
శనివారం 6-7-2024



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 105

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





జుట్టుకు పోషకాలతో పట్టు

ఇటీవలి కాలంలో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య జుట్టు రాలడం. దీని వెనుక వంశపారంపర్య కారణాలు ఉంటే దానిని నివారించడం కష్టం. అయితే బట్టతలను కొంతకాలం పాటు వాయిదా వేయచ్చు. కానీ ప్రతిసారీ ఈ సమస్య జన్యుపరమైన కారణాల వల్ల మాత్రం రాదని తెలుసుకోవాలి. జుట్టు రాలడం లేదా బట్టతల రావడం అనేది మస్కులర్ డిస్ట్రోఫీ లాంటి జన్యుపరమైన సమస్య కాదని సైన్స్ చెబుతోంది. దీనికి ప్రధాన కారణం శరీరంలో కొన్ని అవసరమైన మూలకాలు లేకపోవడమే. కానీ ఆ మూలకాల లోపం వంశపారంపర్యంగా ఉంటుంది. వారసత్వం అనేది ఒక తరం నుంచి మరొక తరానికి బదిలీ అయిన జన్యువులది మాత్రమే కాదు. బదులుగా కొన్నిసార్లు పోషకాల లోపం కూడా ఒక తరం నుంచి మరొక తరానికి బదిలీ అవుతుంది.

బయోటిన్

బయోటిన్ అనేది జుట్టుకు అవసరమైన మూలకం. ఇది లేకపోవడం వల్ల జుట్టు పలుచబడుతుంది. దీని లోపం వల్ల గోళ్లు కూడా విరిగిపోతాయి. కండరాల అలసట, బలహీనత, మైకం, కాళ్ళలో తిమ్మిరి వంటివి బయోటిన్ లోపం లక్షణాలు. ఇది శరీరానికి అవసరమైన మూలకం. కానీ జుట్టు, గోళ్లకు ఇది చాలా ముఖ్యమైనది.

రాగి:సాధారణంగా శరీరంలో రాగి లోపం ఉండదు. కానీ ఏదైనా కారణం వల్ల అది లోపిస్తే జుట్టు, గోళ్ల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. సాధారణంగా భారతదేశం వంటి దేశంలో శరీరంలో కాపర్ సమస్య ఉండదు. కాని ఇది లోపిస్తే మోకాలు, కీళ్లలో భరించలేని నొప్పి ఉంటుంది.

కొల్లాజెన్: కొల్లాజెన్ అనేది జుట్టు మూలాలను బలపరిచే మూలకం. ఇది జుట్టుని మందం చేస్తుంది. దీని లోపం వల్ల జుట్టు బలహీనపడి ఎక్కువ ఊడిపోతుంది.

విటమిన్ బి6

జుట్టుకి విటమిన్ బి కాంప్లెక్స్ చాలా ముఖ్యం. దీని లోపం తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. విటమిన్ బి 6 మన జుట్టు ఆరోగ్యానికి సంబంధించినది. ఈ విటమిన్ లోపం ఉన్నట్లయితే జుట్టు బలహీనంగా మారుతుంది. ఎక్కువగా ఊడిపోయి బట్టతల వస్తుంది.

జింక్

జింక్ లోపం ప్రధాన లక్షణం జుట్టు వేగంగా రాలడం. మీ జుట్టు అకస్మాత్తుగా రాలడం ప్రారంభించిందని మీకు అనిపిస్తే అది జింక్ లోపం వల్ల కావచ్చునని భావించి జింక్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ లోపాన్ని సరిచేయవచ్చు.

అందువల్ల ఒకసారి మంచి ట్రికాలజిస్టును కలిసి అవసరమైన పరీక్షలు చేయించుకుని ఏ కారణం వల్ల జుట్టు ఊడిపోతోందో తెలుసుకుని ఆ విటమిన్ లోపాన్ని పూరించడం ద్వారా జుట్టు రాలకుండా నివారించుకోవచ్చు.



కండరాల నొప్పులా?

మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాల్లో పొటాషియం కూడా ఒకటి. ఇది మినరల్స్ జాబితాకు చెందుతుంది. పొటాషియం మన శరీరంలో బీపీని నియంత్రిస్తుంది. స్ట్రోక్స్ రాకుండా చూస్తుంది. కండరాల నొప్పులు, కండరాలు పట్టుకుపోయినట్లు అనిపించడం వంటి సమస్యలను పొటాషియం తగ్గిస్తుంది. అలాగే గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. అందువల్ల పొటాషియం ఉండే ఆహారాలను మనం రోజూ తీసుకోవాలి. మనం తినే ఆహారాల నుంచే మనకు పొటాషియం లభిస్తుంది. సప్లిమెంట్లను వాడాల్సిన పనిలేదు. ఈ క్రమంలోనే పలు ఆహారాలను తీసుకోవడం వల్ల పొటాషియం లోపం రాకుండా చూసుకోవచ్చు.



ఎందులో లభిస్తుంది?

కోడిగుడ్లు, టమాటాలు, చిలగడ దుంపలు, విత్తనాలు, నట్స్, అరటి పండ్లు, యాప్రికాట్స్, చేపలు, తృణ ధాన్యాలు, పెరుగు, పాలు, మాంసం, తర్బూజా, క్యారెట్, నారింజ, కివీ, కొబ్బరినీళ్లు, బీట్‌రూట్ వంటి ఆహారాల్లో పొటాషియం విరివిగా లభిస్తుంది

లైఫ్@360

కొంతమంది ఎప్పుడూ ఉసూరుమంటూ ఉంటారు. ఇంకొందరు ఎప్పుడు చూసినా ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్లే ఉంటారు. అలాంటి వారిని చూస్తే మనకు కూడా ఉత్సాహం కలుగుతుంది. ఇంతకీ వీరిలో ఈ ఉత్సాహానికి వారు తీసుకునే ఆహారమే కారణం అని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఆ ఆహారమేమిటో తెలుసుకుందాం. మనమూ తిందాం... ఉత్సాహంగా ఉందాం...

ఇవి తిందాం.. ఉత్సాహంగా ఉందాం!



నాకు అది ఇష్టం, ఇది ఇష్టం లేదు అని అనకుండా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని రకాల ఆహార పదార్థాలను తరచు తింటుండటం వల్ల ఉత్సాహంగా... ఉల్లాసంగా ఉండడంతోపాటు మెరుపులీనే చర్మం, మంచి ఆరోగ్యం మన సొంతం అవుతాయంటున్నారు పోషకాహార నిపుణులు. ఇంతకూ అవేమిటో చూద్దామా?



టొమాటో... దీనిలోని లైకోపిన్ కాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. గుండె, రక్తనాళాలకి సంబంధించిన అనారోగ్యాన్ని కూడా నిరోధిస్తుంది. మన చర్మానికి ఎండ తాలూకు ప్రభావాలనుండి రక్షించడంలో మిగతా పోషకాలతో పాటు టమాటోల పాత్ర చెప్పుకోదగినదే.



నట్స్: ముఖ్యంగా వాల్‌నట్స్ లో ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్, ప్లాంట్ స్టెరోల్స్ సమృద్ధిగా ఉంటాయి. కొలెస్టరాల్ లెవల్ తగ్గించడంలో వీటి పాత్ర అమోఘం. వాల్నట్స్‌లో పీచుపదార్థం అధికం. మెగ్నీషియం, కాపర్, ఫోలేట్, విటమిన్-ఇ, ఉండి శక్తిమంతమైన యాంటి ఆక్సిడెంట్స్‌ని అందిస్తాయి. బ్లడ్ ప్రెషర్‌ను తగ్గిస్తుంది. ఆస్టియోపొరోసిస్ రాకుండా ఆపుతుంది. గుండె ఆరోగ్యాన్ని, చర్మానికి ఎండనుండి కలిగే హానినుండి కాపాడుతుంది. ఆల్మండ్స్ చర్మకాంతికి తోడ్పడతాయి.



బెర్రీస్... అన్ని రకాల బెర్రీస్... ముఖ్యంగా నేరేడుపండ్లు: వృద్ధాప్యం త్వరగా రాకుండా చేస్తాయి. వృద్ధులవుతున్న కొద్దీ మెదడు నెమ్మదించే అవకాశం ఉంది. అలాంటి అనారోగ్యాల నుంచి బెర్రీస్ కాపాడుతాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, క్యాన్సర్ నిరోధకాలు ఉంటాయి.





యోగర్ట్ లేదా పెరుగు: ప్రోటీన్, కాల్షియం, విటమిన్-బి లను అందిస్తుంది. ఇవన్నీ కలిసి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇన్ఫెక్షన్ కలగకుండా పోరాడతాయి. యోగర్ట్ మన శరీర ఆరోగ్యానికి, జీర్ణ వ్యవస్థకు, నాడీవ్యవస్థకు మేలుచేస్తుంది. క్యాన్సర్, ఎలర్జీలు, అధిక రక్తపోటు, హై-కొలెస్టరాల్ బారిన పడకుండా కాపాడుతుంది.

బీన్స్.... ప్రోటీన్స్, పీచుపదార్థం, విటమిన్లు, మినరల్స్, ఫైటో న్యూట్రియెంట్స్. ఇవన్నీ బీన్స్‌లో సమృద్ధిగా ఉంటాయి. అలాగే కొవ్వుకు సంబంధించిన చెడు లక్షణాలు ఉండవు. బీన్స్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. షుగర్ లెవల్స్ సమతుల్యంగా ఉండేటట్లు చూస్తూనే సురక్షితమైన, నిలకడ అయిన నెమ్మదిగా ఖర్చయ్యే శక్తిని అందిస్తుంది. కొలెస్టరాల్ లెవెల్స్‌ని కొంతమేరకు తగ్గిస్తాయి. బీన్స్‌తో చేసిన కూరలు తిన్నప్పుడు కడుపు నిండినట్లు ఉంటోంది గాని అధిక క్యాలరీలు లేకపోవడం వలన బరువు పెరిగే సమస్యే ఉండదు.



గ్రీన్ టీ... ఇది ఓ సూపర్ డ్రింక్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. చర్మాన్ని అంత త్వరగా ముడతలు పడనివ్వదు. కళ్ళకు మెరుపు అందిస్తుంది. కేటరాక్ట్ ముదరటాన్నీ నెమ్మదింపచేస్తుంది.

ఆకుకూరలు... ఆకుకూరలు చాలా రకాల క్యాన్సర్‌ల నుండి కాపాడుతాయి. వీటిలో విటమిన్ బి, సి, ఇ, ఫోలేట్, పొటాషియం, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి మంచిది. కాల్షియంని శరీరం ఇముడ్చుకోవటానికి తోడ్పతాయి. కేటరాక్ట్‌ను నిరోధించడంలో పాలకూర తోడ్పడుతుంది.

అందుకే తిందాం... ఉత్సాహంగా ఉందాం.

సినిమా

మాయా బజార్ స్ఫూర్తితో 'కల్కి' తీశాను - నాగ్ అశ్విన్



''కల్కి 2898 ఏడీ'ని సూపర్ హిట్ చేసినందుకు మా టీమ్, వైజయంతీ మూవీస్ తరఫున ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ విజయం మొత్తం ఇండస్ట్రీదిగా భావిస్తున్నాను. ఎన్నో ప్రొడక్షన్స్, యాక్టర్స్, రైటర్స్, అప్ కమింగ్ డైరెక్టర్స్‌కి ఒక డోర్ ఓపెన్ అయ్యింది. ఇలాంటి సైన్స్ ఫిక్షన్ కథలు రాసుకునే వారికి 'కల్కి' రిఫరెన్స్ పాయింట్‌లా ఉంటుంది'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా కోసం రూపొందించిన సెట్స్‌లో శుక్రవారం డైరెక్టర్ నాగ్ అశ్విన్ విలేకరులతో పంచుకున్న విశేషాలు.

- తెలుగు సినిమా అనగానే చాలామందికి 'మాయా బజార్' గుర్తొస్తుంది. అది ఓ రకంగా మహాభారతం ఆధారంగా రూపొందిందే. 'మాయా బజార్' మూవీ స్ఫూర్తితోనే 'కల్కి 2898 ఏడీ' తీశాను. ఈ కథను ముందుగా చిరంజీవిగారికి చెప్పాననడంలో నిజం లేదు. ప్రభాస్‌గారు కథని నమ్మి చాలా సపోర్ట్ చేశారు. ముందు ఒకే భాగంగా తీయాలనుకున్నాం. కొన్ని షెడ్యూల్స్ తర్వాత ఇంత పెద్ద కథని ఒక భాగంలో చెప్పడం సవాల్‌గా అనిపించింది. అందుకే రెండు భాగాలుగా చూపించాలనుకున్నాను.
- 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్ చేసిన భైరవ పాత్ర సీరియస్‌గా కాకుండా సరదాగా ఉండాలనే ఉద్దేశంతోనే అలా క్రియేట్ చేశాను. మొదటి భాగంలో ప్రభాస్ పాత్ర నిడివి తక్కువగా ఉందంటున్నారు. రెండో భాగంలో ఆయన పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. ఈ మూవీలో ప్రభాస్, అమితాబ్, కమల్, దీపిక వంటి స్టార్స్‌ని వ్యాపార కోణంలో ఆలోచించి తీసుకోలేదు. ఆయా పాత్రలకు వారు న్యాయం చేయగలరనే ఉద్దేశంతోనే తీసుకున్నా. ఒకవేళ కథలో బలం లేకపోతే ఆ నటుల ఎంపిక మాకు నెగెటివ్ అయ్యేది. కానీ వారి క్యారెక్టర్స్‌కి అనూహ్య స్పందన వస్తోంది. కమల్ సార్ చేసిన యాస్కిన్ పాత్రను పార్ట్ 2లోనే ఎక్కువ రివీల్ చేస్తాం.
- వైజయంతీ మూవీస్ 50 ఏళ్ల జర్నీలోనే కాదు... తెలుగు సినిమా హిస్టరీలో ఉన్న అత్యధిక భారీ బడ్జెట్ చిత్రాల్లో 'కల్కి 2898 ఏడీ' ఒకటి. ఈ సినిమా గొప్ప విజయం సాధించి మా పెట్టుబడి పూర్తిగా రావడంతో చాలా హ్యాపీగా ఉంది. రామ్‌గోపాల్ వర్మ, రాజమౌళిగార్లు ఈ మూవీలో కనిపించడం ప్రేక్షకులకు సర్‌ప్రైజ్. విజయ్ దేవరకొండ, మాళవికా నాయర్‌లతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' తీశాను. నా ఫస్ట్ మూవీ నటులు కాబట్టి వారు ప్రత్యేకం. నాకు లక్కీ ఛార్మ్. అందుకే వాళ్లని నా ప్రతి చిత్రంలో తీసుకుంటాను. నానీ, నవీన్ పొలిశెట్టిలను రెండో భాగంలో ఎక్కడ వీలుంటే అక్కడ పెట్టేస్తా (నవ్వుతూ).

- 'కల్కి...'లో కృష్ణుడి పాత్రలో మహేశ్‌బాబు నటించి ఉంటే బాగుంటుందని సోషల్ మీడియాలో ట్రెండ్ నడుస్తోంది. అయితే ఈ మూవీలో ఆ చాన్స్ లేదు. కానీ ఆయన ఏ సినిమాలో అయినా కృష్ణుడిగా నటిస్తే చాలా బాగుంటుంది. 'కల్కి' రెండో భాగానికి సంబంధించి 20 రోజులు షూటింగ్ జరిపాం. రెండో భాగంలో కల్కి పాత్రలో ఏ హీరో కనిపిస్తారన్నది సస్పెన్స్. రెండో భాగాన్ని ఎప్పుడు రిలీజ్ చేస్తామన్నది ఇప్పుడే చెప్పలేం.


డబ్బు ఎవరిది?



• రష్మికా మందన్నా

ఇక్కడ రష్మికా మందన్నా చేతిలో ఉన్న పెద్ద సూట్‌కేసును చూశారుగా! ఈ సూట్‌కేసు నిండా డబ్బు కట్టలే. ఈ సూట్‌కేసును రాత్రి వేళ తవ్వి బయటకు తీశారు రష్మిక. మరి... ఈ డబ్బు ఎవరిది? రష్మికా మందన్నా ఇంత రహస్యంగా డబ్బును ఎందుకు తవ్వి తీశారు? అనే విషయాలు 'కుబేర' సినిమాలో తెలుస్తాయి. నాగార్జున, ధనుష్ హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా, జిమ్ సర్భ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ సోషల్ డ్రామాను సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. శుక్రవారం రష్మికా మందన్నా ఫస్ట్ లుక్ వీడియోను విడుదల చేశారు మేకర్స్.

గుమ్మడికాయ కొట్టారు



• రామ్, కావ్యా థాపర్

'డబుల్ ఇస్మార్ట్' సినిమాకు గుమ్మడికాయ కొట్టారు హీరో రామ్. 2019లో హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన హిట్ ఫిల్మ్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రధారులు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిందని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ వేగంగా జరుగుతున్నాయని చిత్రయూనిట్ ప్రకటించింది. సో.. షూటింగ్ పూర్తయిన సందర్భంగా 'డబుల్ ఇస్మార్ట్' యూనిట్ గుమ్మడికాయ కొట్టింది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది.

అడవిని ఏలేది మనమే!



• ఆలియా భట్

'వైఆర్‌ఎఫ్' (యశ్ రాజ్ ఫిలిమ్స్) స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న మరో హిందీ చిత్రం 'ఆల్ఫా'. ఆలియా భట్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాలో శార్వరి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. 'ది రైల్వేమెన్' ఫేమ్ శివ్ రవైల్ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఆల్ఫా' సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ''నిశితంగా గమనిస్తే ప్రతి నగరంలోనూ ఓ అడవి ఉంటుంది. ఆ అడవిని ఏలేది మనమే'' అంటూ ఆలియా భట్ చెప్పే డైలాగ్ ఈ చిత్రం అనౌన్స్‌మెంట్ టీజర్‌లో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.

భయంకరమైన హెచ్చరిక



• కల్యాణ్ రామ్

'నువ్వు ఓ మంచి ఉదాహరణగా ఉండలేనప్పుడు ఓ భయంకరమైన హెచ్చరికగా ఉండు' అంటూ ఫుల్ మాస్ మోడ్‌లో చెబుతున్నారు కల్యాణ్ రామ్. ఆయన హీరోగా ప్రదీప్ చౌదరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం (జూలై 5) కల్యాణ్‌రామ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌పై పైన పేర్కొన్న డైలాగ్ ఉంది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి, సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

సీక్వెల్ కాదు... ప్రీక్వెల్

కల్యాణ్ రామ్ నటించిన చిత్రం 'బింబిసార' (2022). ఈ హిట్ చిత్రానికి ప్రీక్వెల్ రూపొందనుంది. ''బింబిసార కన్నా యుగాల ముందు త్రిగర్తలను ఏలిన లెజెండ్‌ని చూడడానికి సిద్ధంగా ఉండండి'' అంటూ శుక్రవారం ప్రీక్వెల్‌ని ప్రకటించారు. 'బింబిసార' సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహించగా, ప్రీక్వెల్‌ని ఎడిటర్-దర్శకుడు అనిల్ పాదూరి తెరకెక్కించనున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో ఆరంభం కానుంది.

కథలెన్నో వినరా...



• 'టుక్ టుక్' పోస్టర్

''నజభజ జ..జ..ర.. కథలెన్నో వినరా... మన కథ వినినది రా...' అంటూ సాగే 'వరల్డ్ టూర్' పాట 'టుక్ టుక్' సినిమాలోనిది. సుప్రీత్ సి. కృష్ణ సాహిత్యం అందించిన ఈ పాటను ఈ చిత్ర సంగీతదర్శకుడు సంతు ఓంకార్ పాడారు. హర్ష రోహన్, కార్తి కేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు సుప్రీత్ సి. కృష్ణ దర్శకుడు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి. కృష్ణ నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

పవర్‌ఫుల్ రోల్



• సాయికుమార్

నటుడు అలీ సోదరుని కుమారుడు సదన్ హీరోగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకుడు. ప్రియాంకా ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో సాయికుమార్, సునీల్ రావినూతల కీలక పాత్రధారులు. పారమళ్ల లింగయ్య నిర్మించిన ఈ చిత్రంలో సాయికుమార్ పెదకాపు అనే పవర్‌ఫుల్ పాత్ర చేశారు. ఈ పాత్ర లుక్‌ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– ''మా మునుగోడు ప్రాంతానికి చెందిన లింగయ్య 'ప్రణయ గోదారి' అనే ఓ మంచి సినిమా నిర్మించినందుకు అభినందనలు. ఈ సినిమా మంచి విజయం సాధించి, భవిష్యత్‌లో లింగయ్య ఇలాంటి సినిమాలు మరిన్ని నిర్మించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో అన్ని వర్గాల వారిని అలరించే అంశాలున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు పీఎల్ విఘ్నేష్, పారమళ్ల లింగయ్య.

జీవితం గుణపాఠాలు చెబుతుంది



• 'సారంగదరియా' పోస్టర్

నటుడు రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి (పండు) దర్శకత్వం వహించారు. చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ను హీరో నిఖిల్ విడుదల చేశారు. 'కులం అంటే రక్తం కాదు పుట్టుకతో రావడానికి... మనం చేసే పనే కులం', 'ఇక్కడ చెప్పిన పాఠాలకే పరీక్షలు పెడతాం... కానీ జీవితం పరీక్షలు పెట్టి గుణపాఠాలు చెబుతుంది' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''మధ్య తరగతి నేపథ్యంలో కుటుంబ భావోద్వేగాలతో సాగే చిత్రం 'సారంగదరియా'. ఈ చిత్రంలో గొప్ప ఉపాధ్యాయుడి పాత్రలో రాజా రవీంద్ర నటన అందర్నీ కదిలించేలా ఉంటుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎబెనెజర్ పాల్, కెమెరా: సిద్ధార్థ స్వయంభు.

సోడు... సోడు...



• సాయితేజ, పావని

సాయి తేజ కల్వకోట, పావని కరణం జంటగా నటించిన చిత్రం 'పైలంపిలగా'. తెలంగాణ నేపథ్యంలో వినోద ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొద్దుల, ఎస్.కె. శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమాలోని 'సోడు సోడు నొక్కమే నీ సోకు...' అంటూ సాగే పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల విడుదల చేసి, మాట్లాడుతూ – ''మంచి సాహిత్యానికి మంచి ట్యూన్, మంచి ట్యూన్‌కి మంచి సాహిత్యం తోడైతే ఆ పాటలు ఎవర్ గ్రీన్‌గా నిలిచిపోతాయి. అలా నిలిచిపోయే పాటల్లో ఈ 'సోడు సోడు...' పాట ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు శేఖర్ కమ్ముల. యశ్వంత్ నాగ్ స్వరపరచిన 'సోడు... సోడు...' పాటను రామ్ మిరియాల పాడారు.


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 105

శనివారం 6-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తొలి సీఎన్జీ బైక్ వచ్చేసింది..

ఫ్రీడమ్ 125ను ఆవిష్కరించిన బజాజ్ ఆటో. ఎక్స్ షోరూమ్ ధర రూ.95,000 - 17లో



దక్షిణాఫ్రికా మహిళల విజయం

తొలి టి20లో 12 పరుగుల తేడాతో భారత మహిళల జట్టు ఓటమి. - 17లో



రాజకీయం చేయదల్చుకోలేదు

హత్రాస్ తొక్కిసలాట ఘటనపై రాజకీయం చేయదల్చుకోలేదని విపక్ష నేత రాహుల్ చెప్పారు. బాధితులను పరామర్శించారు.

- వివరాలు 6లో



భోలే బాబా ఆస్తులు రూ.100కోట్లు

హత్రాస్ దుర్ఘటనకు కారణమైన భోలే బాబాకు రూ.100 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

- వివరాలు 6లో



రోబో 'ఆత్మహత్య'!?

దక్షిణ కొరియాలోని ఓ కార్యాలయంలో పని చేసే ఒక రోబో పని ఒత్తిడితో 'ఆత్మహత్య' చేసుకున్నట్లు మీడియా పేర్కొంది.

- వివరాలు 6లో



చూపున్న కల..

అంధత్వాన్ని జయించి 19 ఐఐఎంలలో ప్రవేశానికి అర్హత సాధించిన జహీరాబాద్‌కు చెందిన కొత్తకాపు శివానిపై ప్రత్యేక కథనం.

- వివరాలు 16లో

మండలిపై పట్టు కోసమే!

పెద్దలపై వలసల వల.. పై'చేయి' కోసం యాక్షన్ ప్లాన్



- మండలిలో 40 మందికి గాను 29 మంది బీఆర్ఎస్ సభ్యులే
- అయితే మొత్తం 8 మంది ఇప్పటికే హస్తం గూటికి
- 12కు చేరిన కాంగ్రెస్ బలం.. 21కి తగ్గిన గులాబీ దళం
- మరికొందరు ఎమ్మెల్సీలపై అధికార పార్టీ నజర్
- బిల్లుల ఆమోదంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రయత్నాలు
- పార్టీ ఫిరాయింపుల్ని గతంలో వ్యతిరేకించి ఇప్పుడు ప్రోత్సహించడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర శాసనమండలిలో సంఖ్యాపరంగా మైనారిటీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వలసలను ప్రోత్సహించడం ద్వారా పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా మండలిలో సుమారు నాలుగింట మూడొంతుల ఎమ్మెల్సీల బలం ఉన్న బీఆర్ఎస్‌పై దృష్టి కేంద్రీకరించింది. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన ఆరు మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరుకోగా, గురువారం అర్ధరాత్రి ఒకేసారి అర డజను మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు హస్తం కండువా కప్పుకున్నారు. వీరి చేరికతో మండలిలో కాంగ్రెస్ బలం డజను స్థానాలకు చేరింది. అయినా కీలక బిల్లులు, తీర్మానాల ఆమోదానికి అవసరమైన సంఖ్యా బలం ఆ పార్టీకి చేకూరలేదు. కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం జరిగితే తప్ప నిధులు వ్యయం చేయడానికి వీల్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలు ఎదురవుతాయన్న ఉద్దేశంతోనే బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకునే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ముమ్మరం చేసింది. రానున్న రోజుల్లో మరికొందరు ఎమ్మెల్సీలను చేర్చుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మండలిలో బీఆర్ఎస్ బలం 29 నుంచి ప్రస్తుతం 21కి పడిపోయింది. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించినప్పుడు తీవ్రస్థాయిలో ఆరోపణలు, విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులే.. ఇప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించడంపై రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒక పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలోకి వెళ్లిన వారిని రాళ్లతో కొట్టాలని అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఒక పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలో చేరితే వారిపై అనర్హత వేటు ఆటోమేటిక్‌గా అమలయ్యేలా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ జాతీయ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని కూడా వారు ప్రస్తావించడం గమనార్హం.

దూరం పాటిస్తున్న చైర్మన్, మరో ఎమ్మెల్సీ: గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడేనాటికి మండలిలో బీఆర్ఎస్ 29 మంది సభ్యుల బలాన్ని కలిగి ఉంది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ముగ్గురు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి (రంగారెడ్డి), కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి (మహబూబ్‌నగర్) కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికలో తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపొందారు. తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, దండె విఠల్, టి.భానుప్రసాద్‌రావు, ఎంఎస్ ప్రభాకర్‌రావు, బొగ్గారపు దయానంద్, బసవరాజు సారయ్య కాంగ్రెస్‌లో చేరారు. దీంతో 40 మంది సభ్యులున్న శాసన మండలిలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 21 మంది, కాంగ్రెస్ 12 మంది, ఎంఐఎంకు ఇద్దరు సభ్యులుండగా, బీజేపీకి ఒక సభ్యుడు ఉన్నారు. మరో ఇద్దరు స్వతంత్రులు. గవర్నర్ కోటాలో రెండు స్థానాలు ఖాళీగా ఉండగా, వీటి భర్తీపై వివాదం నెలకొంది. ఇలావుండగా మండలి చైర్మన్ గుత్తా

మిగతా 14వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఉద్యోగులకు 'సహకార రుణాలు'



హైకోర్టు జోక్యం ఆర్టీసీ కార్మికుల్లో ఆనందం నింపింది. కొన్నేళ్ల తర్వాత మళ్లీ 'ఉద్యోగుల సొంత నిధి' నుంచి రుణాలందుకుంటున్నారు. 40 రోజుల వ్యవధిలో 9,500 మంది రూ.200 కోట్ల వరకు రుణాలు పొందారు.

- వివరాలు 5లో


రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గిద్దామా?



రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఫీజును ఒక శాతంమేర తగ్గిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై నివేదిక సమర్పించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులను ఆదేశించారు.

- వివరాలు 14లో

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా సుదర్శన్‌రెడ్డి



రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న వికాస్ రాజ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సీఈవో బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది.

- వివరాలు 3లో

ఛేజింగ్.. ఫైరింగ్



హైదరాబాద్-విజయవాడ హైవేపై దోపిడీలు, హత్యలకు పాల్పడుతున్న పార్ధి గ్యాంగ్‌లోని ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగలు దాడి చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు.

- వివరాలు 18లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	114	Dressed with Skin	197
₹ 70	Retail Live Bird	136	Skin Less	224

Issued in the interest of consumers

ప్రజాభిప్రాయం మేరకే 'రైతు భరోసా'



మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

- అభిప్రాయ సేకరణ కోసం ఈనెల 11–16 తేదీల్లో జిల్లాల పర్యటనలు
- ప్రజలు అభిప్రాయం తెలిపేందుకు ప్రత్యేక ఫార్మాట్
- ఎన్ని ఎకరాలకు ఇవ్వాలన్న అంశంపై కూడా ఆ తర్వాతే స్పష్టత
- కౌలురైతులకూ భరోసా ఇస్తామని స్పష్టం చేసిన మంత్రులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతు భరోసా పథకాన్ని ఎలా అమలు చేయాలన్న అంశంపై ప్రజాభిప్రాయం మేరకే ముందుకెళ్లాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ పథకం పరిధిలోకి వచ్చే భాగస్వామ్య పక్షాలతో పాటు మేధావులు, సామాన్య ప్రజల అభిప్రాయాలను కూడా సేకరించిన తర్వాతే విధివిధానాల రూపకల్పనకు శ్రీకారం చుట్టాలని అభిప్రాయ పడింది. ఉమ్మడి జిల్లాల స్థాయిలో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకునేందుకు గాను ఈనెల 11–16 తేదీల్లో ఉపసంఘంలోని మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు జిల్లా కేంద్రాల్లో పర్యటించాలని, విస్తృత స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని, ఈ సమావేశాల్లో అభిప్రాయం తెలిపేందుకు గాను ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించాలని ఉపసంఘం నిర్ణయించింది. రైతు భరోసాపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన గంటకు పైగా సమావేశమైంది. ఈ సమావేశంలో ఉపసంఘం సభ్యులైన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,

మిగతా 14వ పేజీలో ▶

త్వరలో జాబ్ కేలండర్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి విడుదల చేస్తాం



కాంగ్రెస్ నేతలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్

- నిరుద్యోగులకు మేలు జరిగేలా త్వరలో నిర్ణయాలు
- స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావొద్దు
- తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే నోటిఫికేషన్లు రద్దయ్యే ప్రమాదం
- నిరుద్యోగుల డిమాండ్లపై అధికారులతో సీఎం చర్చ
- హాజరైన విద్యార్థి సంఘాల నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, నిరుద్యోగులందరికీ మేలు జరిగేలా త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి జాబ్ కేలండర్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిరుద్యోగుల ఆందోళనల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో దాదాపు మూడు గంటలకు పైగా ఆయన సమావేశమయ్యారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి, పవన్ మల్లాది, ప్రొఫెసర్ రియాజ్, టీచర్ల జేఏసీ నేత హర్షవర్ధన్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు చనగాని దయాకర్, మానవతారాయ్, బాల లక్ష్మి, చారకొండ వెంకటేశ్,

మిగతా 14వ పేజీలో ▶

బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకం ఎప్పుడు?

- కేంద్రమంత్రిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలతో బిజీబిజీ
- పోటీలో ఎంపీలు ఈటల, డీకే అరుణ, అర్వింద్, రఘునందన్
- ఎమ్మెల్యేలతోపాటు పాత, కొత్త నేతలు కూడా రేసులో..
- ఏటూ తేల్చుకోలేకపోతున్న బీజేపీ కేంద్ర నాయకత్వం



- వివరాలు 3లో

ఇక స్టార్మర్ శకం

బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం

- 650 స్థానాలకుగాను ఏకంగా 412 సీట్లు కైవసం..
- కన్జర్వేటివ్‌లకు ఘోర పరాజయం.. 121 సీట్లకే పరిమితం
- రిషి సునాక్ రాజీనామా, ప్రధానిగా స్టార్మర్



బ్రిటన్ ఎన్నికల్లో ఘనవిజయం అనంతరం ప్రధాని అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్ వద్ద అభివాదం చేస్తున్న స్టార్మర్ దంపతులు

భారత్‌పై ప్రభావమెంత?

తుపానులా వచ్చాడు..

కేబినెట్‌లోకి లీసా నంది..

- వివరాలు 6లో

నేడు రేవంత్, బాబు భేటీ

- ప్రజాభవన్ వేదికగా తెలంగాణ, ఏపీ సీఎంల సమావేశం
- షెడ్యూల్ 9, 10లోని అంశాలతో పాటు పలు అపరిష్కృత సమస్యలు, అంశాలు చర్చకు వచ్చే చాన్స్
- తెలంగాణ తరఫున హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అంశాలపై శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రజాభవన్ వేదికగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల స్థాయిలో కీలక సమావేశం జరగనుంది. ఇరు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పాటైన నేపథ్యంలో మరోసారి విభజన అంశాలపై చర్చలకు ఇరు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు సిద్ధమయ్యారు. ఈ భేటీలో ముఖ్యమంత్రులతో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఏపీ నుంచి మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,

మిగతా 3వ పేజీలో ▶

పరిశ్రమలకు ఎలాంటి సమస్యలు రానివ్వం

- ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఆరోగ్య సంరక్షణకు ఫార్మా పరిశ్రమ వెన్నెముక లాంటిది
- ఫార్మా కంపెనీలు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలి: మంత్రి కోమటిరెడ్డి



సదస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

మాదాపూర్: రాష్ట్రం నుంచి ప్రతి ఏటా రూ.50 వేల కోట్ల విలువైన మందులను ఎగుమతి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తమది పారిశ్రామిక అనుకూల ప్రభుత్వమని, పారిశ్రామికవేత్తలకు మంత్రివర్గం 24 గంటలూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలకు విద్యుత్తు, నీటి సమస్య లేదని, ఏ పరిశ్రమకు ఎలాంటి సమస్యా

మిగతా 14వ పేజీలో ▶

ఇదండీ సంగతి



బాధ పడకండి సార్! మళ్లీ మీరు అధికారంలోకి రాగానే ఇట్టే వచ్చేస్తా!!

లోకల్ 'లొల్లి'

- బోనఫైడ్‌లకు బదులుగా పెద్దసంఖ్యలో రెసిడెన్షియల్ సర్టిఫికెట్ల సమర్పణ
- ఉద్యోగ నియామకాల్లో భాగంగా ధ్రువపత్రాల పరిశీలనతో వెలుగులోకి
- పూర్తిస్థాయి విచారణ లేకుండా ఆమోదిస్తే స్థానికులకు తీవ్ర అన్యాయమే
- ఇప్పటికే పలు విధాలుగా ప్రభుత్వానికి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో స్థానికతకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. మెరుగైన మార్కులు సాధించినా, స్థానికేతరులైతే ఉద్యోగం దక్కడం కష్టం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 95 శాతం స్థానికులకు, 5% మాత్రం ఓపెన్ కేటగిరీకి కేటాయిస్తూ నియామక సంస్థలు భర్తీ ప్రక్రియ చేపడతాయి. టీజీపీఎస్సీ ద్వారా ప్రస్తుతం గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల

మిగతా 2వ పేజీలో ▶

పరిశ్రమల భూములు తాకట్టు!

- రూ.10వేల కోట్ల సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం పావులు
- కోకాపేట, రాయదుర్గంలో విలువైన భూముల గుర్తింపు
- రూ.20 వేల కోట్ల విలువ చేసే 400 ఎకరాలు తనఖాకు సిద్ధమైన టీజీఐఐసీ
- గతంలో ఇచ్చిన టెండర్ రద్దు.. మరోమారు టెండర్ పిలిచేందుకు సన్నద్ధం
- బిడ్డర్ ఎంపికలో టీజీఐఐసీతోపాటు ఆర్థికశాఖకు బాధ్యతలు
- రుణం ఇప్పించే మర్చంట్ బ్యాంకర్‌కు రూ.100 కోట్ల కమీషన్!



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీతో పాటు ఇతర పథకాల అమలుకు నిధుల వేటలో ఉన్న ప్రభుత్వం పరిశ్రమల భూములను తాకట్టు పెట్టేందుకు సిద్ధమైంది. మూలధన వ్యయం, ఇతర అవసరాలకు రుణమార్కెట్ నుంచి కనీసం రూ.10 వేల కోట్లు అప్పుగా తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో కనీసం రూ.5 వేల కోట్లు వెంటనే సేకరించేందుకు అవసరమైన ప్రక్రియను ఆర్థిక, పరిశ్రమల శాఖలు సంయుక్తంగా ప్రారంభించాయి. దీనికోసం హైదరాబాద్‌లో అత్యంత విలువైన సుమారు 400 ఎకరాల భూములను ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు తాకట్టు పెట్టాలనుకుంటోంది. కోకాపేట, రాయదుర్గంలో ఉన్న ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.20వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రభుత్వ భూములను తనఖా పెట్టి రుణాలు తీసుకున్న అనుభవం ప్రభుత్వ శాఖలకు లేదు. దీంతో అప్పు ఇప్పించడంలో అనుభవం గల 'మర్చంట్ బ్యాంకర్'కు రుణసేకరణ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. ఈ మర్చంట్ బ్యాంకర్ ప్రభుత్వం తరఫున బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ సంస్థలతో సంప్రదింపులు జరిపి, వాటికి ప్రభుత్వ భూము లను తనఖా పెట్టి రుణం ఇప్పిస్తుంది. అందుకు ప్రతిఫలంగా మర్చంట్ బ్యాంకర్‌కు కనీసం 1% కమీషన్ చొప్పున లెక్క వేసినా రూ.100 కోట్లు కమీషన్ చెల్లించాల్సి ఉంటుందని సమాచారం.

మర్చంట్ బ్యాంకర్ కోసం మళ్లీ టెండర్

బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలతో సంప్రదింపులు జరిపి అప్పులు

మిగతా 15వ పేజీలో ▶

నీట్-యూజీ కౌన్సెలింగ్‌పై అయోమయం!

- నేటి నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్న కేంద్రం
- ఇప్పటివరకూ కనీసం షెడ్యూల్ విడుదల చేయని ఎంసీసీ
- మరోవైపు రాష్ట్ర స్థాయి ర్యాంకులు వెలువడని పరిస్థితి
- కౌన్సెలింగ్ ఆలస్యం.. ఆందోళనలో విద్యార్థులు



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే యూజీ నీట్–2024 అడ్మిషన్ కౌన్సెలింగ్‌పై విద్యార్థుల్లో తీవ్ర అయోమయం నెలకొంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మే 5వ తేదీన ఈ పరీక్షను నిర్వహించగా.. జూన్ 4వ తేదీన ఫలితాలను ప్రకటించింది. ఆ తర్వాత గ్రేస్ మార్కుల వ్యవహారంపై తీవ్ర దుమారం రేగడంతో ఆయా అభ్యర్థులకు తిరిగి జూన్ 23న పరీక్ష నిర్వహించారు. ఆ తర్వాత జూన్ 30న ఎన్టీఏ తుది ఫలితాలను ప్రకటించింది. మరోవైపు జూలై 6వ తేదీ (శనివారం) నుంచి ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ

మిగతా 15వ పేజీలో ▶



నేడు మూడోదశ సీట్ల కేటాయింపు
▶ గతంతో పోలిస్తే పెరిగిన అడ్మిషన్లు
మిగతా కౌన్సెలింగ్‌లు వేగవంతం

ఈ నెలాఖరు నుంచే డిగ్రీ క్లాసులు

ఇప్పటికే లక్షమంది చేరిక

సాక్షి, హైదరాబాద్: ఈ నెలాఖరు నుంచే డిగ్రీ క్లాసులు ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఏటా కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో డిగ్రీ క్లాసులు ఆగస్టు చివరివారం లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యేవి. దీనివల్ల విద్యా సంవత్సరం ఆలస్యంగా నడుస్తోందనే విమర్శలున్నాయి. డిగ్రీ పూర్తయిన తర్వాత ఇతర రాష్ట్రాల్లో కొన్ని కోర్సుల్లో చేరే అవకాశం కొంతమంది విద్యార్థులు కోల్పోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సకాలంలో క్లాసులు మొదలు పెట్టాలని నిర్ణయించారు. క్లాసులు త్వరగా నిర్వహించే వెసులుబాటు కల్పించాలని ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు కూడా కోరుతున్నాయి. జూలై నెలాఖరులో డిగ్రీ బోధన చేపడితే మే వరకు సిలబస్ పూర్తవుతుందని, విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అవకాశం లభిస్తుందని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. కోవిడ్ సమయంలో అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యమైంది. ఇది గత రెండేళ్లుగా ప్రభావం చూపుతోంది.

గతంతో పోలిస్తే ఈ ఏడాది మొదటి రెండు కౌన్సెలింగ్‌ల్లో ఎక్కువమంది విద్యార్థులు సీట్లు పొందారు. ఇప్పటివరకు 93,214 మంది డిగ్రీలో చేరారు. నాన్–దోస్త్ కాలేజీలు, దోస్త్ పరిధిలోకి రాని ఇతర కాలేజీల అడ్మిషన్లు కలుపుకుంటే లక్ష సీట్లు భర్తీ అయినట్టు అధికారులు చెబుతున్నారు. రెండుదశ కౌన్సెలింగ్ ముగిసే సమయానికి 1,04,784 మంది విద్యార్థులు దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 1,81,769 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. మూడోదశ కౌన్సెలింగ్ సీట్లు శనివారం భర్తీ చేస్తారు. ఈ కౌన్సెలింగ్‌కు కొత్తగా 66,976 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొదటి, రెండో దశలో సీట్లు రానివారు, వచ్చిన కొత్త గ్రూపుల కోసం ప్రయత్నించే వారు 80,312 మంది ఆప్షన్లు ఇచ్చారు.

ఎక్కువ మంది కామర్స్ వైపే..

రాష్ట్రంలో ప్రస్తుతం 3,84,748 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో కూడా ఎక్కువగా కామర్స్ కోర్సులకే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ జరిగిన దోస్త్ కౌన్సెలింగ్‌లో కామర్స్ కోర్సుల్లో 28,655 మంది చేరారు. ఆర్ట్స్‌లో కేవలం 7,766 మంది మాత్రమే చేరారు. లైఫ్‌సైన్స్ కోర్సుకు మంచి స్పందన కనిపిస్తోంది. ఈ విభాగంలో 15,301 మంది చేరారు. ఇంజనీరింగ్‌లో డేటా సైన్స్ కోసం విద్యార్థులు పోటీ పడతారు. డిగ్రీలో అదే స్థాయిలో కోర్సు ప్రవేశ పెట్టినా కేవలం 2,502 మంది మాత్రమే చేరారు. డిగ్రీ కోర్సుల్లో చేరుతున్న వారిలో బాలికలే ఎక్కువగా ఉంటున్నారు. ఇప్పటివరకూ 47,867 మంది బాలికలు చేరితే, బాలురు 28,423 మంది మాత్రమే డిగ్రీ సీట్లు పొందారు.



- ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

డిగ్రీ క్లాసుల ప్రారంభంపై దృష్టి

ఈ నెలాఖరు నుంచే డిగ్రీ క్లాసులు మొదలు పెట్టాలని నిర్ణయించాం. వీలైనంత త్వరగా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. దీనివల్ల విద్యార్థుల విద్యా సంవత్సరం త్వరగా పూర్తవుతుంది. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు త్వరగా ఆప్షన్లు ఇవ్వడం, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడంపై దృష్టి పెట్టాలి. త్వరలోనే మిగతా కౌన్సెలింగ్‌లు పూర్తి చేస్తాం.

'బదిలీలు వెనక్కి తీసుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన అధికారులను వెనక్కి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశం శుక్రవారం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల అద్దె వాహనాలపై చెల్లింపులు విడుదల చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలకు రికగ్నిజేషన్ పునరుద్ధరించి, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, ఆఫీసర్స్ కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాం, కోశాధికారి ఉపేందర్, జాయింట్ సెక్రటరీ పరమేశ్వర్‌రెడ్డి, మహిళా ప్రతినిధి దీపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు

సాక్షి, హైదరాబాద్: వనపర్తి, వికారాబాద్ జిల్లాలోని తాండూరు, బషీరాబాద్, జగిత్యాల జిల్లా ధర్మపురి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గ సభ్యులు, చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రాష్ట్రంలోని మొత్తం 197 మార్కెట్ కమిటీలకు ఇప్పటికే 11 మార్కెట్ కమిటీలకు చైర్మన్లతో పాటు కొత్తగా పాలకవర్గ సభ్యులను నియమించామన్నారు. మరో 4 మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాన్ని నియమించినట్టు వెల్లడించారు. మిగిలిన మార్కెట్ కమిటీలన్నింటికీ త్వరలోనే చైర్మన్లతో పాటు నూతన పాలకవర్గాలను నియమిస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను అభినందిస్తూ.. మార్కెట్ యార్డులలో రైతులు తమ పంటను అమ్ముకోవడానికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెటింగ్ పరంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవడం వారి బాధ్యత అని గుర్తు చేశారు.

విద్యార్థి నేతలపై పోలీసుల అణచివేత

నిరుద్యోగుల విషయంలో కాంగ్రెస్ వైఖరి డొల్ల: కేటీఆర్





సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులపై పోలీసుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రయత్నం చేసిన యువకులు, నిరుద్యోగులను అరెస్టు చేయడాన్ని కేటీఆర్ ఒక ప్రకటనలో తప్పుపట్టారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిరుద్యోగులతో రాహుల్‌గాంధీ ములాఖత్‌లు జరిపారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అణచివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు భావోద్వేగాలు రెచ్చగొట్టి, నిరుద్యోగులను కాంగ్రెస్ వాడుకుందని చెప్పారు. కానీ ప్రస్తుతం వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. ప్రజాపాలన అంటూ పదేపదే చెబుతూ..నిరసన తెలిపే అవకాశం కూడా ఇవ్వకుండా నియంతృత్వంతో వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన జాబ్ కేలండర్ తేదీల గడువు ఇప్పటికే తీరిపోయిందని తెలిపారు. నిరుద్యోగులు చేపట్టే అన్ని నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

డిమాండ్లు పరిష్కరించేంతవరకు వదలం: హరీశ్‌రావు

నిరుద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు డిమాండ్లు సాధించే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరఫున గొంతెత్తి నిరంతర పోరాటం చేస్తామన్నారు. టీజీపీఎస్సీ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నేతలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. శాంతియుత నిరసన తెలిపేందుకు వెళ్లిన వారిని నిర్బంధించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రజాపాలనలో శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా నిరుద్యోగులకు లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు జరిగే అన్యాయంపై బీఆర్ఎస్ పార్టీ గొంతెత్తుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

అరెస్టులపై బీఆర్ఎస్ ఖండన

ఏడు నెలలుగా నిరుద్యోగ సమస్యలను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీమంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. కాంగ్రెస్‌పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని నిరంజన్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగుల సమస్యలను వినేందుకు ప్రభుత్వం తరఫున ఎవరూ అందుబాటులో లేరని ఎర్రోళ్ల శ్రీనివాస్ చెప్పారు.

నిరుద్యోగుల పట్ల సర్కార్ తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

- బీజేవైఎం కార్యకర్తలను విడుదల చేయాలి
- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై గవర్నర్ రాధాకృష్ణన్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడి నేపథ్యంలో వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...జాబ్ క్యాలెండర్ విడుదలతోపాటుగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ఉద్యమించిన నిరుద్యోగులను రేవంత్‌రెడ్డి సర్కార్ అక్రమంగా అరెస్టు చేసిందని మండిపడ్డారు. బీజేవైఎం కార్యకర్తలు, నిరుద్యోగులను పోలీసులు అడ్డుకుని క్రిమినల్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన బీజేవైఎం కార్యకర్తల్ని, నిరుద్యోగుల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకునేలా మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి.. ఉద్రిక్తత



బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను లాక్కెళ్తున్న పోలీసులు



టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నేతలు

- ఎక్కడికక్కడ నిరుద్యోగ, విద్యార్థి సంఘాల నేతల అరెస్టు
- ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట
- నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నాయకుల డిమాండ్

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): నిరుద్యోగ జేఏసీ తమ డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం విద్యార్థి, నిరుద్యోగ సంఘాల ప్రతినిధులు కదం తొక్కారు. టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన బీజేవైఎం, బీఆర్ఎస్‌వీ, నిరుద్యోగ జేఏసీ శ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది.

విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య ఆధ్వర్యంలో..

నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీసీ జనసభ అధ్యక్షుడు డి.రాజారామ్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ ముట్టడి కార్యక్రమానికి సంబంధించి బీసీ జనసభ ఆందోళనలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా నిరుద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వ పెద్దలు స్పందించక పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళనలో పాల్గొన్న విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య ప్రతినిధులను పోలీసులు అరెస్టు చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు కె.రాజు, యువజన దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ సభ్యుడు నరహరి తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్, ఇతర నేతలు మోతీలాల్ నాయక్, బర్రెలక్క (శిరీష), వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నిరుద్యోగులు విడతల వారీగా టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఈ నేపథ్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

నిరుద్యోగులకు నేతల మద్దతు

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించిన పలువురు విద్యార్థి నేతలను గోషామహల్ పోలీస్ స్టేడియానికి తరలించారు. దీంతో అరెస్టు అయిన నిరుద్యోగ, విద్యార్థి నేతలను పరామర్శించేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, రాకేశ్‌రెడ్డి, పల్లె రవికుమార్, అనిల్, రాజు సాగర్‌లను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టు అయిన నిరుద్యోగులకు మద్దతు తెలపడానికి వస్తే తమను అడ్డుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న దీని మేనేజింగ్ పార్ట్‌నర్ **శ్రీ ముత్యాలపాటి విశ్వనాథ్ తండ్రి శ్రీ ముత్యాలపాటి శేషగిరి,** 19 మంది ఇతర వ్యక్తులతో కలిసి వివిధ సేల్ డీడ్స్ ద్వారా 2022, 2023 వ సంవత్సరంలో గండిపేట (మం), కిస్మత్‌పూర్ గ్రామం, సర్వే నంబర్లు 15, 16, 17, 20, 22 మరియు 23లలోని ఎ.4.18 గుంటల విస్తీర్ణం కలిగిన భూమిని కొనుగోలు చేశారు మరియు ఎ.14.14 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి మొత్తంలో ఎ.6.08 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి కొరకు వివిధ రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ కుదుర్చుకున్నారు మరియు నా క్లయింట్లకు ఎ.14.14 గుంటల మొత్తంలో ఎ.10.25 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి కొరకు సదరు భూమి యజమానుల నుండి స్వాధీనం కూడా బట్వాడా చేయబడినది. షెడ్యూలు ఆస్తిలో కొన్ని అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నవి. ఇటీవల సదరు భూమికి పొరుగు భూమి యజమాని అయిన **శ్రీ ఎల్. సంజీవ రెడ్డి తండ్రి ఎల్.యాది రెడ్డి** అతని భూమి ఎ.3.28 గుంటల విస్తీర్ణంలో వివిధ షెడ్లు నిర్మించారు మరియు ప్రహరీ గోడ కట్టారు మరియు దానిలో గుర్రపు స్వారీ వ్యాపారాన్ని చేస్తున్నారు. వారు నా క్లయింట్‌ను సంప్రదించి అతని భూమి ఎ.3.28 గుంటల భూమిని చాలా అన్యాయమైన ధరకు తీసుకోమని అడిగాడు మరియు లేనిచో నా క్లయింట్‌ను అక్కడ అడుగు కూడా పెట్టనివ్వనని బెదిరించారు మరియు వారి అభివృద్ధి పనులు కొనసాగించబోమని హెచ్చరించారు. **ఎల్. సంజీవ రెడ్డి** చేసిన ప్రతిపాదన తిరస్కరించినందుకు అతను నా క్లయింట్ మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్ వారి అనవసరమైన ఇబ్బందులు కల్గిస్తున్నారు మరియు దాని పరిహారాలతో గౌరవనీయ న్యాయస్థానాల సమక్షంలో ఓఎస్ నం. 886/2023, ఓఎస్ నం. 78/2024, ఓఎస్ నం. 664/2023, మరియు ఓఎస్ నం. 364/2024లతో ఒకటి తర్వాత మరొకటి వివిధ పార్టిషన్ దావాలు దాఖలు చేస్తున్నారు. మేము కూడా న్యాయస్థానాలను ఆశ్రయించాము మరియు వాస్తవిక డాక్యుమెంట్లను పరిశీలించుటకు సంబంధిత డాక్యుమెంట్లు దాఖలు చేశాము. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత గౌరవనీయ న్యాయస్థానం స్టేటస్ కో ఆర్డర్‌ను సవరించినది మరియు ఎఫ్ లైన్ పిటిషన్‌తో కొనసాగుటకు అనుమతినిచ్చింది. ఆ ప్రకారంగా **ఎల్ సంజీవ రెడ్డి**తోపాటు అన్ని పార్టీలకు నోటీసు జారీ చేసిన తర్వాత ఎడి సర్వే చేపట్టబడినది, పార్టీల ద్వారా దాఖలు చేయబడిన దరఖాస్తుపై హద్దులతో మొత్తం భూమి విస్తీర్ణం ఎ.14.14 గుంటలు విభజించబడినది. సదరు భూమి విస్తీర్ణం ఎ.3.28 గుంటలు ఇప్పటికే ఎల్ సంజీవ రెడ్డి స్వాధీనంలో ఉన్నదనే విషయం స్పష్టంగా చూపించబడినది మరియు కొలతలు వేయబడినది మరియు భూమి విస్తీర్ణం ఎ.2.29 గుంటలు గుర్తులు పెట్టబడినది మరియు ఓఎస్ నం. 886 ఆఫ్ 2023లో అడ్వకేట్ కమిషనర్ ద్వారా కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉంచబడినది మరియు అందులో గౌరవనీయ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది మరియు ఎ.1.00 గుంటలు ఎ.2.29 గుంటల మొత్తంలో అడ్వకేట్ కమిషనర్ ద్వారా గుర్తించబడినది మరియు అది అపరిష్కృతంగా ఉన్నది. మిగిలిన ఎ.8.25 గుంటల విస్తీర్ణమునకు సంబంధించి అక్కడ ఎటువంటి వివాదాలు లేవు మరియు పూర్తిగా స్పష్టంగా మా స్వాధీనంలో ఉన్నది, ఇందుకు సంబంధించి గౌరవనీయ న్యాయస్థానం నిషేధపుటుత్తరువు కూడా జారీ చేసినది మరియు అది మా స్వాధీనం క్రింద ఉన్నది మరియు సదరు **ఎల్ సంజీవ రెడ్డి** అక్కడ ప్రతీ విషయంలో జోక్యం చేసుకుంటున్నారు మరియు కొంతమంది అసాంఘిక శక్తులతో కలిసి అక్కడ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గౌరవనీయ న్యాయస్థానం ఉత్తర్వులను అతిక్రమిస్తూ విధేయత లేకుండా సదరు **ఎల్ సంజీవ రెడ్డి అలియాస్ నరసింహారెడ్డి** నా క్లయింట్ మెసర్స్ **అశోకా లీగ్ ప్రాజెక్ట్స్** వారి నుండి సులభంగా డబ్బు తీసుకొనుటకు ప్రయత్నిస్తూ మరియు నా క్లయింట్ పేరును చెడగొట్టుటకు ఎటువంటి వాస్తవాలు లేకుండా వార్తాపత్రికలలో తప్పుడు ప్రచురణలను ఇస్తూ మోసపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఆ ప్రకారంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా సదరు **ఎల్ సంజీవ రెడ్డి** భూమి నా క్లయింట్ ద్వారా కొనుగోలు చేయబడలేదు మరియు అతను అన్యాయమైన ధరకు అతని భూమి విక్రయించుట అతనికి కావాలి కనుక అతను తప్పుడు ప్రకటనలు/ప్రచురణలు వార్తాపత్రికలలో ఇస్తున్నారు. దానికి మేము సదరు **ఎల్ సంజీవ రెడ్డి మరియు ఎల్ సంగారెడ్డి అలియాస్ నరసింహారెడ్డి**లపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటున్నాము.

తేది: 05.07.2024 **సం/- ఎం.శ్రీనివాస్ రెడ్డి,** అడ్వకేట్, మొబైల్ నం: **8185811456**
ప్రదేశం: రంగారెడ్డి జిల్లా ఇ–మెయిల్: **prataplawfirmtg@gmail.com**
అడ్రస్: ఫ్లాట్ నం.405, 4వ అంతస్తు, సైబర్ శాంతి అపార్ట్‌మెంట్స్, ఆనంద్‌నగర్, బండ్లగూడజాగీర్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ– 500086

లోకల్ 'లొల్లి'

▶ మొదటి పేజీ తరువాయి

ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. అయితే ఎక్కువ మంది అభ్యర్థులు రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికత నిర్ధారణ ఇలా...

కొత్త జిల్లాల ఏర్పాటు..ఆపై జోన్లు, మల్టీ జోన్ల విభజన తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత స్థానికత పరిగణనలో ప్రభుత్వం కొంతమేర మార్పులు చేసింది.

- ఒక అభ్యర్థి స్థానికతను విద్యాభ్యాసం ఆధారంగా పరిగణిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతిలో ఎక్కువ కాలం(కనీసం నాలుగు సంవత్సరాలు) చదివిన జిల్లాను స్థానికతగా గుర్తిస్తున్నారు. లేదా 4,5,6,7 తరగతులను రాష్ట్రంలో చదివిన విద్యార్థిని తెలంగాణలో స్థానిక అభ్యర్థి కింద లెక్కిస్తారు.
- జిల్లా యూనిట్‌గా తీసుకున్నప్పుడు మాత్రం 1 నుంచి 7వ తరగతిలో కనీసం నాలుగేళ్లు చదివిన జిల్లాను ఆ జిల్లాలో పరిగణనలోకి తీసుకుంటారు. ఈమేరకు ఆ విద్యార్హత సర్టిఫికెట్లు (బోనఫైడ్) పరిశీలిస్తారు.

తహసీల్దార్ ధ్రువీకరించినవే ఎక్కువగా..

గ్రూప్–4 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా టీజీపీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన చేపడుతోంది. అయితే చాలామంది అభ్యర్థులు బోనఫైడ్‌లకు బదులుగా రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పిస్తున్నారు.

- తహసీల్దార్ ద్వారా తీసుకున్న నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పిస్తుండడంతో వాటిని అధికారులు ఆన్‌లైన్ ద్వారా నిర్ధారించుకుని పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పిస్తున్న అభ్యర్థులు ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుకున్న బోనఫైడ్‌లు మాత్రం సమర్పించడం లేదని సమాచారం. వారంతా ఏడోతరగతి వరకు బడికి వెళ్లకుండా ప్రైవేట్ పద్ధతిలో చదువుకున్నట్టు చెబుతుండడం గమనార్హం.

ఆ మూడు జిల్లాల్లోనే ఎక్కువగా...

రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థుల్లో అత్యధికంగా మూడు జిల్లాలకు చెందినవారే ఉన్నట్టు తెలుస్తోంది. గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మరో నెలరోజుల పాటు జరగనుంది. ఇప్పటివరకు జరిపిన పరిశీలన ప్రక్రియలో అత్యధికంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల నుంచి ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ జిల్లాల పరిధిలో ఉద్యోగాల సంఖ్య కూడా ఎక్కువే. పట్టణ నేపథ్యమున్న ఈ జిల్లాల్లో స్కూల్‌కు వెళ్లకుండా ప్రైవేట్‌గా చదివే పరిస్థితి ఉంటుందా అనే ప్రశ్న పలువురి నుంచి ఉత్పన్నమవుతోంది. తహసీల్దార్ కార్యాలయాల నుంచి స్థానికత ధ్రువీకరణ పత్రం సంపాదించడంపైనా పలు విమర్శలు వస్తున్నాయి. దీంతో సరైన విధంగా విచారణ జరపకుండా నియామక పత్రాలు ఇస్తే స్థానికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని నియామకాల్లోనూ..

టీజీపీఎస్సీ మాత్రమే కాదు..తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ), తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు నియామకాల బోర్డు(టీజీఎస్‌పీఆర్‌బీ), తెలంగాణ మెడికల్‌అండ్‌హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీజీఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా గత ఆర్నెల్లలో 30వేలకు పైబడి ఉద్యోగ నియామకాలు జరిగాయి. ఈ ప్రక్రియలోనూ చాలా మంది అభ్యర్థులు రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగాలు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు జరిగిన నియామకాల్లో రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పించిన వారి వివరాలను బహిర్గతం చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఉద్యోగ నియామక సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తున్నారు.

గురుకుల టైం టేబుల్ మార్చాలి

లేకుంటే ఆందోళన: పీఆర్‌జీటీఏ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకులాల్లో ప్రకటించిన టైం టేబుల్‌లో శాస్త్రీయత లోపించిందని, తక్షణమే దీన్ని మార్చాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తాము ప్రతిపాదించిన టైంటేబుల్ అమలు చేయకపోతే ఆందోళన దిశగా వెళ్తామని హెచ్చరించింది. అసోసియేషన్ అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈమేరకు సీఎస్ ఓఎస్‌డీ, మైనార్టీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీకి శుక్రవారం వినతి పత్రం అందజేసింది. కొత్త టైంటేబుల్ వల్ల విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం ఉండే అవకాశం ఉందని పేర్కొంది. అధికారులను కలిసిన వారిలో ఎంఎల్‌సీ పూల రఘోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, పీఆర్‌జీటీఏ ఉపాధ్యక్షుడు ఎం.వేణు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఉప్పు అశోక్ తదితరులున్నారు.



మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌జీటీఏ సంఘం నేతలు

కొత్త హెచ్‌ఓలకు పోస్టింగ్ ఉత్తర్వులిచ్చిన మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉద్యానవన శాఖలో కొత్తగా ఉద్యానవన అధికారులు (హెచ్‌ఓ)గా నియమితులైన వారికి శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోస్టింగ్ ఉత్తర్వులు అందించారు. రాష్ట్రంలో ఉద్యానపంటల సాగును మరింత పెంచాల్సిన ఆవశ్యకత ఉందని, ఇందుకు కొత్తగా నియమితులైన హెచ్‌ఓలు బాధ్యతగా ఈ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఉద్యాన పంటల రైతుల అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను పెంచాలన్నారు. ఉద్యాన, వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు, వాటి ఆవశ్యకత, సాంకేతికత తదితర అంశాలపైన ఉద్యానవన అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యానవన శాఖ సంచాలకుడు షేక్ యాస్మిన్ బాషా తది తరులు పాల్గొన్నారు.

10 నుంచి వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలతో పాటు విశ్వవిద్యాలయం గుర్తింపు పొందిన ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండేళ్ల వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ డిప్లొమా కోర్సు, మూడేళ్ల డిప్లొమాఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 10వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ పి.రఘురామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను రెండ్రోజుల పాటు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలీసెట్- 2024 ర్యాంకుల ఆధారంగా అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్, అభ్యర్థులు తీసుకురావలసిన సర్టిఫికెట్లు, ఫీజు తదితర వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ www.pjtsau.edu.inను సంప్రదించాలని సూచించారు. యూనివర్సిటీ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ర్యాంకుల వారీగా అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా...

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పార్టీలోకి వద్దు

గాంధీభవన్‌లో సరిత తిరుపతయ్య వర్గం ఆందోళన.. మెట్లపై కూర్చుని నిరసన

సాక్షి, హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని ఆ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఆయన్ను ఇప్పుడు పార్టీలోకి తీసుకుంటే మొదటి నుంచీ పార్టీలోనే ఉన్న తమ పరిస్థితేంటని వారు ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం గద్వాల నియోజకవర్గానికి చెందిన వందలాది మంది నేతలు, కార్యకర్తలు గాంధీభవన్ మెట్లపై కూర్చుని ఆందోళన చేశారు. కృష్ణమోహన్‌రెడ్డి మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. గద్వాల ఇన్‌చార్జి సరిత తిరుపతయ్య యాదవ్ వర్గానికి చెందిన వీరంతా మూడు గంటల పాటు గాంధీభవన్‌లోనే ఉండి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ధరూర్ మండలం పాతపల్లికి చెందిన పాషా అనే కార్యకర్త మాట్లాడుతూ ఇప్పుడు కృష్ణమోహన్‌రెడ్డి పార్టీలోకి వస్తే తమ పరిస్థితేంటని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నుంచీ సరితా తిరుపతయ్య పార్టీలో ఉంటున్నారని, ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న తమ లాంటి వారి గురించి పార్టీ ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేకే రాజీనామాకు ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సీనియర్ నేత కె.కేశవరావు రాజీనామాను రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆమోదించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన నేపథ్యంలో కేశవరావు రాజ్యసభ చైర్మన్‌ను కలిసి రాజీనామా లేఖను అందించడం తెలిసిందే. ఈ మేరకు రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయిందని రాజ్యసభ సచివాలయం బులెటిన్‌ను విడుదల చేసింది. బీఆర్ఎస్ పార్టీని వీడిన కేశవరావు ఇటీవల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం తెలిసిందే.

నథింగ్ టు వర్రీ.. న్యాయం దక్కుతుంది

కవితకు కేటీఆర్, హరీశ్‌రావు భరోసా



సాక్షి, న్యూఢిల్లీ: 'నథింగ్ టు వర్రీ. న్యాయస్థానాలను ఆశ్రయించాం. కచ్చితంగా న్యాయం దక్కుతుందనే నమ్మకం ఉంది'అంటూ ఎమ్మెల్సీ కవితకు సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో జ్యుడీషియల్ కస్టడీపై ఉన్న ఎమ్మెల్సీ కవితను తిహార్ జైలులో కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. లిక్కర్ కుంభకోణం కేసులో సీబీఐ, ఈడీ వ్యవహరిస్తున్న తీరును కవితకు వివరించారు. న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, త్వరలోనే బయటకు వస్తావు అధైర్యపడాల్సిన అవసరం లేదంటూ ధైర్యం చెప్పారు. అనంతరం సుప్రీంకోర్టులో వేయనున్న బెయిల్ పిటిషన్‌పై న్యాయ నిపుణుల బృందంతో కేటీఆర్, హరీశ్‌రావులు భేటీ అయ్యారు. సీబీఐ, ఈడీలను ఏవిధంగా ఎదుర్కోవాలి, కవితకు బెయిల్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. బెయిల్ నిమిత్తం సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశముందని తెలుస్తోంది.

త్వరలోనే జాబ్ కేలండర్

టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే జాబ్ కేలండర్ విడుదల చేస్తామని, ఈ కేలండర్ ద్వారా రానున్న ఐదేళ్లలో 2లక్షల ఉద్యోగ ఖాళీలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ వెల్లడించారు. పదేళ్ల కాలంలో నిరుద్యోగులను అరిగోస పెట్టించిన బీఆర్ఎస్.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. నిరుద్యోగుల పక్షాన ఆలోచించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. పది రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డికి నిరుద్యోగులు పాలతో అభిషేకం చేస్తారని పేర్కొన్నారు. కొందరు దొంగ దీక్షలకు కూర్చుని నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులు ఎలాంటి ఆందోళనలు, పోరాటాలు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని దయాకర్ హామీ ఇచ్చారు.

కర్ణాటక బీజేపీ సహ ఇన్‌చార్జిగా పొంగులేటి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ బీజేపీ సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డిని కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌చార్జిగా నియమించారు. దేశంలోని 24 రాష్ట్రాలకు ఇన్‌చార్జిలు, సహ ఇన్‌చార్జిలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఈ విషయాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిహార్‌కు వినోద్‌తావ్డే, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లకు తరుణ్ ఛుగ్, జార్ఖండ్‌కు లక్ష్మీకాంత్ బాజ్‌పేయి, కర్ణాటకకు రాధా మోహన్‌దాస్, కేరళకు ప్రకాశ్ జవదేకర్, పంజాబ్‌కు విజయ్ రూపానీలను ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈశాన్య రాష్ట్రాల కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ సంబిత్ పాత్రా, జాయింట్ కో–ఆర్డినేటర్‌గా వి.మురళీధరన్‌కు బాధ్యతలు అప్పగించారు.

బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకం ఎప్పుడు?

- కేంద్రమంత్రిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలతో బిజీబిజీ
- పోటీలో ఎంపీలు ఈటల, డీకే అరుణ, అర్వింద్, రఘునందన్
- అదే వరుసలో ఎమ్మెల్యేలతోపాటు పాత, కొత్త నేతలు కూడా....
- ఎటూ తేల్చుకోలేకపోతున్న బీజేపీ కేంద్ర నాయకత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి నియామకం ఎటూ తేలలేదు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో స్తబ్దత నెలకొంది. కేంద్ర కేబినెట్ ఏర్పాటు, తదనంతర పరిణామాల్లో రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక తెరపైకి వచ్చి హడావిడి జరిగినా, ఆ తర్వాత మళ్లీ సద్దుమణిగింది. కేంద్రమంత్రిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డిని జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించారు. దీంతో ఆయన అటు మంత్రిగా పార్లమెంట్ సమావేశాలు, కశ్మీర్ బాధ్యతలతో బిజీగా ఉంటున్నారు. కశ్మీర్ ఎన్నికలు వచ్చే సెప్టెంబర్ నెలాఖరులోగా జరిగే అవకాశాలు ఉండటంతో అప్పటి దాకా అధ్యక్షుడిగా ఆయన రాష్ట్ర రాజకీయాలపై దృష్టి సారించే పరిస్థితులు లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ పదవిలో ఎవరిని నియమించాలనే దానిపై బీజేపీ కేంద్రం నాయకత్వం ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రాలేదు. దీంతో ఈ అంశం కొంతకాలం పాటు పెండింగ్‌లో పడినట్టుగానే భావించాల్సి ఉంటుందని పార్టీవర్గాలు పేర్కొంటున్నా యి. రాష్ట్రంలో అడపాదడపా యువమోర్చా, మహిళా మోర్చాల వంటి విభాగాలు ఆయా అంశాలు, సమస్యలపై నిరసనలు, దీక్షలు వంటివి చేపడుతున్నా పెద్దనాయకులెవరూ పాల్గొనకపోవడంతో అవి పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నాయి. అధ్యక్ష పదవి కోసం పలువురు ముఖ్యనేతలు పోటీపడుతున్నా, చివరకు ఎవరిని నియమిస్తారనే దానిపై స్పష్టత కొరవడింది. పార్టీలో ఉన్న ఇప్పటికే ఉన్న కొందరు ముఖ్యనేతలు, పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయలేమి, కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు పవర్‌సెంటర్లుగా మారడం వంటి కారణాలతో పార్టీనాయకత్వం రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికను వాయిదా వేస్తోందని పార్టీనాయకులు భావిస్తున్నారు. జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా పదవీకాలం ముగిసి, ఆయన్ను కూడా కేంద్ర కేబినెట్‌లోకి తీసుకున్నందున, కొత్త జాతీయ అధ్యక్షుడి నియామకం తర్వాతే రాష్ట్ర అధ్యక్షుడిని నియమించే అవకాశాలున్నాయని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

కొనసాగుతున్న ఉత్కంఠ

కొత్త అధ్యక్షుడి ఎంపికపై రాష్ట్ర బీజేపీలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, అర్వింద్ ధర్మపురి, ఎం.రఘునందన్‌రావు గట్టిగా పోటీపడుతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. కేంద్రమంత్రిగా, బీజేఎల్పీనేతగా రెడ్డి సామాజికవర్గానికి అవకాశం ఇచ్చినందున, బీసీ వర్గాల నుంచే అధ్యక్షుడిని ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. దీంతో ఈటల పేరు దాదాపుగా ఖరారై ప్రకటించాల్సిన దశలో మళ్లీ ఏవో కారణాలతో వాయిదా పడినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి ఒకరి ఎంపిక ఉండొచ్చునని కొందరు అభిప్రాయపడుతున్నారు. పార్టీపరంగా చూస్తే ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పార్టీ సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, టి.ఆచారి, ఎం.ధర్మారావు డా.జి. మనోహర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, దుగ్యాల ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఈ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. అధ్యక్ష పదవి కోసం పాత,కొత్త నాయకుల మధ్య తీవ్రస్థాయిలో పోటీ నెలకొనడంతో రాష్ట్ర పార్టీలోనూ విచిత్ర పరిస్థితులు ఏర్పడ్డాయి. కొంతకాలం క్రితమే పార్టీలో చేరిన వారికి కీలకమైన అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారా అన్న చర్చ కూడా బలంగానే వినిపిస్తోంది. మరోవైపు 1951లో జనసంఘ్ కాలం, 1980లో బీజేపీగా ఏర్పడ్డాక ఇప్పటిదాకా రెండేళ్ల పాటు మాత్రమే బంగారు లక్ష్మణ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగించారు. ఇదీగాకుండా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో దళిత సామాజికవర్గాల ఆదరణను పొందలేకపోయినందున ఈసారి ఓ సీనియర్ ఎస్సీ నేతను కొత్త అధ్యక్షుడిగా నియమించడం ద్వారా ఈ వర్గాల్లోనూ పార్టీ విస్తరణకు అవకాశం ఉంటుందని ఓ వర్గం నాయకులు గట్టిగా వాదిస్తున్నారు.

కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

- తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నందుకు రూ.100 కోట్లు చెల్లించాలని డిమాండ్
- తనపై సోషల్ మీడియాలో బీఆర్ఎస్ దుష్ప్రచారంపై మంత్రి ఆగ్రహం
- క్షమాపణ చెప్పకపోతే చట్టపరంగా చర్యలు..



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌కు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీకి కూడా నోటీసులు ఇచ్చారు. తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నందుకు రూ.100 కోట్ల మేరకు నష్టపరిహారంగా చెల్లించాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారానికి ఆమె ఈ నోటీసులు పంపించారు. 'ఇందిరమ్మ రాజ్యంలో– ఇసుకాసుర రాజ్యం'అంటూ సీఎం, సీతక్కతో పాటు మంత్రులపై గత కొంతకాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి తీవ్రంగా పరిగణించారు. సామాజిక మాధ్యమాల్లో తనపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు లిఖిత పూర్వకంగా క్షమాపణలు చెప్పాలని, ఆ మేరకు ఆరోపణల వీడియో అసత్యమని అంగీకరిస్తూ ఒక వీడియో పోస్ట్ చేయాలని ఆ నోటీసుల్లో మంత్రి పేర్కొన్నారు. ఈ నోటీసులకు స్పందించి క్షమాపణలు చెప్పకపోతే.. చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 24న బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా పేజీలో ఈ పోస్టులు పెట్టిన నేపథ్యంలో లీగల్ నోటీసులు పంపించినట్టు మంత్రి తరపు న్యాయవాది నాగులూరు కృష్ణకుమార్ తెలిపారు. ఈ మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియోలో సీతక్కతో సీఎం, కేబినెట్ మంత్రులు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడినట్టుగా చూపడాన్ని తప్పు బట్టారు. పనిగట్టుకుని ఎలాంటి ఆధారాలు లేకుండా అవాస్తవాలతో చేస్తున్న దుష్ప్రచారంతో తమ క్లయింట్, మంత్రి సీతక్క ప్రతిష్టకు తీరని విఘాతంతోపాటు, ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం ఓటర్లలో ఆమెకున్న ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు.

ప్రమాదంలో మండలి మనుగడ: వినోద్

- ఇద్దరు సీఎంలు అసెంబ్లీలో సీట్లు పెరిగేలా చూడాలి
- తెలంగాణ ఆస్తులపై చంద్రబాబుతో రేవంత్ రాజీ పడొద్దు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్య తగ్గడంతో తెలంగాణ శాసన మండలి మనుగడకు ప్రమాదం ఏర్పడిందని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో వినోద్ కుమార్ మాట్లాడుతూ...శాసనసభలో ఆంగ్లో ఇండియన్ సభ్యుడిని ఎమ్మెల్యేగా నామినేట్ చేసే నిబంధన తొలగించడంతో రాష్ట్రంలో ఎమ్మెల్యేల సంఖ్య 119కి పడిపోయిందన్నారు. గతంలో ఆంగ్లో ఇండియన్ కోటా సభ్యుడితో కలుపుకుని ఎమ్మెల్యేల సంఖ్య 120గా ఉండేదన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 169 ప్రకారం శాసన మండలిలో ఎమ్మెల్సీల సంఖ్య 40 కంటే తక్కువ ఉండకూడదని స్పష్టం చేశారు. అసెంబ్లీలో 119 మంది శాసనసభ్యులే ఉండటంతో రాజ్యాంగ నిబంధనల ప్రకారం శాసనమండలిలో సభ్యుల సంఖ్య 39కి పడిపోయిందన్నారు. దీంతో శాసనమండలి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. తెలంగాణ శాసనమండలి కొనసాగేందుకు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెంచడమే ఏకైక మార్గమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే శాసనమండలి రద్దయ్యే అవకాశముందన్నారు.

శాసనసభ సీట్లు పెంచాలి

తెలుగు రాష్ట్రాలశాసనసల్లో సీట్లు పెంచేందుకు ఆయా రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ప్రయత్నించాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం తెలంగాణలో 153, ఏపీలో 225 శాసనసభ సీట్లు ఉండేలా చూడాలన్నారు. శనివారం జరిగే ఉభయ రాష్ట్రాల సీఎంల భేటీలో తెలంగాణ ఆస్తుల పరిరక్షణలో సీఎం రేవంత్ రాజీపడొద్దని కోరారు.

పాలమూరులో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీ

ఈ ఏడాది నుంచి మొదలయ్యే చాన్స్

సాక్షి, హైదరాబాద్: పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీ రాబోతోంది. దీనిపై ప్రభుత్వం నియమించిన నలుగురు సభ్యులతో కూడిన కమిటీ శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రితో సమావేశమైంది. దీంతో పాటు మహబూబ్‌నగర్‌లో లా కాలేజీ ఏర్పాటుపైనా అధికారులు చర్చించారు. త్వరలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించనున్నారు. వీలైనంత వరకు ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంజనీరింగ్ కాలేజీ మొదలవ్వాలని ప్రభుత్వం నుంచి సంకేతాలు వచ్చినట్లు తెలిసింది. పాలమూరు యూనివర్సిటీ కొన్ని నెలల కిందట ఇంజనీరింగ్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), సీఎస్ఈ–ఏఐఎంఎల్, సీఎస్ఈ–డేటాసైన్స్, సీఎస్ఈ–సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ కోర్సులతో కాలేజీ నిర్వహించాలని విశ్వవిద్యాలయం ప్రతిపాదించింది. దీనిపై సాధ్యాసాధ్యాల పరిశీలనకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. జేఎన్టీయూహెచ్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన డీన్ కుమార్, మెకానికల్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ కృష్ణయ్య, సాంకేతిక విద్య విభాగం ఆర్‌జేడీ శ్రీనాథ్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుత డిమాండ్‌ను పరిశీలిస్తే ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ కోర్సుల వల్ల ఉపయోగం లేదని కమిటీ భావిస్తోంది. ప్రైవేటు కాలేజీల్లో కూడా ఈ కోర్సులకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదని గుర్తించింది. సీఎస్ఈతో పాటు, ఏఐఎంఎల్, డేటాసైన్స్ మాత్రమే అనుమతిస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. ఈ కోర్సులకు కావాల్సిన మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, ఆర్థిక అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని యూనివర్సిటీకి సూచించింది. ఒక్కో విభాగంలో తొలి దశలో 60 సీట్లను అనుమతించే వీలుంది. వర్సిటీ కొత్త ప్రతిపాదనలు పంపిన తర్వాత ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.

నేడు రేవంత్, బాబు భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఇతర శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు కూడా పాల్గొననున్నారు.

కీలక అంశాలపై చర్చలు

విభజన సమస్యలపై గతంలో అధికారుల స్థాయిలో దాదాపు 30 సమావేశాలు జరిగినా పెద్దగా ముందడుగు పడలేదు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీట వేయడంతో సమస్యలు, అంశాలు పరిష్కారానికి నోచుకోలేదు. తాజా సమావేశంలో ప్రధానంగా షెడ్యూల్ 9, 10లోని సంస్థలు, వాటి ఆస్తులు, నగదు నిల్వల పంపకాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ఏ రాష్ట్రంలో ఉన్న ఆస్తులు ఆ రాష్ట్రానికి చెందుతాయని కేంద్ర ప్రభుత్వం విస్పష్టంగా ప్రకటించినప్పటికీ.. ఆంధ్రప్రదేశ్ మాత్రం అలా కుదరదని, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు వేల కోట్లతో హైదరాబాద్‌లో ఆస్తులు ఏర్పడ్డాయని, వాటిలో వాటా కావాలని డిమాండ్ చేస్తోంది. తెలంగాణ మాత్రం తమ భూభాగంలోని స్థిరాస్తుల్లో వాటా ఇచ్చే ప్రసక్తే లేదని వాదిస్తోంది. ఇక ఆర్టీసీ బస్‌భవన్, రాష్ట్ర ఆర్థికసంస్థ, ఉన్నత విద్యా మండలి, స్పోర్ట్స్ అథారిటీ ఆస్తులు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్, ఉద్యోగుల పరస్పరం బదిలీ అంశాలు కూడా ప్రస్తుత భేటీలో ప్రధానంగా చర్చకు రానున్నాయి.

విద్యుత్ బకాయిల అంశం కూడా..

ఇరు రాష్ట్రాల మధ్య విద్యుత్ బకాయిల అంశం కూడా ప్రధానంగా మారింది. తెలంగాణకు రావాల్సిన సీలేరును ఏపీకి కేటాయించడం వల్ల, అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లు చేయడం వల్ల.. వేల కోట్ల రూపాయల భారం రాష్ట్రంపై పడిందని, ఆ మొత్తాన్ని ఏపీ చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తుంటే.. తెలంగాణకు విద్యుత్ సరఫరా చేసినందున అందుకు చెల్లించాల్సిన నిధులు ఇవ్వడం లేదని ఏపీ చెబుతోంది. కృష్ణా జలాల పంపకంపై కూడా ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. గతంలో తాత్కాలిక పద్ధతిలో పంపిణీ చేసిన కృష్ణా జలాలను ఇప్పుడు 50 :50 చొప్పున పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. మరోవైపు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు చెందిన నిధుల వివాదం కూడా పరిష్కారానికి నోచుకోలేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ డిమాండ్లు

1. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన 7 మండలాలను తిరిగి తెలంగాణలో చేర్చాలి.
2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 1000 కి.మీ. మేర విస్తారమైన తీరప్రాంతం ఉంది. తెలంగాణకు ఈ తీర ప్రాంతంలో భాగం కావాలి.
3. తెలుగు ప్రజల ఆరాధ్య దైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి. టీటీడీలో కూడా తెలంగాణకు భాగం కావాలి.
4. కృష్ణా నదిలో 811 టీఎంసీల నీటి లభ్యత ఉంది. అంతర్జాతీయ నీటి పంపిణీ సూత్రం ప్రకారం క్యాచ్ మెంట్ ఏరియా నిష్పత్తిలో నీటి పంపకాలు జరగాలి. అదేవిధంగా తెలంగాణకు 558 టీఎంసీల నీటిని కేటాయించాలి.
5. తెలంగాణ విద్యుత్ సంస్థలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు రూ.24 వేల కోట్ల బకాయిలు సత్వరమే చెల్లించాలి. దానిలో భాగంగా ఆంధ్రాకు ఏమైనా చెల్లించాల్సి ఉంటే చెల్లించడం జరుగుతుంది.
6. తెలంగాణకు ఓడరేవులు లేవు. అందుకే విభజనలో భాగంగా ఆంధ్రాలోని కృష్ణపట్నం, మచిలీపట్నం, గంగవరం రేవుల్లో వాటా కావాలి.

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న వికాస్‌రాజ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సీఈవో బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. దీంతో ఆయన శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్ట్ చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుదర్శన్‌రెడ్డిని పురపాలక శాఖ కార్యదర్శి స్థానం నుంచి బదిలీ చేసి, హైదరాబాద్ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. అక్కడ నుంచి గత నెలలో ఆయన్ను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి బదిలీ చేసి జీఏడీ సర్వీసెస్ విభాగానికి పంపించింది. అక్కడికి వెళ్లిన పక్షంరోజులు కూడా కాకముందే సుదర్శన్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా నియమించింది. కాగా, వికాస్ రాజ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను సజావుగా ఎక్కడా రీపోలింగ్ లేకుండా నిర్వహించారు. ఆయన సీఎస్‌కు రిపోర్ట్ చేసిన తర్వాత త్వరలోనే ప్రభుత్వం కొత్త పోస్టింగ్ ఇవ్వనుంది. సుదర్శన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లి గ్రామానికి చెందినవారు. 2002 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన ఆయన ఉమ్మడి ఏపీలో ట్రెనీ కలెక్టర్, సబ్‌కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2014 నుంచి 2019 వరకు కేంద్రమంత్రిగా పనిచేసిన బండారు దత్తాత్రేయకు పర్సనల్ సెక్రటరీగా, అప్పుడు రక్షణశాఖ మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ సెక్రటరీగా పనిచేశారు. అనంతరం తెలంగాణ సీఎం కేసీఆర్ హయాంలో మున్సిపల్‌శాఖ సెక్రటరీగా పనిచేశారు. సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమితుడు కావడంతో ఆయన స్వగ్రామమైన తిరుమలరెడ్డిపల్లెలో ఆయన బంధువులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే నిధులు విడుదల చేయండి

- గ్రామాలకు 7 నెలల్లో 7 పైసలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదు
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని, పారిశుద్ధ్య కార్మికులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. సర్పంచ్‌లు గతంలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమానికి అంకురార్పణ చేస్తే... ఏడు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం కుంటుపడేసి, పంచాయతీలకు నయాపైసా కూడా విడుదల చేయకుండా నిర్వహణను గాలికి వదిలేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు జీతాలు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, వేతనాలు అందకపోవడంతో దిక్కులేని స్థితిలో పనులు మానేశారని, దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ ఆగిపోయిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 7 నెలల్లో 7 పైసలు కూడా విదిల్చింది లేదని విమర్శించారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సైతం గౌరవ వేతనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను తిరిగి గాడినపెట్టేందుకు కృషి చేయాలని, ముఖ్యమైన సమస్యలకు తక్షణం పరిష్కారం చూపాలని లేఖలో హరీశ్‌రావు కోరారు.

మా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతల పెత్తనం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ధ్వజం
- ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ స్పందించాలి



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్

సాక్షి, హైదరాబాద్: తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతల పెత్తనం నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ప్రొటోకాల్ నిబంధనలు పాటించకపోవడంపై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చేందుకోసం స్పీకర్‌ను కలిసేందుకు అసెంబ్లీకి వచ్చి ఎదురుచూసినా ఆయన అందుబాటులోకి రాలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి శుక్రవారం సునీతా లక్ష్మారెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. స్పీకర్ ఎప్పుడు అపాయింట్‌మెంట్ ఇచ్చినా ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ప్రివిలేజ్‌మోషన్ ఇస్తామని ఆమె చెప్పారు. కాంగ్రెస్ నేతలు అధికార గర్వంతో విర్రవీగవద్దని ఎమ్మెల్యే కె.సంజయ్ హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

కేసులకు భయపడేది లేదు: పాడి కౌశిక్‌రెడ్డి

ఉదయం 11 గంటలకు కలిసేందుకు స్పీకర్ తమకు సమయం ఇచ్చారని, కానీ మధ్యాహ్నం ఒంటి వరకు ఎదురుచూడటంతో పాటు ఎన్నిమార్లు ఫోన్ చేసినా స్పీకర్ అందుబాటులోకి రాలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లాలో అధికారులు యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారన్నారు. విద్యా శాఖపై సమీక్ష చేసిన తనపై క్రిమినల్ కేసు నమోదు చేశారని, కరీంనగర్ డీఈఓ, జెడ్పీ సీఈఓపై ప్రివిలేజ్‌మోషన్ ఇచ్చేందుకు అసెంబ్లీకి వచ్చానని తెలిపారు. అధికారుల తీరుతో కల్యాణలక్ష్మి చెక్కులు బౌన్స్ అవుతున్నాయని, ప్రొటోకాల్ ఉల్లంఘనలపై సీఎం రేవంత్ స్పందించాలని సూచించారు. తనపై కేసులు పెడితే భయపడేది లేదని, జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధమేనని కౌశిక్‌రెడ్డి అన్నారు. అవసరమైతే సీఎం కాన్వాయ్‌కు అడ్డుపడతానని పేర్కొన్నారు.

రాష్ట్రపతి ప్రసంగంలో అసత్యాలు చెప్పించారు

- నెహ్రూ, ఇందిర గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగం విని బాధ అనిపించిందని, రాష్ట్రపతితో ఎన్డీఏ ప్రభుత్వం అసత్యాలు చెప్పించిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఇందిరా 'గరీబీ హటావో' నినాదం బూటకం అన్నట్లుగా రాష్ట్రపతితో మాట్లాడించారని విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరాగాంధీ గురించి రాష్ట్రపతి నోటి నుంచి చెడుగా చెప్పించే ప్రయత్నం చేశారని వారి గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదని తేల్చి చెప్పారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ ఓడించిందని చెబుతున్న బీజేపీ అసలు అప్పుడు ఉందా అని ప్రశ్నించారు. అంబేడ్కర్ ఓడిపోయిన తర్వాత ఆయన్ను ఎంపీని చేసి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, రాజ్యాంగాన్ని రాసే గురుతర బాధ్యతను ఆయనకు అప్పగించింది కూడా కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు.



కేసీఆర్ ఫిరాయింపులకు పాల్పడినప్పుడు కేటీఆర్ ఏం చేస్తున్నారు?

- రాష్ట్రంలో ఫిరాయింపులు ప్రారంభించింది బీఆర్ఎస్సే
- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తుంటే ఏదో జరిగిపోయిందని మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయన తండ్రి కేసీఆర్ ఫిరాయింపులకు పాల్పడినప్పుడు ఏంచేస్తున్నారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...కేసీఆర్‌ను ఓడించింది తెలంగాణ రైతులేనన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో కూర్చుని బీఆర్ఎస్ కార్యకర్తలకు పేదరాశి పెద్దమ్మ కథలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తీరు చూస్తుంటే ఆయన ఫామ్‌హౌజ్‌కు తానే ముఖ్యమంత్రినని చెప్పుకునేలా ఉన్నారని, వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు అధికారంపై మాత్రమే యావని, రైతులపై ఏమాత్రం ప్రేమ లేదని చెప్పారు. 2000 సంవత్సరంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే పాపారావును టీఆర్ఎస్‌లో చేర్చుకుని రాష్ట్రంలో ఫిరాయింపుల పర్వానికి తెరదీసింది బీఆర్ఎస్ పార్టీయేనని గుర్తు చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అక్రమపొత్తు

- బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి
- టీడీపీ గెలిస్తే మంత్రి తుమ్మల సంబురాలు చేసుకోవడం ఏమిటి?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అక్రమ పొత్తు కొనసాగుతోందని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ సంపదను అమ్మేస్తున్నారని, సింగరేణి బొగ్గు గనులను వేలం వేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ వేసిన విద్యుత్ కమిషన్‌కు బీజేపీ సపోర్టు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద గెలిచిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో సంబురాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రంలో కలిసి పని చేస్తున్నాయని అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలని అడిగారు. తాను, తన తల్లి సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు.

జీవాత్మకు పరమశాంతి లభించేది పరమాత్మను ప్రాప్తం గావించుకున్నప్పుడే; కనుక దానికి సైతం పరమ ఆశ్రయం ఆ పరమాత్మేనని వేదాంతుల వివరణ.
– ప్రశ్నోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 6 జూలై 2024

చైనా తీరు మారాలి!

ఆవిర్భవించిన నాటి లక్ష్యాలు విడిచి చాన్నాళ్లుగా దారీ తెన్నూ లేకుండా మిగిలిపోయిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రెండు రోజుల శిఖరాగ్ర సదస్సు కజఖ్‌స్తాన్‌లోని ఆస్తానాలో గురువారం ముగిసింది. ఈ సదస్సువల్ల ఇతరత్రా పెద్ద ప్రయోజనం లేకపోవచ్చుగానీ మనతోవున్న సరిహద్దు సమస్యను నాలుగేళ్లుగా దాటవేస్తున్న చైనాతో మన విదేశాంగమంత్రి జైశంకర్ భేటీ కావటం ఉన్నంతలో జరిగిన మేలు. వాస్తవానికి ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావాల్సివుండగా ఆయన బదులు విదేశాంగ మంత్రి వెళ్లారు. ప్రధాని ప్రసంగాన్ని చదివి వినిపించారు. మోదీ గైర్హాజరు ఆ సంస్థనుంచి భారత్ దూరం జరగటానికి సంకేతమనీ, అమెరికా ఒత్తిడే ఇందుకు కారణమనీ చైనా అనుకూల మీడియా ప్రచారం చేసుకుంది. నిరుడు భారత్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు కూడా ఇలాంటి భాష్యాలే చెప్పారు. చైనాతో నేరుగా సమావేశం కావటం ఇష్టం లేకే ఈ లాంఛనం పూర్తిచేసిందని ఆ భాష్యాల సారాంశం.

నిజమే... ప్రపంచంలో 40 శాతం జనాభాతో, ప్రపంచ జీడీపీలో 23 లక్షల కోట్ల మేర వాటాతో ఉన్న దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్‌సీఓను విస్మరించటం మంచిది కాదు. కానీ ఆ సంస్థ ఆరంభ కాలంనాటి లక్ష్యాలను గుర్తుంచుకుందా? వాటికి అనుగుణంగా పనిచేస్తున్నదా అంటే లేదనే చెప్పాలి. వర్తక, వాణిజ్యాల్లో దాని ముద్ర లేకపోలేదు. అయితే ఆ సంస్థ పరిధిలోని ప్రాంతాల్లో ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా వగైరా పోకడల గురించి అది సక్రమంగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. మోదీ ప్రసంగంలో ఈ సమస్యలే ప్రధానంగా ప్రస్తావనకొచ్చాయి. 1996లో షాంఘై ఫైవ్‌గా ఏర్పడ్డ బృందంలో చైనా, రష్యా, కజఖ్‌స్తాన్, కిర్గిజిస్తాన్, తజికిస్తాన్‌లున్నాయి. 1991లో సోవియెట్ యూనియన్ కుప్పకూలాక ఆ ప్రాంతంలో తెగల ఘర్షణలు పెచ్చుమీరటంతో భద్రతాపరమైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి ఈ బృందం ఆవిర్భవించింది. అంతర్జాతీయ సంస్థగా మలచాలన్న లక్ష్యంతో 2001లో దీన్ని ఎస్‌సీఓగా మార్చారు. మన దేశానికి సభ్యత్వం ఇవ్వాలన్న రష్యా ప్రతిపాదనను అంగీకరిస్తూనే 2017లో తనకు అనుకూలంగా ఉన్న పాకిస్తాన్‌ను ఇందులో చేర్చింది చైనాయే. కానీ ఉగ్రవాదులకు సాయం చేస్తున్నట్టు వెల్లడై అనేక సార్లు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అభిశంసనకు గురైన పాక్‌ను దారి మార్చుకోవాలని చెప్పటంలో చైనా విఫలమైంది. అలాగే పాకిస్తాన్‌లో తలదాచుకున్న ఉగ్రవాదుల జాబితాను మన ప్రతిపాదన పర్యవసానంగా భద్రతామండలి చర్యలు తీసుకుంటున్న తరుణంలో చైనా గండికొట్టింది. సరిగదా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)ను పాకిస్తాన్ అధీనంలోవున్న ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్లేలా రూపొందించింది. అందుకే 2018లో ఎస్‌సీఓలో బీఆర్ఐను అందరూ అంగీకరించినా మన దేశం వ్యతిరేకించాల్సి వచ్చింది. నిరుడు జరిగిన ఆన్‌లైన్ సదస్సులో కూడా మన దేశం బీఆర్ఐ గురించిన పేరా తొలగిస్తే తప్ప ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేది లేదని చెప్పింది.

ఆ సంగతలావుంచి ఎస్‌సీఓను అమెరికా, పాశ్చాత్య దేశాల నేతృత్వంలోని సంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలనుకుంటున్న చైనా అందుకు అనుగుణమైన నడవడి కనబరచవద్దా? వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వద్ద భారీగా సైన్యాన్ని మోహరించి దురాక్రమణకు పాల్పడినప్పుడు ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. 2020లో ఘర్షణలు చెలరేగాక భారత్, చైనాల సైనికాధికారుల స్థాయిలో 20 సార్లు, దౌత్యస్థాయిలో 13 రౌండ్ల చర్చలు జరిగాక ప్యాంగాంగ్ సో సహా అయిదు చోట్ల ఇరు దేశాల సైన్యాలూ వెనక్కి తగ్గటానికి అంగీకరించాయి. తూర్పు లద్దాఖ్‌లోని ప్రాంతాల్లో పరిస్థితి మారలేదు. దీన్ని పక్కనబెట్టి ఇరు దేశాల సంబంధాలూ సాధారణ స్థితికి తీసుకురావాలని చైనా కోరుతోంది. కానీ అక్కడ 2020 ఏప్రిల్ నాటి స్థితికి చైనా సిద్ధపడితేనే అది అసాధ్యమన్నది మన దేశం వాదన. మన సరిహద్దుకు సమీపంగా ఈ నాలుగేళ్లలో చైనా 600 'సంపన్న గ్రామాల'ను నిర్మించింది. మన దేశం కూడా అరుణాచల్‌లో 60 గ్రామాలు నిర్మిస్తోంది. ముందుముందు అరుణాచల్, హిమాచల్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, సిక్కింలలో ఇలాంటివి 3,000 గ్రామాలు నిర్మించాలన్నది మన దేశం లక్ష్యం. ఇదిగాక అమెరికన్ కాంగ్రెస్ ప్రతినిధి బృందం దలైలామాను కలవడానికి మన దేశం అంగీకరించటం, దక్షిణ చైనా సముద్రంలో చైనాతో ఫిలిప్పీన్స్‌కు వచ్చిన తగాదాలో ఫిలిప్పీన్స్‌ను సమర్థించటం చైనాకు కంటగింపుగా ఉంది. అటు చైనా మనతో స్నేహసంబంధాలున్న హిందూ మహాసముద్ర ప్రాంత దేశాలను దువ్వుతూ మనకు వ్యతిరేకంగా కూడగడుతోంది.

ఈ నేపథ్యంలో ఎల్ఏసీ సమస్యపై భారత్‌తో చర్చించి, దాన్ని త్వరగా పరిష్కరించుకోవాలన్న జ్ఞానం చైనాకు ఉండాలి. అసలు ఎల్ఏసీ మ్యాప్‌లను ఇచ్చిపుచ్చుకుందామన్న మన ప్రతిపాదనకే అది జవాబివ్వటం లేదు. ఆ పని చేస్తే తన పాపం బద్దలవుతుందని దాని భయం. వర్తక వాణిజ్యాలు ముమ్మరంగా పెరిగేలా, కట్టుదిట్టమైన భద్రత ఉండేలా ఎస్‌సీఓను తీర్చిదిద్దుతామని మాటల్లో చెబుతూనే అతి పెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను విస్మరించటం ఏ రకంగా చూసినా చైనాకు తోడ్పడదు. పొరుగుతో సఖ్యతకు రాలేని దేశం ఇటువంటి సంస్థల అభ్యున్నతికి ఏమాత్రం పాటుపడగలదన్న ప్రశ్నలు అందరిలోనూ తలెత్తుతాయి. అందువల్లే మళ్లీ చర్చల పునరుద్ధరణకు చైనా చొరవ తీసుకోవాలి. చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ, జైశంకర్‌ల మధ్య జరిగిన భేటీ ఆ దిశగా తోడ్పడితే మంచిదే. సమస్య పరిష్కారానికి ఇరు దేశాలూ చిత్తశుద్ధితో ప్రయత్నించి సఫలమైతేనే ఎస్‌సీఓ వంటి సంస్థల నిజమైన లక్ష్యాలు నెరవేరతాయి.

రైతులకు లాభాలు తేలేమా?

విశ్లేషణ


దేవీందర్ శర్మ

ఇరవై ఏళ్లలో బ్రెడ్ ధర రెండింతలు పెరిగింది, కానీ గోధుమల ధర సగానికి తగ్గింది. రైతులను మినహాయిస్తే అందరినీ సంతోషపెట్టే ఏర్పాటు ఇది. ప్రపంచవ్యాప్తంగా ఓవైపు రైతుల ఆదాయం పడిపోతుంటే, మరోవైపు కార్పొరేట్లు మాత్రం లాభార్జన చేస్తున్నాయి. భారత దేశంలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్నది వ్యవసాయ రంగమే. 45.5 శాతం మంది శ్రామిక శక్తికి ఉపాధి కల్పిస్తూ, వ్యవసాయాన్ని లాభదాయకమైన వ్యాపారంగా మార్చడం ఈ కాలపు అవసరం. 2024–25 సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి సమాయత్తమవుతున్న తరుణంలో, వ్యవసాయాన్ని పునర్నిర్మించే రోడ్‌మ్యాప్‌ను రూపొందించేందుకు ఎలాంటి ఆర్థిక విధానాలు అవసరమో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

'పంజాబ్ ఫార్మర్స్ అండ్ ఫార్మ్ వర్కర్స్ కమిషన్' మాజీ చైర్‌పర్సన్ అజయ్ వీర్ జాఖడ్ ఇటీవల ట్వీట్ చేస్తూ, 'ఇరవై ఏళ్ల క్రితం, స్విట్జర్లాండ్‌లో బ్రెడ్ ధర 2.5 స్విస్ ఫ్రాంకులు, గోధుమ ధర కిలోకు 110 స్విస్ ఫ్రాంకులు ఉండేది. ఇప్పుడు బ్రెడ్ ధర 4 ఫ్రాంకులు కాగా, గోధుమల ధర కిలోకు 50 ఫ్రాంకులు అయింది' అన్నారు. కొంతకాలం క్రితం, నేను కూడా కెనడా నుండి ఒక ఉదాహరణను షేర్ చేశాను. గత 150 సంవత్సరాలుగా కెనడాలో గోధుమ ధరలు పడిపోతున్నాయి, కానీ గత నాలుగు దశాబ్దాలుగా బ్రెడ్ ధరలు పెరుగుతూ వచ్చాయి. వ్యవసాయ ఉత్పాదక ధరల తగ్గుదలకు సంబంధించి ఈ ఆందోళనకరమైన ధోరణి స్విట్జర్లాండ్, కెనడాకు మాత్రమే కాదు, కాస్త ఎక్కువ లేదా తక్కువగా ప్రపంచమంతటా ఇలాగే ఉంటోంది. ఒక శతాబ్దానికి పైగా, వ్యవసాయ ధరలు బాగా పడిపోతున్నాయి. ఇది రైతులను ఆత్మహత్యలకు లేదా వ్యవసాయాన్ని వదిలేసేలా పురిగొల్పుతోంది. ఇది ఆహార అసమానత్వమే.



స్థోమత లేని పోషకులు

ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారు నిరంతరం పేదరికంలో జీవిస్తున్నారు. తరచుగా, వ్యవసాయ ధరలు తక్కువగా ఉండటమే కాకుండా ఉత్పత్తి ఖర్చు కూడా రైతులకు దక్కడం లేదు. విషాదమేమిటంటే, మన పళ్లెల దగ్గరికి ఆహారం తెచ్చేవారికి తమను తాము పోషించుకునే స్థోమత ఉండటం లేదు. తమను 'అన్నదాత'లు అని పిలిచినప్పుడు రైతులు సులభంగా ఉప్పొంగిపోతారు; వ్యవసాయ సరఫరా గొలుసులోని ఇతర వాటాదారులు మాత్రం లాభాల్లో మునిగితేలుతారు.

రైతులు కష్టాల్లో కూరుకుపోతూ, గ్రామీణ వేతనాలు స్తబ్ధుగా ఉంటున్నప్పుడు కూడా విచ్ఛిన్నమైన ఆహార వ్యవస్థ వినియోగదారులను మాత్రం సంతోషంగా ఉంచింది. ఆహార ధరలను ఉద్దేశపూర్వకంగా తక్కువగా ఉంచడం, ఏటికేడూ వాటి ధరలను ఇంకా తగ్గించి వేయటం... అదే సమయంలో అధిక లాభాలను పొందడం (దీనిని విక్రేత లాభమని ఇప్పుడు పిలుస్తున్నారు) అనేది వ్యవసాయ వ్యాపార సంస్థలను సంతోషంలో ముంచెత్తుతోంది. పెరుగుతున్న వేతనాలు, ధరల వల్ల సరఫరా వ్యవస్థకు అడ్డంకులు పెరుగుతాయని కార్పొరేట్లు నిందించినప్పటికీ, అమెరికాలో ఉదాహరణకు, 2023 సంవత్సరం రెండవ, మూడవ త్రైమాసికాల్లో, కార్పొరేట్ లాభాలు ద్రవ్యోల్బణంలో 53 శాతానికి ఆజ్యం పోశాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇంకా, కోవిడ్ మహమ్మారి తర్వాత కార్పొరేట్ లాభాలు మరింతగా పెరిగాయి. 2023 చివరి త్రైమాసికం నాటికి ఇది రికార్డు స్థాయికి చేరుకుంది. మహమ్మారికి ముందు నాలుగు దశాబ్దాలలో, ద్రవ్యోల్బణానికి కార్పొరేట్ లాభాల సహకారం కేవలం 11 శాతం మాత్రమే.

ఒకటిన్నర శతాబ్దానికి పైగా, మన ఆర్థిక విధానాల రూపకల్పన రైతులకు సరైన ధరలను నిరాకరించింది. వ్యవసాయ రంగంలో ముదిరిపోతున్న సంక్షోభం పట్ల విధాన నిర్ణేతలు కళ్ళుమూసుకోవడంతో, గ్రామీణ ప్రాంత ఆగ్రహం ఎన్నికల సీజన్‌లో మాత్రమే నొక్కి చెప్పబడుతోంది. 'భారత ప్రభుత్వం రైతులకు రాయితీలు ఇస్తున్నట్లు ప్రకటిస్తుంటుంది, కానీ వాస్తవానికి వారినే బాధపెడుతుంది' (ది ఎకనామిస్ట్, 2018 జూలై 12) అనే కథనం ఆసక్తికరమైన అంతర్దృష్టిని అందిస్తుంది. ధనిక వాణిజ్య కూటమి అయిన ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) దేశాలు ఉత్పత్తిదారులకు వ్యవసాయ ఆదాయంలో 18 శాతానికి సమానమైన మొత్తాన్ని అందజేస్తుండగా, భారతదేశం వాస్తవానికి వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించడంతో సరిపెట్టింది.

సాయం చేయని సాంకేతికత

2024–25 సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి సమాయత్తమవుతున్న తరుణంలో, రైతులలో పెరుగుతున్న ఆగ్రహాన్ని చల్లార్చడమే కాకుండా వ్యవసాయాన్ని పునర్నిర్మించే రోడ్‌మ్యాప్‌ను రూపొందించేందుకు ఎలాంటి ఆర్థిక విధానాలు అవసరమో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ సందర్భంగా, ఆర్థికవేత్త జీన్ డ్రేజ్ పేర్కొన్న ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. ''భారతదేశంలో రాజకీయ చర్చలు సాధారణంగా ప్రత్యేకాధికారులు, శక్తిమంతులు నిర్దేశించిన కొన్ని సరిహద్దుల్లోనే జరుగుతాయి. మీరు ఈ సరిహద్దులను అధిగమించినట్లయితే, ఇబ్బందిని ఎదుర్కొంటారు''. వ్యవసాయానికి 'అవుటాఫ్ ద బాక్స్ థింకింగ్' అవసరం. అయితే అది పాలించే ఉన్నత వర్గాన్ని చాలావరకు కలవరపెట్టవచ్చు.

ఈ అన్ని సంవత్సరాలలో, సాంకేతిక జోక్యాలకు మరింత బడ్జెట్ మద్దతును అందివ్వడమే వ్యవసాయ ఆదాయాలను పెంచడానికి ప్రధాన మార్గంగా ఉంటూ వచ్చింది. డిజిటలీకరణ, కృత్రిమ మేధ, రోబోటిక్స్, కచ్చితమైన వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ, తద్వారా వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ ఒడిలోకి తీసుకువస్తున్నప్పటికీ, వ్యవసాయం చుట్టూ ఉన్న పరిశ్రమకు ఇటువంటి బడ్జెట్ మద్దతుతో అపారమైన ప్రయోజనం ఉంది. అదే సమయంలో రైతులు మరింత దుస్థితిలోకి కూరుకుపోవడం కొనసాగుతోంది.

హరిత విప్లవం సాగిన 60 ఏళ్ల తర్వాత కూడా వ్యవసాయ ఆదాయాలు పిరమిడ్‌లో అట్టడుగునే కొనసాగితే, వ్యవసాయ విప్లవం 4.0 వైపు సాంకేతిక పరివర్తనను చేపడతామని చేస్తున్న వాగ్దానాన్ని, వ్యవసాయాన్ని పట్టి పీడిస్తున్న అన్ని రుగ్మతలకు దివ్యౌషధంగా చూడలేము. ఎప్పటిలాగే, విధాన నిర్ణేతలు మరోసారి వ్యవసాయ కష్టాలకు నిజమైన కారణాన్ని (వ్యవసాయ ఆదాయాలు పడిపోవడం), సాంకేతిక జోక్యాలు ఆదాయాన్ని పెంచుతాయనే లోపభూయిష్ట ఆలోచనతో కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు.

'ప్రపంచం వేడెక్కిపోతున్న' స్థితిలో, పునరుత్పత్తి వ్యవసాయ పద్ధతుల నుండి స్థితిస్థాపక వ్యవసాయం వస్తుంది. కృత్రిమ మేధస్సు కంటే ముందుగా అందుబాటులో ఉన్న సహజ మేధస్సును ఉపయోగించుకోవడం అవసరం. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంపొందించడంలో, వ్యవసాయంలో నిమగ్నమైన మానవ జనాభా సామర్థ్యాన్ని పెంచడానికి మొదటగా పెట్టుబడి పెట్టడం చాలా ముఖ్యం.

దేశంలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్నది వ్యవసాయమే. 45.5 శాతం మంది శ్రామికశక్తికి ఉపాధి కల్పిస్తూ, వ్యవసాయాన్ని లాభదాయకమైన వ్యాపారంగా మార్చడం ఈ కాలపు అవసరం. వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో తోడ్పడే పరిశ్రమకు సహాయం చేయాలనే సాంప్రదాయిక ఆలోచన (ట్రికిల్–డౌన్ సూత్రానికి అనుగుణంగా) ఇప్పుడు పని చేసే అవకాశం లేదు.

ఆహార అసమానతలను తొలగించడానికి, తాజా ఆలోచనలు అవసరం. ముందుగా, ఎంఎస్ స్వామినాథన్ సూత్రం ప్రకారం వ్యవసాయ ధరలకు హామీ ఇవ్వడానికి చట్టపరమైన యంత్రాంగాన్ని అందించాలి; రెండవది, బడ్జెట్‌లో 50 శాతాన్ని జనాభాలో దాదాపు సగం మందికి కేటాయించేలా ఆర్థిక మంత్రి చూడాలి. దీనికోసం, వ్యవసాయ బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం మొత్తం బడ్జెట్‌లో 10 శాతం పెంచడం ప్రారంభించాలి. ప్రస్తుతం ఇది 3 శాతం కంటే తక్కువగా ఉంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దాగని సత్యం



మారియుపోల్ నగరాన్ని రష్యన్లు ఏం చేశారనే విషయంలో ఆఖరికి రష్యన్ బ్లాగర్లు కూడా మౌనంగా లేరు. రెండున్నరేళ్ల తర్వాత స్థానికులు ఇప్పటికీ తమ ప్రియమైనవారి చితాభస్మాలను వెతుక్కుంటున్నారు. వేలాది మంది చనిపోయిన సత్యాన్ని దాయడం అసాధ్యం.

– ఐరీనా మత్వియిషీన్, ఉక్రెయిన్ జర్నలిస్ట్

క్వీన్ ఎడిటర్



వాళ్లు చేస్తున్న పనిలాగా నేను ఎప్పటికీ చేయలేనంత మెరుగైన మనుషులతోనే నేను ఒక దర్శకుడిగా ఎల్లప్పుడూ పనిచేస్తాను. అప్పుడు నేను వాళ్ల నుంచి నేర్చుకో వచ్చు. బాండిట్ క్వీన్‌కు రేణూ సలూజా నా ఎడిటర్. సౌండ్, ఇమేజ్ గురించి ఆమె నాకు ఎంతో నేర్పారు. బాండిట్ క్వీన్ అంత బాగా రావడానికి ఆమె ప్రతిభే కారణం. (జూలై 5న రేణు సలూజా జయంతి.)

– శేఖర్ కపూర్, దర్శకుడు

బంగ్లాలో జగన్నాథుడు



పూరి(ఒడిశా) తరహాలోనే పశ్చిమ బెంగాల్‌లోని దీఘాలో కూడా జగన్నాథ దేవాలయ సముదాయం నిర్మిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. జగన్నాథుడు, బలభద్ర (బలరాముడు), సుభద్ర ఇక్కడ కూడా పూజలు పొందుతారు. రథయాత్ర ఉత్సవం కూడా జరుగుతుంది. జై జగన్నాథ్!

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

లీడర్ ఇండియా



ఇప్పుడు బ్రిటిష్ పార్లమెంటులో 26 మంది, కెనడియన్ పార్లమెంటులో 19 మంది భారత సంతతి ఎంపీలు ఉన్నారు. ఎన్నో గ్లోబల్ కంపెనీలను భారతీయ సీఎక్స్ఓ'లు (చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్స్) నడుపుతున్నారు. ప్రపంచపు కర్మాగారం చైనా కావొచ్చుగానీ, ఇండియా ప్రపంచపు నాయకత్వ కర్మాగారంగా మారుతోంది.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

మూక జ్ఞానమే!



మతపరంగా లేదా క్రీడలపరంగా కల్ట్‌లను ప్రోత్సహించే దేశం, సమాజం దగ్గర జీవితపు వాస్తవాలను ఎదుర్కొనే జ్ఞానం ఉండదు.

– ప్రదీప్ మ్యాగజైన్, రచయిత

వైజ్ఞానిక వేగుచుక్కలు

డాక్టర్ కావడానికి పోరాటం

యూరోపియన్ వైద్యశాస్త్రాన్ని అభ్యసించిన, అలాగే అమెరికాలో చదివిన తొలి భారతీయ మహిళగా ఆనంది బాయి జోషి పేరుగాంచారు. ఆమె అసలు పేరు యమున. 1865 మార్చి 31న అప్పటి బొంబాయి ప్రెసిడెన్సీలో జన్మించారు. అప్పటి సమాజానికి స్త్రీల విద్య, వారి పురోగతి పట్ల తిరస్కార దృష్టి ఉండేది. ఇరవై ఏళ్ల పెద్దవాడైన గోపాలరావు వినాయక్ జోషితో తన తొమ్మిదవ యేటనే ఆమెకు వివాహమయ్యింది. అతడు తన భార్యను చదివించాలని తలచాడు. చదవకుండా వంటగదిలో ఉంటే కఠినంగా శిక్షించే తత్వం అయనది.


ఆనంది బాయి జోషి

1878లో ఆనంది ఓ బిడ్డను కన్నది. కానీ సరైన వైద్య సదుపాయం లేకపోవడం వల్ల పది రోజుల్లోనే బిడ్డను కోల్పోయింది. అందుకే తాను వైద్యశాస్త్రం అభ్యసించాలని సంకల్పం చేసుకుంది. రెండేళ్ల ఉత్తరప్రత్యుత్తరాల ఫలితంగా మిసెస్ కార్పెంటర్ పైచదువుకోసమని ఆనంది బాయిని అమెరికాకు ఆహ్వానించింది. ఆమె అమెరికా వెళ్లడానికి వీల్లేదంటూ బంధువులూ, ఇతరులూ అనేక ఇబ్బందులు కలుగజేశారు. చివరకు ఆనందిబాయి తన గాజులు అమ్ముకుని 1883 ఏప్రిల్ ఏడవ తేదీన మిషనరీలతో కలిసి కలకత్తా నుంచి ఓడలో అమెరికా బయలుదేరింది. అప్పటి వైస్రాయ్ విదేశాలలో ఆమె చదువు కోసం 200 రూపాయలు బహూకరించారు.

శుద్ధ శాకాహారి అయిన ఆనంది బాయి పలు రకాలుగా ఇబ్బందులు పడి, చివరకు 1883 జూన్ 18న న్యూయార్క్ చేరినప్పుడు ఆమెను కార్పెంటర్ ఆహ్వానించారు. పెన్సిల్వేనియాలోని మహిళా వైద్య కళాశాలలో ప్రాథమిక విద్యార్హతతో ఆనంది బాయి ప్రవేశం పొందింది. ఒకవైపు కడు శీతలం, మరోవైపు సరిగా లేని భోజనం... వీటి మధ్య ఆమె తొలుత డిఫ్తీరియా, అటు పిమ్మట క్షయ వ్యాధి బారిన పడ్డారు. అతికష్టం మీద 'ఆర్యులైన హిందువులలో ప్రసూతి విధానాలు' అనే పరిశోధనాంశంతో 1886 మార్చిలో ఎమ్‌డీ పట్టా పొందారు. ఆమె 1886 చివరన భారత దేశం తిరిగి వచ్చారు. కొల్హాపూర్ సంస్థానాధీశులు ఆల్బర్ట్ ఎడ్వర్డ్ హాస్పిటల్లో ఆమెను మహిళా విభాగానికి బాధ్యులైన డాక్టర్‌గా నెలకు 300 రూపాయల జీతంతో నియమించారు.

కానీ ఆమె ఆ ఉద్యోగంలో చేరకమునుపే క్షయ వ్యాధి ముదరడం వల్ల 22 ఏళ్ల వయసులో 1887 ఫిబ్రవరి 26న తల్లి గంగాబాయి ఒడిలో కన్నుమూశారు. ఆమె వైద్యురాలిగా సేవలందించక పోయినా, తర్వాత కాలంలో ఎంతోమంది మహిళలకు వైద్య శాస్త్ర చదువు, విదేశీ చదువుల పట్ల ఆసక్తిని ప్రేరేపించ గలిగారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్,
విశ్రాంత ఆకాశవాణి అధికారి I 9440732392

త్యాగానికి సంకేతం మొహర్రం

మొహర్రం గ్రామీణ ప్రాంతాల్లో పీర్ల పండుగగా ప్రసిద్ధి. ప్రవక్త మనుమడు తన ప్రాణత్యాగంతో విశ్వజనుల శాంతియుత సహజీవనానికి శ్రీకారం చుట్టిన మాసం మొహర్రం. ఇస్లాం క్యాలెండర్‌లో మొట్టమొదటి మాసం కూడా ఇదే. దీన్ని కుల, మతాలకు అతీతంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు పండుగలా జరుపుకుంటారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో విశేషంగా శోక దినాలుగా పాటిస్తారు. ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రాంతాల్లో మొహర్రంను 10 రోజుల పాటు వేడుకగా నిర్వహించుకుంటారు.

మొహమ్మద్ ప్రవక్త నిర్యాణం తర్వాత పాలనా బాధ్యతలు చేపట్టిన తొలి నలుగురు ఖలీఫాలు హజరత్ అబూబకర్ సిద్దీఖ్(ర అ), హజ్రత్ ఉమర్ ఫారూక్ (ర అ), హజరత్ ఉస్మాన్ (ర అ), హజరత్ అలీ (ర అ) ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలించారు. అనంతర కాలంలో అధికారం కోసం పోరు ప్రారంభమైంది. ప్రవక్త ఆదేశాలనుసారం అబ్దుల్ ఘని తర్వాత ఖలీఫాగా ప్రవక్త అల్లుడైన హజరత్ అలీకి ఖిలాఫత్ దక్కాల్సి ఉండగా తద్విరుద్ధంగా రాజ్య భారంతో పాటు పీఠాధిపత్యాన్ని కూడా హజరత్ అమీర్ మావియా కైవసం చేసుకున్నాడు. ఆయన తదనంతరం హజరత్ అలీ ఖిలాఫత్‌కు రాగా మావియా కుమారుడైన ఎజీద్ తన తండ్రి తర్వాత తనకు పరిపాలనతో పాటు పీఠాధిపత్యం కావాలని దేశంలో ఆందోళన సృష్టించాడు. హజరత్ అలీ తర్వాత ఆయన పెద్ద కుమారుడు హజరత్ ఇమామే హసన్ (ర అ)కు ఖిలాఫత్ దక్కింది. శాంతికాముకుడు, మానవతావాది, వివాద రహితుడు అయిన హసన్ దేశంలో నెలకొన్న అశాంతిని రూపుమాపేందుకు ఒక ఒప్పందం ప్రకారం ఖిలాఫత్‌ను వదులుకోవడానికి సిద్ధపడ్డారు. దీంతో తనకు తానే రాజుగా ఖలీఫాగా ప్రకటించుకున్న ఎజీద్ దుష్ట పాలనకు శ్రీకారం చుట్టాడు. దుర్గుణుడైన ఎజీద్ ప్రజలను పీడించడం, హింసించడంతో ప్రవక్త నబూవత్ పొందే నాటికి ముందు ఉన్న పరిస్థితులు పునఃప్రవేశించడం ప్రారంభమయ్యాయి.



ఇదంతా చూసి కలత చెందిన ప్రవక్త మనవడు హజరత్ ఇమామే హుస్సేన్ చర్చల ద్వారా పరిస్థితులను చక్కదిద్దడానికి మొహర్రం నెల మొదటి రోజున తన కుటుంబంతో సహా రాజధాని కూఫాకు బయలుదేరారు. ఆయన చర్చల కోసం రాజధాని చేరుకుంటే తన అధికారానికి ముప్పు తప్పదనీ, ఆయన బతికి ఉంటే తన మనుగడ అసాధ్యమనీ తలచిన ఎజీద్ వేలాది సైన్యంతో మార్గమధ్యంలోనే హుస్సేన్ బృందాన్ని అడ్డగించి కర్బలా మైదానంలో దిగ్బంధనం చేశాడు. ప్రాణం దక్కించుకోవాలంటే తనను రాజుగా అంగీకరించాలని, ఖిలాఫత్ అప్పగించాలని ఆదేశాలు జారీ చేశాడు. మూడు రోజులపాటు ఆహారం నీరు అందకుండా కఠిన ఆంక్షలు విధించాడు. అలా మొహర్రం నెల మొదటి ఆరురోజులు ప్రయాణించి కర్బలా చేరిన హుస్సేన్ బృందం మూడు రోజులు నిర్బంధంలో ఉంది. పదవ రోజు నాటికి ఎజీద్ సైన్యంతో భీకర పోరాటం చేయక తప్పలేదు.

అభం శుభం తెలియని ఏడాదిన్నర పసిబిడ్డ 'అలీ అస్గర్' దాహం తీర్చడానికి గుక్కెడు తాగునీరు అందించమని ఫిరాత్ నదిని దిగ్బంధనం చేసిన సైన్యాధ్యక్షుడు హుర్మిలాను కోరగా ఆ కఠినాత్ముడు కర్కశంగా బాణాన్ని పసివాడి అంగిటకు సంధిండంతో అసువులు బాసిన వైనం చూశారు హుస్సేన్. అంతేకాక కళ్ళ ఎదుట శవాలుగా పడిన బంధువులను చూశారు. అంతే... తండ్రి నుంచి వారసత్వంగా లభించిన కరవాలం (జుల్ఫికార్) చేతబట్టి ఎజీద్ సైన్యంపై విరుచుకుపడ్డారు. వేలాది శత్రువులను చీల్చి చెండాడుతూ శత్రు సైన్యం వైపు దూసుకెళ్ళడంతో శత్రు సైన్యం కకావికలమైంది. అయితే చుట్టుముట్టిన శత్రు సైనికుల అస్త్రాలు అశ్వాన్ని నేలకూల్చి హుస్సేన్ శరీరాన్ని తూట్లు చేశాయి. రక్తసిక్తమైన శరీరంతో నేల కొరిగిన హుస్సేన్ చివరి నమాజుకు ఉపక్రమించగా 'షుమ్రేలైన్' ప్రవక్త మనమడి మెడ నరకడంతో ప్రపంచం నిర్ఘాంత పోయింది. శోక తప్త హృదయంతో గొల్లుమంది. ఆ ధర్మవీరుని రక్తంతో తడిసిన కర్బలా మైదానంలో రక్తం ఏరులైపారింది. క్రీ.శ.680 అక్టోబర్ 10 శుక్రవారం మొహర్రం నెల పదవ రోజు ఈ సంఘటన జరిగింది.

కర్బలా మైదానంలో షహదత్ (అమరత్వం) పొందిన వీరుల ఆత్మ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఖురాన్ పఠిస్తూ వచ్చే పుణ్యాన్ని కర్బలా వీరుల ఆత్మలకు అందించమని భగవంతున్ని కోరుకుంటారు. 2024 జూలై నెల 17న 'యౌమే ఆషురా'గా దీన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకోనున్నారు.

– డా॥ ఎస్. ఎం. బాషా
(జూలై 7న ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభం)

ఒక్క చెట్టంటే ఐదు ఏసీలు

ప్రస్తుత సంవత్సరం ప్రపంచ జనాభా అధిక వేడిని ఎదుర్కొంది. ఢిల్లీలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించిపోయాయి. గత కొన్ని రోజుల క్రితం మక్కాలో ఉష్ణోగ్రతలు 51 డిగ్రీల కంటే ఎక్కువ ఉండటము వలన సుమారు 1,300 మంది హాజ్ యాత్రికులు మరణించారు. ఈ పరిస్థితులు భూగోళంపై పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన మానవాళికి రాబోయే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి.

పారిస్ ఒప్పందం ప్రకారం 'భూ ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక విప్లవ కాల పూర్వ స్థాయిల (1850–1900) కంటే 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకు పరిమితం చేయాలి. కానీ ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 2019 నాటికే పారిశ్రామిక పూర్వ స్థాయి కంటే 1.1 డిగ్రీలకు చేరుకోవడం గమనార్హం.

మానవుని కార్యకలాపాల వలన వాతావరణంలోనికి విడుదల చేయబడిన కార్బన్ డైయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఫ్లోరినేటెడ్ వాయువులు వంటి గ్రీన్‌హౌస్ వాయువులు భూమి ఉష్ణోగ్రత పెరుగుదలకు ముఖ్య కారణం. అడవులను నరికివేయడం, బొగ్గు, చమురు వాయువులు వంటి శిలాజ ఇంధనాలను కాల్చడం వల్ల కార్బన్ డైయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు వాతావరణం లోనికి విడుదల అవుతున్నాయి. ఆవులు, గొర్రెలు తమ ఆహారాన్ని జీర్ణం చేసుకొన్నప్పుడు పెద్ద మొత్తంలో మీథేన్‌ను ఉత్పత్తి చేస్తాయి. నైట్రోజన్ కలిగిన ఎరువులను వాడడం వలన నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలు విడుదలవుతాయి. ఏరోసోల్స్ స్ప్రేలు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషన్ పరికరాలు, ఉత్పత్తుల నుండి ఫ్లోరినేటెడ్ వాయువులు విడుదలవుతాయి.

గాలిలో లేదా ఏదైనా వాయువులో సూక్ష్మ స్థితిలోని ఘన లేదా ద్రవ కణాలు ఉన్నట్లయితే వాటిని ఏరోసోల్స్ అని పిలుస్తారు. శిలాజ ఇంధనాలు, గడ్డివంటి జీవపదార్థాలను కాల్చడం వలన ఏరోసోల్స్ వాతావరణం లోనికి విడుదలై వారాల పాటు గాలిలోనే ఉంటాయి. ఇవి సూర్యరశ్మిని గ్రహించవచ్చు లేదా భూమిపైకి తిరిగి దానిని పరావర్తనం చెందించవచ్చు. ఫలితంగా భూమి వేడెక్కుతుంది.

నలుపు కార్బన్ (మసిలో ఒక భాగం) వంటివి భూమి మీదికి వచ్చే పరావర్తనం చెందిన సూర్యరశ్మిని గ్రహించడమే కాకుండా, ఇన్ఫ్రారెడ్ రేడియేషన్‌ను కూడా గ్రహించి గ్లోబల్ వార్మింగ్‌ను పెంచుతాయి.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నివారించడానికి సరైన పరిష్కారం గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను తగ్గించడం, చెట్లను పెంచడం. ఒక మామిడి చెట్టు ఐదు ఎయిర్ కండీషనర్లకు సమానం. భూమిని కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరునిది కాబట్టి చెట్లను కాపాడుకుందాం, సాధ్యమైనన్ని చెట్లను పెంచుకుందాం.

– డా॥ శ్రీధరాల రాము
ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్
శ్రీ ఇందు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హైదరాబాద్.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.పాడ్యమి తె.3.45 వరకు (తెల్లవారితే ఆదివారం) తదుపరి విదియ, **నక్షత్రం:** పునర్వసు తె.4.56 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.4.38 నుండి 6.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.33 నుండి 7.17 వరకు, **అమృతఘడియలు:** రా.2.44 నుండి 3.46 వరకు; **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** మ.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం :** 5.34, **సూర్యాస్తమయం :** 6.33.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఆర్టీసీ ఉద్యోగులకు 'సహకార రుణాలు'

హైకోర్టు జోక్యంతో మార్గం సుగమం..
- 9,500 మందికి రూ.200 కోట్ల చెల్లింపు
- రిటైర్మెంట్ బెనిఫిట్లకూ మోక్షం
- రుణాల కోసం కొత్తగా 3,000 దరఖాస్తులు



హైకోర్టు జోక్యం ఆర్టీసీ కార్మికుల్లో ఆనందం నింపింది. కొన్నేళ్ల తర్వాత మళ్లీ 'ఉద్యోగుల సొంత నిధి' నుంచి రుణాలం దుకుంటున్నారు. పిల్లల చదువులు, సొంతింటిని సమకూర్చుకోవ టం, ఆస్పత్రి ఖర్చులు, ఇతర అవసరాలకు రుణం పొందుతున్నా రు.. కేవలం 40 రోజుల వ్యవధిలో ఏకంగా 9,500 మంది రూ.200 కోట్ల వరకు రుణాల రూపంలో పొందారు.

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సహకార పరపతి సంఘం(సీసీఎస్) పేరుకుపోయిన రుణ దరఖాస్తులను క్లియర్ చేసింది. రూ.355 కోట్ల మేర దరఖాస్తుదారులకు చెల్లింపులు చేసింది. అడపాదడపా స్వల్ప మొత్తం రుణాల రూపంలో ఇవ్వటం తప్ప ఇంత మొత్తంలో చెల్లించడం చాలా ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. ఇటు ఉద్యోగుల ఇంటి అవసరాలకు రుణాలు, పదవీ విరమణ పొందిన వారికి సెటిల్‌మెంట్లు, సీసీఎస్‌లో సభ్యత్వం రద్దు చేసుకున్న వారికి చెల్లింపులతో ఒక్కసారిగా సీసీఎస్ కార్యాలయం సందడిగా మారింది.

హైకోర్టు జోక్యంతో...

ప్రతినెలా ఉద్యోగుల జీతం నుంచి నిర్ధారిత మొత్తం మినహాయించి సీసీఎస్‌లో ఆర్టీసీ డిపాజిట్ చేస్తుంది. ఇలా పోగయ్యే మొత్తం నుంచి ఉద్యోగులకు రుణాలివ్వటం సీసీఎస్ విధి.
- ఉద్యోగుల జీతాల నుంచి ఆ మొత్తాన్ని మినహాయిస్తూ దాన్ని కొన్నేళ్లుగా ఆర్టీసీ సొంతానికి వాడుకుంది. దీంతో సీసీఎస్ దివాలా దశకు చేరిన విషయం తెలిసిందే. దీంతో సీసీఎస్ పాలకవర్గం కొంతకాలంగా న్యాయపోరాటం చేస్తోంది.
- గతేడాది రూ.200 కోట్ల మొత్తాన్ని సీసీఎస్‌కు చెల్లించాలంటూ హైకోర్టు ఆదేశించింది. కానీ, కేవలం రూ.50 కోట్లు మాత్రమే చెల్లించటంతో సీసీఎస్ పాలకవర్గం కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. మిగతా రూ.150 కోట్లను వెంటనే చెల్లించాలంటూ ఏప్రిల్‌లో కోర్టు ఆర్టీసీని ఆదేశించింది. దీంతో ఆ నెల చివరలో ఆ మొత్తాన్ని ఆర్టీసీ జమ చేసింది.
- ది తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు నుంచి సీసీఎస్ మరో రూ.150 కోట్లు రుణం పొందింది. ఈ రూ.300 కోట్లను ఉద్యోగులకు రుణాలుగా, రిటైర్డ్ ఉద్యోగుల సెటిల్మెంట్లకు వినియోగించాలని నిర్ణయించింది.

9,500 దరఖాస్తులు

ఏప్రిల్ చివరి నాటికి సీసీఎస్‌లో రుణాల కోసం 6,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ రెండున్నరేళ్లుగా పేరుకుపోయినవే. నిధులు సమకూరాయని తెలియగానే మరో 3 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి 9,500 దరఖాస్తుదారులకు రుణాల కింద రూ.200 కోట్లు సీసీఎస్ అందజేసింది. అప్పటివరకు వారి జీతాల నుంచి కోత పెట్టి సీసీఎస్‌లో జమ చేసిన మొత్తాన్ని రిటైర్మెంట్ సమయంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ నిధులు లేక ఏడాదిన్నరగా దాదాపు 1,200 మందికి చెల్లించలేదు. ఇప్పుడు వారికి కూడా సెటిల్ చేశారు. సీసీఎస్ ఆర్థిక పరిస్థితి దిగజారిపోవటంతో అందులో నుంచి తమ సభ్యత్వాన్ని రద్దు చేసి సెటిల్ చేయాల్సిందిగా మరో 3,200 మంది దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉంటూ వచ్చాయి. వారందరికీ చెల్లించేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఆర్టీసీ జమ చేసిన నెలవారీ మొత్తం రూ.55 కోట్లను కూడా ఇందుకు వినియోగించారు. ఇక సీసీఎస్‌లో డిపాజిట్లు పెట్టిన రిటైర్డ్ ఉద్యోగులకు 9 నెలలుగా పేరుకుపోయిన వడ్డీ మొత్తం మరో రూ.9 కోట్లు కూడా చెల్లించారు. కేవలం 40 రోజుల వ్యవధిలో రూ.355 కోట్లు చెల్లించారు.

రుణాలు ఇస్తున్నారని తెలిసి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు దరఖాస్తులు సమర్పించారు. పోగైన నిధులు రూ.355 కోట్లు ఖర్చయిపోవటంతో, ఇప్పుడు కొత్తగా వచ్చిన దరఖాస్తుల్లో 3 వేలు పెండింగ్ జాబితాలోకి చేరాయి. ఇంకా కొత్త దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. ఆర్టీసీ ప్రతినెలా సీసీఎస్‌కు చెల్లించే మొత్తం రూ.20 కోట్లు మాత్రమే. అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలంటే ఈ మొత్తం సరిపోదు.

ఇంకా రావాల్సినవి రూ.980 కోట్లు

సీసీఎస్‌కు ఆర్టీసీ చెల్లించాల్సిన మిగతా బకాయిలు చెల్లిస్తే తప్ప ఇవి క్లియర్ అయ్యే సూచనలు కనిపించటం లేదు. ఇప్పటికీ, సీసీఎస్‌కు ఆర్టీసీ రూ.570 కోట్ల మొత్తం (అసలు) బకాయి ఉంది. దీనిపై చెల్లించాల్సిన వడ్డీ మరో రూ.410 కోట్ల వరకు ఉంటుందని అంచనా. వెరసి మరో రూ.980 కోట్ల వరకు ఆర్టీసీ బకాయి ఉన్నట్టు తేలుతోంది. విడతలవారీగానైనా ఈ మొత్తాన్ని చెల్లిస్తేనే మిగతా దరఖాస్తులు క్లియర్ అవుతాయి.

ప్రజాక్షేమమే పరమావధి కావాలి: నారాయణ



సాక్షి, హైదరాబాద్: మొదటిసారి జరగనున్న రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రజా క్షేమం కోరే నిర్ణయాలు తీసుకోవాలని, వైషమ్యాలు అవసరం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అభిప్రాయ పడ్డారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కలిసి మాట్లాడుకోవడం శుభపరిణామమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రులు వారివారి రాష్ట్రాలకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లను పరిష్క రిస్తూనే, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను కేంద్రంతో అమలు చేసుకునేందుకు కృషి చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విలీన గ్రామాల సమస్యలపై సామరస్య పూర్వకంగా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాట్లాడుకోవాలని సూచించారు.

Karnataka Power Transmission Corporation Limited

(CIN : U40109KA1999SGC025521)

నమోదిత కార్యాలయం: కార్పొరేట్ ఆఫీస్, కావేరి భవన్, K.G.రోడ్డు, బెంగళూరు – 560009

ప్రకటన

సంఖ్య. కెపిటిసిఎల్/బి36/45565/2023-24/378 — తేది: 03.07.2024

1. కర్ణాటక SLDC, బెంగళూరు ద్వారా అంతర్‌రాష్ట్ర విద్యుత్తు తీసుకువెళుతున్నట్లుగా గుర్తించబడిన KPTCL కు సొంతమైన FY 2022 మరియు FY 2023 కోసం 12 నం.ల 220 kV లైన్ల కోసం వార్షిక ట్రాన్స్‌మిషన్ చార్జీలను క్లెయిమ్ చేయడానికి CERC (షేరింగ్ ఆఫ్ ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జ్ అండ్ లాసెస్) రెగ్యులేషన్స్, 2020తో చదువబడే విద్యుత్తు చట్టం, 2003లోని సెక్షన్ 62 & 64 కింద పిటీషన్ దాఖలు చేయబడింది.
2. ట్రాన్స్‌మిషన్ సిస్టం లబ్దిదారులు:
ఎ. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (TS TRANSCO)
బి. మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ (MAHATRANSCO)
3. FY 2021-22 మరియు FY 2022-23 బ్లాక్ కోసం వార్షిక ట్రాన్స్‌మిషన్ టారిఫ్

క్ర. సం.	లైన్ పేరు	కర్ణాటక యొక్క నాన్-ISTS లైన్లు షేరింగ్ పొందుతున్న లబ్దిదారు రాష్ట్రాలు	లైన్ పొడవు (కి.మీ.)	FY 2021-22 కోసం YTC (రూ. లక్షలలో)	FY 2022-23 కోసం YTC (రూ. లక్షలలో)
1	220 kV గుల్బర్గా-హుమ్నాబాద్ లైన్-1	తెలంగాణ	52.83	596.27	583.44
2	220 kV గుల్బర్గా-హుమ్నాబాద్ లైన్-2	తెలంగాణ			
3	220 kV సేడం-షాపూర్ లైన్	తెలంగాణ	114.85	114.56	117.01
4	220 kV జిందాల్-లింగాపూర్ లైన్-1	తెలంగాణ	44.137	104.37	105.80
5	220 kV జిందాల్-లింగాపూర్ లైన్-2	తెలంగాణ			
6	220 kV లింగసుగుర్-RTPS లైన్-1	తెలంగాణ	96	101.16	104.18
7	220 kV లింగసుగుర్-RTPS లైన్-2	తెలంగాణ			
8	220 kV షాబాద్-గుల్బర్గా లైన్స్	తెలంగాణ	52.60	195.52	142.33
9	220 kV సేడం-రాయిచూర్ RTPS లైన్-1	తెలంగాణ	102.60	188.92	192.80
10	220 kV సేడం-రాయిచూర్ RTPS లైన్-2	తెలంగాణ			
11	220 kV బాగల్‌కోట్-వజ్రమట్టి లైన్-1	మహారాష్ట్ర	31.65	137.03	140.29
12	220 kV బాగల్‌కోట్-వజ్రమట్టి లైన్-2	మహారాష్ట్ర			
	మొత్తం			1437.83	1385.85

4. వార్షిక ట్రాన్స్‌మిషన్ టారిఫ్ నిర్ధారణ కోసం చేసిన దరఖాస్తు కాపీ పిటీషనర్ వెబ్‌సైట్ అంటే https//kptcl.karnataka.gov.in లో పోస్ట్ చేయబడింది.
5. పిటీషన్‌లో ఉన్న వార్షిక ట్రాన్స్‌మిషన్ టారిఫ్ నిర్ధారణ కోసం ప్రతిపాదనపై ఏవేని సూచనలు మరియు అభ్యంతరములను **Secretary, Central Electricity Regulatory Commission, 3rd and 4th floor, Chanderlok Building, #36, Janapath, New Delhi - 110001** సమక్షంలో (లేదా కమిషన్ కార్యాలయం ఉన్న ఇతర చిరునామాలో), ఒక కాపీని పిటీషనర్ యొక్క కార్పొరేట్ ఆఫీస్ చిరునామా **Kaveri Bhavan, K.G.Road, Bengaluru - 560009** కు ఈ ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోగా దాఖలు చేయవలెను.

కర్ణాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ తరఫున
సం/-
మేనేజింగ్ డైరెక్టర్
కెపిటిసిఎల్, కావేరి భవన్, బెంగళూరు – 560009

సీఐ, కానిస్టేబుళ్లపై అట్రాసిటీ కేసు

- అశ్వారావుపేట ఎస్సై ఆత్మహత్యాయత్నం కేసులో మలుపు
- ఎస్సై భార్య ఫిర్యాదుతో మలక్‌పేట పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్

అశ్వారావుపేట రూరల్/మహబూబాబాద్ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం ఘటనలో అశ్వారావుపేట సీఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఇప్పటికే ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా పోలీసు ఉద్యోగులపై కేసు నమోదుతో మరో మలుపు తిరిగినట్లయింది. ఈ మేరకు బాధితుడి భార్య కృష్ణవేణి శుక్రవారం హైదరాబాద్‌లోని మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట ఎస్సైగా నాలుగు నెలల నుంచి విధులు నిర్వర్తిస్తున్న వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన తన భర్త శ్రీనివాస్ గత నెల 30వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆమె తెలిపారు. సీఐ జితేందర్‌రెడ్డితోపాటు కానిస్టేబుళ్లు సన్యాసి నాయుడు, శేఖర్, సుభాని, శివనాగరాజు ఇందుకు కారణమని పేర్కొన్నారు. తన భర్తను సీఐతోపాటు నలుగురు కానిస్టేబుళ్లు కుల వివక్ష, ప్రాంతీయ విభేదాలతో వేధించేవారని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సివిల్, భూతగాదాల విషయంలో కేసులు నమోదు చేయాలని ఒత్తిడి చేస్తూ, ప్రాంతీయ వాదంతో ఇబ్బంది పెట్టారని తెలిపారు. అంతేకాక గతంలో జరిగిన క్రైం మీటింగ్‌లో సీఐ తన భర్త ముఖంపై ఫైళ్లు విసిరేసి మానసికంగా వేధించారని వెల్లడించారు. ఈ మేరకు కృష్ణవేణి ఫిర్యాదుతో మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ కింద సీఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. కాగా, ఎస్సై మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పురుగుల మందు తాగడంతో కేసును మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కాగా, రెండు రోజుల క్రితమే సీఐను ఐజీ కార్యాలయానికి, నలుగురు కానిస్టేబుళ్లను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం విదితమే.

సీఎం సన్నిహితుడు గోవర్ధన్‌రెడ్డి హఠాన్మరణం

- కోస్గికి వచ్చి నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- బాధిత కుటుంబానికి పరామర్శ

కోస్గి (నారాయణపేట): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నిహితుడు నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి కౌన్సిలర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి(50) శుక్రవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న సీఎం రేవంత్ కోస్గికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తెల్లవారుజామున గుండెపోటుకు గురైన గోవర్ధన్‌రెడ్డిని కుటుంబ సభ్యులు కోస్గిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మండల కాంగ్రెస్‌లో ముఖ్యనేతగా, మొదటి నుంచీ సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డికి నమ్మినబంటుగా గోవర్ధన్‌రెడ్డి వ్యవహరించేవారు. గోవర్ధన్‌రెడ్డి భార్య సావిత్రమ్మ, తల్లి యాదమ్మ, కూతురు, కుమారుడిని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. గోవర్ధన్‌రెడ్డికి నివాళులర్పించినవారిలో ముఖ్యమంత్రితోపాటు ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి, పరిగి, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్య, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథరెడ్డి ఉన్నారు.



గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

పర్యవేక్షించిన జిల్లా అధికారులు..

అకస్మాత్తుగా ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతం, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి కోస్గి పట్టణ శివారుకు చేరుకొని.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పోతిరెడ్డిపల్లికి వెళ్లారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వెంటనే సీఎం హెలీకాప్టర్‌లోనే హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు.

రైతు ఆత్మహత్య ఘటనలో 8 మంది అరెస్ట్

ఖమ్మం అర్బన్: ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఇటీవల తన భూమిని చెరువు శిఖంలో కలిపారని ఆరోపిస్తూ రైతు బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ప్రభాకర్ మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెబుతూ గత సోమవారం ఖమ్మంలో కలెక్టర్‌ను కలిసేందుకు రాగా అప్పటికే గ్రీవెన్స్ సమయం ముగిసింది. దీంతో ఉద్యోగులకు వినతిపత్రం ఇచ్చి బయటకు వచ్చాక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆయన తన ఆవేదనను వివరిస్తుండగా పలువురు వీడియో తీసినట్లు గుర్తించిన ప్రభాకర్ తండ్రి ఖానాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో పెంట్యాల నాగుల్‌మీరా, గుడిపూడి రజినీకాంత్, వేల్పుల కోటయ్య, మొగిలి శ్రీను, షేక్ సిద్దయ్య, వేల్పుల నర్సింహారావు, షేక్ సైదులు, మొగిలి మాధవరావు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. కాగా, నిందితులను అరెస్ట్ చేసినట్లు ప్రకటించిన పోలీసులు ఈ కేసుకు సంబంధించిన వివరాలేవీ వెల్లడించకపోవడం గమనార్హం.

పనుల్లేక పస్తులుంటున్నాం

- సిరిసిల్లలో నేతకార్మికుడి నిరసన



సిరిసిల్లలోని నేతన్న విగ్రహం వద్ద ప్రభాకర్ నిరసన

సిరిసిల్ల టౌన్: పనుల్లేక పస్తులుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. ఫుట్‌పాత్‌లపై అడుక్కు తినాలా?.. అంటూ సిరిసిల్లలో ఓ నేత కార్మికుడు నేతన్న విగ్రహం ఎక్కి ఆవేదన వ్యక్తం చేశాడు. నేత కార్మికుడు పాము ప్రభాకర్ మాట్లాడుతూ.. వరంగల్ నుంచి 25 ఏళ్ల క్రితం సిరిసిల్లకు వచ్చి సాంచాలు నడుపుతున్నట్లు తెలిపాడు. కొన్ని నెలలుగా పనుల్లేక పస్తులుంటున్నామని, తిండిలేక ఆకలితో అలమటిస్తున్నామని కన్నీటిపర్యంతమయ్యాడు. ఎన్నడూ లేనిది సిరిసిల్లలో ప్రస్తుతం విద్యుత్ సబ్సిడీ, ప్రభుత్వ ఆర్డర్లు లేవంటూ పవర్‌లూమ్స్ నిలిపివేయడంతో ఆసాములు తమకు పని కల్పించడం లేదని వాపోయాడు. కార్మికులు ఫుట్‌పాత్‌లపై అడుక్కోవాలా?.. అని ప్రశ్నించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని.. కార్మికుడితో మాట్లాడి కిందకు దింపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విడిగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయండి

- బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉమ్మడిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విడదీసి ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు బీజేపీ నేతలు విజ్ఞప్తిచేశారు. ఉమ్మడిగా ఈ కమిషన్ కొనసాగడం వల్ల ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంపూర్ణన్యాయం జరగడం లేదని తెలిపారు. శుక్రవారం ఈ మేరకు హుస్సేన్ నాయక్‌కు బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ వినతిపత్రం అందించారు. విడిగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు ద్వారా బాధిత మహిళలతో పాటు ఎస్టీ విద్యార్థుల విద్య, యువకుల ఉద్యోగ నియామకాల విషయంలో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసినా సరైన సమయంలో న్యాయం జరగడం లేదని చెప్పారు.

న్యాయ సాయం చెయ్యండి

- తెలుగు రాష్ట్రాల సీఎంలకు ఓటుకు కోట్లు కేసు నిందితుడు మత్తయ్య విజ్ఞప్తి



పంజగుట్ట (హైదరాబాద్): గత 10 సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరగలేక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తనకు న్యాయసాయం చేసి ఆదుకోవాలని ఓటుకు కోట్లు కేసులో నిందితుడు జెరూషలేము మత్తయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అప్పట్లో బీఆర్ఎస్‌ను కూల్చి కాంగ్రెస్ పాలన తీసుకువచ్చేందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో భారీ కుట్రను చేశారని తెలిపారు. వారి రాజకీయ అవసరాల కోసం తనను కొరియర్‌గా వాడుకున్నారని, ఆ కేసులో ఇరుక్కుని తాను 2015 నుంచి సుప్రీంకోర్టుకు, ఇటు నాంపల్లి కోర్టుకు, ఈడీ కోర్టుకు తిరగలేక ఆర్థికంగా ఎంతో చితికిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో నుంచి చంద్రబాబు పేరు తొలగించగానే తనను పట్టించుకోవడం లేదన్నారు. కోర్టు ఫీజులు, ఢిల్లీకి రాకపోకల ఖర్చులు భరించలేకుండా ఉన్నానని తెలిపారు. తన తరఫున వాదించేందుకు సరైన అడ్వొకేట్‌లను నియమించి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. శనివారం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలుస్తున్న నేపథ్యంలో తన కేసుగూర్చి కూడా నిర్ణయం తీసుకోవాలని మత్తయ్య కోరారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
టెండరు ప్రకటన నం.01/24-25 Sp.No. G-01/24-25

నల్గొండ సర్కిల్‌లోని మిర్యాలగూడ డివిజన్‌లో శ్రీనాథ్ పురం స్టేజ్ వద్ద 33 KV పులిమామిడి ఫీడర్ తగువిధంగా ట్యాపింగ్ చేస్తూ 132/33 KV ఎర్రబెల్లి EHT SS నుండి ప్రారంభమయ్యే 33 KV పులిమామిడి ఫీడర్‌కు SCOH లైన్ (100 sqmm. AAAC) అనుసంధానిస్తూ 4.86 KM 33 KV నెలకొల్పుట మరియు 14 మైలు హాలియా టౌన్ వరకు పొడిగించుట కొరకు అర్హత గల వెండార్స్ నుండి టెండర్లు కోరబడుచున్నవి. వివరాలు www.tgsouthernpower.com లో లభిస్తాయి. ఫోన్ నం.9440814343. చివరి తేది: 12.07.2024.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్, నల్గొండ
DIPR RO No.1518-PP/CL/Advt/1/2024-25, Dt: 05.07.2024

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, బొల్లారం, (సంగారెడ్డి జిల్లా)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ-ప్రొక్యూర్‌మెంట్ NIT No.E1/11/2024 to E1/18/2024. మొత్తం పనుల సంఖ్య: MGF 2023-24 (08 నంబర్లు) 1వ పిలుపు, బిడ్ దాఖలు ప్రారంభ తేది, సమయం: 06.07.2024న ఉ.11.00 గం.కు. బిడ్ దాఖలు ముగింపు తేది, సమయం: 12.07.2024న ఉ.11.00 గం.కు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నం. AE, బొల్లారం మున్సిపాలిటీ: 7569034801.

సం/- మున్సిపల్ కమిషనర్, బొల్లారం మున్సిపాలిటీ
DIPR RO No.1527-PP/CL/Advt/1/2024-25, Dt. 05.07.2024

తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

Lr No.E1/73/2024-25 — **కొటేషన్ల ఆహ్వానము** — తేది:06-07-2024

ఈ క్రింద చూపిన పరికరాలకు కమిషనర్, తుక్కుగూడ పురపాలక సంఘము వారు సీల్డు చేయబడిన కొటేషన్లు ఆహ్వానిస్తున్నారు. 1) వివిధ పండుగల నిర్వహణలో అన్ని రకాల లైటింగ్ ఏర్పాట్లు చేయుటకు (ఒక్క రోజుకు ఒక్క లైటుకు) మరియు జనరేటర్లు అద్దెకు తీసుకొనుటకు. 2) అన్ని రకాల ఇన్ డోర్ మరియు అవుట్ డోర్ మొక్కలు మరియు మొక్కల కుండీలు కొనుగోలు చేయుటకు తమ యొక్క సీల్డు చేయబడిన కొటేషన్లు పురపాలక సంఘ కార్యాలయము, తుక్కుగూడలో తేది: 10-07-2024 లోగా చేరే విధంగా పంపగలరు. సంప్రదించు నెం.8639160741, 8978455983.

సం/- కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ
DIPR RO No.1522-PP/CL/Advt/1/2024-25, Dt: 05-07-2024

జాతీయ మానవ హక్కుల కమిషన్
షార్ట్ ఫిలిమ్స్ కాంపిటీషన్ - 2024

మానవ హక్కులను పరిరక్షించే మరియు ఔన్నత్యాన్ని చాటే NHRC షార్ట్ ఫిలిమ్స్ కాంపిటీషన్ - 2024 కోసం భారత పౌరుల నుండి ఎంట్రీలు కోరబడుచున్నవి. వివరాల కోసం దరఖాస్తు ఫారం, నియమ నిబంధనలు NHRC వెబ్‌సైట్ **www.nhrc.nic.in** నుండి డౌన్‌లోడ్ చేసుకొని ఎంట్రీని ఆన్‌లైన్‌లో మాత్రమే ఇమెయిల్ చిరునామా: **nhrcshortfilm@gmail.com** కు పంపవలెను.

ఎంట్రీల స్వీకరణకు చివరి తేది 30 ఆగస్టు 2024.

ఏవేని స్పష్టీకరణల కోసం పైన పేర్కొన్న ఇమెయిల్ చిరునామాలో డిప్యూటీ డైరెక్టర్ (మీడియా & కమ్యూనికేషన్), NHRCకు వ్రాయండి.

CBC 53101/12/0003/2425



ఇక స్టార్మర్ శకం

బ్రిటన్ ఎన్నికల్లో ఘనవిజయం • కన్జర్వేటివ్‌లకు ఘోర పరాజయం





లండన్: అంతా ఊహించిందే జరిగింది. గురువారం జరిగిన బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ ఘనవిజయం సాధించింది. హౌజ్ ఆఫ్ కామన్స్‌లో 650 స్థానాలకు గాను ఏకంగా 412 సీట్లు కైవసం చేసుకుంది. ప్రధాని రిషి సునాక్ సారథ్యంలోని అధికార కన్జర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాలతో ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఏకంగా 252 స్థానాలు కోల్పోయింది! ఇది ఆ పార్టీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయం. లేబర్ పార్టీకి 33.7 శాతం రాగా కన్జర్వేటివ్‌లకు 23.7 శాతమే లభించాయి. శుక్రవారం మధ్యాహ్నానికల్లా ఫలితాలు వెలువడటం, సునాక్ రాజీనామా చేయడం, లేబర్ పార్టీని విజయపథంలో నడిపిన కియర్ స్టార్మర్ దేశ 58వ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం చకచకా జరిగిపోయాయి. దాంతో 14 ఏళ్ల కన్జర్వేటివ్ పాలనకు తెర పడింది. భారత మూలాలున్న తొలి ప్రధాని సునాక్ పాలన కూడా 20 నెలలకే ముగిసింది. రిచ్‌మండ్-నార్త్ అలెర్టన్ స్థానం నుంచి ఆయన ఘనవిజయం సాధించినా మాజీ ప్రధాని లిజ్ ట్రస్‌తో పాటు గ్రాంట్ షేప్స్, పెన్నీ మోర్డంట్, జాకబ్ రీస్ మాగ్ వంటి పలువురు కన్జర్వేటివ్ హేమాహేమీలు ఓటమి చవిచూశారు. దాంతో ఫలితాల అనంతరం మాట్లాడుతూ 44 ఏళ్ల సునాక్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ''లేబర్ పార్టీకి, స్టార్మర్‌కు అభినందనలు. ఘోర ఓటమి చవిచూసిన నా కేబినెట్ సహచరులకు సానుభూతి. నాయకునిగా వారిని గెలిపించుకోలేకపోయినందుకు క్షమాపణలు. ప్రజల అంచనాలు అందుకోలేకపోయినందుకు వారికి కూడా క్షమాపణలు'' అన్నారు. ఓటమికి బాధ్యత వహిస్తూ కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు సునాక్ ప్రకటించారు. అయితే ప్రధానిగా తన బాధ్యతలకు నూరు శాతం న్యాయం చేశానన్నారు. ప్రధానిగా కుటుంబంతో కలిసి అధికార నివాసంలో జరుపుకున్న దీపావళి వేడుకలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ''మా తాతల కాలంలో చేతిలో పెద్దగా ఏమీ లేకుండా ఇంగ్లండ్ వచ్చిన కుటుంబం మాది. అలాంటిది రెండే తరాల్లో నేను ప్రధాని కాగలిగాను. నా పిల్లలు డౌనింగ్ స్ట్రీట్ మెట్లపై దీపావళి ప్రమిదలు వెలిగించగలిగారు. అదీ దేశ గొప్పదనం'' అంటూ కొనియాడారు. ''నా వారసునిగా అత్యంత సవాళ్లమయమైన బాధ్యతను స్వీకరిస్తున్న నూతన ప్రధానికి 10, డౌనింగ్ స్ట్రీట్‌కు హార్దిక స్వాగతం. నూతన బాధ్యతల్లో ఆయన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. ఎందుకంటే ఆయన విజయమే మనందరి విజయం. ప్రచారంలో విమర్శలు గుప్పించుకున్నా స్టార్మర్ చాలా మంచి వ్యక్తి. ఆయన వ్యక్తిత్వాన్ని ఎంతగానో అభిమానిస్తాను'' అన్నారు. అనంతరం రాజు చార్లెస్-3కు సునాక్ రాజీనామా సమర్పించారు. తర్వాత భార్య అక్షత, పిల్లలతో కలిసి అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయారు. స్టార్మర్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

తుపానులా వచ్చాడు...

స్టార్మర్ ప్రస్థానం ఆద్యంతం ఆసక్తికరం

నిరుపేద కుటుంబం. తండ్రి పనిముట్ల తయారీ కార్మికుడు. తల్లి నర్సు. నలుగురు సంతానంలో రెండోవాడు. కుటుంబాన్ని నిరంతరం అప్పుల బాధ వెంటాడేది. దాంతో ఫోన్ బిల్లును తప్పించుకునేందుకు దాన్ని నెలల తరబడి వాడకుండా పక్కన పెట్టే పరిస్థితి! ''కార్మికునిగా ఫ్యాక్టరీలో తన తండ్రి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. దాంతో విపరీతమైన ఆత్మన్యూనతకు లోనై జనానికి దూరంగా మెలగడం అలవాటు చేసుకున్నారు'' అంటూ ఆవేదనగా గుర్తు చేసుకుంటారు స్టార్మర్. అందుకే స్థాయిలో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూడటం తనకు చిన్నప్పటి నుంచే అలవాటైందని చెబుతారు. లేబర్ పార్టీ తొలి నాయకుడైన కియర్ హార్డీ అంటే తల్లిదండ్రులకు ఎంతో అభిమానం. ఆ పేరునే స్టార్మర్‌కు పెట్టుకున్నారు. ఆయన ఇప్పుడదే పార్టీకి ఘనవిజయం సాధించి పెట్టడమే గాక ప్రధాని పీఠమెక్కడం విశేషం. విపక్షంలో ఉండగా లేబర్ పార్టీ పగ్గాలు చేపట్టి గెలుపు బాటన నడిపిన ఐదో నేతగా కూడా నిలిచారు...

తమ కుటుంబంలో కాలేజీ చదువు చదివిన తొలి వ్యక్తి స్టార్మరే. అప్పుడు కూడా డబ్బుల కటకట బాగా వేధించేది. దాంతో డబ్బుల కోసం స్టార్మర్ ఓసారి బీచ్‌లో మిత్రులతో కలిసి చట్ట విరుద్ధంగా ఐస్‌క్రీం అమ్ముతూ పట్టుబడ్డారు! లీడ్స్‌లో న్యాయశాస్త్రం చదివాక ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్లారు. 1987లో బారిస్టర్ పూర్తి చేశారు. మానవ హక్కుల చట్టంలో స్పెషలైజేషన్ చేశారు. కరీబియన్, ఆఫ్రికాల్లో ఉద్యోగం చేశారు. పని రాక్షసునిగా పేరుపడ్డారు. 2008లో ఇంగ్లండ్, వేల్స్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు.

రాజకీయ ప్రవేశం...

స్కూలు దశ నుంచే స్టార్మర్ రాజకీయాల పట్ల మొగ్గు చూపేవారు. తొలుత వామపక్ష రాజకీయ పట్ల ఆకర్షితులయ్యారు. 2015లో 52వ ఏట పూర్తిస్థాయిలో రాజకీయ రంగప్రవేశం చేశారు. ఉత్తర లండన్‌లోని హాల్‌బోర్న్ అండ్ సెయింట్ పాంక్రాస్ నియోజకవర్గం నుంచి 2015లో ఎంపీగా గెలుపొందారు. తాజా మాజీ ప్రధాని రిషి సునాక్ కూడా సరిగ్గా అదే రోజున తొలిసారిగా ఎంపీగా ఎన్నికవడం విశేషం! నాటి లేబర్ పార్టీ నాయకుడు జెరెమీ కార్బిన్‌కు నమ్మకస్తునిగా పేరుబడ్డారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘోర పరాజయంతో కార్బిన్ తప్పుకున్నారు. దాంతో 2020 ఏప్రిల్‌లో స్టార్మర్ లేబర్ పార్టీ నేతగా ఎన్నికయ్యారు. పార్టీలో పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. విలువల విషయంలో రాజీ పడేందుకు ససేమిరా అంటారాయన. తమ కంచుకోటైన హార్టిల్‌పూల్ స్థానంలో మూడేళ్ల క్రితం జరిగిన ఉప ఎన్నికలో లేబర్ పార్టీ తొలిసారి ఓటమి చవిచూసింది. ఆ పరాభవానికి బాధ్యత వహిస్తూ పార్టీ సారథ్యం నుంచి తప్పుకోవడానికి స్టార్మర్ సిద్ధపడ్డారు. సీనియర్ నాయకుల విజ్ఞప్తి మేరకు కొనసాగారు. 2019 ఓటమితో చతికిలపడి ఉన్న పార్టీలో జవజీవాలు నింపడమే గాక ఐదేళ్లకే ఘనవిజయం సాధించి పెట్టారు. ఇది తేలిగ్గా ఏమీ జరగలేదు.

పార్టీకి పునర్వైభవం...

లేబర్ పార్టీకి పునర్వైభవం తేవడానికి స్టార్మర్ చాలా కష్టపడ్డారు. హార్టిల్‌పూల్ ఉప ఎన్నిక ఓటమి తర్వాత ఓటర్లను పార్టీ వైపు తిప్పుకోవడంపై దృష్టి సారించారు. వర్సిటీల ట్యూషన్ ఫీజుల రద్దు, ఇంధన, నీటి కంపెనీల జాతీయాకరణ వంటి గత వాగ్దానాల నుంచి వెనక్కు తగ్గారు. ఇది నమ్మకద్రోహమని, పార్టీ వాగ్దానాలను తుంగలో తొక్కారని సీనియర్లే ఆరోపించినా వెనక్కు తగ్గలేదు. కొన్నేళ్లుగా బ్రిటన్‌లో ఉద్యోగ సంక్షోభం నెలకొంది. ధరలు విపరీతంగా పెరిగి, ప్రజల ఆదాయం తగ్గి జీవన ప్రమాణాలు పడిపోయాయి. వీటితో పాటు ప్రధాన సమస్యయిన ఆరోగ్య రంగంపైనా స్టార్మర్ దృష్టి సారించారు. బ్రిటన్‌లో వైద్య సేవలందించే ప్రభుత్వ విభాగం ఎన్‌హెచ్‌ఎస్‌లో వెయిటింగ్ జాబితాను తగ్గిస్తామని, పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేస్తామని, పన్ను చెల్లింపుల్లో లొసుగులను నిర్మూలించి ఎన్‌హెచ్‌ఎస్‌కు నిధులు సమకూర్చుతామని హామీలిచ్చారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రత కమాండ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా సొంతిల్లు లేనివారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో చట్టాలను సంస్కరించి 15 లక్షల కొత్త ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు. ప్రైవేట్ స్కూళ్లకు పన్ను మినహాయింపులు ఎత్తేసి ఆ సొమ్ముతో 6,500 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని చెప్పారు. ఇవన్నీ జనాన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వేణుగానంలో నిపుణుడు

స్టార్మర్‌కు సంగీతంలో లోతైన ప్రవేశముంది. చాలాకాలం పాటు శాస్త్రీయ శిక్షణ తీసుకున్నారు. ఫ్లూట్, పియానో, వయొలిన్ అద్భుతంగా వాయిస్తారు. కాలేజీ రోజుల్లో ఆయన వేణుగానాన్ని అలా వింటూ ఉండిపోయేవాళ్లమని నాటి మిత్రులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. కాలేజీ రోజుల్లో స్టార్మర్ ఎంతో చురుకైన ఫుట్‌బాల్ ఆటగాడు కూడా. 2007లో విక్టోరియా అలెగ్జాండర్‌ను పెళ్లాడారు. ఆమె నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్)లో ఆక్యుపేషనల్ థెరపిస్ట్. వారికి ఒక కొడుకు, కూతురున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

దేశాన్ని పునర్నిర్మిస్తాం: స్టార్మర్

ప్రజలు మార్పు కోసం నిర్ణాయక రీతిలో ఓటేశారని 61 ఏళ్ల స్టార్మర్ అన్నారు. శుక్రవారం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక 10, డౌనింగ్ స్ట్రీట్ నుంచి ఆయన తొలి ప్రసంగం చేశారు. ''ప్రజల త్యాగాలకు, ప్రతిగా వారికందుతున్న సేవలకు మధ్య అంతరం ఈ స్థాయిలో పెరిగితే భవిష్యత్తు పట్ల వారిలో మిగిలేది నిరాశా నిస్పృహలే. ముందు వారిలో విశ్వాసాన్ని పాదుగొల్పాలి. ఇది మాటలతో కాదు. చేతల్లోనే చూపాలి. మన ముందు భారీ లక్ష్యాలున్నాయి. కనుక నేటినుంచే పని మొదలవుతుంది'' అన్నారు. ''సేవే ఏకైక లక్ష్యంగా లేబర్ పార్టీని పునర్ వ్యవస్థీకరించాం. దేశమే ముందు, ఆ తర్వాతే పార్టీ అంటూ సమూలంగా మెరుగుపరిచి ప్రజల ముందుంచాం. అలాగే దేశాన్ని కూడా అన్ని రంగాల్లోనూ బలోపేతం చేసి చూపిస్తాం. 'సేవల ప్రభుత్వం'గా పని చేస్తాం. లేబర్ పార్టీకి ఓటేయని వారికి కూడా అంతే చిత్తశుద్ధితో సేవ చేస్తాం. ప్రజలందరి నమ్మకాన్నీ నిలబెట్టుకుంటాం. బ్రిటన్‌ను పూర్తిస్థాయిలో పునర్నిర్మిస్తాం'' అని ప్రకటించారు.

సునాక్‌పై ప్రశంసల జల్లు

ప్రధానిగా సునాక్ ఎంతో సాధించారంటూ స్టార్మర్ ప్రశంసలు కురిపించడం విశేషం! 20 నెలల పాలనలో దేశ ప్రగతి కోసం ఆయన చిత్తశుద్ధితో ఎంతగానో కృషి చేశారంటూ కొనియాడారు. ''ఆసియా మూలాలున్న తొలి బ్రిటిష్ ప్రధానిగా సునాక్ ఎంతో సాధించారు. ఆ ఘనతలను ఏ మాత్రం తక్కువ చేసి చూడలేం. ప్రధానిగా ఆయన పనితీరుకు జోహార్లు'' అన్నారు.
ఫలితాలు వెలువడగానే స్టార్మర్ బకింగ్‌హాం రాజ ప్రాసాదానికి వెళ్లి రాజు చార్లెస్-3తో భేటీ అయ్యారు. నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా స్టార్మర్‌ను రాజు లాంఛనంగా ఆహ్వానించారు.

కేబినెట్‌లోకి లీసా నంది




స్టార్మర్ మంత్రివర్గంలో భారతీయ మూలాలున్న 44 ఏళ్ల లీసా నందికి చోటు దక్కింది. ఆమెను సాంస్కృతిక, క్రీడా, సమాచార ప్రసార మంత్రిగా నియమించారు. విగాన్ నుంచి ఆమె వరుసగా రెండోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. లీసా తండ్రి దీపక్ విద్యావేత్త. 1950ల్లో బ్రిటన్ వెళ్లారు. అక్కడి అమ్మాయిని పెళ్లాడారు. జాతుల సయోధ్యకు బ్రిటన్‌లో గుర్తింపు పొందారు. లీసా 2020లో లేబర్ పార్టీ నాయకత్వం కోసం స్టార్మర్‌తో పోటీపడి మూడోస్థానంలో నిలిచారు.



ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక స్టార్మర్ దంపతుల అభివాదం



అధికార నివాసాన్ని వీడుతున్న సునాక్ దంపతులు



బ్రిటన్ ఎన్నికల్లో భారతీయం

రికార్డు స్థాయిలో 28 మంది బ్రిటిష్ ఇండియన్ల గెలుపు

లండన్: భారతీయమూలాలున్న వ్యక్తులు బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి విదేశంలోనూ తమ సత్తా చాటారు. శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో 28 మంది భారతీయసంతతి నేతలు విజయం సాధించారు. కన్జర్వేటివ్ పార్టీ ఓడినా మాజీ ప్రధాని, భారతీయ మూలాలున్న రిషిసునాక్ తన రిచ్‌మండ్ నార్త్ అలెర్టాన్ నియోజకవర్గంలో గెలిచారు. ఈసారి అన్ని పార్టీల తరఫున 107 మంది బ్రిటిష్ ఇండియన్లు బరిలో దిగగా 28 మంది గెలిచారు! ఇవి రెండూ రికార్డులే. కేరళ నుంచి పంజాబ్‌దాకా పలు రాష్ట్రాల నుంచి వలసవచ్చిన భారతీయ సంతతి వ్యక్తులు ఎక్కువగా ఎన్నికల్లో పోటీచేశారు. విజేతల్లో ఎక్కువ మంది లేబర్ పార్టీ అభ్యర్థులు కావడం విశేషం!

గెలిచిన మహిళా మంత్రులు

కన్జర్వేటివ్ పార్టీ నేతలు, మాజీ హోం శాఖ మహిళా మంత్రులు సుయెల్లా బ్రేవర్‌మ్యాన్, ప్రీతిపటేల్ గెలిచారు. ఎసెక్స్ పరిధిలోని వీథెమ్ నియోజకవర్గంలో ప్రీతి, ఫేర్‌హామ్ వాటరలూవిల్లే నియోజకవర్గంలో బ్రేవర్‌మ్యాన్ విజయం సాధించారు. లీసెస్టర్‌లో పుట్టిపెరిగిన శివానీ రాజా కన్జర్వేటివ్ అభ్యర్థినిగా లీసెస్టర్ ఈస్ట్ స్థానంలో గెలిచారు. పంజాబ్ నుంచి వలసవచ్చిన గగన్ మోహేంద్ర కన్జర్వేటివ్ నేతగా మరోసారి హార్ట్‌ఫోర్డ్‌షైర్ నుంచి జయకేతనం ఎగరేశారు. ఈయన తాత బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో పనిచేశారు. గోవా నుంచి వలసవచ్చిన క్లెయిర్ కాటిన్హో కన్జర్వేటివ్ నాయకురాలిగా ఈస్ట్ సర్రే నుంచి విజయం సాధించారు. 12 ఏళ్ల వయసులో కుటుంబంతో కలిసి బ్రిటన్‌కు వలసవచ్చిన కనిష్క నారాయణ్ లేబర్ పార్టీ నేతగా బరిలో దిగి వేల్స్ స్థానంలో గెలిచారు. ఈయన గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా డేవిడ్ కామెరూన్, లిజ్ ట్రస్ ప్రభుత్వాల్లో పనిచేశారు. 13 ఏళ్లుగా ఎంపీగా కొనసాగుతున్న లేబర్ పార్టీ నాయకురాలు సీమా మల్హోత్రా ఫెల్తామ్ హీస్టన్ నుంచి గెలిచారు. గోవా మూలాలున్న లేబర్ నేత వలేరీ వజ్ మరోసారి వాల్‌సేల్ బ్లాక్స్‌విచ్ నుంచి విజయం సాధించారు. పంజాబీ సిక్కు కుటుంబానికి చెందిన నాదియా ఎడిత్ విట్టోమే లేబర్ పార్టీ తరఫున నాటింగ్‌హామ్ ఈస్ట్ నుంచి గెలుపొందారు. 2019లో 23 ఏళ్లవయసులోనే ఎంపీగా గెలిచిన అతిపిన్న వయస్కురాలిగా రికార్డ్ నెలకొల్పారు. సిక్కు నాయకురాలు, లేబర్ పార్టీ నేత అయిన ప్రీతి కౌర్ గిల్ మరోసారి బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్ నుంచి గెలిచారు. పార్లమెంట్‌లో తొలి సిక్కు మహిళా ఎంపీగా నాడు చరిత్ర సృష్టించారు. బ్యాగీ శంకర్ (డర్బీ సౌత్), హర్‌ప్రీత్ ఉప్పల్ (హడర్స్‌ఫీల్డ్), సోనియా కుమార్ (డడ్లే) తదితరులూ విజయం సాధించారు.

భారత్‌పై ప్రభావం ఎంత?

న్యూఢిల్లీ/లండన్: బ్రిటన్‌లో రిషి సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్‌లు ఓటమి చవిచూసి లేబర్ పార్టీ గద్దెనెక్కడంతో ఈ అధికార మార్పిడి ప్రభావం భారత్‌పై ఎలా ఉండనుందన్న చర్చ జోరందుకుంది. దానికి భారత వ్యతిరేక, పాక్ అనుకూల పార్టీగా పేరుండటమే ఇందుకు కారణం. 1997లో బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 భారత పర్యటనకు వచ్చారు. పాలక లేబర్ పార్టీ సలహా మేరకు ముందుగా పాకిస్తాన్‌లో ఆగడమే గాక, 'ఇరు దేశాలూ కశ్మీర్‌పై విభేదాలను పరిష్కరించుకో'వాలని పాక్ గడ్డ నుంచి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అందుకు తాను మధ్యవర్తిత్వం వహిస్తానంటూ బ్రిటన్ విదేశాంగ మంత్రి రాబిన్ కుక్ నోటి దురుసు ప్రదర్శించడంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. దీనిపై భారత్ భగ్గుమనడమే గాక, బ్రిటన్‌ను థర్డ్ రేట్ దేశంగా నాటి ప్రధాని ఐకే గుజ్రాల్ ఛీత్కరించుకునేదాకా వెళ్లింది. ఉద్రిక్తతల నడుమ రాణి భారత పర్యటన మొక్కుబడిగా ముగిసింది. 2019లో లేబర్ పార్టీ నేత జెరెమీ కోర్బిన్ కశ్మీర్ సమస్యకు ఐరాస ఆధ్వర్యంలో రిఫరెండం నిర్వహించాలంటూ బ్రిటన్ పార్లమెంట్‌లో తీర్మానమే ప్రవేశపెట్టారు! దాంతో బ్రిటన్‌లో ప్రబల శక్తిగా ఉన్న భారతీయులు ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో లేబర్ పార్టీకి వ్యతిరేకంగా ఓటేశారు. పార్టీ ఘోర ఓటమికి ఇది కూడా ముఖ్య కారణంగా నిలిచింది. పైగా ఆ పార్టీ నేతల్లో ఖలిస్తానీ సానుభూతిపరుల సంఖ్య ఎక్కువ. సారథిగా స్టార్మర్ రాకతో చాలా సానుకూల మార్పు వచ్చిందంటున్నారు. ఎన్నికల్లో బ్రిటిష్ ఇండియన్ల మద్దతు కోసం ఆయన పలు చర్యలు చేపట్టారు. స్వామి నారాయణ్ ఆలయాన్ని సందర్శించారు. పార్టీలోని ఖలిస్తానీ అనుకూల నేతల ప్రాధాన్యాన్ని బాగా తగ్గించారు. ''భారత్‌తో సన్నిహిత సంబంధాలే మా ప్రాథమ్యం. హిందూఫోబియాకు బ్రిటన్‌లో ఏ మాత్రమూ స్థానం లేదు. వాణిజ్యంలోనే గాక పర్యావరణ, భద్రత వంటి పలు రంగాల్లో భారత్‌తో మరింత సన్నిహితంగా కలిసి పని చేస్తాం'' అని ప్రధానిగా తొలి ప్రసంగంలో స్టార్మర్ ప్రకటించారు.

ఆగస్ట్ 11న నీట్-పీజీ పరీక్ష

న్యూఢిల్లీ: నీట్–పీజీ 2024 ప్రవేశ పరీక్ష కొత్త తేదీ ఖరారైంది. ఆగస్ట్ 11న రెండు షిఫ్టుల్లో పరీక్ష జరగనుంది. జూన్ 23న జరగాల్సిన ఈ పరీక్షను కొన్ని పోటీ పరీక్షల సమగ్రతపై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా వాయిదా వేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ జూన్ 22వ తేదీన ప్రకటించడం తెల్సిందే. పరీక్ష విధానం సమగ్రతపై సంబంధిత నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) తదితర విభాగాలతో ప్రభుత్వం సమీక్ష జరిపింది. అనంతరం, పరీక్షను ఆగస్ట్ 11వ తేదీన రెండు షిఫ్టుల్లో జరపాలని నిర్ణయించినట్లు ఎన్‌బీఈఎంఎస్ శుక్రవారం తెలిపింది.

రాజకీయం చేయదల్చుకోలేదు

- సత్సంగ్ ఘోరంపై రాహుల్
- బాధితులకు పరామర్శ

హత్రాస్/అలీగఢ్: హత్రాస్ తొక్కిసలాట ఘటనపై రాజకీయం చేయదల్చుకోలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. 121 మందిని బలితీసుకున్న తొక్కిసలాట ఘటన బాధితుల కుటుంబాలను ఆయన శుక్రవారం పరామర్శించారు. తొలుత యూపీలో అలీగఢ్ జిల్లాకు చెందిన 17 మంది మృతుల కుటుంబసభ్యులను కలిసి మాట్లాడారు. తర్వాత హత్రాస్ జిల్లాకు చెందిన 19 మంది కుటుంబీకులను పరామర్శించారు. తర్వాత ఘటన జరిగిన పుల్‌రయీ వెళ్లి బాధితుల కుటుంబాలను ఓదార్చారు. తొక్కిసలాట వంటి నిర్లక్ష్యపూరిత ఉదంతాలపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని చెప్పారు. నష్టపరిహారం త్వరగా ఇవ్వాలని సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు. '''బాధితుల్లో ఎక్కువ మంది మహిళలే. పేద కుటుంబాలకు తక్షణ సాయం అవసరం. ఆరు నెలలు, ఏడాది తర్వాత అందే నష్టపరిహారం, సాయం అనవసరం. ఆలస్యం చేయకుండా వెంటనే గరిష్ట మొత్తంలో నష్టపరిహారం సీఎం యోగి అందివ్వాలి'' అని రాహుల్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు యూపీ సర్కార్ ప్రకటించడం తెల్సిందే. '' సత్సంగ్ వద్ద పోలీస్ చెబుతున్న రక్షణ ఏర్పాట్లేవీ చేయలేదని బాధితుల కుటుంబసభ్యులు చెప్తున్నారు. ఇది దిగ్భ్రాంతికరం'' అని రాహుల్ అన్నారు.



భోలే బాబా ఆస్తులు... రూ.100 కోట్ల పైనే..

లక్నో: సత్సంగ్ నిర్వహణలో అవకతవకలతో 121 మంది మరణానికి కారణమైన సూరజ్ పాల్ అలియాస్ సాకార్ నారాయణ్ హరి అలియాస్ భోలే బాబాకు ఏకంగా రూ.100 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. భోలే బాబాకు దేశవ్యాప్తంగా 24 ఆశ్రమాలు ఉన్నాయి. వీటిలో అత్యధికం ఆయన సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నాయి. శ్రీనారాయణ్ హరి సాకార్ ట్రస్టు పేరిట వీటిని నిర్వహిస్తున్నారు. బాబాకు అత్యంత సన్నిహితులైన వ్యక్తులే ఆశ్రమాల కార్యకలాపాలు పర్యవేక్షిస్తుంటారు. బాబా ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి ఆశ్రమంలో నివసిస్తున్నారు. దాదాపు 14 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఆశ్రమాన్ని హరినగర్ అని పిలుస్తుంటారు. ఇందులో బాబా దంపతుల కోసం ఆరు అత్యాధునిక గదులు ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ఎటావాలో బాబా కోసం మరో కొత్త ఆశ్రమం నిర్మాణంలో ఉంది. భోలే బాబాకు ఖరీదైన కార్లున్నాయి. ఆయన ఎల్లప్పుడూ తెల్లరంగు సూటు, టై, బూట్లు, నల్ల కళ్లద్దాలతో దర్శనమిస్తుంటారు. బాబా రక్షణ కోసం సుశిక్షితులైన 17 మంది వ్యక్తిగత కమాండోలు ఉన్నారు. ఆయన కారుకు ముందు 16 మంది అంగరక్షకులు ఖరీదైన బైక్‌లపై ప్రయాణిస్తూ ట్రాఫిక్ క్లియర్ చేస్తుంటారు. బాబా కాన్వాయ్‌లో 30 కార్లుంటాయి. తొక్కిసలాట కేసులో ప్రధాన నిందితుడు దేవప్రకాశ్ మధుకర్ లొంగిపోయాడు.

త్వరలో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు!

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై బీజేపీ దృష్టి పెట్టింది. ఆ రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. అమర్‌నాథ్ యాత్ర తర్వాత ఎన్నికలు జరగవచ్చని ఈ సందర్భంగా షా స్పష్టం చేసినట్లు తెలిసింది. అన్ని స్థానాల్లోనూ బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయనన్నారు. అమర్‌నాథ్ యాత్ర ఆగస్టు 19న ముగియనుంది. సెప్టెంబర్‌లోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఎంపీలుగా అమృత్‌పాల్, రషీద్ ప్రమాణం

న్యూఢిల్లీ: స్వతంత్ర అభ్యర్థులుగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన సిక్కు వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ (31), జమ్మూకశ్మీర్ నాయకుడు షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్ (56) శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. పలు కేసుల్లో జైల్లో ఉన్న వారికి ప్రమాణం చేయడానికి షరతులతో పెరోల్ లభించింది. కట్టుదిట్టమైన భద్రతమైన పార్లమెంట్‌కు వచ్చి స్పీకర్ చాంబర్‌లో వారు ప్రమాణ స్వీకారం చేశారు. అమృత్‌పాల్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నుంచి, రషీద్ కశ్మీర్‌లోని బారాముల్లా నుంచి గెలిచారు. కోర్టు నుంచి సకాలంలో పెరోల్ రాకపోవడంతో జూన్ 24, 25న మిగతా ఎంపీలతో కలిసి వారు ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. జాతీయ భద్రతా చట్టం కింద 2023 ఏప్రిల్‌లో అరెస్టయిన అమృత్‌పాల్ అసోంలోని దిబ్రూగఢ్ జైలులో ఉంటున్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చిన కేసులో రషీద్ 2017లో అరెస్టయ్యారు. 2019 నుంచి ఢిల్లీలోని తీహార్ జైలులో ఉంటున్నారు.

ఆగస్ట్‌లో ప్రభుత్వం కూలొచ్చు: లాలూ

పట్నా: మోదీ సర్కార్ ఆగస్టులో పడిపోవచ్చని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ శుక్రవారం జోస్యం చెప్పారు. ఈ తరుణంలో ఆర్జేడీ పుంజుకోవాలని పిలుపునిచ్చారు. లాలేవి పగటి కలలేనని బీజేపీ ఎద్దేవా చేసింది. ''లాలూ పగటి కలలు కంటున్నారు. మోదీకే ఓటర్లు మళ్లీ పట్టంకట్టారని లాలూ మర్చిపోయినట్లున్నారు. డీలా పడ్డ ఆర్జేడీ కార్యకర్తల కోసం లాలూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు'' అని కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్ అన్నారు.

రోబో ఆత్మహత్య!?

సియోల్: పరీక్ష సరిగా రాయలేదని, ప్రేమ విఫలమైందని, ఆర్థిక సమస్యలతో ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు తీసుకుంటున్న జనం వార్తలను మనం చూశాం. కానీ మరమనిషి సైతం ఆత్మహత్య చేసుకుంటాడన్న వార్త వింటానికి కొత్తగా ఉన్నా ఇది నిజంగా జరిగిందని దక్షిణకొరియా వార్తాసంస్థలు కోడై కూస్తున్నాయి. రోబో సేవలను విపరీతంగా వాడే దక్షిణ కొరియాలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. డాక్యుమెంట్ల డెలివరీ వంటి పనుల్లో తెగ బిజీగా ఉండే ఓ రోబో సూసైడ్ చేసుకుందన్న వార్త సంచలనం సృష్టించింది. పని ఒత్తిడి వల్లే రోబోట్ ఆత్మహత్య చేసుకుందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

చక్కర్లు కొట్టి.. మెట్లపై పడి

గత గురువారం సాయంత్రం గుమీ నగర సిటీ కౌన్సిల్ భవనంలో ఈ రోబో 'సూపర్ వైజర్' బాధ్యతల్లో ఉండగా ఉన్నట్టుండి ఆగిపోయి గుండ్రంగా తిరిగి మెట్లపై నుంచి పడిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఏకబిగిన పని చేయాల్సి రావడంతో విపరీత పని ఒత్తిడితోనే అది ఇలా చనిపోయిందని వార్తలొచ్చాయి. అమెరికాకు చెందిన బేర్‌రోబోటిక్స్ సంస్థ ఈ రోబోను తయారు చేసిచ్చింది. గత ఆగస్ట్ నుంచి అది చురుగ్గా పనిచేస్తోందట. ఈ రోబోకు సొంతంగా పౌరసేవల గుర్తింపు కార్డుంది! అంటే ఒకే ఫ్లోర్‌లో కాకుండా లిఫ్ట్‌లో తిరుగుతూ వేర్వేరు అంతస్తుల్లో పనులు చక్కబెట్టగలదు. ఇలాంటి రోబోట్ పొరపాటున మెట్ల పై నుంచి పడిందా? లేదంటే సాంకేతిక లోపమా? లేదంటే మరేదైనా సమస్యా? అన్న కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. రోబో శకలాలను స్వాధీనంచేసుకుని ల్యాబ్‌కు పంపించారు. అనూహ్య ఘటన తర్వాత ఈ బిల్డింగ్‌లో మరో రోబోను పనిలో పెట్టుకోబోమని గుమీ సిటీ కౌన్సిల్ చెప్పింది. అయితే ద.కొరియాలో రోబోట్ సేవలు అత్యధికం. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రోబోటిక్స్ గణాంకాల ప్రకారం ద.కొరియాలో ప్రతి పది మంది ఉద్యోగులకు ఒక పారిశ్రామిక అవసరాల రోబోట్‌ను వినియోగిస్తున్నారు.





RIGHT TO WALK

ఇంకెప్పుడు?

గ్రేటర్ సిటీని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామంటున్న పాలకులు నగరం మధ్యలో ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ వంటి పనులపై దృష్టి పెడుతున్నా, కాలినడకన వెళ్లే వారికి అవసరమైన మేరకు ఫుట్‌పాత్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ)ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రధాన రహదారుల్లో సాఫీగా కొద్ది దూరం కూడా నడవలేక.. ఒకవైపు నుంచి మరో వైపు రోడ్డు దాటలేక పాదచారులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. చాలాచోట్ల ఫుట్‌పాత్‌లు లేక, ఉన్న ఫుట్‌పాత్‌లు చాలా ప్రాంతాల్లో ఆక్రమణకు గురికావడంతో పాదచారులు విధిలేని పరిస్థితుల్లో రోడ్లపైనే నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. కిక్కిరిసిన జంక్షన్ల వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నించేవారు కూడా రయ్ మంటూ దూసుకుపోయే వాహనాల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ఎఫ్‌ఓబీలు ఉన్నా చాలాచోట్ల లిఫ్ట్‌ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈ కారణంగా పాదచారులు ఎఫ్‌ఓబీలు ఉపయోగించకుండా ట్రాఫిక్ మధ్యలోనే రోడ్లు దాటేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఏడాది నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 123 మంది మృత్యువాత పడగా అనేకమంది గాయాల పాలవడం గమనార్హం. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 9,013 కి.మీ పొడవైన రోడ్లు ఉండగా ఫుట్‌పాత్‌లు కేవలం 817 కిలోమీటర్లకే పరిమితం కావడం పరిస్థితిని స్పష్టం చేస్తోంది.

- సాక్షి, హైదరాబాద్

జీహెచ్ఎంసీలో రోడ్లు.. ఫుట్‌పాత్‌లు ఇలా (కి.మీ.లలో)

మొత్తం రోడ్లు	బీటీరోడ్లు
9,013	2,846
సీసీ రోడ్లు	**ఫుట్‌పాత్‌లు**
6,167	817

మహానగరంలో పాదచారులకు అవస్థలెన్నో..

రోడ్ల నిడివితో పోల్చుకుంటే 10% కూడా లేని ఫుట్‌పాత్‌లు

ఉన్న ఫుట్‌పాత్‌లపై చాలాచోట్ల వ్యాపారాలు, వాహనాల పార్కింగ్

రోడ్డు దాటాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే..!

ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నా చాలా వరకు నిరుపయోగంగానే..

పెలికాన్ సిగ్నల్స్‌దీ అదే పరిస్థితి.. నిర్వహణ లోపం..ప్రజల్లోనూ నిర్లక్ష్యం


బిజీ రోడ్లలో ప్రమాదాలు..ఏటా పెరుగుతున్న మరణాలు

10% కూడా లేని ఫుట్‌పాత్‌లు

జీహెచ్ఎంసీ పరిధిలో బీటీ, సీసీ, ఇతరత్రా రోడ్లన్నీ కలిపి మొత్తం 9,013 కిలోమీటర్ల రహదారులుండగా, వాటిల్లో ఫుట్‌పాత్‌లు లేదా వాక్‌వేలు కలిపి కనీసం 10 శాతం కూడా లేవు. ఉన్న ఫుట్‌పాత్‌లు దుకాణదారులు తమ అమ్మకపు సామగ్రిని ఉంచడానికి, వాహనాల పార్కింగ్‌కు, టీకొట్లు, తోపుడు బండ్లు, ఇతరత్రా చిన్న వ్యాపారాల నిర్వహణకు పనికి వస్తున్నాయే తప్ప ప్రజలు నడవడానికి అనువుగా ఉండటం లేదు. ప్రభుత్వ సంస్థలు సైతం పబ్లిక్ టాయ్‌లెట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.5 భోజన కేంద్రాలు వంటివి ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేయడం గమనార్హం. కాగా కొందరు ఇసుక, ఇటుక, కంకర వంటి వాటిని సైతం ఫుట్‌పాత్‌లపైనే ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు.

అన్ని రోడ్లకు ఫుట్‌పాత్‌లుండాలి

అన్ని రహదారుల వెంబడి ఫుట్‌పాత్‌లను నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే ఇప్పటికే ఉన్న ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించి, అవి ప్రజలు నడిచేందుకు మాత్రమే ఉపయోగపడేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. జీహెచ్ఎంసీలో ఈవీడీఎం విభాగం ప్రారంభమైన తొలినాళ్లలో ఆరేళ్ల క్రితం 'రైట్ టూ వాక్' పేరిట 20 వేలకు పైగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించింది. చిన్నాచితకా వ్యాపారులను వాటిపై నుంచి తరలించారు. తొలగింపు సమయంలో ఫుట్‌పాత్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో కొత్తగా నిర్మిస్తామని పేర్కొన్నారు. కానీ కొత్తగా నిర్మించలేదు సరికదా.. కొన్నాళ్లకే ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ వ్యాపారాలు వెలిశాయి.



రోడ్డు దాటేదెలా?



ఫుట్‌పాత్‌ల పరిస్థితి అలా ఉంచితే.. ఒక వైపు నుంచి మరో వైపు రోడ్డు దాటి వెళ్లాలంటే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా బిజీ రోడ్లలో ఆగకుండా దూసుకొచ్చే వాహనాలతో ఒక్క అడుగు ముందుకు వేయడం కూడా కష్టంగా ఉంటుంది. బిక్కుబిక్కుమంటూ వచ్చే వాహనాల వైపు చేతిని అడ్డంగా పెడుతూ బతుకుజీవుడా అనుకుంటూ రోడ్లు దాటుతున్నవారు నిత్యం కనిపిస్తుంటారు. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఎవరో ఒకరు తోడులేందే వారు రోడ్డు దాటలేని పరిస్థితి ఉంటోంది. పాదచారులు రోడ్లు దాటేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు, పెలికాన్ సిగ్నల్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కోట్ల రూపాయలు ఖర్చవడం తప్ప అవి ప్రజలకు ఉపయోగపడటం లేదు. నగరంలో ఉన్న అనేక ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. పాదచారుల నిర్లక్ష్యం కూడా ఇందుకు కొంత తోడవుతోంది. చాలాచోట్ల లిఫ్ట్‌లు పని చేయడం లేదు. కొన్నిచోట్ల పనిచేస్తున్నా పాదచారులు వాటిని ఉపయోగించడం లేదు. అధికార యంత్రాంగం మాత్రం ప్రజలకు

మిగతా 8వ పేజీలో ▶

ఫుట్‌పాత్‌లు ఉండాల్సింది ఇలా (మీటర్లలో..)

దుకాణాల ముందు	బస్టాప్‌లు
3.5 - 4.5	3.00
వాణిజ్య ప్రాంతాల్లో..	**ఇతర ప్రాంతాల్లో..**
4.00	2.5

(నగరంలో 0.60 మీటర్ల నుంచి 3 మీటర్ల లోపే ఉన్నాయి. ఎక్కువగా మీటరు నుంచి మీటరున్నర వరకే ఉన్నాయి)



బ్లడ్ ఆర్ట్

బ్లడ్‌ఆర్ట్‌కు చిరునామాగా మారి...

రుధిరంతో భావోద్వేగాలు దిద్దుతున్న ఆర్టిస్ట్

అనుభవజ్ఞులైన ల్యాబ్ టెక్నీషియన్‌తో సేకరణ

3 నుంచి 4 గ్రా.ల రక్తం అవసరం

13లో

సిక్స్‌ప్యాక్ తాతయ్య



13లో



మెట్టు మెట్టుకు బొట్టు

గోల్కొండ కోటలో ప్రారంభం కానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు ముందు కోటలోని నగీనాబాగ్ నుంచి అమ్మవారి ఆలయం వరకున్న మెట్లకు బొట్టు పెడతారు. ఇందులో భాగంగా అమ్మవారి వృత్తి పని సంఘం వారితో పాటు కోట పరిసరాలకు చెందిన మహిళలు మెట్టుమెట్టుకు బొట్టు కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు.

ఇంకెప్పుడు..?

▶ 7వ పేజీ తరువాయి

ఉపయోగపడుతున్నదీ, లేనిదీ పరిశీలించకుండానే కొత్తవి నిర్మించేందుకు పూనుకుంటోంది. ఉన్నవి ఉపయోగపడేలా చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు.

ఎన్ని ఉన్నా ఏం లాభం?

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, నేషనల్ హైవే, టీజీఐఐసీ సంస్థలు ఏర్పాటు చేసిన ఎఫ్ఓబీలు పాతవి 23 ఉండగా, కొత్తగా పనులు చేపట్టిన వాటిల్లో 12 పూర్తయ్యాయి. మరో ఐదు పురోగతిలో ఉన్నాయి. ఎఫ్ఓబీలు ఎక్కువ ఎత్తులో ఉండటంతో చాలామంది వాటిని వినియోగించుకోవడం లేదు. వయోవృద్ధులు శారీరక సమస్యలున్న వారు అసలు ఎక్కలేక పోతున్నారు. ఎక్కగలిగే శక్తి ఉన్నవారు సైతం వాటిని ఎక్కి నడిచి దిగే కంటే ఎలాగోలా రోడ్డు దాటేయొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ లిఫ్టులు, ఎస్కలేటర్లు వంటివి ఏర్పాటు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని ఏర్పాటు చేయడంతో ఊరుకోకుండా ప్రజలు వాటిని వినియోగించేలా చూడాలని, ఎలా వినియోగించాలో తెలియని వారి కోసం నిర్వహణ సిబ్బందిని నియమించాలని అంటున్నారు.



పేరుకే పెలికాన్ సిగ్నల్స్

బిజీ రోడ్డును దాటాలనుకునే పాదచారుల కోసం నగరంలోని 70కి పైగా ప్రాంతాల్లో పెలికాన్ సిగ్నల్స్ ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పాదచారి ఎవరైనా రోడ్డు దాటాలనుకున్నప్పుడు పక్కనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాలో ఉండే స్విచ్‌ను నొక్కాల్సి ఉంటుంది. అప్పుడు రెడ్ సిగ్నల్ పడి కొన్ని సెకన్ల తర్వాత రోడ్డుకిరువైపులా రాకపోకలు సాగించే వాహనాలు నిర్ణీత సమయం ఆగిపోతాయి. అప్పుడు పాదచారులు రోడ్డు దాటాల్సి ఉంటుంది. ఒక్కసారి బటన్ నొక్కిన తర్వాత.. పదే పదే నొక్కినా పని చేయకుండా కొంత గ్యాప్ ఉంటుంది. అంటే ఎవరైనా కూడా వెంట వెంటనే నొక్కడానికి అవకాశం ఉండదన్న మాట. అయితే బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి వద్ద, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఈ పెలికాన్ సిగ్నల్స్ కేవలం అలంకారంగానే ఉన్నాయి. ఎప్పుడో ఏర్పాటు చేసిన ఈ సిగ్నల్స్ కొన్ని ప్రాంతాల్లో పనిచేయడం లేదు. అసలు వీటిని ఎలా వినియోగించాలో కూడా ప్రజలకు తెలియదని, అధికారులు ఈ విషయంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోడ్డుపైకి వెళ్లకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి



కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఎఫ్ఓబీలను ప్రజలు వినియోగించుకోవాలి. కొందరు రోడ్డు పైనుంచే వెళ్తూ ప్రమాదకరమైనప్పటికీ సెంట్రల్ మీడియన్లను సైతం ఎక్కి దిగుతున్నారు. ఈ పరిస్థితి నివారణకు బ్రిడ్జికి అటూ ఇటూ కనీసం వంద మీటర్ల వరకు ప్రజలు రోడ్డు మీదకు వెళ్లేందుకు వీల్లేకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి.

- **ఆర్. శ్రీధర్,** స్ట్రక్చరల్ ఇంజనీర్, రిటైర్డ్ ఈఎన్‌సీ, జీహెచ్ఎంసీ

ఆ వ్యవస్థతో బ్రిడ్జీలు ఏర్పాటు చేయొచ్చు



ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో, ప్రస్తుతం ఫుట్‌పాత్‌లు లేని ప్రాంతాల్లో రోడ్డు చివరి లైన్‌లో టూ టయర్ సిస్టమ్‌తో బ్రిడ్జిలాంటి ఏర్పాటు చేయవచ్చు. 2 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేసే ఈ బ్రిడ్జి పైనుంచి పాదచారులు వెళ్లేలా, టూ, త్రీవీలర్లు కిందనుంచి వెళ్లేలా నిర్మాణాలు చేయొచ్చు. అలాగే రోడ్డు దాటేందుకు జాకింగ్ కాన్సెప్ట్‌తో మీటర్ రేడియస్‌తో టన్నెల్ లాంటి నిర్మాణం చేయొచ్చు. గతంలో ఓ పోలీసు ఉన్నతాధికారి హయాంలో ఇలాంటి ఆలోచనలు జరిగాయి. ఆయన మారడంతో అది అటకెక్కింది.

- **ప్రొఫెసర్ లక్ష్మణరావు,** జేఎన్‌టీయూ

ఎక్కువ ఎత్తు అవసరం లేదు



నగరంలో ఏర్పాటు చేసిన ఎఫ్ఓబీలు చాలా ఎత్తులో ఉన్నందువల్ల ఎవరూ ఎక్కడం లేదు. కాబట్టి ఎత్తు కాస్త తగ్గించాలి. మెట్రో స్టేషన్లలో మాదిరిగా లిఫ్టులు, ఎక్సలేటర్లు ఉంటే అవసరమైన వారు వినియోగిస్తారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వద్ద ఎఫ్ఓబీ ఉన్నప్పటికీ లిఫ్టు పనిచేయక ఎక్కడం లేదు. పాదచారులు ఎక్కువగా రోడ్లు దాటే ప్రాంతాలను గుర్తించి అక్కడ రోడ్‌క్రాసింగ్‌కు వీలుగా సిగ్నల్ లైట్లు పెట్టడం మాత్రమే కాకుండా వాహనాలు కచ్చితంగా ఆగేలా చూడాలి. పాదచారుల క్రాసింగ్ ఏరియా అని తెలిసేలా ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలి. పాదచారులకు సహాయకులుగా పోలీసులు లేదా ఇతర సిబ్బందిని నియమించాలి. దీనివల్ల కొందరికి ఉపాధి కూడా లభిస్తుంది.

- **డా. దొంతి నరసింహారెడ్డి,** సామాజికవేత్త

లిఫ్ట్ ఉన్నా వేస్ట్



ఎర్రగడ్డ ప్రధాన రహదారిలోని మోడల్ కాలనీ కమాన్ వద్ద ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిని సరిగా నిర్వహించడం లేదు. లిఫ్ట్ సౌకర్యం ఉన్నా అది ఎప్పుడు పని చేస్తుందో, ఎప్పుడు పని చేయదో తెలియదు. నాలాంటి సీనియర్ సిటిజన్లు మెట్లు ఎక్కి వెళ్లలేకపోతున్నాం. ఎఫ్ఓబీ సమీపంలో చెత్తాచెదారం నిండి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

-**జేఎస్‌టీ శాయి,** మోడల్ కాలనీ, సనత్‌నగర్.

నిబంధనల పాటింపు తప్పనిసరి చేయాలి



పాదచారులకు సైతం కొన్ని నిబంధనలు ఉన్నాయి. వీటి ప్రకారం పెడస్ట్రియన్ క్రాసింగ్స్‌లో, నిర్దేశించిన విధంగానే రోడ్డు దాటాలి. అలా చేయకపోవడం ఉల్లంఘన కిందికే వస్తుంది. నేను గతంలో చెన్నై వెళ్లినప్పుడు ఓ విషయం గమనించా. అప్పట్లో అక్కడి సెంట్రల్ రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉండేది. దీంతో పాదచారులు రోడ్డు దాటడానికి వీలుగా అండర్ పాస్ ఏర్పాటు చేశారు. అయితే తొలినాళ్లలో దీన్ని వినియోగించకుండా రోడ్డు పైనుంచే దాటుతుండ టంతో ప్రమాదాలు కొనసాగాయి. దీంతో ఆ అండర్ పాస్ వద్ద ఓ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. ఎవరైనా అండర్ పాస్ కాకుండా రోడ్డు పైనుంచి క్రాస్ చేస్తే కానిస్టేబుల్ పట్టుకునేవారు. అక్కడి కక్కడే రూ.5 జరిమానా విధించి వసూలు చేసే వారు. దీంతో పాటు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడంతో అండర్ పాస్ వినియోగం పెరిగింది. ఇలాంటి విధానాలు హైదారాబాద్‌లోనూ అమల్లోకి తీసుకురావాలి.

- **కేవీకే రెడ్డి,** ట్రాఫిక్ నిపుణుడు



నగరంలో ఎఫ్ఓబీలున్న ప్రాంతాలు

పాతవి: అనుటెక్స్ (సైనిక్‌పురి), హెచ్‌పీ పెట్రోల్‌బంక్ (రామంతాపూర్), నేషనల్ పోలీస్ అకాడమీ (రాజేంద్రనగర్), గగన్‌పహాడ్, మహవీర్ హాస్పిటల్, ఎన్ఎండీసీ (మాసాబ్‌ట్యాంక్), ఎన్టీఆర్ మార్గ్ (ట్యాంక్‌బండ్), గ్రీన్‌ల్యాండ్స్ గెస్ట్‌హౌస్, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ముఫకంజా కాలేజ్ (బంజారాహిల్స్), భారతీయ విద్యాభవన్ స్కూల్ (ఫిల్మ్‌నగర్), వెల్స్ ఫార్గో (ఖాజాగూడ), ఐఎస్‌బీ, ఐటీసీ కోహినూర్, మియాపూర్ క్రాస్‌రోడ్స్, ఆల్విన్ క్రాస్‌రోడ్స్ (మదీనగూడ), మలేసియన్ టౌన్‌షిప్, కేపీహెచ్‌బీ–4 ఫేజ్, కళామందిర్ (కేపీహెచ్‌బీ కాలనీ), ఐడీపీఎల్, మెట్టుగూడ, రైల్‌నిలయం, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ (బేగంపేట).

కొత్తవి: బాలానగర్, చెన్నైయ్ షాపింగ్ మాల్ (మదీనగూడ), మియాపూర్, ఈఎస్ఐ హాస్పిటల్(ఎర్రగడ్డ), హైదరాబాద్ సెంట్రల్ మాల్, నేరేడ్‌మెట్ బస్టాప్, సెయింట్ ఆన్స్ స్కూల్(సికింద్రాబాద్), తార్నాక, స్వప్న థియేటర్ (రాజేంద్రనగర్), ఒమర్ హోటల్, రంగభుజంగ థియేటర్, మూసాపేట క్రాస్‌రోడ్స్.



సాక్షి హైదరాబాద్



దర్యాప్తు అధికారులే స్టేటస్ చెప్పాలి!
కొత్త చట్టంతో ఫిర్యాదుదారులకు భారీ ఊరట కలగనుంది. బీఎన్ఎస్ఎస్‌లో కీలకమైన 193 (3) (2) సెక్షన్ ప్రకారం కేసు దర్యాప్తు పురోగతిని బాధితులకు తెల్పాల్సిందే.

-10లో



రెవెన్యూ సేవలపై నిర్లక్ష్యం
మహా నగరంలో రెవెన్యూ సేవలపై నిర్లక్ష్యం వెంటాడుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలు నత్తలకు నడక నేర్పిస్తున్నాయి.

-12లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0/25.0
నగర పరిధిలో రానున్న 24 గంటల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్టంగా 33, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.







ముబారక్ సిరాజ్!

మువ్వెన్నెల జెండాల రెపరెపలు.. మా తుఝే సలామ్ గీతాల హోరు మధ్య భారత క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌కు సొంత నగరం ఘనస్వాగతం పలికింది. టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన సిరాజ్ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. అంతకుముందు ఎయిర్‌పోర్ట్‌లో సిరాజ్‌కు అతని మిత్రులు, ఆత్మీయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మెహిదీపట్నం నుంచి ఓపెన్ టాప్ కారులో సిరాజ్ ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తూ సాగాడు. ఈ ర్యాలీ సిరాజ్ క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్న ఫస్ట్ లాన్సర్‌లోని గ్రౌండ్ వరకు సాగింది. టీ20 ప్రపంచ కప్‌లో సిరాజ్ మూడు మ్యాచ్‌లు ఆడాడు.

బోనాల జాతరకు భారీ బందోబస్తు

నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



సీపీ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ బోనాల నిర్వహణ కోసం అధికారులకు ప్రజలు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 7న ప్రారంభం కానున్న జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన గోల్కొండ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాల జాతరకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. కోట అడుగడుగునా సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందన్నారు. పోకిరీలు, చైన్ స్నాచర్ల ఆటకట్టించేందుకు పోలీసులు మఫ్టీలో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం వార్ల అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, సలహాదారు ఎస్.రాజువస్తాద్ సీపీని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు, బంజారా దర్వాజా బాబురావు, బి.శ్రీకాంత్‌చారి, అజామ్‌ఖాన్, ఎస్.శ్రీకాంత్, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న కోట బోనాలకు గవర్నర్ రాధాకృష్ణన్

గోల్కొండ: ఈ నెల 7న ప్రారంభం కానున్న గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి బోనాలకు తొలి రోజున రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రానున్నారని భాగ్యనగర్ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు అన్నారు. శుక్రవారం రాసాల బజార్‌లోని శివాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో భాగ్యనగర్ బోనాల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి రాహుల్ స్వాగత్, గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, జియాగూడ కార్పొరేటర్ బి.దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఏఈ



లంచం డబ్బులతో బల్వంత్ రెడ్డి

రాజేంద్రనగర్: బిల్లు మంజూరు కోసం కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటున్న రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ బల్వంత్ రెడ్డిని శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో బల్వంత్‌రెడ్డి నాలుగేళ్లుగా ఇంజినీరింగ్ విభాగంలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మూడు నెలల పాటు లాంగ్ లీవ్‌లోకి వెళ్లిన బల్వంత్ రెడ్డి గత నెల రోజులుగా విధులకు హాజరవుతున్నాడు. మైలార్‌దేవ్‌పల్లి ఆదర్శ్‌నగర్‌లో సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన ముజఫరుద్దీన్ ఖాద్రీ సీసీ రోడ్డు పనులు చేపట్టాడు. రూ.5 లక్షల బిల్లు మంజూరు కోసం ఏఈ బల్వంత్ రెడ్డి రూ.24 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఖాద్రీ ఏఈ బల్వంత్ రెడ్డికి రూ.15 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు పక్కా ప్రణాళికతో శుక్రవారం కార్యాలయంలోని తన చాంబర్‌లో బల్వంత్ రెడ్డి.. కాంట్రాక్టర్ ముజఫరుద్దీన్ ఖాద్రీ నుంచి రూ.15 వేలు లంచం తీసుకున్న వెంటనే ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

వీధి దీపాల నిర్వహణలో అశ్రద్ధ వద్దు

సాక్షి, సిటీబ్యూరో: వీధి దీపాల నిర్వహణలో అశ్రద్ధ తగదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఈఈఎస్ఎల్ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులతో వీధి దీపాల నిర్వహణపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిటీలో డార్క్ స్పాట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన విధంగా బల్బులు, సామగ్రి బఫర్ స్టాక్ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఏజెన్సీని ఆదేశించారు. అగ్రిమెంట్ ప్రకారం అన్ని సమకూర్చుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా అదనపు వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈఈఎస్ఎల్ ప్రతినిధులు, అడిషనల్ కమిషనర్ (ఎలక్ట్రికల్) సత్యనారాయణ, ఈఈ మమత, ఇన్‌చార్జి ఎస్ఈ సంతోష్, ఏఈ దివ్య పాల్గొన్నారు.

డేంజర్ బెల్!

గ్రేటర్‌లో మళ్లీ డెంగీ పంజా!!

బస్తీల్లో కన్పించని ఫాగింగ్
- విజృంభిస్తున్న దోమలు
- నగరంలో మూడు నెలల్లో 114..
- రంగారెడ్డి జిల్లాలో 51..
- మేడ్చల్– మల్కాజిగిరిలో 108 కేసులు నమోదు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు


సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరం.. అంతర్జాతీయ నగరం.. గ్రేటర్ హైదరాబాద్.. చిన్న దోమ పేరు చెబితే చాలు గజగజ వణికిపోతోంది. కోవిడ్ నియంత్రణలో భాగంగా మూడేళ్ల పాటు వీధుల్లో ఫాగింగ్ నిర్వహించే వారు. ప్రస్తుతం బస్తీల్లో ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు లేకపోవడంతో మళ్లీ దోమలు విజృంభిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా సిటిజన్లపై దాడి చేస్తున్నాయి. మంచినీటిలో పెరిగే ఎడిస్ ఈజిప్టే దోమ కుట్టడంతో అనేక మంది డెంగీ జ్వరాల బారినపడుతున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లాలో 114, మేడ్చల్ జిల్లాలో 108, రంగారెడ్డి జిల్లాలో 51 కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా బాధితుల సంఖ్య రెట్టింపు ఉన్నట్లు అంచనా. హైదరాబాద్ జిల్లాలో మే నెలలో 39, జూన్‌లో 56, జులైలో కేవలం నాలుగు రోజుల్లోనే 19 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం నగరంలోని ఫీవర్ ఆస్పత్రి సహా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీకి వస్తున్న బాధితుల్లో మెజారిటీ బాధితులు జ్వర పీడితులే కావడం గమనార్హం. ప్రతి పది మంది జ్వరపీడితుల్లో ఇద్దరు నుంచి ముగ్గురు డెంగీతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అవుతోంది.

పూల కుండీలే దోమలకు నిలయాలు..

సాధారణ బస్తీలతో పోలిస్తే.. సంపన్నులు ఎక్కువగా నివసించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, నార్సింగి, మణికొండ, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సహా శివారు మున్సిపాలిటీల్లోని గెటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తుల భవనాల్లో నివసిస్తున్న వారే ఎక్కువగా డెంగీ జ్వరాల బారినపడుతున్నట్లు వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. ఇంటి ఆవరణలో షో కోసం పెంచే మనీ ప్లాంట్స్, ఇతర పూల మొక్కలు డెంగీ దోమలకు నిలయంగా మారుతున్నాయి. చెట్ల పొదల మధ్య చెత్తా చెదారం పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కుండీల్లోని నీటిని తొలగించకపోవడంతో డెంగీ దోమలకు నిలయంగా మారుతున్నాయి. కొత్త నిర్మాణాల్లో క్యూరింగ్ కోసం వాడిన నీరు గదుల్లో నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారుతోంది. వాటర్ ట్యాంకులు, ఇంటిపై ఉన్న టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాల్లోనూ నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి.

'క్యాష్' చేసుకుంటున్న వైద్యులు..

డెంగీని రెండు పద్ధతుల్లో నిర్ధారిస్తున్నారు. ఎన్ఎస్1 యాంటిజెన్, ఐజీఎం ఎలిసా టెస్టు ద్వారా డెంగీని నిర్ధారిస్తుంటారు. ప్రైవేటు వైద్యులు ర్యాపిడ్ ఎన్ఎస్1 యాంటిజెన్ టెస్టును ప్రమాణికంగా తీసుకుంటుండగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు మాత్రం ఐజీఎం ఎలిసా టెస్టును ప్రామాణికంగా తీసుకుని చికిత్సలు చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యులు సాధారణ జ్వరాలను కూడా డెంగీ పాజిటివ్‌గా చూపించి, ప్లేట్ లేట్ కౌంట్, ఐసీయూ చికిత్సల పేరుతో హడావుడి చేస్తున్నారు. నిజానికి డెంగీ బారిన పడిన రోగుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలియజేయాల్సి ఉంది. కానీ కార్పొరేట్/ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా గుట్టుగా చికిత్సలు చేస్తున్నారు. రక్త కణాల సంఖ్య తగ్గిపోయిందని చెప్పి, రోగులతో పాటు వారి వెంట వచ్చిన బంధువులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోగుల భయాన్ని కొంత మంది వైద్యులు క్యాష్ చేసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ కౌంట్, ఐసీయూ చికిత్సల పేరుతో అడ్డగోలుగా బిల్లులు వసూలు చేస్తున్నారు.



అన్ని జ్వరాలూ డెంగీ జ్వరాలు కాదు..



ప్రస్తుతం సీజన్ మారింది. వాతావరణంలోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. దగ్గు, జలుబు, జ్వరంతో బాధ పడుతు ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే.. అన్ని జ్వరాలూ డెంగీ జ్వరాలు కాదు. దోమ కుట్టడం ద్వారా డెంగీ సోకుతుంది. ఇది పగటి పూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టిన 7 నుంచి 8 రోజులకు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండ రాల్లో భరించ లేని నొప్పి, శరీరంపై ఎర్రటి పొక్కులు వస్తాయి. రక్త కణాలు (ప్లేట్స్ లెట్స్) సంఖ్య పడిపోతుంది. లక్షణాలు గుర్తించిన వెంటనే చికిత్స తీసుకోవాలి. డోలో 650 వంటి సాధారణ మందులతోనూ డెంగీ నుంచి బయటపడొచ్చు.
– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, రంగారెడ్డి డీఎంహెచ్ఓ

ఏం జరిగేనో?

సాగేనా.. ఆగేనా?

GHMC

'కౌన్సిల్' సమావేశంపై ఉత్కంఠ
- మేయర్ దిగిపోవాల్సిందిగా ఒత్తిడికి బీఆర్ఎస్ వ్యూహం
- హాజరు కానున్న ఎమ్మెల్యేలు
- నేడు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం



మార్షల్స్‌కు శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: నేడు (శనివారం) జరగనున్న జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంపై రాజకీయ వర్గాలతో పాటు సిటీజనుల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన మేయర్, డిప్యూటీ మేయర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో, బీఆర్ఎస్ బలంతో ఆ పదవులు పొందిన వారిని పదవులు వదులుకోవాల్సిందిగా వారిపై ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్ఎస్ వ్యూహరచన చేసినట్లు తెలిసింది. దీంతోపాటు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు కాలేదంటూ సభ దద్దరిల్లేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులుగా అర్హత కలిగిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం సభలో పాల్గొననున్నారు. గతంలో బీఆర్ఎస్ మంత్రులు కానీ, ఎమ్మెల్యేలు కానీ సభకు వచ్చిన దాఖలాల్లేవు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సభలో అనుసరించాల్సిన వ్యూహంపై తెలంగాణ భవన్‌లో శుక్రవారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేస్తారని పిలుపునిచ్చినప్పటికీ, ఆయన నగరంలో లేనందున రాలేదని సమాచారం. సమావేశంలో పాల్గొన్న నేతలు శ్రీనివాస్‌యాదవ్, తదితరులు మాట్లాడుతూ.. గ్రేటర్‌లో అధిక సంఖ్యలో ఉన్న మనం మన సత్తా చాటాలని పిలుపునిచ్చినట్లు తెలిసింది.



- బీఆర్ఎస్ వ్యూహం గురించి తెలుసుకున్న కాంగ్రెస్ సైతం తగ్గేదేలే అన్నట్లు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ అనుసరించే వ్యూహాన్ని బట్టి కాంగ్రెస్ రెండు రకాల వ్యూహాలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.
- కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సైతం సమావేశానికి హాజరు కానున్నారు.

ప్రస్తుతం జీహెచ్ఎంసీలో ఎక్స్‌అఫీషియో సభ్యులు సహా మొత్తం సభ్యుల సంఖ్య దాదాపు 195గా ఉన్నట్లు సమాచారం. ఎక్కువమంది హాజరు కానుండటంతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్షల్స్‌కు శిక్షణ నిచ్చారు.

ప్రశ్నల వర్షం కురిసేనా?

ఈ నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం సాఫీగా సాగుతుందా? లేక ఆగుతుందా? అసలు మొదలవుతుందా అనే సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి. సభ్యులు సభలోకి ప్రవేశించాక ప్రశ్నల వర్షం కురిపిస్తారా? లేక సభలోకి వెళ్లకుండా అడ్డుకుంటారా? అనే ఊహాగానాలు సాగుతున్నాయి. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా కౌన్సిల్‌కు హాజరు కానున్నారు.

కాంగ్రెస్ నేతల సమావేశం

బంజారాహిల్స్‌లోని ఓ హోటల్లో జీహెచ్ఎంసీ కాంగ్రెస్ నేతలు కూడా సమావేశమైనట్లు తెలిసింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు శనివారం కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు సమాచారం. బీజేపీ కూడా కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నగర కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించింది. డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు

వారి మదిలో ఏముందో..?

- జీహెచ్ఎంసీ 'కౌన్సిల్' నేపథ్యంలో బీఆర్ఎస్ సమావేశం
- పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు డుమ్మా
- కొనసాగుతున్న ఊహాగానాలు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహిస్తున్నారని సమాచారం పంపినా పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో.. వారి మదిలో ఏముందో ? అనే ఊహాగానాలూ మొదలయ్యాయి. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాల్సిందిగా గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సహ కార్పొరేటర్లకు గురువారం సాయంత్రం సమాచారం వెళ్లినా ఆరుగురు ఎమ్మెల్యేలు, 17 మంది కార్పొరేటర్లు సమావేశానికి హాజరు కాలేదని తెలిసింది. ప్రస్తుతం పార్టీ కార్పొరేటర్లు 47 మంది ఉండగా, 30 మంది మాత్రం హాజరైనట్లు తెలిసింది. ఎమ్మెల్యేల్లో ఎ.గాంధీ, వివేకానంద, మాధవరం కృష్ణారావు, మల్లారెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరు కాలేదని సమాచారం. జీహెచ్ఎంసీ సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యులైనా, కాకపోయినా పార్టీ పిలుపు మేరకు హాజరు కావాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అత్యవసర పనులు, యాత్రల వల్ల హాజరు కాలేదని సమాచారం.

ముక్తకంఠంతో ప్రశ్నిద్దాం..

ప్రజా సమస్యలు, నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ సమావేశంలో ముక్తకంఠంతో ప్రశ్నించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు దాటినా ఇంత వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలేరు వెంకటేష్, మాజీమంత్రి మహమూద్ అలీ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఫోన్ గొడవ

మద్యం మత్తులో ఒకరి హత్య

చిలకలగూడ: మద్యం మత్తులో ఇరువురి మధ్య ఫోన్ కోసం ఏర్పడిన గొడవ హత్యకు దారితీసింది. ఈ ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కథనం ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన కమ్మరి రాంచందర్, గుంటూరుకు చెందిన సలీంలు సీతాఫల్‌మండి బ్రాహ్మణ బస్తీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద పని చేస్తున్నారు. గురువారం రాత్రి భవనం రెండో అంతస్తులో రాంచందర్, సలీంలు మద్యం తాగారు. ఆ సమయంలో సలీం తన భార్యతో మాట్లాడేందుకు రాంచందర్ ఫోన్ తీసుకున్నాడు. కొద్దిసేపటికి తాను ఇంటికి వెళ్లాలని, తన ఫోన్ ఇవ్వాలని రాంచందర్ పలుమార్లు అడిగాడు. అదేం పట్టించుకోకుండా మాట్లాడుతున్న సలీం వద్దకు వెళ్లి రాంచందర్ ఫోన్‌ను లాగేసుకున్నాడు. దీంతో కోపంతో రగిలిపోయిన సలీం అక్కడే ఉన్న ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతో రాంచందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం నిర్మాణ పనుల కోసం వచ్చిన కూలీలకు రెండో అంతస్తులో విగతజీవిగా పడి ఉన్న రాంచందర్ మృతదేహాన్ని చూసి భవన యజమాని సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలియడంతో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని హంతకుడి కోసం గాలిస్తున్నారు.

అడగకుండా నీళ్లు తాగాడని..

వ్యక్తితో టీ స్టాల్ యువకుడి ఘర్షణ
- ఇద్దరు స్నేహితులతో కలిసి హత్య
- మియాపూర్ పీఎస్ పరిధిలో ఘటన



విగతజీవిగా పడిఉన్న సాయిలు



సాయిలు (ఫైల్)

మియాపూర్: తమను అడగకుండా నీళ్లు తీసుకున్నాడని టీ స్టాల్‌లో పనిచేసే ముగ్గురు యువకులు ఓ వ్యక్తిని కొట్టి చంపిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బోడగట్టు గ్రామానికి చెందిన చాకలి సాయిలు (35)కు భార్య మీనా ఇద్దరు కుమారులు మహి, కిరణ్ ఉన్నారు. బీరంగూడలో ఉంటూ మియాపూర్‌లోని లారీలలో ఇసుకను ఖాళీ చేసే పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. సాయిలు ప్రతిరోజూ రాత్రి 10 గంటలకు మియాపూర్ వచ్చి లారీలలోని ఇసుకను ఖాళీ చేసి ఉదయం ఇంటికి వెళ్తుంటాడు.

ఈ క్రమంలో గురువారం రాత్రి 10 గంటలకు పనికి వచ్చి లారీలలోని ఇసుకను ఖాళీ చేశాడు. శుక్రవారం తెల్లవారు జామున దాహం వేస్తోందని మియాపూర్‌లోని రాజారామ్ కాలనీ సమీపంలో ఉన్న సురక్ష టీ స్టాల్‌లో నీళ్లు తాగేందుకు వెళ్లాడు. నీళ్లు తాగుతుండగా టీ స్టాల్‌లో పని చేస్తున్న సతీష్ అనే యువకుడు సాయిలుతో ఘర్షణకు దిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తర్వాత సాయిలు అక్కడి నుంచి సమీపంలో ఉన్న కూలీల అడ్డా వద్దకు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత టీ స్టాల్‌లో పనిచేసే సతీష్ పాల ప్యాకెట్ తీసుకువచ్చేందుకు వెళ్తుండగా మళ్లీ వీరిద్దరి మధ్య గొడవ జరిగింది.

స్నేహితులకు ఫోన్ చేసి.. రప్పించి..

సతీష్ ఆగ్రహంతో సమీపంలో ఉన్న స్నేహితులు భాను, లక్ష్మణ్ అలియాస్ లక్కీలకు ఫోన్ చేసి రప్పించాడు. ముగ్గురూ కలిసి సాయిలుపై దాడికి దిగారు. సమీపంలోని కూలీలు విడిపిస్తున్నా వినకుండా తీవ్రంగా కొట్టి సాయిలును స్కూటీపై తీసుకుని టీ స్టాల్ వద్ద పడేసి వెళ్లిపోయారు. స్థానికులు, కూలీలు చూసేసరికి సాయిలు మృతిచెంది ఉన్నాడు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువు నాగారం సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. సాయిలు హత్యకు గురయ్యారనే విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, తోటి కూలీలు మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని న్యాయం చేయాలంటూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ముగ్గురు అంతర్రాష్ట్ర మొబైల్ స్నాచర్ల రిమాండ్



మహ్మద్ ఎజాజ్ మహ్మద్ షాహిద్ జమీల్

బంజారాహిల్స్: రోడ్డు పక్కన కస్టమర్ల కోసం వేచిచూస్తున్న ఓ ర్యాపిడో డ్రైవర్‌పై ముగ్గురు యువకులు దాడి చేసి మొబైల్ ఫోన్ చోరీ చేసిన ఘటనలో అంతర్రాష్ట్ర మొబైల్ స్నాచర్ల ముఠాను బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బిహార్‌కు చెందిన మహ్మద్ ఎజాజ్, మహ్మద్ షాహిద్(24), ఢిల్లీకి చెందిన జమీల్‌లు కొంతకాలంగా హైదరాబాద్‌లో తిష్టవేసి స్నాచింగ్‌లపై దృష్టి పెట్టారు. జల్సాలు, ఈజీ మనీ కోసం అలవాటు పడ్డ ఈ ముగ్గురు అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ ఒంటరిగా ఉండే వ్యక్తులను లక్ష్యంగా పెట్టుకుని వారితో గొడవకు దిగి ఫోన్‌లు తస్కరించి ఉడాయిస్తున్నారు. గత నెల 24వ తేదీన ఓ ర్యాపిడో డ్రైవర్ బంజారాహిల్స్ రోడ్డు నెం.1లోని జీవీకే-1 మాల్ ఎదురుగా కస్టమర్ల కోసం వేచి చూస్తున్నాడు. అదే సమయంలో యాక్టివాపై వచ్చిన ముగ్గురు అగంతకులు ర్యాపిడో డ్రైవర్ వద్దకు వెళ్లి నువ్వు నా వ్యాలెట్‌ను చోరీ చేశావంటూ బెదిరించారు. నేను ఎలాంటి వ్యాలెట్‌ను దొంగిలించలేదని చెబుతుండగానే వారు వాగ్వివాదానికి దిగడంతో వెంటనే బాధితుడు 100కు డయల్ చేసేందుకు యత్నిస్తుండగా ఫోన్ లాక్కున్నారు. అడ్డుకోబోయిన ర్యాపిడో డ్రైవర్‌ను కర్రలతో కొట్టి మొబైల్ ఫోన్ తస్కరించి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి ముగ్గురు దొంగలను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు మొబైల్ స్నాచర్లను పక్కా ప్రణాళికతో శాస్త్రీయ ఆధారాలు జోడించి పట్టుకున్న బంజారాహిల్స్ డీఐ ఎస్ఎం బషీర్ అహ్మద్, ఎస్ఐ కె.వెంకటేష్‌లను బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి అభినందించారు.

అవయవాల తరలింపునకు గ్రీన్ చానల్

బంజారాహిల్స్: రోగికి అవయవాల తరలింపు కోసం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఉదయం గ్రీన్‌చానల్ ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి నుంచి హైటెక్ సిటీ యశోద హాస్పిటల్‌కు ఓ రోగికి అమర్చేందుకు జీవన్‌దాన్ ఆధ్వర్యంలో లంగ్స్ తరలింపు ప్రక్రియ ఉదయం 10.45 గంటలకు బంజారాహిల్స్ నుంచి కొనసాగింది. ఇందుకోసం బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ గ్రీన్‌చానల్ ఏర్పాటుచేసి అవయవాలను తీసుకెళ్తున్న అంబులెన్స్‌కు దారి సుగమం చేశారు. మూడు నిమిషాల్లోనే ఈ అంబులెన్స్ బంజారాహిల్స్ నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లగలిగింది. 45 సంవత్సరాల బల్లా సరస్వతి అనే రోగికి లంగ్స్ అమర్చే క్రమంలో ఈ గ్రీన్‌చానల్ ఏర్పాటుచేశారు.



గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసిన బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

కిడ్నాపర్లను పట్టుకున్న రైల్వే పోలీసులు

నాంపల్లి: వరంగల్‌లో నమోదైన ఓ కిడ్నాప్ కేసును ఇక్కడి ఆర్పీఎఫ్ పోలీసులు ఛేదించారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులో మైనర్ బాలికను తీసుకెళ్తున్న యువకుడిని పట్టుకుని వరంగల్ పోలీసులకు అప్పగించారు. బేగంపేట ఎస్ఐ ఎస్.నసీమా తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం తెల్లవారు జామున సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఓ యువకుడు, బాలిక అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దెబ్రోస్మిత ఛటోపాధ్యాయ ఆదేశాల మేరకు వీరిని అఖిల మహిళా శక్తి టీమ్ సభ్యులు భువనగిరి వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసుకుని తీసుకెళ్తున్నట్లు వెల్లడైంది. దీనిపై జులై 1న వరంగల్‌లో కిడ్నాప్ కేసు నమోదైనట్లు గుర్తించారు. ఈమేరకు పట్టుబడిన ఇద్దరిని తదుపరి చర్యల కోసం వరంగల్ పోలీసులకు అప్పగించారు.

'ఉన్నతి శిక్షణ'కు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల మహిళలు ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీలత తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాలలోపు మహిళలకు ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మగ్గం వర్క్‌లో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మహిళలు ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని దినాలు పూర్తి చేసి ఉండాలని, 10వ తరగతి వరకు చదివి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ.300 చొప్పున స్టైఫండ్, ఉచిత భోజనం, యూనిఫాం ఇస్తారని చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత ధ్రువపత్రం జారీ చేస్తారని పేర్కొన్నారు.

దర్యాప్తు అధికారులే స్టేటస్ చెప్పాలి!

కొత్త చట్టంతో ఫిర్యాదుదారులకు భారీ ఊరట

- జీఎన్ఎస్ఎస్‌లో కీలకంగా 193 (3) (2) సెక్షన్
- దర్యాప్తు పురోగతిని బాధితులకు తెల్పాల్సిందే
- 90 రోజుల్లోగా తెలియజేయడం ఇక తప్పనిసరి
- 2018లో రాష్ట్రంలో పాక్షికంగా అమలైన విధానం



సాక్షి, సిటీబ్యూరో:

అది ఓ ఠాణాలో రెండేళ్ల క్రితం నమోదైన చీటింగ్ కేసు...నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దర్యాప్తు అధికారులు తీసుకున్న చర్యల విషయం తెలియని బాధితుడు తన కేసును వాళ్లు నిర్లక్ష్యం చేస్తున్నారని భావించాడు. దీంతో పోలీసులపై చులకన భావం ఏర్పరుచుకున్నాడు. పోలీసులపై ఒత్తిడి రావడంతో వారు అసలు విషయం బాధితుడికి వివరించారు.

- ఇది మరో ఠాణాలో రిజిస్టరైన చోరీ కేసు...బాధితుడు పోగొట్టుకున్నది ద్విచక్ర వాహనం. బైకు దొరకడం కష్టమనే భావనతో అధికారులు దర్యాప్తు చేయలేదు. దాదాపు ఆరు నెలలుగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇది బయటకు తెలిస్తే ఇబ్బందులు వస్తాయనే భావనతో పోలీసులు మిన్నకుండిపోయారు. సుదీర్ఘ కాలం తర్వాత అసలు విషయం తెలిసిన అతడు చేసేది లేక నిస్సహాయుడిగా మిగిలాడు.
- బాధితులు ఏదైనా నేరానికి సంబంధించి పోలీసులు కేసు పెట్టడంటక ఎత్తైతే... దర్యాప్తు పురోగతిని తెలుసుకోవడం మరో ఎత్తుగా మారింది. అనేక కేసులకు సంబంధించి బాధితులు తమ కేసుల్ని దర్యాప్తు చేస్తున్న దర్యాప్తు అధికారులను (ఐఓ) కలుసుకోవడానికే అనేక ఇబ్బందులు పడుతుంటారు. అతి కష్టమ్మీద కలుసుకున్నా సరైన స్పందన లేని కారణంగా నిరాశ, అసంతృప్తి, అసహనాలకు లోనవుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహితలో (బీఎన్ఎస్ఎస్) కీలకాంశంగా చేర్చారు. ఇందులోని సెక్షన్ 193 (3) (2) ప్రకారం ప్రతి దర్యాప్తు అధికారి తాము దర్యాప్తు చేస్తున్న కేసుల పురోగతిని 90 రోజుల్లోగా ఫిర్యాదుదారుడికి తెలియజేయాలి.

ఆన్‌లైన్‌లో ఉన్నవి కొన్ని అవకాశాలే..

ఈ సమస్యల్ని దృష్టిలో పెట్టుకున్న తెలంగాణ పోలీసు విభాగం ఈ-కాప్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్ విధానాలను ప్రవేశపెట్టింది. తొలినాళ్లల్లో సంక్షిప్త సందేశం (ఎస్సెమ్మెస్) ద్వారా ఆపై పోలీసు వెబ్‌సైట్లలో 'నో యువర్ కేస్ స్టేటస్' అవకాశం కల్పించింది. వీటి ద్వారా ఎవరైనా తమ కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకోవాలని ప్రయత్నిస్తే 'అండర్ ఇన్వెస్టిగేషన్' (యూఐ), 'అండర్ ట్రయల్' (యూటీ), క్లోజ్డ్... ఇలా కేసు దర్యాప్తు దశలో ఉందనో, చార్జ్‌షీట్ దాఖలై కోర్టు విచారణలో ఉందనో, కేసును మూసేశామనో మాత్రమే తెలుస్తుంది. బాధితులు/ఫిర్యాదుదారులు తమ కేసు అప్పటికీ దర్యాప్తు దశలోనే ఉండిపోవడానికో, కేసును మూసేయడానికో కారణం తెలుసుకోవాలంటే అది ఆన్‌లైన్ ద్వారా సాధ్యంకాదు.

ఐఓలకే ఆ బాధ్యతలు అప్పగింత...

ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం కేసు దర్యాప్తు దశ, తీరుతెన్నుల్ని బాధితులు/ఫిర్యాదుదారులకు వివరించాల్సిన బాధ్యతల్ని దర్యాప్తు అధికారులకే అప్పగించాలని నిర్ణయించుకుంది. దీనికోసం సీఆర్పీసీకి బదులుగా అమలులోకి వచ్చిన బీఎన్ఎస్ఎస్‌లో ప్రత్యేకంగా ఓ సెక్షన్‌ను చేర్చింది. ప్రతి ఐఓ(ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్)తన దగ్గర ఉన్న కేసుల జాబితాతో పాటు ఫిర్యాదుదారుల ఫోన్ నెంబర్లు సైతం కలిగి ఉంటారు. దీని ద్వారా లేదా ఆన్‌లైన్, వాట్సాప్ విధానాల్లో కేసు నమోదైన నాటి నుంచి గరిష్ఠంగా 90 రోజుల్లోగా ఒకసారైనా దర్యాప్తు పురోగతిని వివరించాల్సి ఉంటుంది. వారి కేసు ప్రస్తుతం ఏ దశలో ఉంది? దర్యాప్తులో జాప్యానికి కారణమేంటి? ఇతర ఇబ్బందులు, సమస్యలు ఏంటి? అనే అంశాలను సవివరంగా చెప్పాలని బీఎన్ఎస్ఎస్‌లో సూచించింది. ఇలా ప్రతి ఐఓ తాను ఎవరెవరితో మాట్లాడాననే విషయంతో పాటు వారి కాంటాక్టు నెంబర్‌ను ఉన్నతాధికారులకు అందించాల్సి ఉంటుంది. ఈ విధానం 2018లో ఎం.మహేందర్‌రెడ్డి డీజీపీగా ఉండగా కొన్నాళ్లు అమలు చేశారు. ఆపై అటకెక్కింది. అప్పట్లో దీనిపై పర్యవేక్షణ బాధ్యతల్ని యూనిట్ ఆఫీసర్లుగా వ్యవహరించే జిల్లా ఎస్పీలు, కమిషనరేట్ల పోలీసు కమిషనర్లకు అప్పగించారు.

కలవరు...కలిసినా చెప్పరు...

అత్యధిక శాతం కేసుల్లో సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) స్థాయి అధికారులే దర్యాప్తు అధికారులుగా (ఐఓ) వ్యవహరిస్తుంటారు. హత్య, భారీ చోరీ, దోపిడీ, బందిపోటు దొంగతనం తదితర కేసుల్లో ఇన్‌స్పెక్టర్, వరకట్న వేధింపులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన వాటిలో ఏసీపీ స్థాయి అధికారులు దర్యాప్తు అధికారులుగా ఉంటారు. పోలీసుస్టేషన్లలో ఉండే ఎస్సైలు, ఇతర ఐఓలకు దర్యాప్తు బాధ్యతలతో పాటు పరిపాలన, బందోబస్తు, భద్రత విధులు, ఇతర డ్యూటీలు తప్పవు. దీంతో చాలా సందర్భాల్లో పోలీసు స్టేషన్‌లో కూర్చుని ఉండటం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే బాధితులు తమ కాళ్లు అరిగేలా పోలీసుస్టేషన్ల చుట్టూ తిరిగినా ఆయా దర్యాప్తు అధికారుల్ని కలుసుకోవడం అరుదు. అతికష్టమ్మీద కలిసినా వారి స్పందన అనేక సందర్భాల్లో అభ్యంతరకరంగా ఉంటోంది. ఇవన్నీ పోలీసు విభాగంపై ప్రజల చులకన భావానికి కారణమయ్యే ఆస్కారం ఉంది.

త్వరలో నూతన పారిశ్రామిక విధానం

ఐ.టి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



అవార్డులు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి..

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమలకు సంబంధించిన అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని, తమది పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వమని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ, ఇన్నోవేషన్, ఇండ్యూజువల్ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి 'వార్షిక ఎక్సలెన్స్ అవార్డు-2023' లను శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందించారు. కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన రూ.3700 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఇంకా పంపిణీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని పరిశీలిస్తుందని అన్నారు. మూడు నాలుగు వారాల్లో నూతనంగా పటిష్టమైన పారిశ్రామిక విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా భవిష్యత్తులో మొట్టమొదటి ఎంఎస్ఎంఈ పాలసీని ఆవిష్కరించనుందని అన్నారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, ప్రపంచానికి రాష్ట్రాన్ని స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఎఫ్‌టీసీసీఐ కృషిని ఎంపీ డాక్టర్ మల్లు రవి అభినందించారు. అంతేకాకుండా ఎంపీగా అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. పారిశ్రామిక అభివృద్ధి లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ భవన నిర్మాణానికి రెండు ఎకరాల భూమి కేటాయించాలని సంస్థ అధ్యక్షుడు మీలా జయదేవ్ కోరారు.

ఉద్యోగం ఆశ చూపి లైంగిక దాడికి యత్నం?

- బయటకు పొక్కనివ్వని పోలీసులు
- నిందితునికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపిన వైనం
- మీడియాతో గోడు వెల్లబోసుకున్న బాధితురాలు

మణికొండ: ఉద్యోగం ఇస్తానని ఇంటర్వ్యూకు పిలిచి ఓ మహిళపై లైంగిక దాడికి యత్నం చేసిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాధితురాలు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం..వ్యాల్యూ ల్యాబ్ పేరుతో ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం ఉందని ఆన్‌లైన్‌లో ప్రకటన కనిపించటంతో దరఖాస్తు చేశానన్నారు. దీంతో తోట ప్రదీప్‌కుమార్ అనే వ్యక్తి తాను సంస్థ డైరెక్టర్‌నని చెప్పి..తన ఇంటి వద్దే ఇంటర్వ్యూ ఉంటుందని, అక్కడికే రావాలని ఫోన్‌లో తెలిపాడని బాధితురాలు పేర్కొంది. ఆయన సూచన మేరకు ఇంటికి వెళ్లగా..అతను అసభ్యంగా ప్రవర్తించి తన కోరిక తీర్చాలని, అలా అయితేనే ఉద్యోగం ఇస్తానని బలవంతం చేశాడని పేర్కొన్నారు. ఈ సంఘటనపై జూన్ 21వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆమె పేర్కొన్నారు. తన ఫిర్యాదు ఆధారంగా అతనిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా స్టేషన్‌కు పిలిపించి పోలీసులు వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని ఆమె ఆరోపించింది. ఈ సంఘటన వివరాలు బయటకు పొక్కకుండా నార్సింగి పోలీసులు పూర్తి స్థాయిలో ప్రయత్నం చేశారు. శుక్రవారం తన కేసు ఫిర్యాదు, చర్యల విషయం తెలుసుకునేందుకు రావటం, అక్కడే ఉన్న మీడియాతో ఆమె తన గోడు వెల్లబోసుకోవటంతో విషయం బయటకు పొక్కింది. ఇదే విషయమై నార్సింగి సీఐని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కులాంతర వివాహ జంటలకు చెక్కుల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు కష్టసుఖాల్లో ఒకరినొకరు అండగా నిలబడి ఆదర్శంగా నిలవాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ వెంకటాచారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కులాంతర వివాహాల జంటలకు ప్రోత్సాహకాల కింద ఫిక్సడ్ డిపాజిట్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యలను సమిష్టిగా ఎదుర్కొని ధైర్యంగా జీవించాలని, సమాజంలో ఒక మార్పు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కులాంతర వివాహాలు చేసుకున్న 33 జంటలకు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల రూపాయల చొప్పున మొత్తం 82 లక్షల 50 వేల రూపాయల ఫిక్సడ్ డిపాజిట్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పెరిక యాదయ్య, చార్మినార్ ఏఎస్‌డబ్ల్యూఓ గట్టుమల్లు, శ్రీనివాస్ బాబు, అరవింద్ మూర్తి, శ్రీశైలం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

ఇద్దరి పరిస్థితి విషమం



గచ్చిబౌలి: గ్యాస్ లీకై మంటలు అంటుకోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం..ఖాజాగూడలో విద్యుత్ శాఖ ఉద్యోగి సీహెచ్ సత్యనారాయణ కుటుంబం నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో గ్యాస్ లీకైనట్లు వాసన రావడంతో సత్యనారాయణ చెక్ చేసేందుకు కిచెన్‌లోకి వెళ్లాడు. రెగ్యులేటర్‌ను పరిశీలిస్తుండగా దేవుడి గదిలో వెలుగుతున్న దీపం కారణంగా ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. తండ్రిని కాపాడేందుకు పెద్ద కొడుకు నర్సింగ్‌రావు లోపలికి వెళ్లగా అతనికి మంటలు అంటుకోవడంతో మొదటి అంతస్తులోని బాల్కనీ నుంచి కిందకి దూకాడు. తీవ్ర గాయాలపాలైన సత్యనారాయణ, నర్సింగ్ రావులను అపోలో డీఆర్‌డీఓ హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. సత్యనారాయణకు 80 శాతం, నర్సింగ్‌రావుకు 60 శాతం శరీరం కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పెంపును విస్మరించడం తగదు

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెన్షన్లు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్ల జంగయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు, మహిళలకు రూ.4 వేల పెన్షన్ అందజేయాలని అన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని చెప్పి మాట మరిచారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించినట్లు దివ్యాంగులకు సైతం అనుమతించాలన్నారు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్ (పీహెచ్‌డీ) వయసు, నెట్ నుంచి దివ్యాంగులందరికీ మినహాయింపు ఇవ్వాలని కోరారు. శారీరక దివ్యాంగులకు రోస్టర్ 56ని 10లోపు మార్చాలని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు, శ్రీనివాస్‌నాయక్, రాజు, జంగయ్య, బాలరాజ్, గువ్వల యాదయ్య, ఎంఆర్‌పీఎస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు జుట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

- 12,999/-కే గజం HMDA అప్రూవ్డ్ కొంగరకలాన్ Foxconn, TCS, టౌన్‌షిప్స్ & IT Hubs, ఎరోస్పేస్, 100ft రోడ్ ఫేసింగ్ న్యూవెంచర్‌లో ప్లాట్లు అమ్మబడును. బ్యాంక్ లోన్స్ Avl. ఫోన్: 8309376230 [H-796092]

FLAT FOR SALE

- కూకట్‌పల్లి, కొల్లూర్ 2 BHK & 3 BHK (1585 sft, 1755 sft, 3545 sft) ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. East, West, North Facings. సంప్ర: 7330928822 [HA-15723]
- Dathunagar, ASR Residency. Very Near to Balapur 'X' Road. Resale 2 BHK Furnished Flat 1150 sft 3 Floor. Car Parking. Bank Loan Avl. Urgent Sale. Ph: 7013967079 [H-778889]
- 940 sft 32 Sqd USD Flat No. 504, 2 Bedroom, Raga Manor Apartments B/Side Rishi UBR Eng-College Nizampet Road, Kukatpally. Ph: 7099004365 [HA-189682]
- Brand New Flats For Resale. Gated Communities. Near Habsiguda, ECIL, Cherlapally, Yapral. Many Options for every budget. Call Now. Call: 08069045555 [HA-334]

HOUSE FOR SALE

- Alwal 244 Sq.yds @ 68 Lakh Only, E/F, 2BHK INDP Old House with Car Parking, 30'ft Roads, Well Developed Colony. Ph: 7331183679 / 7893597609 [HA-97839]

LAND FOR SALE

- Rs. 7300 గజం ఈస్ట్ ఫేసింగ్ 240 + 240 మొత్తం 480 గజాల రెండు ప్లాట్లు అమ్మబడును @ మహేశ్వరం. A.I City - Medical College - Electronic City దగ్గర DTCP ఫైనల్ అప్రూవల్. ఫోన్: 9966521191 [H-800427]

PLOT FOR SALE

- VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 18,500/- సంప్ర: ✆ 63028 55524 [B-33]
- సాగర్ హైవే (యాచారం) దగ్గరలో DTCP & RERA అప్రూవ్డ్ శివనంది వెంచర్‌లో ఓపెన్ ప్లాట్స్, ఫార్మా సిటీ భూములను, IT సంస్థలు మరియు పరిశ్రమలకు ప్రభుత్వం బదిలీ చేయనుంది. సాగర్ రోడ్ to అమరావతి Fastage రోడ్ ప్రపోజల్. డైరెక్ట్ కస్టమర్స్ ఓన్లీ. ఫోన్: 9050988936, 8886082214 [HA-13697]
- షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఅవుట్‌లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ విజిట్ కొరకు సంప్ర: 9949695027 [HA-342]
- శ్రీశైలం హైవే RRR దగ్గరలో DTCP+ ఫామ్ ల్యాండ్ ప్లాట్లు కలవు ఇప్పుడు గజం 7000 రూపాయలు గల ప్లాట్లు కేవలం 5000+3500 రూపాయలకు మాత్రమే గజం ఇవ్వబడును. ఫోన్: 9177619716 [HA-13699]
- తక్కువ ధరలో జడ్చర్ల Town కి ఆనుకొని 50 ఎకరాల ఫాంల్యాండ్ గుంట 4.50 లక్షలు, అవకాడ మొక్కలతో సం॥కి 50 వేల ఆదాయం ఇవ్వబడును. ఫోన్: 7396428222 [HA-5001]
- A.P. రాజధాని అమరావతికి 25 కి.మీ. NTR జిల్లాలో 33, 40 అ॥ రోడ్డు, పూర్తి డెవలప్‌మెంట్స్‌తో చ.గ. 4250/- మాత్రమే & ప్రకాశం జిల్లా, అద్దంకి దగ్గరలో ఫామ్ ల్యాండ్స్ 22 సెంట్లు 96 శ్రీగంధం మొక్కలతో 7.50 లక్షలకే అమ్మకం. ✆ 99496 62068 [B-1248941]
- 5,999/-కే గజం DTCP ప్లాట్లు VIJ హైవే Nr టోల్ ప్లాజా. RRR & 2,499/-కే గజం GP LRS Paid ప్లాట్. డబుల్ గ్యారెంటీ. ఫోన్: 7842408719 [HA-9991]
- కేవలం గజం 25,000 లకే అమీనాపూర్, బాచుపల్లి దగ్గర ప్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్ర : 7989493073 [H-800426]
- Shadnagar Burgula (Vi.) NH-44, Bangalore H/W DTCP/RERA Apprd Villa Open Per Sq.Yd: 10499/- With All Modern Develpd. Bank Loans. Ph:9100074143 [H-796314]
- Manikonda Panchavati Colony 400 Sq.Yds, N/F, 30' Road, per Sq.Yard Rs.1,55,000/- for Sale. Ph: 9246546336 (10am to 9pm) [HA-4327]

Services

FOR SALE

- హాస్టల్ అమ్మకం: మంగల్‌పల్లిలో రన్నింగ్‌లో ఉన్న గర్ల్స్ (Girls) హాస్టల్ అమ్మబడును, CVR, Sri Indu, Bharath ఇంజనీరింగ్ కాలేజీల దగ్గరలో కలదు. ఫోన్:9391854615 [H-189683]
- ONE LEADING Low Current Systems Business, CCTV, Biometric, Fire Alarm, Access Control, Computer & Laptops Sales & Service. Running Business Ready To Sales at V V Nagar, Dilsuknagar, With 4 Technicians & Rented Office. Valuation 28 lakhs. Ph: 9000231720 [H-778884]

BEAUTY CARE

- Women Care: Obesity, Depression, Physically & Fitness, Body Pains, other Health Problems. Ayur & Herbal, Trmt. Avail. Counciling at your home for appt. Cont: Dr Ram 9346931006 [HA-14370]

BUSINESS SERVICE

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800419]

BUSINESS OFFER

- ఫ్రూట్ జ్యూస్ రన్నింగ్ బిజినెస్ పెట్టుబడి కొరకు మంచి నిజాయితీ గల ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్‌నర్ కావలెను. సంప్ర: 9603232008 [H-778828]

HEALTH CARE

- మెడికల్ మసాజ్ ద్వారా శరీరంలోని వాపును తగ్గించడం (కాళ్ళు, చేతులు), వక్షోజాలు (Breast) సైజ్ పెంచడం, తగ్గించడం, బిగుతుగా చేయడం, (Compression Stockings మరియు Breast Implants) లభించును వివరాలకు. సంప్ర: 8096721180 [H-796121]

PERSONAL CARE

CHANGE OF NAME

- I, Sneha Latha S V Balusu D/o Subash Chandra Bose Hanumara R/o Plot No: 81, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500073, TS., changed my name from Balusu Sneha / Sneha Latha V Balusu to "Sneha Latha S V Balusu" vide Affidavit dated 5th July 2024. For All records [H-778885]
- I, K. Siva Surya Narendra (K.S. Narendra) S/o K. Veerayya Shastry (K.V. Sastry) have changed my name as Kadiyala Sivasurya Narendra S/o Kadiyala Veeraiah Sastry [HA-15742]
- I, BOYA SAMPATH NARAYAN H.No. 12-11-1255 Boudha Nagar, Warasiguda, Hyderabad, changed my new name as BOYA YOGESH NAIDU S/o BOYA NAGARAJU [H-778886]
- I, BOYA ESHWAR No. 12-11-1255 Boudha Nagar, Warasiguda, Hyderabad, changed my new name as BOYA CHAKRADHAR NAIDU S/o BOYA NAGARAJU [HA-778887]
- I, Nallapa Reddy Rajasekhara Reddy S/o Nallapa Reddy Reddeppa Reddy R/o 138, Brindavan Colony, Behind GK Colony, Sainikpuri, Hyderabad, TS - 500094. Vide Passport No: X8782151. have changed my name from Nalla Reddy Rajasekhara Reddy to NALLAPA REDDY RAJASEKHARA REDDY for All Records [H-778888]

LOST

- I, T. Padmavathi W/o T. Venkataprasad Babu. Lost my Original Sale Deed Property Vide Doc No. 2857/12, 2652/12. SRO Sangareddy. If Find Call: 7097222903 [H-796252]
- I, Nallalla Kishan Reddy S/o N. Narasimha Reddy, R/o Allwyn Colony, Kukatpally. My Document No. 6325 / 1987 of SRO Ranga Reddy, Kukatpally, Lost on 25.06.2024 While Travelling From Home to Jagadgirigutta Bus Stand. If found Pls. Call: 9676553334 [HA-32517]

OLD AGE HOME

- వృద్ధులు, Rtd ఎంప్లాయీస్ విలాసవంతమైన గదులు, లిఫ్ట్, 24/7 మెడికల్ సర్వీస్. మేడిపల్లి, ఉప్పల్ మరియు ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్ 7981467036, 9391039990, 8074327715 [H-778817]

Wanted

- కర్టెన్స్ షాపులో కర్టెన్స్ ఫోల్డింగ్ చేయుటకు స్త్రీలు కావలెను. Age: 18-30 సం॥లోపు జీతం: 9 వేలు టైమింగ్ 10am - 8pm సన్‌డే సెలవు. పాన్ బజార్, సికింద్రాబాద్. ఫోన్: 040-66142179 [H-796251]
- రియల్‌ఎస్టేట్ రంగంలో పనిచేయుటకు ఆసక్తి ఉన్న లేడీ టీమ్ లీడర్స్ కావలెను. రిటైర్డ్ M/F Part Time. ఫోన్: 8919833729 [HA-3740]
- హైదరాబాద్ నందు మైసమ్మగూడలో (కొంపల్లికి దగ్గరలో) గల 200 మంది స్టూడెంట్స్ గల గర్ల్స్ హాస్టల్లో సూపర్‌వైజర్‌గా పనిచేయుటకు చదువుకొని ఆకర్షణీయంగా ఉండి కమాండింగ్ వాయిస్ గల మహిళ కావలెను. జీతం: 18,000/-, రూము మరియు మూడు పూటల ఉచిత భోజన సౌకర్యం కలదు. ఆసక్తి గల వారు సం.ప్ర: యుగంధర్: 9949966477. [L-796480]
- గచ్చిబౌలిలో ఉన్న హాస్టల్ కొరకు వంట చేయుటకు వంట మాస్టర్, క్లీనింగ్ స్టాఫ్ వెంటనే కావలెను. మంచి జీతం. ఫోన్: 7386385558 [H-796176]
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [H-799899]
- Require Female Telecallers & Receptionist, Good Looking, Fluency in English, Telugu & Hindi @ Gayathri "99" Developers, Madhapur. Ph:8886666913 [HA-3739]
- Wanted Full Time Consultants Gynecologist, Pediatrician, Pediatric Surgeon, DMO's Staff : Nursing, Lab Tech, X-ray Tech, Pharmacist, Accountant, Marketing, PRO for Dhruva Woman & child Super Speciality hospitas. Isnapur ✆ 91431 85185 [B-3779]

FACULTY TEACHERS

- Anjani School, Narapally Requires Higher Social, PET & Primary Incharge. Contact: 9347521899, 8019601899 [H-796602]
- Wanted Full / Part Time English Teacher (Higher 8th-10th) Alpha Model High School, Karmanghat. Ph: 9292920070, 9052221375 [H-801644]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 43, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 52, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 35, క్యారెట్ 35, దొండ 18, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 22, దోసకాయ 25, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి రూ. 5–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆధార్ కార్డు.. రేషన్ కార్డు... కాదేదీ చోరీకి అనర్హం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో దొంగలు పడి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్, హ్యాండీ క్యాప్డ్ సర్టిఫికెట్‌తో పాటు నగదు, నగలు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఫస్ట్‌లాన్సర్ అహ్మద్‌నగర్‌లో నివసించే అబ్దుల్ జలాల్ ఇంట్లోకి ఈ నెల 1న తెల్లవారుజామున అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి దొంగలు ప్రవేశించారు. జలాల్‌తో పాటు ఆయన భార్య రేష్మాబేగం, కొడుకు అబ్దుల్ హసీంల మూడు సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, రూ. 8 వేల నగదు, బ్యాంక్ పాస్ బుక్, ముగ్గురి ఆధార్ కార్డులు, హ్యాండీ క్యాప్డ్ సర్టిఫికెట్, పదో తరగతి సర్టిఫికెట్‌లను చోరీ చేశారు. తమ ఇంటి సమీపంలో నివసించే సల్మాన్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తంచేస్తూ బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా సల్మాన్ తమ ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

నేడు ఆకర్షణ 12వ లైబ్రరీ ప్రారంభం

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆకర్షణ సతీష్ లైబ్రరీ ఏర్పాటు పరంపరలో భాగంగా 12వ లైబ్రరీని సిద్ధం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం గ్రామంలోని ఎయిడ్స్, అనాథ గృహంలో ఈ లైబ్రరీని ఏర్పాటు చేశారు. 400 పైచిలుకు పుస్తకాలతో ఏర్పాటైన ఈ లైబ్రరీని శనివారం ప్రారంభించనున్నారు. లైబ్రరీ ఏర్పాటులో భాగంగా తెలుగు పుస్తకాలను ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అందజేశారు.





దోమలపై యుద్ధానికి సన్నద్ధం!

149 దోమల నివారణ టీమ్‌లు
రోజూ ఇంటింటికీ వెళ్లి అవగాహన

ప్రతి శుక్రవారం డ్రై డే.. ఫ్రైడే
పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన తరగతులు

సీజనల్ వ్యాధులపై
అప్రమత్తమైన యంత్రాంగం

డెంగీ వ్యాధి సోకే ప్రమాదం
ఉందంటున్న సిబ్బంది

బంజారాహిల్స్: వర్షాకాలంలో తరచూ వచ్చే సీజనల్ వ్యాధులపై జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇందులో భాగంగా వర్షాకాలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే డెంగీ వ్యాధిపై ఒకవైపు అవగాహన కలిగిస్తూ మరోవైపు ముందు జాగ్రత్తలు తీసుకునేవిధంగా చర్యలకు ఉపక్రమించారు. లార్వా దశలోనే దోమలను నివారిస్తే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని, అందుకోసం తమ ఇళ్లల్లో దోమలు వృద్ధి చెందే ప్రాంతాలపై దృష్టి పెట్టాలని హెచ్చరిస్తున్నారు.

- జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఎంటమాలజీ సిబ్బంది రోజూ ఇంటింటికీ వెళ్లి దోమల నివారణపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా అవగాహన కలిగిస్తూ ఎక్కడెక్కడ దోమలు వృద్ధి చెందుతాయో వాటి గురించి తెలియజేస్తున్నారు.
- వాడి పారేసిన టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, ట్రేలు, కూలర్లు, నల్లా గుంతలు, ప్లాస్టిక్ కప్పులు, ఇంటి నిర్మాణ సమయంలో చేసే క్యూరింగ్, లిఫ్ట్ గుంతలు.. ఇవన్నీ నీరు నిల్వ ఉండే ప్రాంతాలని, దోమల ఉత్పత్తికి ఇవే ఆవాసం అవుతాయని తెలియజేస్తున్నారు. దోమ గుడ్డు నుంచి మొదట లార్వా విడుదలై అదివారం గా రోజుల్లో దోమగామారి కుట్టడం వల్ల డెంగీ వైరల్ జ్వరం వస్తుందని, ఈ దోమ పగటి పూట ఎక్కువగా కుడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.
- డెంగీ వల్ల జ్వరం, చర్మంపై దద్దుర్లు, తలనొప్పి, కళ్లల్లో మంటలు, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయని పేర్కొన్నారు.


దోమల నివారణపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

నివారణ మన చేతుల్లోనే...

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. దోమలు నివారించడం మన చేతుల్లోనే ఉంది. ఇంట్లో దోమలు వృద్ధి చెందే ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించాలి. దోమలను అరికట్టేందుకు, నిర్మూలించేందుకు మా ఎంటమాలజీ టీమ్‌లు ఇంటింటికీ వస్తుంటాయి. వారికి ప్రజలు సహకరించాలి. తమ ఇళ్లల్లో దోమల నివారణ ప్రాంతాలు ఉంటే ఎంటమాలజీ సిబ్బందికి తెలియజేయాలి. మేము ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పాఠశాలల్లో విద్యార్థులకు డెంగీ కారక ఏడిస్ దోమ ఉత్పత్తి, దోమ నివారణ, దోమ ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. పూల కుండీల్లోని నిల్వ నీటిని పారబోయాలి. నీటి పాత్రలపై మూతలు పెట్టాలి. ఐదారు రోజులకు మించి నీరు నిల్వ లేకుండా చేయాలి.
– అనురాగ్ జయంతి, జోనల్ కమిషనర్, ఖైరతాబాద్ జోన్



149 టీమ్‌లు...

దోమలను లార్వా దశలోనే నిర్మూలించేందుకు ఖైరతాబాద్ జోన్ పరిధిలో 149 యాంటీ లార్వా టీమ్‌లు ఏర్పాటుచేశారు. ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో 27 టీమ్‌లు, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 19 టీమ్‌లు ఏర్పాటయ్యాయి.

- వీరు రోజూ ఉదయం ఇంటింటికీ వెళ్లి నీటి తొట్టెలు, టైర్లు, వాడి పారేసిన కూలర్లు డీవాటరింగ్ చేస్తున్నారు. అలాగే దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను వారు తెలియజేస్తూ ఎలా అరికట్టాలో చైతన్యం కలిగిస్తున్నారు.

65 ఫాగింగ్ మిషన్లు...

ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట తదితర డివిజన్లతో పాటు వివిధ సర్కిళ్లలో కలిపి మొత్తం 54 చిన్న ఫాగింగ్ మిషన్లు, 11 పెద్ద ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. ప్రతి వార్డుకు రెండు చొప్పున పనిచేస్తున్నాయి. చెరువులు, కుంటలు, మురుగు కాలువల్లో ప్రతిరోజూ దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్నారు. గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. గుర్రపు డెక్క తొలగించే ప్రాంతాల్లో మనుషులు వెళ్లలేని ఏరియాకు డ్రోన్ల ద్వారా వాటిని తొలగిస్తున్నారు.

మహిళలు ముఖ్య పాత్ర పోషించాలి

పిల్లల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండాలన్నా, వాటిని పూర్తిగా నిర్మూలించాలన్నా అది ఆ ఇంటి మహిళ చేతిలోనే ఉంటుంది. ఇళ్లల్లో రోజుల తరబడి ఒకేచోట నీరు నిల్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత మహిళలదే. అంతేకాకుండా తమ ఇంటికి వచ్చే ఎంటమాలజిస్ట్ సిబ్బంది దోమల నివారణ కోసం చెప్పే విషయాలు జాగ్రత్తగా విని అమలులో పెట్టాలి. అవగాహన పెంచుకోవాలి. దోమలను నివారించుకోవాలి. డెంగీ వైరస్ సోకిన తర్వాత బాధపడే కంటే ముందస్తు జాగ్రత్తలతో వాటి ఉనికి లేకుండా చేయడం వల్ల ఇంట్లో ఎవరూ జ్వరాల బారిన పడరు. పగలు కుట్టే ఏడిస్ దోమకాటుతోనే డెంగీ వైరస్ సోకుతుంది. ఈ విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రతగా ఉండాలి. మేము రోజూ ఎంటమాలజిస్ట్ సిబ్బందితో దోమల నివారణకు పిచికారి చేయడంతో పాటు దోమలను అంతమొందించేందుకు ఫాగింగ్ కూడా చేస్తున్నాం. ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా దోమల నివారణకు తగిన సహకారం అందించాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకుతుంటాయి.
– రజని, సీనియర్ ఎంటమాలజిస్ట్, ఖైరతాబాద్ జోన్

తెలంగాణ భవన్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్: తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి జూబ్లీహిల్స్ నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పాల్గొన్నారు. జీహెచ్‌ఎంసీ కౌన్సెలింగ్ సమావేశంలో అభివృద్ధి పనుల కొనసాగింపుపై ఏవిధంగా ఏ వ్యవహరించాలనే అంశంపై దిశానిర్దేశం చేయడం జరిగిందని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు.

కబ్జా చెర నుంచి పార్కుకు విముక్తి!


కబ్జా చేసిన పార్కు స్థలాన్ని కాపాడిన అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని సీఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సుమారు 300 గజాల జీహెచ్‌ఎంసీ పార్కు స్థలాన్ని రాఘవేంద్రరావు అనే వ్యక్తి కబ్జా చేశాడు. స్థానికులు జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు ఈవీడీఎం అధికారులకు తెలియజేశారు. ఈవీడీఎం కమిషనర్ ఆదేశాల మేరకు డీఆర్‌ఎఫ్ సిబ్బందితో కూల్చివేతలు చేపట్టారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ... ఇలాంటి పార్కు స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవీడీఎం అధికారులు, సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల సమస్యలపై స్పందించాలని వినతి


మల్లు రవికి సమస్యలు వివరిస్తున్న కుమారస్వామి

లిబర్టీ: అన్నింటా వెనుకబడి దయనీయ జీవితాలు సాగిస్తున్న బీసీల సమస్యలపై స్పందించాలని లోక్‌సభ సభ్యుడు మల్లు రవికి బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి కోరారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని విన్నవించారు. ఈ మేరకు ఎంపీ మల్లు రవికి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి విన్నతిపత్రం సమర్పించారు. బీసీ జనగణన చేయాలని ఎందుకు ప్రధానమంత్రి దృష్టికి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విన్నవించారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీల సమగ్ర అభివృద్ధి కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు ప్రత్యేక నిధిని కేటాయించాలని కేంద్ర స్థాయిలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని మల్లు రవి దృష్టికి ఆయన తీసుకువచ్చారు. కార్యక్రమంలో బండి సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్ నిర్మాణాన్ని త్వరలో పూర్తిచేస్తాం

శేరిలింగపల్లి జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

రహమత్‌నగర్: హెచ్‌ఎఫ్‌నగర్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సంబంధించిన పనులపై నివేదికలు రూపొందించి పంపిస్తే, నిధులు త్వరగా మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ శేరిలింగపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ హబీబ్ ఫాతిమానగర్‌లో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ... ఫంక్షన్ హాల్ పూర్తి అయితే ఎంతో మందికి ముఖ్యంగా పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దాదాపు 70 శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగతా పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని పెండింగ్ పనులపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆయన డీఎంసీ ఇస్తావత్ సేవా నాయక్‌కు ఆదేశించారు. ఈ ప్రాంతంలో అన్ని హంగులతో నిర్మితమవుతున్న ఫంక్షన్ హాల్ ఇది ఒక్కటనని గుర్తు చేశారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న రహమత్‌నగర్ రహదారి విస్తరణ పనులు చేపట్టి, జంక్షన్ ఇంప్రూమెంట్ చేయాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కోరారు. స్పందించిన జెడ్‌సీ మాట్లాడుతూ... త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ ఈఈ రాజ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- బోరబండ పీఎస్ పరిధిలో పెరుగుతున్న సైబర్ నేరాలు
- రెండు రోజుల్లోనే మూడు కేసుల నమోదు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. రెండు రోజుల వ్యవధిలో మూడు సైబర్ నేరాలపై కేసులు నమోదు కావడం ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... అలీరాజ్‌అనే వ్యక్తి స్వరాజ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. ఇతను ఓ న్యూస్ చానెల్‌లో పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఓ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని ఓ వ్యక్తి అలీరాజ్‌కు ఫోన్ చేశాడు. క్రెడిట్ కార్డు ఇన్స్యూరెన్స్ చేసుకోవాలని వివరాలు రాబట్టి అతని ఖాతా నుంచి రూ. 70 వేలు దోచుకున్నారు. అలాగే ఇదే బస్తీకి చెందిన మరో వ్యక్తి అబ్దుల్ సలీం అనే వ్యక్తికి కస్టమ్స్ అధికారులు మాట్లాడుతున్నామంటూ నీ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ అతని అధార్ కార్డును పంపించి తనపై అధికారితో మాట్లాడాలంటూ బెదిరించారు. అనంతరం అతని ఖాతాలోంచి రూ. 20 వేలను మాయం చేశారు. సుల్తాన్ నగర్‌కు చెందిన శ్రీకాంత్‌ను సైతం కస్టమ్స్ అధికారులమంటూ బెదిరించి రూ. 80,800లను అతని ఖాతా నుంచి దోచుకున్నారు. బాధితులు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ మాట్లాడుతూ... బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పే వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. ఖాతాకు సంబంధించిన ఎలాంటి వివరాలు వారికి చెప్పవద్దన్నారు. తమ ఆధార్ కార్డులు, పాన్ కార్డులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. బోరబండ పీఎస్ పరిధిలో పెరుగుతున్న సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన స్పష్టం చేశారు.

అక్రమ అరెస్టులపై ఏఐవైఎఫ్ ఆగ్రహం

హిమాయత్‌నగర్: బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిస్టు పార్టీల మహా ధర్నాను జరగనివ్వకుండా రాష్ట్ర వ్యాప్తంగా అఖిల భారత యువజన సమాఖ్య, వామపక్ష యువజన, విద్యార్థి సంఘ నేతలను అర్ధరాత్రి నుంచి ఇళ్లలోకి చొరబడి అక్రమంగా ముందస్తు అరెస్టులను ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఖండించింది. ఇంటలిజెన్స్, పోలీసుల నిర్లక్ష్యానికి నిరసనగా శుక్రవారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా తమ నేతలను కరీంనగర్, సిద్దిపేట, అసిఫాబాద్, యాదాద్రి భువనగిరి, ఆదిలాబాద్, సూర్యాపేట తదితర జిల్లాలలో అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. అరెస్ట్ చేసిన నేతలను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, ఏఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజీద్ అలీ ఖాన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

వృద్ధురాలికి రూ. 10 లక్షల టోకరా

హిమాయత్‌నగర్: మనీలాండరింగ్ కేసు నమోదయిందని ఓ వృద్ధురాలిని సైబర్ నేరగాళ్లు బెదిరించి ఆమె ఖాతాలోని రూ. 10 లక్షలను దోచేసుకున్నారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలికి (రిటైర్డ్ ఉద్యోగి) ట్రాయ్ నుంచి అంటూ ఫోన్ కాల్ వచ్చింది. ముంబై పోలీస్ స్టేషన్‌లో ఆమె పేరు మీద కేసు నమోదు అయిందన్నారు. ముంబై క్రైమ్ బ్రాంచ్‌ను సంప్రదించగా, ఆమె నరేష్ గోయెల్‌తో మనీలాండరింగ్ కేసులో ఉందని తన బ్యాంక్ ఖాతా వివరాలు వెరిఫై చేయాలని, అనంతరం అందులోని నగదును తిరిగి బదిలీ చేస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు రూ. 10 లక్షలు వారు సూచించిన ఖాతాకు బదిలీ చేసింది. అనంతరం తాను పంపిన డబ్బు తిరిగి రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

వినతిపత్రం అందజేత

కాచిగూడ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా త్వరలో చేపట్టబోయే సామాజిక ఆర్థిక కులగణనకు సంబంధించి కార్యచరణ ప్రణాళికను త్వరితగతిన పూర్తిచేసి ప్రభుత్వానికి అందజేయాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావును జాతీయ బీసీదళ్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కులగణన చేపట్టాలని చాలాకాలంగా బలహీనవర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయని, కులగణనకు కావాల్సిన మెథడాలజీ, ప్రశ్నావళి రూపకల్పన చేసి అందజేయాలని బీసీ కమిషన్‌ను ప్రభుత్వం కోరిందని తెలిపారు. త్వరితగతిన యాక్షన్ ప్లాన్‌ను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించాలని కమిషన్‌ను కోరారు.

పరిశుభ్రతే లక్ష్యంగా...


మొక్కల కుండీల ఏర్పాటు చేసిన దృశ్యం

రహమత్‌నగర్: పరిశుభ్రతే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రహదారులపై చెత్త వేయకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. రహమత్‌నగర్‌లో చెత్త వేసే ప్రాంతంలో మొక్కల కుండీలను ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసి, చెత్త వేయకుండా కాపలా కాస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు వినూత్నంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బాటసారులు, వాహనదారులు ఆశక్తిగా చూస్తున్నారు.

అప్పు చెల్లించమన్నందుకు మహిళపై దౌర్జన్యం

వెంగళరావునగర్: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమన్నందుకు మహిళపై దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌లో నివసించే సి.హెచ్.రాణికి ఎల్లారెడ్డిగూడలో టెంట్‌హౌస్ నిర్వహించే శివకుమార్‌తో గత ఐదేళ్లుగా పరిచయం ఉంది. దాంతో ఆమె అతనికి, తన కుటుంబ సభ్యులకు కలిపి రూ.9 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఆమె రూ. 2.20 లక్షలకు అతని వద్ద కారు కొనుగోలు చేసింది. శివకుమార్ ఆమె పేరుతో కారు ట్రాన్స్‌ఫర్ చేయలేదు. ఆమె నగదు కోసం అనేకసార్లు అతనికి ఫోన్ చేసింది. అయితే ఆమెను పరుష పదజాలంతో దూషించాడు. దాంతో విషయాన్ని అతని అక్కకు, వదినకు తెలియజేసింది. ఆగ్రహించిన శివకుమార్ ఈ నెల 3న ఆమె ఇంటికి వచ్చి కారు తాళాలు విసిరేసి ఆమె చెంపపై కొట్టి, కుర్చీలు విసిరేసి అసభ్యకరమైన పదజాలంతో దుర్భాషలాడాడు. ఆమెను చంపేస్తానని బెదిరించాడు. ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.






సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

రెవెన్యూ సేవలపై నిర్లక్ష్యం..!

అమలు కానీ సిటిజన్ చార్టర్

- పెండింగ్‌లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులు
- పైరవీలు లేనిదే ముందుకు సాగని దరఖాస్తులు



సాక్షి, సిటీబ్యూరో: సాక్షాత్తు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రెవెన్యూ సేవలపై నిర్లక్ష్యం వెంటాడుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలు నత్తలకు నడక నేర్పిస్తున్నాయి. కనీసం సేవలకు సంబంధించి సిటిజన్ చార్టర్ కూడా అమలు కావడం లేదు. ఒక వైపు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు వరుస నోటిఫికేషన్లతో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం తాకిడి పెరిగింది. సకాలంలో వివిధ ధ్రువీకరణ పత్రాలు జారీ కాకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మీ సేవలో చేసుకున్న దరఖాస్తు పత్రాల రశీదులను పట్టుకుని తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. దీంతో నిర్ణీత గడువులోగా పత్రాలు అందక దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంటోంది. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని సిటిజన్ చార్టర్‌ను అమలులోకి తీసుకొచ్చారు. ఆదాయం సర్టిఫికెట్స్ ఏడు రోజుల్లోగా, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను పక్షం రోజుల్లోగా, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్‌ను 30 రోజుల్లోగా క్షేత్రస్థాయిలో విచారించి అందజేయాల్సి ఉంది. వీటితోపాటు మరికొన్నింటిని కూడా నిర్ణీత కాలవ్యవధిలో ఇవ్వాలనే నిబంధనలున్నా.. ఆచరణలో అమలు మాత్రం కనిపించడం లేదు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకొని ఆమోదం కోసం పడిగాపులు తప్పడం లేదు.

మధ్య దళారులకు పెద్దపీట

తహసీల్ ఆఫీసుల్లో కేవలం మధ్య దళారుల ద్వారా వెళ్లిన దరఖాస్తులకు ప్రాధాన్యం లభిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ పౌరుల దరఖాస్తులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. వారం, పక్షం రోజులు కాదు.. నెలల తరబడి పెండింగ్‌లో పడిపోతున్నాయి. నేరుగా వెళ్లి ఒత్తిడి తెస్తే మాత్రం వివిధ కారణాలతో తిరస్కరించడం సర్వసాధారణంగా తయారైంది. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తర్వాత రశీదును పట్టుకుని మధ్య దళారి దగ్గరకి వెళ్లి ఎంతో కొంత డబ్బులు చెల్లిస్తే.. కేవలం రెండు, మూడు రోజుల్లోనే ఆయా సర్టిఫికెట్లు జారీ కావడం విస్మయానికి గురిచేస్తోంది.

నెల రోజుల్లో ఇలా..

రెవెన్యూ సేవలవకు సంబంధించి నెల రోజుల్లో సుమారు 33,494 దరఖాస్తులు రాగా అందులో 24,776 మాత్రమే ఆమోదానికి గురికాగా, మిగతావి పెండింగ్‌లో పడిపోయాయి. మీ సేవ కుల, ఆదాయ, నివాస, ఈబీసీ, ఓబీసీ, ఇతర ధ్రువ పత్రాల కోసం తహసీల్దారుల పరిధిలో 14,195 అర్జీలు రాగా 8,111 దరఖాస్తులకు, నాయబ్ తహసీల్దార్ల పరిధిలో 19,299 అర్జీలు రాగా 16,665 అర్జీలు పరిష్కారానికి నోచుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



ప్రజాభవన్ దరఖాస్తులకే దిక్కులేదు

సాక్షాత్తు ప్రజాభవన్ ప్రజావాణి దరఖాస్తులకే దిక్కు లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత ప్రజాభవన్ వేదికగా వారానికి రెండు రోజులు(మంగళ, శుక్ర) ప్రజావాణి పేరుతో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తోంది. ఇలా ఇప్పటి వరకు ప్రజాభవన్‌కు హైదరాబాద్ జిల్లా పరిధికి సంబంధించి 596 అర్జీలు అందగా, వీటిలో ఏ ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకోలేదు. అన్నీ పెండెన్సీలో పడిపోయాయి. సీఎంఓ నుంచి వచ్చిన అర్జీలపై కూడా నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

10 నుంచి వ్యవసాయ డిప్లొమా కోర్సుల కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్‌లు, విశ్వవిద్యాలయం నుంచి గుర్తింపు పొందిన ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 2 సంవత్సరాల వ్యవసాయం , సేంద్రీయ డిప్లొమా కోర్సులకు 3 సంవత్సరాల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ నుంచి విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి తెలిపారు. పాలిసెట్ 2024 ర్యాంకులు పొందిన అభ్యర్థులను మెరిట్ అభ్యర్థుల నుంచి రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్, అభ్యర్థులు తీసుకురావాల్సిన సర్టిఫికెట్ల ఫీజు, ఇతర వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ చూడాలన్నారు. అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ప్రకారం వారి ర్యాంకుల వారిగా కౌన్సెలింగ్ హాజరుకావాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

కుష్టు రోగులకు ఎన్‌టీపీసీ చేయూత

- 60 మంది పేషెంట్లకు సెల్ఫ్‌కేర్ కిట్ల అందజేత

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం ద్వారా కుష్టు వ్యాధి సోకిన వారికి ఎన్‌టీపీసీ ఎస్ఆర్‌హెక్యూ చేయూత అందిస్తోంది. కుష్టు, ఫైలేరియా సోకిన వారికి సేవలందించే లెప్రా కేర్ సొసైటీ అనే ఎన్జీవోకు సెల్ఫ్ కిట్లను ఎన్‌టీపీసీ అందజేసింది. శుక్రవారం ఇంటిగ్రేటెడ్ ప్రివెన్షన్ ఆఫ్ డిజేబులిటీ శిబిరంలో ఏర్పాటు చేసిన క్యాంపులో 60 మంది రోగులకు ఈ కిట్లను అందజేసింది. జీఎం హెచ్‌ఆర్ ఎస్ఎన్ పాణిగ్రాహి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని రోగులకు కిట్లను అందజేశారు. తమకు అవసరమైన సహాయం అందజేసినందుకు ఎన్‌టీపీసీ యాజమాన్యానికి రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక కారణాల దృష్ట్యా సికింద్రాబాద్–మేడ్చల్, లింగంపల్లి–మేడ్చల్ స్టేషన్‌ల మధ్య నడిచే 8 ఎంఎంటీఎస్ సర్వీసులను ఈ నెల 8 నుంచి 31వ తేదీ వరకు రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ జారీ చేసే విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించనున్నారు. తమ మొబైల్ ఫోన్ ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వినియోగదారులు తమ బిల్లులు చెల్లించవచ్చు. ఈ క్యూఆర్ కోడ్‌తో కూడిన బిల్లులు ఆగస్టు నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త నిబంధనల వల్ల కొన్ని థర్డ్ పార్టీ యాప్స్ ద్వారా బిల్లులు చెల్లించే సదుపాయం లేకున్నా.. ప్రస్తుతం బిల్లు వసూళ్లపై పెద్దగా ప్రభావం పడలేదని, శుక్రవారం ఉదయం 10 గంటల వరకు దాదాపు 1.20 లక్షల వినియోగదారులు బిల్లులు చెల్లించారని అధికారులు చెప్పారు. వినియోగదారులకు మరింతగా సౌకర్యవంతమైన చర్యల్లో భాగంగా బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారులు అన్నారు. టీజీఎస్పీడీసీఎల్ ఇంటిగ్రేటెడ్ కస్టమర్ సర్వీస్ సెంటర్లలో ఇప్పటికే ఎస్టిమేషన్ పేమెంట్స్, ఇతర బిల్లుల చెల్లింపుల్లో క్యూఆర్ కోడ్ ఆధారిత పేమెంట్స్ జరుగుతున్నాయని తెలిపారు.

పీడియాట్రిక్ న్యూరో సర్జరీపై అవగాహన సదస్సు



లక్డీకాపూల్: రాష్ట్రంలోని వైద్యులకు పీడియాట్రిక్ న్యూరో సర్జరీకి సంబంధించిన అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని నిమ్స్ న్యూరోసర్జరీ హెచ్‌ఓడీ డా.సుచంద భట్టాచార్జీ అన్నారు. పిల్లల మెదడు, వెన్ను, నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు నిమ్స్ పీడియాట్రిక్ న్యూరాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల అవగాహన సదస్సు ప్రారంభమైంది. ఈ రంగంలో నర్సులకు శిక్షణ ఇచ్చేందుకు పీడియాట్రిక్ న్యూరో సర్జరీపై నర్సింగ్ సింపోజియం ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఈ రంగంలో పనిచేసే న్యూరో సర్జన్లు మరిన్ని మెళకువలు నేర్చుకునేందుకు సీఎంఈల అవసరం ఉందని కిమ్స్ హాస్పిటల్ న్యూరోసర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ మానస్ పాణిగ్రాహి తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ న్యూరోసర్జరీ ఎడ్యుకేషన్ కో చైర్మన్ డా.ఆర్థర్ కున్హా, నిమ్స్ డైరెక్టర్ డా.బీరప్ప నగరి, ఇండియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరోసర్జరీ ప్రెసిడెంట్ డా.వీపీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్ ఆకస్మిక తనిఖీ


ఐఐటీ స్టడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్‌చంద్ర

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్‌ను ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ శరత్ చంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఐఐటీ, ఎన్ఐటీ, మెడిసిన్, ఇంటర్మీడియెట్ ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ముచ్చటించిన ఆయన సమస్యలను తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గురుకుల డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి,రీజినల్ కో ఆర్డినేటర్ కల్యాణి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు జగన్నాథ రథయాత్ర


రథయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వేదాంత చైతన్యదాస్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ మెంబర్ వేదాంత చైతన్యదాస్ తెలిపారు. అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రథయాత్ర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఆదివారం ఉదయం 11.30 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వివిధ రాష్ట్రాల నుంచి ఇస్కాన్ ప్రతినిధులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి నారాయణగూడ, హిమాయత్‌నగర్, టీటీడీ టెంపుల్ బషీర్‌బాగ్, అబిడ్స్, ఎంజేమార్కెట్ చౌరస్తా మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు ఈ రథయాత్ర సాగుతుందని తెలియజేశారు. 6 కిలోమీటర్ల పాటు రథయాత్రను భక్తులే స్వయంగా రథాన్ని లాగుతారని, దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద రథయాత్ర అన్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో లక్షకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పండగ వేడుకలు జరుగుతాయని, ఈ వేడుకల్లో కచేరి, మహా హారతి, ప్రవచనాలు ఉంటాయని చెప్పారు. భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు 108 దేవాలయాల్లో భాగవతాధానం చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో హైదరాబాద్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ కన్వీనర్ వరద కృష్ణదాస్, కార్యదర్శి శంభు వైష్ణవ దాస్ తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ పేరుతో కబ్జాకు యత్నం

- సింగరేణి కాలనీలో ఉద్యోగుల ఆగ్రహం

లక్డీకాపూల్: రహదారి విస్తరణ పేరుతో ఖరీదైన భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని సింగరేణి ఉద్యోగులు ఆరోపించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా సింగరేణి ఉద్యోగులు తమ క్వార్టర్స్‌ను, ఇళ్లను కూల్చివేయడానికి సిద్ధపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ సింగరేణి కార్మికులకు 16వేల ఇళ్లు ఇస్తే, రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్న ఇళ్లను కూల్చేయాలనుకోవడం ప్రజాపాలనకు విరుద్ధమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్లంపల్లిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకొచ్చిన తర్వాతే ఇరువైపులా రోడ్డు వైండింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అవసరం మేరకే బదిలీలు చేయాలంటూ ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్లు అర్జీ అందించారు. రాష్ట్రంలో కౌలు రైతులను గుర్తించాలని రైతులు దరఖాస్తు అందించారు. తమ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆశ వర్కర్లు పెద్ద సంఖ్యలో ప్రజావాణికి తరలివచ్చారు. ఇతర వివిధ రకాల సమస్యలపై అర్జీదారులు అధికారులకు తమ దరఖాస్తులను సమర్పించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రజావాణి ప్రత్యేక అధికారికి దివ్య, ఇతర అధికారులు వినతి పత్రాలు స్వీకరించారు. సంబంధిత శాఖాధికారులను అర్జీలపై సత్వరం స్పందించి పరిష్కరించాలని కోరారు. ప్రజావాణికి మొత్తం 594 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ సమస్యలపై 141, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 86, విద్యుత్ శాఖ 58, హౌసింగ్ 56, పంచాయతి రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ 54, ఇతర శాఖలకు సంబంధించి 199 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

జూలై 5ను సోషల్ జస్టిస్ డేగా ప్రకటించాలి



రాంవిలాస్ పాశ్వాన్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తూ..

పంజగుట్ట: తొమ్మిదిసార్లు పార్లమెంట్ సభ్యుడిగా, రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఊపిరి ఉన్నంత వరకు పోరాడిన రాంవిలాస్ పాశ్వాన్ జయంతి రోజైన జూలై 5వ తేదీని సోషల్ జస్టిస్ డేగా కేంద్రం ప్రకటించాలని రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ శాఖ డిమాండ్ చేసింది. పార్టీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పాశ్వాన్ 78వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ జిల్లా జడ్జి నిమ్మ నారాయణ, హైకోర్టు న్యాయవాది ఇనుగాల భీమ్‌రావు కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో ఎప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు జరిగినా ఢిల్లీ కేంద్రంగా పార్లమెంట్‌లో చర్చకు తీసుకువచ్చేవారని గుర్తుచేశారు. ఢిల్లీలో ఏ ప్రభుత్వం ఉన్నా ఆయనను మంత్రివర్గంలో తీసుకునేవారని, ఆయన సోషల్ వెల్ఫేర్ మంత్రిగా ఉన్నప్పుడే మండల్ కమిషన్ తీసుకువచ్చి బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు తెచ్చారని గుర్తుచేశారు. అసలు సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అనే నినాదం ఆయనదే అని, దాన్ని ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ హైజాక్ చేశారని ఆయన చెప్పరు. ఆయన జయంతి రోజును సోషల్ జస్టిస్ డేగా ప్రకటించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.ఎస్. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు శంకర్, సి.బి.ప్రసాద్, బి.శారద, మధుసూదన్‌రావు, సమ్మన్న, భారతి, చంద్రశేఖర్, కల్పన, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓఎంఆర్ ఆధారిత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



సాక్షి, సిటీబ్యూరో: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఓఎంఆర్ ఆధారిత పరీక్షలను పగడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ వెంకటాచారి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూపీఎస్సీ ఓఎంఆర్ ఆధారిత ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పర్సనల్ అసిస్టెంట్, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని 37 సెంటర్లలో ఉదయం 9:30 గంటల నుంచి 11.30 గంటల వరకు జనరల్ ఎబిలిటీ టెస్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నర్సింగ్ పరీక్ష నిర్వహించనున్నటుల్ వివరించారు. పర్సనల్ అసిస్టెంట్ పరీక్షకు 6,090 మంది అభ్యర్థులు, నర్సింగ్ ఆఫీసర్ పరీక్షకు 13,728 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్ష ప్రారంభానికి ముందు ఉదయం, సాయంత్రం 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రం గేటు మూసివేస్తామన్నారు. అభ్యర్థులు ఈ అడ్మిట్ కార్డ్‌తో ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని తెలిపారు. యూపీఎస్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణ

- నాలుగు అంశాలపై అవగాహన
- హాజరైన కొత్వాల్, ప్రిన్సిపల్ సెక్రటరీ


ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) వలంటీర్లను కమ్యూనిటీ పోలీసింగ్ వినియోగించాలన్న రాష్ట్ర విద్యా శాఖ నిర్ణయం కార్యరూపంలోకి తీసుకువస్తోంది. నగర పోలీసు విభాగంతో కలిసి ఈ దిశలో ముందుకు వెళ్తోంది. ఇప్పటికే ట్రాఫిక్ విభాగంలో వీరు సేవలు అందిస్తుండగా... మహిళా భద్రత సహా మరో నాలుగు అంశాల్లో వినియోగించుకోనున్నారు. దీనికి సంబంధించి ట్రెనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటీ) కార్యక్రమం మహిళా భద్రత విభాగంలో శుక్రవారం జరిగింది. నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డితో పాటు విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం స్పై కెమెరాలు అనేవి మహిళా భద్రతకు సవాల్‌గా మారాయి. మాల్స్, వస్త్ర దుకాణాలతో పాటు ఛేంజింగ్ రూమ్స్, టాయిలెట్స్ ఉన్న చోట్ల వీటి బెడద ఎక్కువగా ఉంది. వెలుగులోకి రాకుండా ఉంటున్న ఘటనలు అనేకం ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో రహస్యంగా ఉండే ఇలాంటి స్పై కెమెరాలను గుర్తించడంపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మహిళ భద్రత విభాగం ఆధ్వర్యంలో నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు. ఈ ట్రైనర్లు మిగిలిన వలంటీర్లకు అవగాహన కల్పిస్తారు. సుశిక్షితులైన వారికి అవసరమైన ఉపకరణాలు సైతం అందిస్తారు. వీరంతా స్థానిక పోలీసులతో కలిసి తరచూ ఏరియాల వారీగా ఆయా వ్యాపార, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు చేసి ఆ ప్రదేశం సేఫ్ అని ధ్రువీకరిస్తూ స్టిక్కర్లు అతికిస్తారు. ఈ స్టిక్కర్ ఉన్న సంస్థలకే మహిళా కస్టమర్లు ఎక్కువగా వెళ్లేలా అవగాహన పెంపొందించనున్నారు. రానున్న రోజుల్లో ఎన్‌సీసీ, రెడ్ క్రాస్ వలంటీర్లతోనూ కలిసి పని చేయనున్నట్లు కొత్తకోట శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

గోల్కొండ బోనాలకు తాగునీటి ఏర్పాట్లు



సాక్షి, సిటీబ్యూరో: గోల్కొండ బోనాలకు వచ్చే భక్తుల కోసం జలమండలి తాగునీటి వసతి కల్పిస్తోంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. కోట ప్రారంభంలో ఉన్న మెట్ల దగ్గరి నుంచి బోనాలు జరిగే ప్రాంతం వరకు వివిధ స్థానాల్లో తాగునీటి పాయింట్లు ఏర్పాట్లు చేసింది. దీనికోసం అవసరమైన డ్రమ్ములు, సింటెక్స్ ట్యాంకులు, పంపులు, పైప్‌లైన్‌తో పాటు వంట చేసే ప్రాంతంలో స్టాండ్లు కూడా సిద్ధం చేసింది. పైపులైన్ ద్వారా తాగునీరు అందించేందుకు అవసరమైన ట్రయల్ రన్ కూడా అధికారులు ఇప్పటికే నిర్వహించారు. వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు అందుబాటులో ఉంచారు.

భక్తులకు ఉచిత వాహన ప్రయాణ సదుపాయం


లంగర్‌హౌస్‌లో పర్యటిస్తున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

లంగర్‌హౌస్: భక్తులకు బోనాల సందర్భంగా సూచించిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని, ఈ సంవత్సరం ఆ ప్రాంతాల నుంచి గోల్కొండకు వెళ్లడానికి ఉచితంగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాలు ప్రారంభం రోజున లంగర్‌హౌస్‌లో మంత్రులు, ప్రముఖులు నిర్వహించే పూజలు సాఫీగా సాగనిచ్చేలా అందరూ సహకరించాలని ఆయన సూచించారు. లంగర్‌హౌస్‌లో బోనాల ఉత్సవాలు ప్రారంభించే వేదిక, పట్టువస్త్రాలు సమర్పించే ప్రాంతాలు, ఊరేగింపు వెళ్లే దారులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అయితే మంత్రులు పట్టువస్త్రాలు సమర్పించే సమయంలో నాయకులతో ప్రజలు ఫొటోల కోసం ఎగబడుతుండటంతో ప్రతి సంవత్సరం తోపులాటలు జరుగుతున్నాయని స్థానిక నాయకులు తెలిపారు. దీనివల్ల ప్రముఖులు ఇబ్బంది పడటంతో పాటు పూజలు సజావుగా సాగట్లేదని సీపీకి తెలిపారు. స్పందించిన సీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం తాము సాఫీగా పూజలు నిర్వహించేలా చూస్తామని, అందరూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలన్నారు. ఆయన వెంట పర్యటనలో అదనపు సీపీ విశ్వప్రసాద్, డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ ఉన్నారు.

వైద్యుడిపై దాడి

- కోఠి డీఎంఈ వద్ద ఉద్రిక్తత
- సుల్తాన్‌బజార్ పీఎస్‌లో పరస్పర ఫిర్యాదు


కోఠి డీఎంఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితుడు డాక్టర్ శేఖర్

సుల్తాన్‌బజార్: ఓ పెరిఫెరెల్ వైద్యుడిపై వైద్యుల సంఘం ప్రతినిధులు దాడి చేయడంతో కోఠి డీఎంఈ వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత వివరాల ప్రకారం.. పెరిఫెరెల్ డాక్టర్ శేఖర్ ఇటీవల సాధారణ బదిలీలపై ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయానికి మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న వైద్యులతో డీఎంఈ డాక్టర్ వాణి కలిసేందుకు వస్తున్న తరుణంలో అక్కడే ఉన్న కొంతమంది తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు అడ్డుకున్నారు. అక్కడ ఇరువురికి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో డీఎంఈ కార్యాలయం ప్రాంగణంలో ఇరువురి డాక్టర్ల మధ్య తోపులాటలు జరిగాయి. ఈ క్రమంలో డాక్టర్ శేఖర్‌కు మెడపై గాయాలయ్యాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వంలో వైద్యుల సంఘంలో ఉన్న కొంతమంది తనపై దాడి చేశారని ఆయన డీఎంఈ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా డీఎంఈ సైతం ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. అనంతరం డాక్టర్ శేఖర్ బృందం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ వినోద్, డాక్టర్ రాథోడ్‌తో పాటు మరి కొంత మందిపై ఫిర్యాదు చేశారు. శేఖర్‌తో పాటు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు సైతం శేఖర్‌పై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి దాడి ఘటనలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తోపులాటలో దెబ్బలు తగిలాయి..

డాక్టర్ శేఖర్‌పై తాము దాడి చేయలేదని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్లు బొంగు రమేష్, పల్లం ప్రవీణ్, వినోద్, రాథోడ్ అన్నారు. మాటామాట పెరిగి తోపులాట జరిగిందని, తాము ఆయనపై దాడి చేయలేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే తమపై పోలీస్‌స్టేషన్‌లో శేఖర్‌పై ఫిర్యాదు చేశారని వెల్లడించారు.

నగరంలో భారీ వర్షం


ఎల్బీనగర్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. డ్రైనేజీలు, నాలాలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బాలాపూర్, బండ్లగూడ, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, కర్మన్‌ఘాట్, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, మలక్‌పేట్, సైదాబాద్, చంపాపేట్ జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, బేగంపేట, పంజాగుట్ట, మెహిదీపట్నం, మాసబ్ ట్యాంక్, లక్డీకాపూల్, షేక్‌పేట్, గోల్కొండ, టోలిచౌకి, రాయదుర్గంలలో భారీ వర్షం పడింది.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శనివారం, 6, జూలై, 2024

కైసే హే ఆప్..



కుమారి ఆంటీ.. కైసే హే ఆప్ అంటూ ప్రముఖ సినీ నటుడు సోనూ సూద్ సర్‌ప్రైజ్ చేశారు. మాదాపూర్ స్ట్రీట్ ఫుడ్‌కు పేరుగాంచిన కుమారీ ఆంటీ గురించి అందరికీ తెలిసిందే. కుమారి ఆంటీ హోటల్‌ను సోనూ సూద్ శుక్రవారం సందర్శించి, ఆమెతో ముచ్చటించారు. అంతేకాకుండా స్వయం కృషితో ఎదిగి, మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలిచారన్నారు. కుటుంబం కోసం కష్టపడుతున్న తీరు ఆదర్శనీయమని అన్నారు. హోటల్లో ఎలాంటి వంటకాలు అందుబాటులో ఉంటాయో అడిగి తెలుసుకున్నారు. రూ.80కి వెజ్, రూ.120కి నాన్ వెజ్ లభిస్తాయని తెలిపారు. తను శాకాహారినని, తనకైతే వెజ్‌మీల్ ఎంతకు అమ్ముతావని సోనూ అడిగారు. దీనికి సమాధానంగా...ఎంతో మందికి సహాయం చేసిన మీకు ఏదైనా ఉచితంగానే ఇస్తానని తన అభిమానాన్ని చాటుకున్నారు. తను కష్టకాలంలో ఉన్నప్పుడు సోనూ సూద్ స్వయంగా ఫోన్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తోడా, తోడా హిందీ మాత్రమే వస్తుందని కుమారి ఆంటీ తెలుపగా.. 'మీ హిందీ చాలా బాగుంది' అని సరదాగా కితాబిచ్చారు. అనంతరం ఆమె పిల్లల గురించి పలు విషయాలు తెలుసుకున్నారు. ఎప్పుడైనా ఏ సాయం కావాలన్నా నేనున్నానని భరోసా ఇచ్చారు. అక్కడకు చేరుకున్న అభిమానులకు సెల్ఫీలు ఇస్తూ కాసేపు సందడి చేశారు. సోనూ సూద్ ఓ సినిమా ప్రమోషన్‌లో భాగంగా నగరానికి వచ్చారు. ఏదేమైనా..పట్టుదల, కృషితో ముందుకొచ్చే వారిని గుర్తించడం, ప్రోత్సాహమందించడంలో సోనూ తరువాతే ఎవరైనా అని మరోసారి నిరూపించుకున్నారు. అయితే కుమారి ఆంటీని కలిసిన వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో ఆ వీడియో వైరల్‌గా మారింది.

ప్రిజం మాల్‌లో ఇంటీరియర్ హోం టౌన్..

ఇంటీరియర్ డిజైనింగ్‌లో నగరవాసుల ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రముఖ ఇంటీరియర్ డిజైనింగ్ సంస్థలు నగరానికి చేరుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఈ రంగంలో అగ్రగామిగా పేరుగాంచిన 'హోం టౌన్' గచ్చిబౌలిలోని ప్రిజం మాల్ వేదికగా సరికొత్త స్టోర్ హోంటౌన్‌ను ప్రారంభించింది. ఇందులో ఏర్పాటు చేసిన స్టైలిష్ ఫర్నిచర్‌తో పాటు ఇంటీరియర్ డిజైన్ స్టూడియో, ఫంక్షనల్ టేబుల్‌వేర్, మాడ్యులర్ కిచెన్, అధునాతన 3డి విజువలైజేషన్ ఆకట్టుకుంటోంది. ప్రాక్సిస్ హోమ్ సీఈఓ శ్వేతాంక్ జైన్ మాట్లాడుతూ..అంతర్జాతీయ డిజైన్ సొగసులకు కేంద్రంగా నిలుస్తున్న హైదరాబాద్‌లో సేవలు ఆవిష్కరించడం సంతోషమన్నారు. న్యూయార్క్, జపనీస్ జెన్ వంటి అధునాతన శైలి పట్ల నగరవాసుల ఆసక్తి ఉత్సాహాన్ని అందిస్తుందన్నారు.




నేడు అనంతయ్య చిత్రాల ప్రదర్శన

నాంపల్లి: ప్రముఖ చిత్రకారుడు అనంతయ్య కుంచె నుంచి జాలువారిన చిత్రాలను ఈ నెల 6న సాయంత్రం 5.30 గంటలకు కావూరిహిల్స్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు. అనంతయ్య బాల్యం నుంచి నేటి వరకు గీసిన చిత్రాలను ఇందులో ప్రదర్శించనున్నారు. ప్రదర్శనను తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య యాదవ్, పాత్రికేయులు టి.ఉదయవర్లు, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి. రమణారెడ్డి ప్రారంభిస్తారు. 14 వరకు ప్రదర్శన కొనసాగుతుంది. అనంతయ్య రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ చిత్రకారుడు పురస్కారాన్ని, తెలుగు వర్శిటీ నుంచి ప్రతిభా పురస్కారాన్ని, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ నుంచి గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు.

బంగారు బొమ్మను ఆదరిస్తారు...

మణికొండ: వ్యక్తిగత అల్బమ్‌లను సంగీత ప్రియులు ఆదరిస్తున్నారని, విజువల్స్, కాన్సెప్ట్ కళ్లు చెదిరేలా ఉన్నాయని, బంగారు బొమ్మ అల్బమ్‌ను తప్పక ఆదరిస్తారని ప్రముఖ గీత రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. క్రిస్టోలైట్ మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రణీత్ నేకూరి నిర్మించిన బంగారు బొమ్మ అల్బమ్‌ను మణికొండలోని నివాసంలో శుక్రవారం రిలీజ్ చేశారు. ఎంసీ హరి, ప్రోజాక్‌లు అల్బంలో నటించటంతో పాటు స్క్రిప్ట్, పాడటం చేశారు. వేదం వంశీ మెస్మరైజింగ్ విజువల్స్‌ను అందించారు. అల్బమ్ నిర్మాత డాక్టర్ ప్రణీత్ నేకూరి ఈ పాట సంగీత ప్రపంచంలో కొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు చేపడతామన్నారు. బంగారు బొమ్మ అల్బమ్‌ను న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో ఈ వారాంతంలో ప్రదర్శిస్తున్నామన్నారు.



రాక్ ఫర్ రన్..

రాక్ ఫర్ రన్ పేరుతో నగరంలో ప్రత్యేకంగా రన్నింగ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. సొసైటీ టూ సేవ్ రాక్, హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో రేపు (ఆదివారం) ఉదయం 6 గంటలకు జరగనున్న ఈ రేసులో 5, 10, 20 కిలోమీటర్ల విభాగాల్లో పలువురు ఔత్సాహికులు, ప్రముఖులు పాల్గొననున్నారు. నగరంలో ప్రకృతి సంపదగా ఉన్నటువంటి కొండరాళ్లను, వీటికి అనుబంధంగా ఉన్న ప్రకృతిని సంరక్షించాలనే లక్ష్యంతో ఈ రన్నింగ్ ఈవెంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ రన్నింగ్.. ఘర్–ఈ–ముబారక్ వద్ద మొదలై, తిరిగి మళ్లీ అక్కడే ముగుస్తుంది.

'శ్రీమాన్ రామా' యానిమేషన్ సిరీస్ ఆవిష్కరణ

నేడు ఆవిష్కరించనున్న చినజీయర్ స్వామి

సాక్షి, సిటీబ్యూరో: మరా క్రియేషన్ ఆధ్వర్యంలో వినూత్నంగా రూపొందించిన 'శ్రీమాన్ రామా' యానిమేషన్ సిరీస్‌ను త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి ఆవిష్కరించనున్నారు. ముచ్చింతల్‌లోని జీయర్ ఆశ్రమంలో శనివారం ఉదయం ఈ యానిమేషన్ సిరీస్‌ను ఆవిష్కరించనున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ ఎంపీ విజయేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సిరీస్ రేపటి నుంచి ప్రతి ఆదివారం డీడీ నేషనల్ వేదికగా ప్రసారం కానుంది.



13 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్స్‌లో ప్రసిద్ధిగాంచిన హైలైఫ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను ఈనెల 13, 14, 15 తేదీల్లో హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీని సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్‌లో శుక్రవారం జరిగింది. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న నగలు, దుస్తులు, డిజైనరీ ఆభరణాలను పలువురు మోడల్స్ ధరించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని ప్రసిద్ధిగాంచిన ప్రముఖ మోడల్స్ తీర్చిదిద్దిన వజ్రాభరణాలతో పాటు డిజైనరీ వస్త్రాలు ప్రదర్శిస్తారని, వెడ్డింగ్ కలెక్షన్స్‌తో పాటు ఫ్యాషన్, డిజైనర్ వేర్ లభిస్తాయని తెలిపారు.





అమ్మానాన్నల బొమ్మ గీసిన వీడియోను అనిల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారి 2.7 మిలియన్ల వీక్షణలు దక్కించుకుంది. దేశవిదేశాల నుంచి బ్లడ్ ఆర్ట్ గురించి సంప్రదింపులు మొదలయ్యాయి.





యాక్రలిక్, ఆబ్‌స్ట్రాక్ట్, పాప్ ఆర్ట్, పెయింటర్లీ, వాటర్ కలర్, ఆయిల్ పెయింట్, పేస్టల్స్ కాదేదీ పెయింటింగ్‌కు అనర్హం అన్నట్లు... విచిత్రంగా రక్తంతో బొమ్మలు గీసి ట్రెండ్ సెట్ చేస్తున్నాడు.. నగరానికి చెందిన అనిల్ కుమార్. కొందరు కాన్వాస్‌పై యాక్రిలిక్‌తో అద్భుతమైన చిత్రాలు సృష్టిస్తే మరికొందరు మట్టిముద్దలతో శిల్పాలను రూపొందిస్తున్నారు.. ఇటీవల ఈ క్రియేటివిటీ మరింత పెరగడంతో ఒక్కొక్కరూ ఒక్కో వైవిధ్యమైన రీతిలో కళాకారులు మ్యాజిక్ చేస్తున్నారు. నగరానికి చెందిన యువ చిత్రకారుడు అనిల్ కుమార్ దీని కోసం బ్లడ్‌ను ఉపయోగిస్తూ... 'రక్త' సంబంధాలను సరికొత్తగా పునర్నిర్వచిస్తున్నాడు.

- సాక్షి, సిటీబ్యూరో

- బ్లడ్‌ఆర్ట్‌కు చిరునామాగా మారి...
- రుధిరంతో భావోద్వేగాలు దిద్దుతున్న ఆర్టిస్ట్
- అనుభవజ్ఞులైన ల్యాబ్ టెక్నీషియన్‌తో సేకరణ
- 3 నుంచి 4 గ్రా.ల రక్తం అవసరం

BLOOD ART

బ్లడ్ ఆర్ట్

అమ్మానాన్న బొమ్మను రక్తంతో గీసి...

బ్లడ్ ఆర్ట్ అనే పదం వినడానికి ప్రత్యేకంగా కాస్త ఇబ్బందికరంగా అనిపిస్తుంది. అయితే 'బ్లడ్ పెయింటింగ్ భావోద్వేగాలను పంచుకునేందుకు సాటిలేని మార్గం. కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు లేదా ప్రేమికులు...తమ మధ్య ఉన్న బలమైన సంబంధాలను తెలియజెప్పేందుకు ఓ శక్తివంతమైన సాధనమని' అనిల్ అంటున్నాడు.

దైవకృపతో అబ్బిన కళ...

దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన 24 ఏళ్ల అనిల్ కుమార్‌కు ఎటువంటి చదువు, సాధన లేకుండా చిత్రకళ అబ్బింది...అతని కళాత్మక ప్రయాణం 2019లో బీటెక్ మొదటి సంవత్సరంలో ఉండగా ప్రారంభమైంది. 'చిన్నప్పటి నుంచీ బొమ్మలు గీయడం హాబీ..అలా అలా పోర్ట్రెయిట్స్ గీయడం అలవాటైంది. బీటెక్ పూర్తి చేసినా ఏదో ఒక ఉద్యోగంలో ఇమడలేక పోర్ట్రెయిట్ (పెన్సిల్ స్కెచింగ్) కళలో ప్రావీణ్యం సంపాదించాను. అప్పుడు నేను పెన్సిల్స్ (మైక్రో ఆర్ట్) మీద పేర్లు చెక్కడం ప్రారంభించాను' అని అనిల్ చెప్పాడు. అయితే ఫేస్ డ్రాయింగ్‌లు మైక్రో ఆర్ట్ ద్వారా ప్రొఫెషనల్ అనిపించుకున్నప్పటికీ సరైన ఆర్డర్స్ లేక ఏదో ఒక ఉద్యోగం చూసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

అమ్మాయి 'కళ్ల'తో పుట్టిన కళ...

బెంగుళూర్‌కు చెందిన మైక్రో ఆర్ట్ కస్టమర్ తన సోదరి కళ్లను తన రక్తంతో గీయమని అడిగారు. 'తొలుత నేను ఒప్పుకోలేదు. బాగా రిక్వెస్ట్ చేయడంతో చేసిన ఆ వర్క్‌ని నా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే బాగా రీచ్ వచ్చింది. అయినా అప్పుడు కూడా బ్లడ్ ఆర్ట్‌ని సీరియస్‌గా తీసుకోలేదు. ఆ తర్వాత మా అమ్మానాన్నల మ్యారేజ్ డే రోజున నా రక్తాన్ని ఉపయోగించి వారిద్దరి చిత్రాలనూ గీశాను. అది వారి మనసుకు హత్తుకోవడం మాత్రమే కాదు నా భవిష్యత్తును మార్చేసింది' అని అనిల్ గుర్తు చేసుకున్నాడు.

దేశవిదేశాల నుంచి...

అమ్మానాన్నల బొమ్మ గీసిన వీడియోను అనిల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారి 2.7 మిలియన్ల వీక్షణలు దక్కించుకుంది. దేశవిదేశాల నుంచి బ్లడ్ ఆర్ట్ గురించి సంప్రదింపులు మొదలయ్యాయి. వేలాది మంది తమ ప్రియమైన వారి బ్లడ్ పెయింటింగ్స్ కోసం నాకు మెసేజ్ చేయడం ప్రారంభించారు. 'దాంతో ఇప్పుడు ఎవరైనా ఆర్డర్ ఇస్తే కనీసం కొన్ని వారాల పాటు సమయం తీసుకోవాల్సి వస్తోంది' అని అనిల్ చెప్పాడు.



జాగ్రత్తలు తప్పనిసరి..

'ఈ మాధ్యమాన్ని ఉపయోగించి చిత్రాలు గీసేటప్పుడు ఏదైనా తప్పు జరిగితే ప్రభావితమయ్యే మొదటి వ్యక్తి చిత్రకారుడే.. కాబట్టి.. గ్లవ్స్, మాస్క్ ధరించడం వంటి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి' అని అనిల్ కుమార్ స్పష్టం చేశాడు. రక్తాన్ని సేకరించడం నుంచి గోడపై కళాకృతిని అలంకరించడం వరకూ... ప్రతీది కఠినమైన పరిశుభ్రతతో జరుగుతుందని చెప్పాడు. తమకు కావాల్సిన పోర్ట్రెయిట్‌ను గీయించుకోవాలనుకున్న కస్టమర్స్... అనుభవజ్ఞులైన ల్యాబ్ టెక్నీషియన్ సాయంతో చిన్న ట్యూబ్ ద్వారా సేకరించిన బ్లడ్ (సుమారు 3 నుంచి 4గ్రా) అనిల్‌కు అందిస్తారు. దానిని కనీసం వారం రోజుల వరకూ భద్రంగా నిల్వచేసే అవకాశం ఉంటుంది. రోజుకు ఒక పోర్ట్రెయిట్‌ను మాత్రమే పూర్తి చేస్తున్నానని అనిల్ చెబుతున్నాడు. కస్టమర్ తీసుకెళ్లేవరకూ దుర్వాసన లేదా తేమను గ్రహించకుండా ఆర్ట్‌వర్క్‌ను సంరక్షించడానికి ఫిక్సేటివ్ స్ప్రేని ఉపయోగిస్తామన్నాడు.

ప్రస్తుత సాంకేతిక యుగంలో చేతితో వేసిన సిసలైన చిత్రకళ అస్తిత్వం ప్రశ్నార్థకమవుతోంది. ఈ పరిస్థితుల్లో 'ఏఐ కూడా రీ క్రియేట్ చేయలేని బ్లడ్ ఆర్ట్ భవిష్యత్తులో మరింత ఆదరణ పొందే అవకాశం ఉంది' అంటున్నాడు అనిల్.



ఆయనకు సరిగ్గా 75 ఏళ్లు.. అయితేనేం..? నేటి తరం యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో కష్టపడి తేగానీ నేటితరం యువత సాధించలేని సిక్స్‌ప్యాక్‌ను నలభై ఏళ్ల క్రితమే తన సొంతం చేసుకున్నాడు. వృద్ధాప్యంలోనూ సిక్స్‌ప్యాక్‌ను కాపాడుకుంటూ నేటితరం యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనే సికింద్రాబాద్ ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన విజయ్‌కుమార్. అనేక కారణాలతో నేటి తరం యువత తమ సిక్స్‌ప్యాక్ కలను సాధించలేకపోతున్నారు. సిక్స్‌ప్యాక్ కోసం గంటల తరబడి జిమ్‌లో కసరత్తులు తప్పనిసరి. ఎన్ని కసరత్తులు చేసినా సిక్స్‌ప్యాక్ సాధ్యం అవుతుందన్న గ్యారంటీ లేదు. ఇటువంటి కఠోర వ్యాయామాలను సునాయసంగా చేస్తూ తన సిక్స్‌ప్యాక్‌ను నేటికీ పదిలపరుచుకుంటున్నారు. వయసు శరీరానికే తప్ప మనసుకు కాదు అంటున్న విజయ్‌కుమార్ ఈ వయసులోనూ హుషారుగా వ్యాయామాలు చేస్తున్నారు.. ర్యాంప్‌వాక్‌లు సైతం చేయవచ్చని నిరూపిస్తున్నారు. క్రమం తప్పకుండా జిమ్‌కు వెళ్లడం, వ్యాయామంతోపాటు జాగింగ్, సైక్లింగ్ చేస్తూ ఎందరో యువకులు, విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న వృద్ధ కండలవీరుడు విజయ్‌కుమార్‌పై సాక్షి కథనం.. –సికింద్రాబాద్

- సునాయాసంగా కఠోర ఆసనాలు
- 28 ఏళ్ల వయస్సు నుంచే వ్యాయామాలు

శేషజీవితం సమాజానికి అంకితం

నిరంతర వ్యాయామంతో వృద్ధాప్యంలోనూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నా. ప్రస్తుతం కుటుంబ, వ్యాపార బాధ్యతలు ఏవీ నాపై లేవు. శేష జీవితం సమాజాభివృద్ధికి అంకితం చేయాలన్నదే లక్ష్యం. సీనియర్ సిటిజన్లలో నిరాశ, నిస్పృహలను దూరం చేసేందుకు చేతనైన సహాయం చేస్తున్నా.

– మందుల విజయ్‌కుమార్

సిక్స్‌ప్యాక్ తాతయ్య..

75 ఏళ్ల వయస్సులోనూ ఫిట్‌గా..

ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన ఎం.విజయ్ కుమార్ నాలుగు దశాబ్దాలుగా క్రమం తప్పకుడా వ్యాయామం చేస్తూ అనారోగ్యాన్ని దరిచేరకుండా జాగ్రత్తపడుతున్నారు. సికింద్రాబాద్ నుంచి సుచిత్ర వరకూ, ప్యారడైజ్ నుంచి బొల్లారం వరకూ, మారేడుపల్లి నుంచి బాలానగర్ వరకూ ఉన్న జిమ్ నిర్వాహకులకు, అందులో శిక్షణ తీసుకుంటున్న యువతకు సుపరిచితులు. సికింద్రాబాద్‌లో ఇంజినీరింగ్ వ్యాపారంలో స్థిరపడిన విజయ్‌కుమార్ తన 28 ఏళ్ల వయసు నుంచే వ్యాయాయం మొదలుపెట్టాడు. కొద్ది సంవత్సరాల క్రితం వరకూ వ్యాపారాన్ని కొనసాగించిన ఆయన ప్రస్తుతం వ్యాయామంతోపాటు యువతకు స్ఫూర్తిగా నిలిచే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

సీనియర్ సిటిజన్స్‌లోనూ...

కొద్ది సంవత్సరాలుగా స్నేహ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధిగా కొనసాగుతున్న విజయ్‌కుమార్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ వృద్ధులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. డీజే పాటలకు డ్యాన్స్ చేయడం, స్వతహాగా పాటలు పాడడం వంటి కార్యక్రమాలతో అటు వృద్ధుల్లో ఇటు యువకుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. జిమ్ వర్కవుట్‌తోపాటు జాగింగ్, సైక్లింగ్ పోటీల్లోనూ పలు మెడల్స్‌ను అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించిన బాడీబిల్డింగ్, సైక్లింగ్ పోటీల్లో నేటికీ పాల్గొంటుంటారు.





వ్యాయామం, క్రీడలు విజయ్‌కుమార్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులకు అలవాటయ్యాయి. విజయ్‌కుమార్, భార్య పిల్లలు కూడా ఉదయం నిద్రలేచింది మొదలు వర్కవుట్స్ చేయడం వారి దినచర్య. భార్య శారద కూడా భర్తకు తోడుగా వాకింగ్, జాగింగ్‌లకు వెళతారు. సీనియర్ సిటిజన్స్ క్రీడల్లో శారద పలు పతకాలు గెలుచుకుంది. కూతురు వాణి వాలీబాల్ జాతీయ క్రీడాకారిణిగా అవార్డులు అందుకుంది. కుమారులు పవన్, నవీన్ ఇరువురూ జాతీయ, అంతర్జాతీయ స్విమ్మర్లు. పెద్దకుమారుడు ఆస్ట్రేలియాలో స్థిరపడగా చిన్నకుమారుడు స్విమ్మింగ్ కోచ్‌గా ఉన్నాడు.

అందరూ క్రీడాకారులే...

ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ...

సికింద్రాబాద్ ప్రాంతంలో విజయ్‌కుమార్ వర్కవుట్ చేయని జిమ్, సైక్లింగ్ చేయని రోడ్డు, జాగింగ్ చేయని మైదానం లేదంటే అతిశయోక్తి కాదు. ఆయన వర్కవుట్ చేయడంతో పాటు అక్కడి యువకులకు వర్కవుట్‌లో మెళకువలు నేర్పుతుంటారు. ఇంటి ఆహారం అందులోనూ శాకాహారానికి ప్రాధాన్యత ఇవ్వడం, దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని పదిలం చేసుకోవడం పట్ల అవగాహన కలిగిస్తున్నారు.



శివాజీరావు 90.0

రామంతాపూర్: కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులని సోమరిపోతులైన యువకులను ఉద్దేశించి అన్నాడో మహా కవి. దానిని సవరించుకుంటూ కొంతమంది వృద్ధులు పుట్టుకతో యువకులు అని శివాజీరావును చూస్తే అనిపిస్తుంది. 90 ఏళ్ల వయస్సులో మనకు తెలిసి చాలా మంది మంచానికే పరిమితమైపోతారు. అనేక అనారోగ్య సమస్యలో ఇబ్బందిపడుతుంటారు. కాని శివాజీరావును చూసిన వారెవరైనా తమ అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిందే.. ఎందుకంటే ఇప్పటికీ బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, కళ్లు మసకబారడం వంటి సమస్యలేవీ ఆయన దరిదాపుల్లోకి రాలేకపోయాయి అంటే ఆశ్చర్యపోతారేమో! మెదక్ జిల్లా జహీరాబాద్‌కు చెందిన శివాజీరావు 30 ఏళ్ల కిందట రామంతాపూర్ శారదానగర్‌కు తన కుటుంబంతో సహా వచ్చి స్థిరపడ్డారు. శారదానగర్ ప్రధాన రహదారిలో చెప్పులు కుడుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ వయస్సులో కూడా ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ చెప్పులు కుట్టే పనిలో బిజీగా ఉంటారు. మధ్యాహ్నం ఓ గంట సేపు నిద్రపోతారు. స్కూల్ పిల్లల షూస్, దివ్యాంగుల చెప్పులకు మాత్రం సగం రేటే తీసుకుంటారు.

ఆరోగ్య రహస్యం నడక, జొన్నరొట్టె..

ఈ వయసులో కూడా తాను చెప్పులు కుట్టే వృత్తి నిర్వహిస్తున్నారు. తన వ్యాపారానికి కావాల్సిన ముడి సరుకులు బస్సులో వెళ్లి తెచ్చుకుంటారు. మీ ఆరోగ్య రహస్యం ఏమిటని ప్రశ్నిస్తే నడక మూడు పూటలా జొన్న రొట్టెను ఆహారంగా తీసుకుంటానని, ఉన్న దాంట్లో తృప్తిగా బతకడమే అని సమాధానం ఇచ్చారు. రామంతాపూర్‌లో నడక ప్రారంభించి పాలిటెక్నిక్ కాలేజ్ వరకూ నడుస్తానని తెలిపారు.



నిధులిచ్చి ఆదుకోండి

- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు వినతి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, త్వరితగతిన నిధులు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రులు భూపతిరాజు శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులతో కలిసి చంద్రబాబు వివిధ శాఖల కేంద్ర మంత్రులకు వినతి పత్రాలను అందచేశారు. త్వరలో కేంద్రం ప్రవేశపెట్ట బోయే బడ్జెట్‌లో రాజధాని, పోలవరం, ఇతర ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. అంతకుముందు నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంను సీఎం చంద్రబాబు కలుసుకున్నారు. అనంతరం ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా,రక్షణశాఖ మంత్రిరాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమయ్యారు.

ఏదీ మా ‘నిధి’?

రూ.1,500 సాయం కోసం ఆశగా అక్కచెల్లెమ్మల ఎదురు చూపులు

ఎన్నికల నాటికి రాష్ట్రంలో 2,10,58,615 మంది మహిళా ఓటర్లు



- పింఛన్‌దార్లను మినహాయించినా.. 1.72 కోట్ల మంది మహిళలు సాయానికి అర్హులే
- డబ్బులందక ఇప్పటికే జూన్‌లో రూ.2,588 కోట్లు నష్టపోయిన వైనం
- పోనీ భవిష్యత్తులోనైనా బకాయిలతో కలిపి చెల్లిస్తారా?.. ఇంటింటా ఆందోళన
- 19 – 59 ఏళ్ల మహిళలందరికీ ప్రతి నెలా ఇస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో కూటమి వాగ్దానం
- ఏడాది ముందే చంద్రబాబు సంతకంతో ఇంటింటికీ గ్యారంటీ కార్డుల పంపిణీ
- బాబు రావటమే ఆలస్యం.. ‘ఆడబిడ్డ నిధి’ నుంచి ఇస్తారంటూ నమ్మబలికిన టీడీపీ నేతలు.. 2014లో రైతన్నలకు, పొదుపు మహిళలకు ఇచ్చిన హామీలూ తుంగలోకి..
- బాబు హామీల అమలుకు తనది గ్యారంటీ అని చివరకు మొహం చాటేసిన జనసేనాని

సాక్షి, అమరావతి: కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం అందచేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతవరకూ ఆ హామీ అమలు ఊసే ఎత్తకపోవడం, తొలి సంతకాలలో ఆ ప్రస్తావనే లేకపోవడం, ఇప్పటికే జూన్‌లో సాయం అందక నష్టపోయిన నేపథ్యంలో కనీసం బకాయిలతో కలిపి అయినా చెల్లిస్తారా? అనే ఆందోళన కోట్లాది మంది అక్కచెల్లెమ్మల్లో వ్యక్తమవుతోంది. 19 – 59 ఏళ్ల వయసు మహిళలందరికీ ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం అందించి ఆదుకుంటామని టీడీపీ – జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజాగళంలో హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రంలో 2,10,58,615 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో వృద్ధాప్య, వితంతు తదితర పింఛన్లు తీసుకుంటున్న దాదాపు 38 లక్షల మంది మహిళలను మినహాయించినా కూటమి మేనిఫెస్టో ప్రకారం 1.72 కోట్ల మందికిపైగా అక్కచెల్లెమ్మలు రూ.1,500 చొప్పున ప్రతి నెలా సాయం పొందేందుకు అర్హులని స్పష్టమవుతోంది. ఈ హామీ అమలులో జరుగుతున్న జాప్యంతో అక్కచెల్లెమ్మలు నెలకు రూ.2,588 కోట్ల చొప్పున ఏడాదికి రూ.31,065 కోట్లు దాకా నష్టపోతున్నారు. జూన్‌లో ఇప్పటికే రూ.2,588 కోట్లు నష్టపోయారు. పోనీ భవిష్యత్తులో ఇచ్చే డబ్బులు బకాయిలతో కలిపి ఇస్తారా? అనే అనుమానాలు మహిళల్లో వ్యక్తమవుతున్నాయి. 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి ‘ఆడబిడ్డ నిధి’ నుంచి నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈమేరకు ‘భవిష్యత్తుకు గ్యారెంటీ – ఇది బాబు ష్యూరిటీ’ పేరుతో ఇంటింటికీ చంద్రబాబు సంతకంతో కూడిన కరపత్రాలను పంచారు. అధికారం దక్కించుకునేందుకు ఎడాపెడా హామీలు గుప్పించిన కూటమి నేతలు హామీల అమలుపైనా అంతే ఉత్సాహం చూపాలని ప్రజానీకం కోరుకుంటోంది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ – జనసేన– బీజేపీ కూటమిగా పోటీ చేసినా కమలనాథులతో సంబంధం లేకుండా సూపర్ సిక్స్ పేరిట టీడీపీ, షణ్ముఖ వ్యూహం పేరుతో జనసేన రూపొందించుకున్న అంశాలతో ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఏడాది ముందే బాబు సంతకంతో గ్యారంటీ కార్డులు..

ఎన్నికలకు ఏడాది ముందు నుంచే రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు ప్రతి ఇంటికీ తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున సాయంతోపాటు సూపర్ సిక్స్‌లోని అన్ని అంశాలను కచ్చితంగా అమలు చేస్తారని నమ్మబలుకుతూ ‘గ్యారంటీ’ కార్డులను కూడా పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని, తమను గెలిపించాలని ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతి బహిరంగ సభలోనూ చంద్రబాబు అభ్యర్థించిన విషయం తెలిసిందే. చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీ అమలుకు తనది గ్యారంటీ అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సైతం ఎన్నికల ప్రచార సభల్లో, రాజకీయ వేదికలపై ప్రకటించారు. ఎన్నికలు ముగిసి చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పవన్‌కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతల్లో కొనసాగుతున్న నేపథ్యంలో జాప్యం చేయకుండా మేనిఫెస్టో హామీలను నెరవేర్చి తమకిచ్చిన మాట నిలబెట్టుకోవాలని మహిళలు కోరుతున్నారు.

1.72 కోట్ల మంది నిరీక్షణ..

కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ఓటర్లుగా నమోదైన వారిలో 19–59 ఏళ్ల వయసు మహిళలంతా చంద్రబాబు మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా ప్రతి నెలా రూ.1,500 చొప్పున పొందేందుకు అర్హులేనని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. పింఛన్లు పొందుతున్న మహిళలను మినహాయించినా 1.72 కోట్ల మందికిపైగా ఈ పథకానికి అర్హులేనని పేర్కొంటున్నారు. హామీ అమలులో ఆలస్యం కారణంగా వారంతా ప్రతి నెలా రూ.2,588 కోట్ల చొప్పున నష్టపోతున్నారని గుర్తు చేస్తున్నారు.

డ్వాక్రాకు ద్రోహం..

బేషరతుగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని నమ్మబలికిన చంద్రబాబు ఐదేళ్లలో 70 లక్షల మందికి పైసా కూడా మాఫీ చేయకపోవడంతో పొదుపు సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎన్‌పీలు (నిరర్థక ఆస్తులు)గా మిగిలాయి. సంఘాలు రుణాలు కట్టకపోవడంతో బ్యాంకులు కొత్త రుణాలిచ్చేందుకు నిరాకరించాయి. నాడు సంబంధిత శాఖ మంత్రిగా ఉన్న పరిటాల సునీత తమ ప్రభుత్వం డ్వాక్రా రుణహామీని అమలు చేయలేదని అసెంబ్లీ సాక్షిగా వెల్లడించడం గమనార్హం.

అన్నదాతకు వెన్నుపోటు..

2014 ఎన్నికల నాటికి రాష్ట్రంలో రైతుల పేరిట రూ.8,7612 కోట్లు వ్యవసాయ రుణాలు ఉండగా కోటయ్య కమిటీ పేరుతో కాలయాపన చేసిన చంద్రబాబు కోతలు వేసి విడతలవారీగా అంటూ అరకొర మాఫీతో సరిపుచ్చారు. రైతు సాధికారికత పేరుతో టీడీపీ సర్కారు ఇచ్చిన రుణ బాండ్లు చెల్లుబాటు కాక చిత్తు కాగితాల్లా మిగిలిపోయాయి.

నాడు మొహం చాటేసిన జనసేనాని

ఎన్నికల హామీలను చంద్రబాబు–పవన్ కళ్యాణ్ అమలు చేస్తారా? లేదంటే 2014 తరహాలో మరోసారి మోసం చేస్తారా? అనే చర్చ ప్రజల్లో పెద్ద ఎత్తున సాగుతోంది. 2014 లోనూ టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యతను నెత్తికెత్తుకున్నానని, అమలు చేయకుంటే నిలదీసే బాధ్యత తనదేనంటూ నమ్మకంగా చెప్పిన పవన్ కళ్యాణ్ ఆ తరువాత మొహం చాటేసిన విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. 2014–19 మధ్య అధికారంలో ఉండగా హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబును నాడు జనసేనాని కనీసం ప్రశ్నించని వైనాన్ని ప్రస్తావిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రైతు రుణాల మాఫీతోపాటు డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తానంటూ నాడు కుప్పలు తెప్పలుగా హామీ లిచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా నిలువునా వంచించిన విషయం తెలిసిందే. అప్పట్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా మేనిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్ నుంచి మాయం చేయడం గమనార్హం.

మండలిపై పట్టు కోసమే!

▶ మొదటి పేజీ తరువాయి

సుఖేందర్‌రెడ్డి కూడా ఇటీవలి కాలంలో బీఆర్‌ఎస్‌తో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి గతంలో బీఆర్‌ఎస్‌తో సన్నిహితంగా కొనసాగినా, ప్రస్తుతం ఆయన కూడా దూరం పాటిస్తున్నారు.

మరో టర్మ్ పొడిగిస్తామనే హామీతోనే..?

మండలిలో బడ్జెట్, ప్రభుత్వ బిల్లులు, తీర్మానాలకు ఆమోదం పొందడం కాంగ్రెస్‌కు సవాలుగా మారింది. కీలక బిల్లులు మండలిలో పాస్ అయ్యేందుకు బీఆర్‌ఎస్ మోకాలు అడ్డుతుందని భావిస్తున్న కాంగ్రెస్ చేరికల ద్వారా బలోపేతం అయ్యేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో మరో దఫా పదవి ఇస్తామనే హామీతో ఎమ్మెల్సీలకు కాంగ్రెస్ ఎర వేస్తున్నట్లు తెలిసింది. పార్టీ మారిన ఎమ్మెల్సీల్లో ఎగ్గే మల్లేశం వచ్చే ఏడాది మార్చి 25న, ఎంఎస్ ప్రభాకర్‌రావు వచ్చే ఏడాది ఆగస్టు 6న ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటున్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, బసవరాజు సారయ్య 2026 నవంబర్‌లో, మిగతా ఎమ్మెల్సీలు 2028 జనవరిలో పదవీ కాలం పూర్తి చేసుకుంటారు. అయితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల్లో స్థానిక సంస్థలు, ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైన వారే ఎక్కువగా ఉన్నారు. దీంతో పార్టీ మారే వారిలో వారే ఎక్కువగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించింది. ఈ ఇద్దరి పేర్లను నాటి గవర్నర్ తమిళిసై తిరస్కరించడంతో తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాంతో పాటు అమేర్ అలీఖాన్‌ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. ఈ అంశంలో గవర్నర్ తీసుకోబోయే నిర్ణయం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శిబిరాల్లో ఉత్కంఠ రేపుతోంది.

అండగా నిలుస్తాం.. ధైర్యంగా ఉండండి

టీడీపీ అరాచకాలకు బలై ఊరు విడిచిన వారికి వైఎస్ జగన్ భరోసా



తనను కలసిన నేతలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో టీడీపీ విధ్వంసాలు, అరాచకాలకు బలై ఊరొదిలి పక్క రాష్ట్రాల్లో ఉంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా నిలుస్తామని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యం చెప్పారు. త్వరలోనే తిరిగి స్వస్థలాలకు వచ్చి ఇళ్లలో ఉండేలా న్యాయ పరమైన చర్యలకు ఉపక్రమిస్తామని చెప్పారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని పార్టీ లీగల్ సెల్ నేతలను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు పార్టీ నేతలు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వైఎస్ జగన్‌ను కలిసి వారి ప్రాంతాల్లోని పరిస్థితుల గురించి వివరించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి తదితరులు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాల అనంతరం పల్నాడు జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకున్న సంఘటనల గురించి కాసు మహేష్‌రెడ్డి జగన్‌కు వివరించారు. టీడీపీ వరుస దాడులతో పలువురు నేతలు, అభిమానులు పక్క రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు వలస వెళ్లారని చెప్పారు. ఆయా ప్రాంతాలకు వలస వెళ్లిన వారి తరఫున వచ్చిన ప్రతినిధులను జగన్‌కు పరిచయం చేస్తూ.. పరిస్థితిని వివరించారు. వారందరి కష్టాలు విన్న జగన్.. పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులను పిలిపించి అక్కడికక్కడే పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కాగా, టీడీపీ దాడులతో ఎంతో మంది ఊళ్లు వదిలారని బీబీసీలో వచ్చిన కథనం గురించి ఈ భేటీలో చర్చకు వచ్చింది.

ప్రజాభిప్రాయం మేరకే ‘రైతు భరోసా’

▶ మొదటి పేజీ తరువాయి

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్‌రావులతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాగులో లేకున్నా రైతుబంధు ఇచ్చారు!

గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు అమలు చేసిన తీరు, సీజన్‌ల వారీగా అయిన ఖర్చు, ఎంత మంది రైతులకు.. ఎన్ని ఎకరాల భూమి ఉందన్న అంశాలను వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు ఉపసంఘానికి వివరించారు. గత రెండు సీజన్‌లలో రైతుబంధు ఇచ్చిన తర్వాత తమ శాఖ నేతృత్వంలో పరిశీలన జరిపామని, ఈ సందర్భంగా ఎలాంటి సాగు చేయకుండానే 20 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చినట్టు తేలిందని ఆయన వెల్లడించారు. ఈ 20 లక్షల ఎకరాల్లో వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నా సాగు చేయ కపోవచ్చని, ప్లాట్లు, కొండలు, గుట్టలు కూడా ఉండవచ్చని తెలిపారు. అనంతరం మంత్రులు మాట్లా డుతూ.. ఎవరెవరికి రైతు భరోసా అమలు చేయాల న్న దానిపై తొందరపడకూడదని, ప్రజల డబ్బును ప్రజల అభిప్రాయం మేరకు వెచ్చించాలని, వారి అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఎలాంటి భూము లకు రైతు భరోసా వర్తింపజేయాలి, ఎన్ని ఎకరాల వరకు అమలు చేయాలన్న దానిపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సాగు చేసే ప్రతి ఎకరానికీ రైతు భరోసా ఇస్తామని, వరంగల్ డిక్లరేషన్‌లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు కూడా ఈ సాయాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రజల అభిప్రాయం తీసుకున్న తర్వాత మరోమారు సమావేశం కావాలని మంత్రులు నిర్ణయించారు.

రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గిద్దామా?

- ఇప్పుడున్న 7.5 శాతంలో ఒక శాతం తగ్గిస్తే ఏమవుతుంది?
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో రెవెన్యూ మంత్రి పొంగులేటి భేటీ
- భూముల విలువల సవరణ నేపథ్యంలో ఫీజు తగ్గింపుపై చర్చ
- వచ్చే వారం లోపు భూముల విలువల సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఫీజును ఒక శాతంమేర తగ్గిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై నివేదిక సమర్పించాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫీజు తగ్గింపు అంశం చర్చకు వచ్చింది. ఎలాగూ భూముల విలువలను సవరిస్తున్నందున సామాన్య ప్రజలపై భారం పడకుండా ఒక శాతం ఫీజు తగ్గిస్తే ఎలా ఉంటుందన్న అంశాన్ని చర్చించినట్లు సమాచారం. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతిబుద్ధ ప్రకాశ్‌లతో పాటు పలువురు డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా రిజిస్ట్రేషన్ల శాఖ పనితీరు, భూముల విలువల సవరణ, కొత్త సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం, బదిలీలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సామాన్యుడిపై భారం పడకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలను సవరించాలని, బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలకు అనుగుణంగా ఈ సవరణ చేపట్టాలని సూచించారు. వచ్చే వారంలోపు సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా సబ్‌రిజిస్ట్రార్లు పనిచేయాలని మంత్రి సూచించారు. త్వరలోనే శాఖ పరిధిలో బదిలీలు జరగనున్నాయని, ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని, బది లీల కోసం ఎవరూ తన వద్దకు రావద్దని, పైరవీలు చేసే వారిపై చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించినట్టు సమాచారం. ఇక, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి చెట్ల కింద వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని హంగులతో శాశ్వతంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు భవనాలు నిర్మించే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి కోరారు.

హంతకుడికి అనుకూలంగా సీబీఐ వాదనలా?

- ఇలాంటి ఘటన ఇంతవరకు ఎప్పుడూ చూడలేదు
- సీబీఐ కోర్టులో ఎంపీ అవినాశ్ తరఫు న్యాయవాది వాదనలు
- తనను సాక్షిగా పరిగణించాలని వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: తానే హత్య చేశానని ఒప్పుకున్న ఓ హంతకుడికి అనుకూలంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వాదనలు వినిపించడం గతంలో ఎప్పుడూ చూడలేదని ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇలా వ్యవహరిస్తే ఇక ఆ దర్యాప్తు ఎలా ఉంటుందో అర్థంచేసుకోవచ్చన్నారు. హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున తనను నిందితుల జాబితా నుంచి తొలగించి సాక్షిగా పరిగణించాలని కోరుతూ దస్తగిరి హైదరాబాద్ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి రఘురాం శుక్రవారం వాదనలు చేపట్టారు. సీబీఐ తరఫున అనిల్ తల్వార్ వాదనలు వినిపించగా.. అవినాశ్ తరఫున న్యాయవాది ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. చార్జిషీట్‌లలో నిందితుడిగా పేర్కొన్న వ్యక్తిని ఆ తర్వాత సాక్షిగా మార్చడం చట్టవిరుద్ధమన్నారు. ఓ కరుడుగట్టిన హంతకుడు అప్రూవర్‌గా మారినంత మాత్రాన సాక్షిగా పేర్కొనడం సమర్థనీయం కాదన్నారు. ఈ పిటిషన్‌లో సీబీఐ ప్రతివాదిగా ఉందని.. అయితే, వారి న్యాయవాది మాత్రం పిటిషనర్ తరఫున వాదనలు వినిపించడం దారుణమన్నారు. వాదనలను పూర్తికావడంతో న్యాయమూర్తి తీర్పును ఈనెల 18కి వాయిదా వేశారు. న్యాయవాదులు రవీందర్‌రెడ్డి, టీఎల్ నయన్‌కుమార్‌రెడ్డి తదితరులు నిందితుల తరఫున వాదనలు వినిపించారు.

త్వరలో జాబ్ కేలండర్

▶ మొదటి పేజీ తరువాయి

టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భేటీలో భాగంగా నిరుద్యోగుల డిమాండ్ల గురించి సీఎం ఆరా తీశారు. సీఎస్ శాంతికుమారితో పాటు సంబంధిత అధికారులతో నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకున్న సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

జాబ్ కేలండర్ ప్రకారం భర్తీకి ప్రయత్నాలు: సీఎం

‘నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలు చేపట్టాం. గ్రూప్–1,2,3 ఉద్యోగాలకు సంబంధించి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కోర్టు చిక్కులన్నింటినీ అధిగమించాం. జాబ్ కేలండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాల భర్తీ కోసం ప్రయత్నిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ నియామక పరీక్షలు, ఇతర బోర్డులు నిర్వహించే పరీక్షలతో ఆటంకాలు కలగకుండా రాష్ట్రంలోని నిరుద్యోగులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా కేలండర్ రూపొందిస్తున్నాం. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం కూలంకషంగా కసరత్తు చేస్తోంది. కొందరు మాత్రం రాజకీయ ప్రయోజనల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వారు చేస్తున్న కుట్రలతో నోటిఫికేషన్లలోని నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిలిచిపోవడంతో పాటు నోటిఫికేషన్లు రద్దయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావొద్దు. గత ప్రభుత్వం లాగా మేం తప్పుడు నిర్ణయాలు తీసుకోలేం. పరీక్షలు జరుగుతున్న సమయంలో నిబంధనలు మారిస్తే చట్టపరంగా తలెత్తే అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్తాం..’ అని ముఖ్యమంత్రి చెప్పారు.

1:100కు పెంచితే కోర్టులు జోక్యం చేసుకునే చాన్స్: టీజీపీఎస్సీ

గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలన్న డిమాండ్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ అధికారులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2022లో నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా రెండుసార్లు వాయిదా పడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుప్రీంలో ఉన్న పిటిషన్‌ను వెనక్కు తీసుకుని, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో పోస్టుల సంఖ్యను పెంచి కొత్తనోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. 12 ఏళ్ల తర్వాత నిర్వహించిన గ్రూప్–1 పరీక్షకు 4 లక్షల మంది హాజరయ్యారని, ప్రిలిమ్స్‌ను పూర్తి చేశామని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం 1:50 పద్ధతిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తున్నామని వివరించారు. ఇప్పుడు ఆ నిష్పత్తిని 1:100కు పెంచితే కోర్టులు జోక్యం చేసుకునే అవకాశముందని, అదే జరిగితే మళ్లీ నోటిఫికేషన్ నిలిచిపోతుందని చెప్పారు. నోటిఫికేషన్‌లోని నిబంధనల మార్పు న్యాయపరంగా చెల్లుబాటు కాదని, బయోమెట్రిక్ పద్ధతి పాటించలేదన్న ఏకైక కారణంతో హైకోర్టు గ్రూప్–1 పరీక్షను రెండోసారి రద్దు చేసిందని గుర్తు చేశారు. 1999లో యూపీపీఎస్సీ వర్సెస్ గౌరవ్ ద్వివేది కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా వారు ఉదహరించారు.

గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల పెంపు సాధ్యం కాదు

గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల పెంపు అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నందున పోస్టులు పెంచడం ఇప్పుడు సాధ్యం కాదని, అలా జరిగితే అది నోటిఫికేషన్ ఉల్లంఘన అవుతుందని అధికారులు సీఎంకు వివరించారు. అప్పుడు కూడా కోర్టులు జోక్యం చేసుకునే పరిస్థితి ఉంటుందని తెలిపారు. కాగా గ్రూప్–2, డీఎస్సీ పరీక్షలు వెంటవెంటనే ఉండడంతో అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తోందని విద్యార్థి సంఘాల నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జూలై 17 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలున్నాయని, వెంటనే 7, 8 తేదీల్లో గ్రూప్–2 పరీక్ష ఉండడంతో విద్యార్థులు ప్రిపరేషన్‌కు ఇబ్బంది అవుతుందని వివరించారు. కాగా టీజీపీఎస్సీ, విద్యాశాఖలు చర్చించి ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకుంటాయని సీఎం వారికి హామీ ఇచ్చారు.

కార్మిక రంగ సంస్కరణలపై సదస్సు

హాజరైన కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా



సాక్షి, హైదరాబాద్: కార్మికులు, ఉద్యోగులకు సంబంధించి సంస్కరణలపై శుక్రవారం హోటల్ ట్రిడెంట్‌లో సదస్సు జరిగింది. తెలంగాణ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (టీజీసీఐఐ), ఎంప్లాయర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన సంస్కరణలు, కార్మికులు, ఉద్యోగ కల్పన విషయంలో సమస్యలు, ప్రభుత్వంతో పరిశ్రమల సమన్వయం వంటి అనేక అంశాలు చర్చించుకున్నారు. సమస్యల పరిష్కారానికి సరైన పాలసీ రూపకల్పన ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ, నేషనల్ కెరీర్ సర్వీస్ ప్రారంభించిన ఈజ్ ఆఫ్ డూయింగ్, కొత్తగా అమల్లోకి వచ్చిన కార్మిక చట్టాల గురించి విస్తృతమైన చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రాతో పాటు రాష్ట్ర కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్, సీఐఐ తరఫున సొగతారాయ్ చౌదరి, ఈఎఫ్ఐ నుంచి మధు దామోదరన్, ఈపీఎఫ్‌వో భారతీయ మజ్దూర్ సంఘం నుంచి సుంకరి మల్లేశం, కమిషనర్లు సత్యనారాయణ, ఆరిఫ్ లోహానీ, ఆర్‌పీఎఫ్‌సీ–1 (ఆర్‌వో, హైదరాబాద్) శివకుమార్, ఆర్‌పీఎఫ్‌సీ–1 హెడ్‌ఆఫీస్ అశ్వినీకుమార్ గుప్తా, ఆర్‌పీఎఫ్‌సీ–(ఆర్‌వో, పటాన్‌చెరు) విశాల్ అగర్వాల్ తదితరులు హాజరయ్యారు.

పరిశ్రమలకు ఎలాంటి సమస్యలు రానివ్వం

▶ మొదటి పేజీ తరువాయి

రానివ్వబోమని అన్నారు. ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్‌ల మధ్యలో ఫార్మా క్లస్టర్లు నిర్మించి పరిశ్రమను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. మాదా పూర్‌లోని హైటెక్స్‌లో మూడురోజుల పాటు కొనసాగే 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌ను శుక్రవారం మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలసి ఆయన ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణకు ఫార్మా పరిశ్రమ వెన్నెముక లాంటిదని భట్టి పేర్కొన్నారు. అత్యధిక నాణ్యతతో జనరిక్ మెడిసిన్ ఉత్పత్తి చేసి ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేస్తూ తెలంగాణ గుర్తింపు సాధించిందన్నారు. కరోనా కాలంలో ఫార్మాసిస్టులు అసమానమైన చురుకుదనం ప్రదర్శించి అవిశ్రాంతంగా శ్రమించారని అభినందించారు. రాష్ట్రంలో కొత్త విద్యుత్ పాలసీని తీసుకురాబోతున్నట్టు భట్టి తెలిపారు. మిగులు విద్యుత్ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

ఆస్పత్రుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గ్రామీణ ఆస్పత్రుల అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందిగా ఫార్మా దిగ్గజాలకు మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కంపెనీలు తమ సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు కేటాయించాలని కోరారు. హైదరాబాద్‌లో టిమ్స్, వరంగల్‌లో గవర్నమెంట్ సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ రూ.8 వేల కోట్లతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్టు తెలిపారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ చైర్మన్ బి.పార్థసారథి రెడ్డి, భారత్ బయోటెక్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా, ఫార్మా కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మొంటుకుమార్ పటేల్, డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజీవ్ రఘువంశీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మొత్తం 8,500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

అమీన్‌పూర్‌లో ఫార్మా హెల్త్‌కేర్ ఐటీ హబ్

- పల్సస్ గ్రూప్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ట్రాన్స్‌ఫార్మేటివ్ ఏఐ డ్రివెన్ ఫార్మా హెల్త్‌కేర్ ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పల్సస్ గ్రూప్ తెలిపింది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. ఏఐ ఫార్మా హబ్ ఏర్పాటుతో దాదాపు 10 వేల ప్రత్యక్ష ఉద్యోగాలను కల్పిస్తామని పేర్కొంది. అమీన్‌పూర్‌లోని ఐటీ/ఐటీఈఎస్ జోన్‌లో అద్భుతమైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు ఉండడం హబ్‌కు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ సహా 1,400కు పైగా సైన్స్, టెక్నాలజీ, మెడికల్ జర్నల్స్‌ను ప్రచురించే గొప్ప వారసత్వంతో పల్సస్ గ్రూప్ సమాజానికి గణనీయమైన సహకారం అందిస్తోందని పేర్కొంది.

హెల్త్‌కేర్ ఐటీ హబ్ ప్రయోజనాలు ఇలా...

- రోగులకు మెరుగైన వైద్య సేవలు
- ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణల్లో తెలంగాణ అగ్రగామిగా మారుతుంది
- 10 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన
- అనుబంధ పరిశ్రమలు, సేవల ద్వారా 40 వేల పరోక్ష ఉద్యోగాలు
- స్థానికులకు గణనీయమైన ఉపాధి అవకాశాలు.

ఒకరిద్దరు కాదు.. రెవెన్యూ వ్యవస్థలోనే లోపాలు

రిజిస్ట్రేషన్ల తీరుపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: ఒకరిద్దరు అధికారులు కాదు.. అసలు రెవెన్యూ వ్యవస్థలోనే లోపాలు న్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. కోర్టులో విచారణ ముగిసినా మళ్లీ ఆదేశాలు తీసుకురావాలంటూ వేధించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదవాళ్లు కొద్దోగొప్పో భూమి కొనుగోలు చేద్దాం అనుకుంటే రిజిస్ట్రేషన్, జీఎస్టీ, స్టాంపు డ్యూటీ వసూలు చేస్తున్నారని, ఇప్పుడు బాధితులకు కోర్టు ఫీజులు అదనంగా మారాయని పేర్కొంది. ఎలాంటి నిషేధ ఉత్తర్వులు లేకున్నా పిటిషనర్లకు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయలేదని పెద్దఅంబర్‌పేట్ సబ్‌రిజిస్ట్రార్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు వివాదం పరిష్కారమైన తర్వాత కూడా రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అనంత రామేశ్వరిదేవితో పాటు మరికొందరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇలాంటి సబ్‌రిజిస్ట్రార్‌లకు ప్రభుత్వ న్యాయ వాదులైనా సలహా ఇవ్వరా? అని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ ఎందుకు చేయలేదో కారణాలు తెలియజేస్తూ తదుపరి విచారణలోగా రాతపూర్వకంగా కౌంటర్ దాఖలు చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. విచారణను ఈనెల 9కి వాయిదా వేశారు.

'ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను అరెస్టు చేయొద్దు'

సాక్షి, హైదరాబాద్: బోరబండ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను అరెస్టు చేయొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాలిచ్చేవరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టంచేసింది. అలాగే విచారణకు సహకరించాలని పిటిషనర్ (గోపీనాథ్)కు సూచించింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మే 9న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 200 మందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గోపీనాథ్ పాల్గొన్నారు. తాము మసీద్‌లో ప్రార్థనలు నిర్వహిస్తుండగా విపరీత శబ్దంతో, బైక్ హారన్ల మోతతో ర్యాలీ నిర్వహించారని పేర్కొంటూ కొందరు బోరబండ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు గోపీనాథ్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. దీంతో తనను పోలీసులు అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి ఆదేశాలిచ్చే వరకు గోపీనాథ్‌ను అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలిస్తూ విచారణ ఈనెల 19కి వాయిదా వేశారు.

పరిశ్రమల భూములు తాకట్టు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పించడంలో అనుభవజ్ఞులైన 'మర్చంట్ బ్యాంకర్' కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్వేషణ సాగిస్తోంది. అందులో భాగంగా గత నెల 23న తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) ప్రతిపాదనలు కోరుతూ టెండర్ ప్రకటన విడుదల చేసింది. అయితే టెండర్ ప్రకటనలో విధించిన పలు అంశాలపై మర్చంట్ బ్యాంకర్ల నుంచి కొన్ని విన్నపాలు అందాయి. వాటిని పరిగణనలోకి తీసుకుంటూ తిరిగి గత నెల 28న టెండర్ నిబంధనలు సవరిస్తూ మరో ప్రకటన విడుదల చేయడంతోపాటు బిడ్ల దాఖలుకు ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువుగా పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు బిడ్‌లను తెరుస్తామని టీజీఐఐసీ ప్రకటించింది. అయితే టెండర్ డాక్యుమెంట్‌లో కొన్ని లోపాలు ఉన్నట్టు గమనించిన టీజీఐఐసీ గత నెల 23న ఇచ్చిన టెండర్‌ను ఈనెల 2న రద్దు చేసింది. ఆ లోపాలను సరిదిద్ది తిరిగి ఒకటి రెండు రోజుల్లో తాజా టెండర్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది.

బ్యాంకర్ల ఎంపిక బాధ్యత టీజీఐఐసీకి

ఒకరి కంటే ఎక్కువ మర్చంట్ బ్యాంకర్లను నియమించే అధికారం టీజీఐఐసీ నేతృత్వంలోని కమిటీకి అప్పగించినా, ఆర్థికశాఖనే కీలకపాత్ర పోషించనుంది. ఒకరి కంటే ఎక్కువ మర్చంట్ బ్యాంకర్లను నియమించే పక్షంలో సమపాళ్లలో బాధ్యతలు తీసుకొని నిర్దేశిత రుణం సేకరించాలి. పాత టెండర్ నోటిఫికేషన్ ప్రకారం బిడ్‌లో పాల్గొనే మర్చంట్ బ్యాంకర్లు రూ.50 లక్షలు ధరావత్తుగా చెల్లించాల్సి ఉంటుంది. భూములు తనఖా పెట్టడం సహా ఇతర సాంకేతిక, చట్టపరమైన అంశాలన్నీ మర్చంట్ బ్యాంకర్ ప్రభుత్వంతో సంప్రదిస్తూ పూర్తి చేయాల్సి ఉంటుంది. ముంబయికి చెందిన అరడజను మంది మర్చంట్ బ్యాంకర్లు ఈ ప్రతిపాదనకు ఆసక్తి చూపుతూ ఇప్పటికే బిడ్‌లు దాఖలు చేసినట్టు సమాచారం. అయితే టెండర్ నోటిఫికేషన్ రద్దు చేయడంతో బిడ్‌ల దాఖలు ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది.

రూ.10 వేల కోట్ల సేకరణ లక్ష్యం...

హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ కార్యకలాపాలు మందగించడంతో భూముల వేలం సాధ్యం కాదని, ఆశించిన మొత్తంలో నిధులు సమకూరే అవకాశం లేదని ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. దీంతో టీజీఐఐసీ అధీనంలో ఉన్న భూములను తాకట్టు పెట్టడం ద్వారా కనీసం రూ.10వేల కోట్లు అప్పుగా తేవాలని నిర్ణయించింది. ఇప్పటికే బిడ్‌లో దాఖలు చేసిన మర్చంట్ బ్యాంకర్లు, ఫైనాన్స్ సంస్థలు కూడా వేర్వేరుగా తాకట్టు కోసం ఎంపిక చేసిన భూముల విలువ (వాల్యూయేషన్) లెక్కగట్టినట్టు సమాచారం. ఒక్కో ఎకరానికి గరిష్టంగా రూ.50 కోట్ల చొప్పున 400 ఎకరాల విలువను రూ.20వేల కోట్లుగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ భూముల తాకట్టు ద్వారా లెక్కించిన విలువలో సగం మొత్తం అంటే.. రూ.10 వేల కోట్లు రుణ మార్కెట్ నుంచి అప్పు తేవడం సాధ్యమవుతుందని మర్చంట్ బ్యాంకర్లు భావిస్తున్నట్టు తెలిసింది. 400 ఎకరాలను తాకట్టు పెట్టినా రూ. 10 వేల కోట్లు అప్పు పుట్టకుంటే.. అదనంగా మరింత భూమిని కూడా తాకట్టు పెట్టి అయినా రుణం తెచ్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రక్రియ ద్వారా రెండు నెలల్లో రూ.10 వేల కోట్లు సేకరించి ఇవ్వాలని ప్రభుత్వం కోరుతుండగా, కనీసం ఆరు నెలలు గడువు కావాలని మర్చంట్ బ్యాంకర్లు చెబుతున్నట్టు సమాచారం.

ఆర్‌బీఐ అడ్డుకుంటుందనే అనుమానాలు

రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ఏ తరహా రుణాలైనా ఎఫ్ఆర్‌బీఎం గరిష్ట రుణ పరిమితికి లోబడే ఉండాలని రిజర్వు బ్యాంకు ఇండియా ఇదివరకే స్పష్టం చేసింది. అయితే భూముల తాకట్టు ద్వారా తెచ్చే అప్పులకు ఈ నిబంధన వర్తిస్తుందా లేదా అనే అంశంపై ఆర్థికశాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రుణమార్కెట్ నుంచి తెచ్చే అప్పులకు సంబంధించిన సమాచారం ఆర్‌బీఐకి కూడా ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. భూములను కుదువపెట్టి తెచ్చే అప్పులకు ఆర్‌బీఐ అభ్యంతరాలు చెబితే ఏం చేయాలనే దానిపై ఆర్థిక, పరిశ్రమల శాఖల అధికారులు అధ్యయనం చేస్తున్నట్టు తెలిసింది.

సీఎం వ్యక్తిగతంగా ఐటీ చెల్లించాలి

డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్ తదితరులు కూడా..

- ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించడం సరికాదు
- ఎవరి వేతనానికి వారే పన్ను చెల్లించాలన్నది చట్టం
- 'ముఖ్యుల'కు ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లింపుపై పిల్
- 8న విచారణ చేపట్టనున్న సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్, కేబినెట్ ర్యాంక్ ఉన్న సలహాదారులంతా ప్రభుత్వ ఉద్యోగులే. వీరు తీసుకుంటున్న వేతనంపై ఐటీ చెల్లించాలి. అయితే వ్యక్తిగతంగా వీరు పన్ను చెల్లించకుండా.. ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లిస్తున్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నుల నుంచి వేతనాలు పొందుతూ, మళ్లీవారు కట్టే పన్నులు కూడా ఖజానా నుంచి చెల్లించడం సరికాదు. ఐటీ చట్టం ప్రకారం వేతనాలు పొందుతున్న వారే పన్ను చెల్లించాలి. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు వ్యక్తిగతంగా పన్ను చెల్లిస్తున్నప్పుడు పైన పేర్కొన్న వ్యక్తులు కూడా అలాగే చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలి' అంటూ ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ హైకోర్టును ఆశ్రయించింది. ఎన్జీఓ తరఫున సోమ శ్రీనివాస్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, జీఏడీ ముఖ్యకార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

పిటిషన్‌లోని మరికొన్ని అంశాలు..

- ఏపీ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ డిస్ క్వాలిఫికేషన్ యాక్ట్ 1953 సెక్షన్ 3లోని సబ్‌సెక్షన్ 4 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పన్ను చెల్లిస్తోంది. ఈ చట్టాన్ని రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలి. ఒకే రాష్ట్రంలో ఒకరి పన్ను రెండు రకాలుగా ప్రభుత్వ ఉద్యోగుల పన్ను చెల్లించడం సరికాదు.
- ఐటీ చట్టం ప్రకారం.. ఎవరు పొందే వేతనానికి వారే పన్ను కట్టాలి. దీనికి సీఎం, డిప్యూటీ సీఎం సహా ఎవరూ అతీతులు కాదు.
- వీరందరికీ ప్రభుత్వం ఎంత పన్ను చెల్లిస్తుంది అనే వివరాలపై ఆరేళ్లుగా ఎలాంటి జీఓ లేదు. ఆ వివరాలు కూడా ఎక్కడా పేర్కొనలేదు.
- జీఏడీకి సమాచారహక్కు చట్టప్రకారం దరఖాస్తు చేసుకున్నా సమాచారం ఇచ్చేందుకు నిరాకరించారు. అది వ్యక్తిగతం, గోప్యతకు సంబంధించినది పేర్కొన్నారు.
- ప్రజలు కట్టే పన్ను నుంచి చెల్లిస్తున్నప్పుడు అది వ్యక్తిగతం కాదు.. గోప్యత పాటించాల్సిన అవసరం లేదు. పదేళ్లుగా కోట్లాది రూపాయలు ఇలా చెల్లించినట్టు సమాచారం.
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్, మండలి చైర్మన్, కేబినెట్ హోదా ఉన్న సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, అసెంబ్లీ, మండలిలో చీఫ్‌విప్, ప్రతిపక్ష నేతలు, పార్లమెంటరీ సెక్రటరీలు, ప్రెస్ అకాడమీ చైర్మన్, ఇతర కేబినెట్ ర్యాంక్ వ్యక్తుల పన్ను ప్రభుత్వమే చెల్లిస్తోంది.
- సీఎం, డిప్యూటీ సీఎంలకు ఐటీ మినహాయింపులు కూడా ఇవ్వడానికి వీలులేదు.
- ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, ఉత్తరాఖండ్‌లో ప్రభుత్వ పన్ను చెల్లింపు విధానాన్ని నిలిపివేసింది. ఆ రాష్ట్రాల్లో ఉన్నట్టే మన రాష్ట్రంలోనూ చట్టంలో మార్పులు చేయాలి.

నీట్-యూజీ కౌన్సెలింగ్‌పై అయోమయం!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. ఈ క్రమంలో విద్యార్థులంతా కౌన్సెలింగ్‌కు సన్నద్ధమయ్యారు. కానీ ఇప్పటివరకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) యూజీ నీట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించలేదు. కేంద్రం ప్రకటించిన తేదీ సమీపించినా షెడ్యూల్ జాడలేకపోవడంతో కౌన్సెలింగ్‌పై సందిగ్ధం నెలకొంది. మరోవైపు విద్యార్థుల్లో రోజురోజుకూ ఆందోళన తీవ్రమవుతోంది.

తరగతుల ప్రారంభం మరింత జాప్యం..


యూజీ నీట్ పరీక్ష మే మొదటి వారంలోనే నిర్వహించడంతో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ నెల మూడో వారం నాటికి ప్రారంభమవుతుందని తొలుత అంచనాలు వెలువడ్డాయి. కానీ ఫలితాల విడుదల.. ఆ తర్వాత నెలకొన్న పరిస్థితులతో కేంద్ర ప్రభుత్వం కలగజేసుకుని జూలై 6వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. యూజీ నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహిస్తే అన్ని కేటగిరీల్లో సీట్ల భర్తీకి కనీసం నెలన్నర సమయం పడుతుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జూలై 6వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైతే ఆగస్టు మూడో వారం నాటికి తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉండేది. కానీ ఇప్పటివరకు కౌన్సెలింగ్ షెడ్యూల్ వెలువడకపోవడంతో ఈ ఏడాది తరగతుల ప్రారంభం మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. కోవిడ్-19 సమయంలో నీట్ అడ్మిషన్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. దీంతో 2020 ఏడాదిలో ప్రవేశాల ప్రక్రియ దాదాపు డిసెంబర్ వరకు సాగింది. ఆ అంతరాన్ని తొలగించేందుకు నాలుగేళ్లుగా ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. అప్పటినుంచి ఎంబీబీఎస్ విద్యార్థులకు సెలవులు తగ్గించడం.. తరగతుల నిర్వహణకు ఎక్కువ సమయం కేటాయించడం తదితర అంశాలతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోంది.

మానసిక ఒత్తిడిలో నీట్ విద్యార్థులు

మరోవైపు యూజీ నీట్-2024 పరీక్షను మరోమారు నిర్వహించాలనే ఆందోళనలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఇప్పుడు వెలువడిన ఫలితాల ఆధారంగానే అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందా? లేక కొత్తగా పరీక్ష నిర్వహిస్తారా? అనే అంశంపై స్పష్టత లేదు. ఈ అస్పష్టమైన పరిస్థితి విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈసారి నీట్ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించినప్పటికీ ఆయా విద్యార్థులకు ర్యాంకులు లక్షల్లోకి ఎకబాకాయి. రాష్ట్రస్థాయి ర్యాంకులు వెలువడితే ఆమేరకు సీటు ఎక్కడ వస్తుందో అంచనా వేయొచ్చు. కానీ ఇప్పటివరకు రాష్ట్రస్థాయి ర్యాంకులు వెలువడకపోవడంతో విద్యార్థుల్లో ఉత్కంఠ రోజురోజుకూ పెరుగుతోంది. సీటు రాకుంటే తమ పరిస్థితి ఏమిటని విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారు.

26 వారాల పిండాన్ని తొలగించండి

గాంధీ ఆస్పత్రికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గ్యాంగ్‌రేప్ బాధితురాలు, మైనర్ బాలిక(12) 26 వారాల గర్భస్థ పిండాన్ని తొలగించాలని గాంధీ ఆస్పత్రి వైద్యులను హైకోర్టు ఆదేశించింది. బాధితురాలు, ఆమె తల్లి అనుమతి తీసుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కాచిగూడకు చెందిన ఓ మైనర్ బాలికపై 10 మంది ఆరు నెలలకుపైగా అత్యాచారానికి పాల్పడగా, నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా, బాలిక గర్భం దాల్చడంతో ఆమె తల్లి అబార్షన్ కోసం గాంధీ ఆస్పత్రి వైద్యులను సంప్రదించింది. అయితే బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అబార్షన్‌కు నిరాకరించారు. దీంతో బాలిక తల్లి హైకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తెకు అబార్షన్ చేసేలా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం బాలిక ఆరోగ్యస్థితిపై నివేదిక అందజేయాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశిస్తూ, విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. సీల్డ్ కవర్‌లో అధికారులు నివేదిక అందజేశారు. నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి.. బాలిక, తల్లి అనుమతితో అబార్షన్ చేయాలని గాంధీ వైద్యులను ఆదేశించారు.

సాక్షి రియల్టీ

ఫైవ్ స్టార్ హోమ్స్

పలాజో.. 55 అంతస్తులు

- ఇండోర్ వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు
- ప్రాజెక్ట్‌లోనే వ్యాయామం చేసుకునే వీలు
- దీని పక్కనే 11 లక్షల చ.అ.ల్లో ఐటీ భవనం
- ఈ ఏడాది మదీనాగూడలో జీ+45 అంతస్తుల్లో మరో ప్రాజెక్ట్



సాక్షి, హైదరాబాద్: మేఘాలు, నక్షత్రాల మధ్యలో స్విమ్మింగ్ చేసే అనుభూతిని ఆస్వాదించాలంటే పలాజోకు వెళ్లాల్సిందే! నిజమే.. ప్రముఖ నిర్మాణ సంస్థ పౌలోమి ఎస్టేట్స్ కోకాపేటలో 55 అంతస్తుల అద్భుతమైన ప్రాజెక్ట్‌ను తీర్చిదిద్దుతోంది. విశాలమైన లాబీ.. డబుల్ హైట్ బాల్కనీ.. ప్రత్యేకమైన డిజైన్‌తో ఫైవ్ స్టార్ హోటల్‌ను తలపించేలా గృహాలను నిర్మిస్తోంది. ప్రాజెక్ట్‌కు ముందు భాగంలో ఔటర్, వెనకాల పార్క్ ఉండటంతో చూడచక్కని వ్యూతో పాటు ధారాలమైన గాలి, వెలుతురు, ఆహ్లాదకర వాతావరణం నివాసితుల అనుభూతి రెట్టింపు అవుతుంది.

- అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కోకాపేటలో విల్లా ప్రాజెక్ట్ చేయాలంటే స్థల లభ్యత తక్కువ. ఒకవేళ స్థలం దొరికినా ఖరీదెక్కువ. ఇలాంటి చోట లగ్జరీ హైరైజ్ ప్రాజెక్ట్ చేస్తే బెటరనే ఉద్దేశంతో పలాజో ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. 2.3 ఎకరాల్లో 141 అపార్ట్‌మెంట్లుంటాయి. 6,225 చ.అ. అండ్ 8,100 చ.అ.ల్లో ఫ్లాట్ల విస్తీర్ణాలుంటాయి. 2022 అక్టోబర్‌లో ప్రాజెక్ట్ ప్రారంభం కాగా.. ప్రస్తుతం క్లబ్‌హౌస్, బేస్‌మెంట్ నిర్మాణాలు పూర్తయ్యాయి. 2026 డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్ పూర్తవుతుంది. 74 శాతం విక్రయాలు పూర్తయ్యాయి. ధర చ.అ. రూ.15 వేలు. పలాజోలో ఎక్కువగా వ్యాపారస్తులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కొనుగోలు చేస్తున్నారు. 10–15 శాతం మంది కస్టమర్లు బహుళ జాతి ఐటీ కంపెనీల్లో సీఈఓ స్థాయి ఉద్యోగులున్నారు.

పలాజో పక్కనే ఐటీ బిల్డింగ్..



పలాజో ప్రాజెక్ట్‌ను ఆనుకొనే గ్రేడ్-ఏ ఐటీ భవనం నిర్మాణంలో ఉంది. ఇన్ఫినిటీ పేరుతో 11 లక్షల చ.అ. ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే 95 శాతం విక్రయాలు పూర్తయ్యాయి.

- కోకాపేటలో 4.75 ఎకరాల్లో నిర్మిస్తున్న అవాంతే ప్రాజెక్ట్ తుదిదశకు చేరుకుంది. ఈ నెలాఖరు నాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వస్తుంది. జీ+22 అంతస్తుల్లోని ఈ ప్రాజెక్ట్‌లో 476 యూనిట్లుంటాయి. 1,330 చ.అ. నుంచి 2,575 చ.అ. మధ్య 2,3 బీహెచ్‌కే ఫ్లాట్లుంటాయి. 28 వేల చ.అ. క్లబ్‌హౌస్‌తో పాటు అన్ని రకాల ఆధునిక వసతులుంటాయి.

ప్రాజెక్ట్ హైలైట్స్..

సాధారణంగా బాల్కనీ ఎత్తు 12 ఫీట్లు ఉంటుంది. కానీ, పలాజోలో 24 ఫీట్ల ఎత్తులో డబుల్ హైట్ బాల్కనీ, 52వ అంతస్తు పైన ఇన్ఫినిటీ పూల్ ఉంటాయి. ఇండోర్ వాకింగ్, జాగింగ్ ట్రాక్స్ ఉంటాయి. దీంతో సీనియర్ సిటిజన్లు ఎండ, వాన, చలి ఏ వాతావరణంలోనైనా వ్యాయామం చేసుకోవచ్చు. ఇవీ ప్రాజెక్ట్ హైలైట్స్. ఐదంతస్తుల్లో క్లబ్ హౌస్, ప్రతి టవర్‌కు ప్రత్యేకంగా లిఫ్ట్ ఉంటుంది. స్క్వాష్ కోర్ట్, బ్యాడ్మింటన్ కోర్టు, హోమ్ థియేటర్, కిడ్స్ ప్లే జోన్, స్పా, ఫిట్‌నెస్ స్టూడియో, టేబుల్ టెన్నిస్, ఇండోర్ బాంక్వెట్ లాన్, బార్బిక్యూ పిట్, ప్రైవేట్ డైనింగ్ రూమ్, కాన్ఫరెన్స్ రూమ్స్ వంటి అన్ని రకాల ఆధునిక వసతులు ఉంటాయి.

మదీనాగూడలో జీ+45 అంతస్తులు..

ఈ ఏడాది చివరి నాటికి మదీనాగూడలో 24 ఎకరాల్లో మరో ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది. 9 టవర్లు ఒక్కోటి జీ+45 అంతస్తుల్లో ఉంటుంది. 45 లక్షల చ.అ. బిల్టప్ ఏరియాలో మొత్తం 3,300 యూనిట్లుంటాయి. 1,235 చ.అ. నుంచి 2,565 చ.అ.ల్లో ఫ్లాట్ల విస్తీర్ణాలుంటాయి. ధర రూ.70 లక్షల నుంచి రూ.1.50 కోట్ల మధ్య ఉంటాయి.

బెంగళూరులో తొలి ప్రాజెక్ట్..

ఈ ఏడాది సెప్టెంబర్‌లో బెంగళూరులో తొలి ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారు. థనిసాంద్రలో 9 ఎకరాల్లో హైరైజ్ ప్రాజెక్ట్‌ను నిర్మించనున్నారు. 18 లక్షల చ.అ. బిల్టప్ ఏరియాలో జీ+31 అంతస్తుల నిర్మాణం ఉంటుంది. 5 టవర్లలో మొత్తం 960 యూనిట్లుంటాయి.

గ్లోబల్ సిటీగా హైదరాబాద్



మెరుగైన మౌలిక వసతులు, అందుబాటు ధరలు, ప్రోత్సాహకర విధానాల కారణంగా అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. దీంతో విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ నివాస, వాణిజ్య సముదాయాలతో పాటు గిడ్డంగులు తదితర రంగాల వృద్ధికి భారీ అవకాశాలు ఉన్నాయి.

– ప్రశాంత్ రావు,
డైరెక్టర్, పౌలోమి ఎస్టేట్స్

CLEAR TITLE
LAND / PLOTS
SECURITY / WITH
COMPOUND WALL
NEAR ORR /
SHAMSHABAD
500 / 1000 SQ.YDS.
SPOT REGISTRATION
CALL FOR SITE VISIT
98494 04703





సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 6-7-2024



• శివాని

కనుచూపు లేక ముసిరిన చీకటిలో
పట్టుదల కాంతిపుంజమై దారి చూపింది.
రెప్పల మాటున దాగున్న కలలను చదువుతో సాకారం చేసుకుంది.
అంధత్వాన్ని జయించి జాతీయ స్థాయిలో నిర్వహించే
ఐ.ఐ.ఎం. (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)
పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి
దేశంలోని 21 ఐ.ఐ.ఎం. కళాశాలల్లోని 19 కళాశాలల్లో అర్హత సాధించింది.
తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని
గడి మహెలాలకు చెందిన కొత్తకాపు శివాని భవిష్యత్తుకు
నిర్మించుకుంటున్న సోపానాలను ఇలా మన ముందుంచింది.

చూపున్న కల

'మాది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలు కొత్తకాపు విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డిలకు రెండోసంతానాన్ని. మా అక్క కీర్తన గ్రూప్ 4 పరీక్ష రాసి ఉద్యోగం సాధించింది. మా చెల్లి భవానికి 80 శాతం చూపులేదు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ సీటును సాధించింది. నాకు పుట్టుకతోనే చూపు లేదు. అయినా, చదువంటే మాకెంతో ఆసక్తి. అదే మమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని మా నమ్మకం. జహీరాబాద్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిరంలో నా ప్రైమరీ చదువు ఆరంభమైంది. కానీ, చూపు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడేదాన్ని. నా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అమ్మానాన్నలు హైదరాబాద్‌లోని బేగంపేటలో గల దేవనార్ పబ్లిక్ స్కూల్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు అదే బడిలో చదువుకున్నాను. పదోతరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాను. ఇంటర్మీడియెట్‌ను జహీరాబాద్‌లోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో కామర్స్‌తో పూర్తి చేశాను. కాలేజీలో క్లాసులను విని, సహాయకులతో పరీక్షలు రాశాను. ఆ రెండేళ్లు కాలేజీ టాపర్‌గా నిలిచాను.

ఎంతో గర్వంగా ఉంది

మా అమ్మాయి శివానీ జాతీయ స్థాయిలో ఐఎంఎ సీటును సాధించడం మాకెంతో గర్వంగా ఉంది. ఆమె పుట్టుగుడ్డిగా పుట్టినప్పుడు కొంత బాధపడ్డాం. కొందరు మనసు నొప్పించే మాటలు అనేవారు. కానీ, వాటిని పట్టించుకోకుండా అమ్మాయిలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే పట్టుదలతో కష్టపడి చదివించాం. ఇప్పుడు శివానీ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.

– విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డి



• కుటుంబ సభ్యులతో శివానీ

ఉన్నతస్థాయి ఉద్యోగమే లక్ష్యం

చెన్నైలోని సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరి బీబీఏ కోర్సు పూర్తి చేశాను. క్యాట్ ఎగ్జామ్ కోసం ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకున్నాను. 2023లో నిర్వహించిన ఐఐఎం ప్రవేశ పరీక్ష రాసి 93.51 శాతం మార్కులతో దేశంలోని 21 ఐఐఎం కళాశాలల్లోని 19 కళాశాలల్లో ప్రవేశార్హత సాధించాను. వాటిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ ఐఐఎంను ఎంపిక చేసుకున్నాను. కిందటి నెల 23న కళాశాలలో చేరాను.

శక్తినిచ్చే గీతోపదేశం

చూపు లేకపోవడంతో చదువు కష్టంగా ఉండేది. బ్రెయిలీ లిపి నేర్చుకునేంతవరకు చదువు పట్ల నాకున్న తపనను ఎలా తీర్చుకోవాలో తెలిసేది కాదు. అంధుల పాఠశాలలో చేరాక నాకు పెద్ద అండ దొరికినట్టుగా అనిపించింది. కార్పొరేట్ కంపెనీలలో టాప్ లెవల్ ఉద్యోగం చేయాలని ఉంది. అందుకు తగిన అర్హతలు సంపాదించుకోవడానికి స్పెషలైజేషన్ కూడా చేస్తాను. శ్రీకృష్ణుడి గీతోపదేశం వింటూ ఉంటాను. జీవితంలోని ఒడిదొడుకులను ఎలా ఎదుర్కోవాలో, సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎలా నిలబడాలో గీత ద్వారానే నేను తెలుసుకుంటున్నాను. రెండు సంవత్సరాల ఐఐఎం కోర్సును విజయవంతంగా పూర్తి చేసి, ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని సాధించాలన్నదే నా లక్ష్యం. అమ్మానాన్నలకు, పుట్టిన ఊరికి మంచి పేరు తేవాలన్నదే నా ఆకాంక్ష' అని చెప్పింది శివాని.

– యెర్బల్ శ్రీనివాస్‌రెడ్డి, సాక్షి, జహీరాబాద్

విభిన్నం



సమష్టి గుబ్బి



• బెంగళూరు కబ్బన్ పార్క్‌లో 'శాన్‌స్క్రీట్ వీకెండ్' కార్యక్రమంలో సభ్యులు

బెంగళూరులోని కబ్బన్ పార్క్‌లో ఆదివారం ఉదయం వెళితే ఎవరో ఒకరు ఎదురుపడి 'తవనామధేయం కిమ్?' అంటారు. 'మీ పేరేమిటి?' అని ఆ మాటకు అర్థం. 'మెలనెన బహు సంతోషహ' అంటారు. 'మిమ్మల్ని కలవడం సంతోషంగా ఉంది'. 'అహం సమష్టి' అని పరిచయం చేసుకుంటారు. 'నా పేరు సమష్టి' అని దానికి అర్థం. కన్నడ, తెలుగు, తమిళం మాతృభాషగా కలిగిన బెంగళూరు వాసులు ఆ భాషను లేదా ఇంగ్లిష్‌ను మాట్లాడి మాట్లాడి విసుగు చెంది ఉంటే నాలుక గుండా వెలువడే సంస్కృతం మాటలు కొత్త ఉత్తేజాన్ని, సరదాని కలిగిస్తాయి. అందుకే రెండు నెలల క్రితం కబ్బన్ పార్క్‌లో మొదలైన 'శాన్‌స్క్రీట్ వీకెండ్' కార్యక్రమం పెద్ద హిట్ అయ్యింది. ఇప్పుడు ముంబై, పూణె నగరాలకు వ్యాపించే దాకా వెళ్లింది.

ఆదివారం సంస్కృతం

బెంగళూరు కబ్బన్ పార్క్‌లో ఆదివారం ఉదయం వెళితే వేరే లోకానికి వచ్చామా అనిపిస్తుంది. ఎందుకంటే అక్కడ చేరిన ఒక బృందం మాట్లాడినా ఆడినా చర్చించినా వాడే భాష సంస్కృతం. అంతరించిపోయే దశలో ఉన్న సంస్కృతం ఆ పచ్చని చెట్ల మధ్య చివురులేస్తోంది. సమష్టి గుబ్బి అనే అమ్మాయి ఉచితంగా సంస్కృతం నేర్పడమే కారణం. 'శాన్‌స్క్రీట్ వీకెండ్' అనే ఈ కార్యక్రమం అన్ని చోట్లకూ విస్తరించేలా ఉంది.

'స్థాయి' సంస్థ చొరవతో

బెంగళూరులోని 'స్థాయి' సంస్థ సంస్కృత భాష పునరుద్ధరణకు అంకితమైంది. ఈ తరానికి సంస్కృతం పరిచయం చేయడం కోసం సంస్కృతంలో పాటలు, షార్ట్‌ఫిల్మ్‌లు, పాఠాలు తయారుచేసి యూట్యూబ్‌లో పెడుతోంది. దానిని స్థాపించిన సమష్టి గుబ్బి నేరుగా కూడా సంస్కృతాన్ని పరిచయం చేద్దామని నిశ్చయించుకుని కబ్బన్ పార్క్‌లో ఆదివారం పూట సంస్కృతం నేర్పే ఇన్‌ఫార్మల్ క్లాసులను మొదలెట్టింది. మొదటివారం కేవలం ఆమె స్నేహితులు మాత్రమే వచ్చారు. కాని రెండోవారానికి నోటిమాటతో కొత్తవాళ్ల రాక మొదలైంది. ఇప్పుడు ప్రతి వారాంతం చాలామంది నాగా పెట్టకుండా వచ్చి సంస్కృతం నేర్చుకుంటున్నారు. 'అది పాఠ్యాంశంగా కాకుండా రోజువారీ కార్యకలాపాలకు ఉపయోగపడేలా నేర్పడం వల్ల అందరికీ ఆసక్తి ఏర్పడుతోంది' అంటోంది సమష్టి.

సామాన్యుల భాషే

'సంస్కృతం దేవతల భాష అంటారు. అది సామాన్యుల భాషే. ఇతర దేశాల వాళ్లు వాళ్ల ప్రాచీన భాషలు మాట్లాడితే మనం ఆశ్చర్యపోము. కాని భారతీయులు సంస్కృతం మాట్లాడటం ఎందుకు ఆశ్చర్యకరం. సంస్కృతంలో సినిమాలు, నాటకాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు చేయొచ్చు' అంటుంది సమష్టి. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయంలో ఎం.ఏ సంస్కృత గ్రామర్ చదువుకున్న సమష్టి 'శాన్‌స్క్రీట్ స్పారో' పేరుతో ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసి సంస్కృత మాటలు నేర్పసాగింది. అది కబ్బన్ పార్క్‌లు ముఖాముఖి కార్యక్రమంగా మారింది. సంస్కృత భాష వ్యాప్తి కోసం సమష్టి తన బృందాన్ని తీసుకుని బైక్‌మీద కొత్త ప్రాంతాలకు వెళ్లి సంస్కృతాన్ని ప్రచారం చేస్తోంది. దీనికి 'శాన్‌స్క్రీట్ రైడ్' అని పేరు పెట్టింది. 'శివమొగ్గ జిల్లాలోని మత్తూరు గ్రామంలో ప్రతి ఒక్కరూ సంస్కృతంలో మాట్లాడతారు. అందుకే అది సంస్కృత గ్రామంగా వాసికెక్కింది. నా బృందాన్ని ఆ ఊరికి తీసుకెళ్లాను' అని చెప్పింది సమష్టి. 'మార్కుల కోసం స్కూళ్లలో కాలేజీల్లో చాలా మంది సంస్కృతం చదివారు. కాని నిజజీవితంలో ఉపయోగించరు. అలాంటి వాళ్లంతా మా సంస్కృత ఆదివారాల గురించి విని సంస్కృతాన్ని తలుచుకుంటున్నారు. అది సంతోషం' అంది సమష్టి. ఆమె తన బృందం చేత హిందీ పాటలను సంస్కృతంలో డబ్ చేయించి పాడిస్తుంది. 'మై హూ డాన్' పాటను 'అహం డాన్ అస్మి' అని పాడుతుంటే కేరింతలు వినిపిస్తాయి. ఏ భాష అయినా ఇంత సరదాగా, సజీవంగా ఉంటే ఎందుకు అంతరిస్తుంది?

చైతన్యం



రాజ్యసభలో ప్రసంగిస్తున్న సుధామూర్తి

రాజ్యసభ సభ్యురాలిగా మొదటిసారి సమావేశాల్లో పాల్గొన్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి భారతీయ పేద మహిళల్లో ఇటీవల అత్యధికంగా చోటు చేసుకుంటున్న సర్వైకల్ క్యాన్సర్ మరణాల గురించి మాట్లాడారు. దీనికి అడ్డుకట్ట వేయడం కోసం వేక్సిన్ ఇవ్వాల్సిన ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేశారు. నిజమే. సర్వైకల్ క్యాన్సర్ గురించి ఇది చైతన్యం కలిగించాల్సిన సమయం. ప్రభుత్వం పూనుకోవాల్సిన సమయం.

వ్యాక్సిన్ ఇప్పిద్దాం... మహిళల ప్రాణాలు కాపాడదాం

కొన్ని అధ్యయనాల ప్రకారం మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాప్తి 7% నుంచి 27% మందిలో కనిపిస్తోంది. ఇవన్నీ క్యాన్సర్‌గా మారనప్పటికీ, చాలా కేసుల్లో క్యాన్సర్ ముప్పు మాత్రం ఉంటుంది. పద్దెనిమిదేళ్ల తర్వాత పెళ్లయ్యే యువతులతో పోలిస్తే అంతకంటే ముందుగానే వివాహమయ్యే వారిలో ఇది ఆరు శాతం ఎక్కువ. ప్రస్తుత అంచనాల ప్రకారం ప్రతి ఏడాది 1,23,907 మంది మహిళల్లో దీన్ని కనుగొంటుండగా... ఏటా 77,348 మంది మరణిస్తున్నట్లు అంచనా. గణాంకాల ప్రకారం సంఖ్యాపరంగా పదిహేనో ఏటి నుంచి 44 ఏళ్ల మహిళల్లో వస్తూ, వారిని మృత్యుముఖానికి నెట్టే క్యాన్సర్లలో ఇది రెండో అతి పెద్దది.

మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్ కు వ్యాక్సిన్‌ను ప్రభుత్వమే అందజేస్తే మహిళాలోకానికి చాలా మేలు చేసినట్లవుతుంది. తమ కుటుంబానికే తొలి ప్రాధాన్యమిచ్చే స్త్రీలు సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి, ఏ నాలుగో దశలోనో, మూడో దశలోనో హాస్పిటల్స్‌కు వస్తూ, చేజేతులా మరణాన్ని తెచ్చుకుంటున్నారు. అదే తొమ్మిది నుంచి 45 ఏళ్ల వయసులోనే వారికీ వ్యాక్సిన్ ఇప్పిస్తే ఎన్నో మరణాలను నివారించగలం. కోవిడ్ టైమ్‌లో దేశం మొత్తానికి వ్యాక్సిన్ ఇప్పించిన మనకు ఇదేమీ కష్టం కాబోదు. ప్రైవేటు సంస్థల్లో దీన్ని దాదాపు రూ. 1,400 నుంచి రూ. 1,500 లకు అమ్ముతున్నారు. వ్యాక్సిన్ తయారీ సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరిపి, చవగ్గా ఏ ఏడువందల రూపాయలకో ఇప్పించగలిగితే అత్యంత నిరుపేద మహిళల ప్రాణాలనూ మనం కాపాడ గలిగినవాళ్లమవుతాం.

– సుధామూర్తి
రాజ్యసభ సభ్యురాలు,
సమాజ సేవిక

ఏమిటీ సర్వైకల్ క్యాన్సర్?

మహిళల్లో యోని (వెజైనా) తర్వాత వచ్చే భాగమే సర్విక్స్. ఇది గర్భాశయానికి కింద ఉంటుంది. అంటే ఇది యోనికీ, గర్భాశయానికీ (యుటెరస్)కూ మధ్యన సన్నటి దారిలా ఉండే సర్విక్స్ గర్భాశయానికి ముఖద్వారంలా ఉంటుంది కాబట్టే దీన్ని 'గర్భాశయ ముఖద్వారం' అనీ, దీనికి వచ్చే క్యాన్సర్‌ను 'సర్వైకల్ క్యాన్సర్' (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) అని అంటారు.

నిజానికి మిగతా క్యాన్సర్‌లతో పోలిస్తే గర్భాశయ ముఖద్వారపు క్యాన్సర్‌ను చాలా సులువుగా నివారించవచ్చు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించడం మంచి పరిష్కారం. దీని చికిత్స కూడా చాలా సులభం. ఎంత ముందుగా గుర్తిస్తే దీనికి అంత సమర్థంగా, తేలిగ్గానూ చికిత్స అందించవచ్చు. సాధారణంగా పల్లెల్లో కంటే పట్టణాల్లో, నగరాల్లో వ్యాధుల తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ ఈ క్యాన్సర్ విషయానికి వస్తే ఇది గ్రామీణ ప్రాంతాల స్త్రీలలో ఇది చాలా ఎక్కువగా కనిపిస్తోంది. చాలా చిన్నవయసులోనే అందునా పద్ధెనిమిదేళ్ల వయసు కంటే చాలా తక్కువ వయసులోనే అక్కడ పిల్లలకు పెళ్లిళ్లు చేస్తూ ఉండటం ఇందుకు ఒక కారణమని కొంతమంది పరిశీలకుల విశ్లేషణ. అయితే ఇంతటి తీవ్రమైన వ్యాప్తిలోనూ అదృష్టం ఏమిటంటే... ఈ క్యాన్సర్ రావడానికి ముందర కనీసం 10 ఏళ్ల ముందుగానే కనుగొనగలిగేలా దీనికి చాలా ఎక్కువ వ్యవధిగల ప్రీ-క్యాన్సరస్ దశ ఉంటుంది. ఈ సమయంలో కనుగొనగలిగితే దాన్ని దాదాపు పూర్తిగా నయం చేయడానికి అవకాశముంటుంది.

హెచ్‌పీవీతో సమర్థమైన నివారణ

మామూలుగా శక్తిమంతమైన వైరస్, బ్యాక్టీరియాలను తట్టుకోవడానికి మన శరీరం 'యాంటీబాడీస్'ను తయారుచేస్తుంది. కానీ సర్వైకల్ క్యాన్సర్‌ను తెచ్చిపెట్టే హెచ్‌పీవీ వైరస్ విషయంలో మాత్రం మహిళల దేహం ఎలాంటి యాంటీబాడీస్‌లనూ తయారు చేయదు. అందువల్ల ఒకసారి హెచ్‌పీవీ వైరల్ ఇన్ఫెక్షన్ వస్తే అది జీవితాంతం శరీరంలో ఉండిపోయి సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీయవచ్చు. అదే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను మహిళకు తొమ్మిది నుంచి 26 ఏళ్ల వయసు లోగా ఇప్పిస్తే యాంటీబాడీస్‌ను తయారుచేసి, సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పిస్తుంది.

కేవలం బాలికలు, యువతులకే కాకుండా బాలురు, యువకులకూ కూడా ఇచ్చే అత్యాధునిక వ్యాక్సిన్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఎందుకంటే పురుషులు క్యారియర్లుగా మారి దీన్ని మహిళలకు వ్యాప్తి చేస్తారు కాబట్టి మగవాళ్లకూ ఇచ్చే వ్యాక్సిన్లు రూపొందాయి. ఇవి ఒకటి రెండు రకాలకే గాక... మరిన్ని రకాల సర్వైకల్ క్యాన్సర్లను నివారిస్తాయి. 9 నుంచి 14 ఏళ్ల మగపిల్లల్లో రెండు డోసులూ, పద్నాలుగేళ్లు దాటిన వారికి 0, 2, 6 నెలల్లో వరసగా ఇవ్వాలి.



డా॥ కావ్య ప్రియ వజ్రాల
లీడ్ కన్సల్టెంట్
గైనకాలజిస్ట్ &
రిస్క్ ఆబ్‌స్ట్రెట్రీషియన్,
ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్

ప్రధాన రకాలు...

సర్వైకల్ క్యాన్సర్లలో రెండు ప్రధాన రకాలుంటాయి. మొదటిది తరచుగా కనిపించే 'స్క్వామస్ సెల్ కార్సినోమా' అనే రకం. రెండోది 'అడెనోకార్సినోమా' తరహాకు చెందినదైతే, ఆపరేషన్ ద్వారా తొలగించగల దశలో ఉంటే, సర్జరీ ద్వారా ఆ భాగాన్ని తొలగించవచ్చు. ఇది కాస్త అరుదు.

రిస్క్ ఫాక్టర్లు...

హెచ్‌పీవీ వైరస్ సోకడం అనేది సర్వైకల్ క్యాన్సర్‌కు ఓ ప్రధాన రిస్క్ ఫ్యాక్టర్. చాలామందిలో ఈ హెచ్‌పీవీ వైరస్ దానంతట అదే నశించిపోతుంది. అలా ఒకవేళ నశించకపోతే అది కొంతకాలానికి అది క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదముంది. అలాగే పొగ తాగడం, ఎయిడ్స్, ఐదేళ్ల లేదా అంతకంటే ఎక్కువకాలం గర్భనిరోధక మాత్రలు వాడటం వంటివి కూడా సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీసే రిస్క్‌ఫ్యాక్టర్లలో కొన్ని.

నివారణ...

సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణలో పాప్‌స్మియర్ మంచి పరీక్ష. ఇరవయొక్క ఏళ్లు నిండిన మహిళలు మొదలుకొని, లైంగిక జీవితం ప్రారంభమై మూడేళ్లు దాటిన ప్రతి మహిళా తప్పనిసరిగా క్రమంతప్పకుండా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాలి. సర్వైకల్ క్యాన్సర్ విషయంలో మరో వెసులుబాటు ఏమిటంటే ఇది రావడానికి దాదాపు పదేళ్లు ముందుగానే దీన్ని కనుగొనడానికి అవసరమైనంత 'ప్రీ-క్యాన్సరస్ దశ' దీనికి ఉంది

కారణాలు

సర్విక్స్ మహిళ జీవితంలో ఎన్నో దశల్లో అనేక మార్పులకు లోనవుతూ ఉంటుంది. అందువల్ల అక్కడ అతి వేగంగా జరిగే కణ విభజన కారణంగా క్యాన్సర్‌కు గురయ్యే అవకాశాలెక్కువ. సర్వైకల్ క్యాన్సర్‌కు ముఖ్యమైన కారణాల్లో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ప్రధానం. ఈ వైరస్ లైంగికంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. దాదాపు సగం జనాభాలో వాళ్ల జీవితంలో ఏదో ఒక సమయంలో హెచ్‌పీవీ వైరస్‌ను కలిగి ఉంటారు. అయితే అందరిలోనూ ఇది సర్వైకల్ క్యాన్సర్‌కు దారితీయదు. దురదృష్టవశాత్తూ కేవలం కొంతమందిలోనే క్యాన్సర్‌ను కలగజేస్తుంది. మల్టిపుల్ పార్ట్‌నర్స్‌తో సెక్స్‌లో పాల్గొనేవారికీ హెచ్‌పీవీ వైరస్ సోకే అవకాశాలు ఎక్కువ.



చికిత్స ప్రక్రియలు...

ఈ క్యాన్సర్ల మొదటి, రెండో దశల్లో శస్త్రచికిత్స అయినా, రేడియోథెరపీ, కీమోథెరపీ... ఈ మూడూ బాగానే పనిచేస్తాయి. అయితే ఈ అన్ని చికిత్సా ప్రక్రియలకు వాటివాటి ప్రయోజనాలూ, దుష్ప్రభావాలూ రెండూ ఉంటాయి. చికిత్సకు ముందు ఈ రెండు అంశాలనూ పరిగణనలోకి తీసుకొని చికిత్స ప్రక్రియను డాక్టర్లు నిర్ణయిస్తారు.

సర్జరీతో సాధారణ జీవితానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. సర్జరీ తర్వాత వారం లేదా పది రోజుల్లోనే సాధారణ జీవితం గడిపేలా బాధితులు కోలుకోగలరు. సర్జరీ విజయావకాశాలు 75% నుంచి 90% వరకు ఉంటాయి. పైగా చిన్నవయసులోనే దీని బారిన పడ్డవారికి డాక్టర్లు సాధారణంగా శస్త్రచికిత్సనే సూచిస్తుంటారు. ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా డాక్టర్ల పర్యవేక్షణలో ఉండటం అవసరం. ఇక సర్జరీతో వచ్చే దుష్ప్రభావాలు కూడా చాలా తక్కువే. ఇది ఎంతమాత్రమూ ప్రాణాంతకం కాదు. ఇక కొద్దిమందిలో సర్జరీ తర్వాత కాంప్లికేషన్లు వస్తే / సర్జరీ అంటే భయపడేవారికి డాక్టర్లు 'రాడికల్ రేడియోథెరపీ' అనే చికిత్స చేస్తారు.

పొట్ట రాకూడదా? పొట్టు తియ్యొద్దు మరి!



- పొట్టు తీయని ధాన్యాల (హోల్ గ్రేయిన్స్)లో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయన్నది తెలిసిందే.
- ఈ పొట్టు కారణంగానే అవి చాలా నెమ్మదిగా జీర్ణమవుతుంటాయి. అందుకే వాటిల్లోంచి వచ్చే కార్బోహైడ్రేట్లు రక్తంలో నెమ్మదిగా కలుస్తుంటాయి.
- ఫలితంగా ఒంట్లోకి విడుదలయ్యే చక్కెర మోతాదులూ ఆలస్యమవుతాయి.
- పొట్టుతీయని వరి విషయంలో ముడి బియ్యం మాదిరిగానే పొట్టు తీయని ఓట్స్, గోధుమ, బార్లీ వంటి వాటిని అలాగే తీసుకోవడం వల్ల పొట్టుతీసిన వాటితో పోలిస్తే తక్కువగా బరువు పెరుగుతారని, అందువల్ల ఇన్సులిన్ విడుదల యంత్రాంగం కూడా నియంత్రితంగా పనిచేస్తూ పూర్తి స్థాయి ఆరోగ్యకరంగా ఉంటుందంటున్నారు పరిశోధకులు 'అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్'లో ప్రచురితమైంది.
- ఇలా తినడం వల్ల ఊబకాయం తగ్గడంతో పాటు స్థూలకాయంతో వచ్చే అనేక అనర్థాలనూ తగ్గించుకోవచ్చన్నది పరిశోధకుల మాట.

బ్యూటిప్స్



- రెండు టేబుల్ స్పూన్ల పాల మీగడలో ఒక టీస్పూను ఆల్మండ్ ఆయిల్, నాలుగైదు చుక్కల రోజ్ ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇది పొడిబారి, గరుకుగా ఉన్న చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.
- చర్మం తెల్లగా మారాలంటే... చిన్న చందనం ముక్కను పాలతో పేస్టు చేసి అందులో చిటికెడు స్వచ్ఛమైన పసుపు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లయ్ చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత చన్నీటితో కడగాలి. ఇలా వారానికి మూడు సార్లు ప్యాక్ వేస్తుంటే ఫలితం ఉంటుంది.

ఆషాఢం ఆరంభం





నేటినుంచి ఆషాఢమాసం ఆరంభం అవుతోంది. పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెలకే ఆషాఢమాసం అని పేరు. ఇది సంవత్సరంలో నాలుగవ మాసం. దీనిని శూన్యమాసమని కూడా అంటారు. ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి దక్షిణాయనం మొదలయేది ఈ మాసంలోనే. పేరుకు శూన్యమాసమే అయినా పూరీ జగన్నాథ రథయాత్ర నుంచి తొలి ఏకాదశి, గురు పూర్ణిమ, గ్రామ దేవతలకు సమర్పించే బోనాలు ఈ మాసంలోనే. ఆషాఢ మాసంలో చేసే స్నానం, దానం, జపం, పారాయణలు, విశేష ఫలితాన్నిస్తాయి.

ఆషాడంలో చేసే సముద్ర, నదీ స్నానాలు ఎంతో ముక్తిదాయకాలు. పాదరక్షలు, గొడుగు, ఉప్పు దానం చేయడం శుభకరం.

సాక్షి బిజినెస్
శనివారం
6-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 53	79,997
నిఫ్టీ △ 22	24,314

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	18,354	△	165
డోజోన్స్	39,312	△	4
ఎఫ్‌టీఎస్ఈ 100	8,203	▽	37
డాక్స్	18,475	△	25
షాంఘై	2,959	▽	8
నికాయ్	40,912	▽	1

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)	71,300
బంగారం (22 క్యారట్)	67,900
వెండి (కిలో)	97,700

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.06	84.08
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.44	107.80
€	యూరో	ఒకటి	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.50	64.16
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.85	23.63
¥	చైనా యువాన్	ఒకటి	10.36	12.44

తొలి సీఎన్‌జీ బైక్ వచ్చేసింది!





బజాజ్ నుంచి ఫ్రీడమ్ 125

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో సీఎన్‌జీ బైక్ 'ఫ్రీడమ్ 125' ఆవిష్కరించింది. ప్రపంచంలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ఆధారంగా నడిచే ద్విచక్ర వాహనం ఇదేనని కంపెనీ వెల్లడించింది. నిర్వహణ వ్యయం 50 శాతం తగ్గుతుందని తెలిపింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.95,000 నుంచి ప్రారంభం. 2 లీటర్ల సామర్థ్యంగల పెట్రోల్ ట్యాంక్ సైతం ఉంది. సీఎన్‌జీ ట్యాంక్ సామర్థ్యం 2 కేజీలు. సీఎన్‌జీ అయితే 200 కిలోమీటర్లు, పెట్రోల్‌తో 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. గరిష్ఠ వేగం గంటకు సీఎన్‌జీ 90.5, పెట్రోల్ 93.4 కిలోమీటర్లు. మూడు వేరియంట్లలో లభిస్తుంది. 9.5 పీఎస్ పవర్‌తో 4 స్ట్రోక్ ఎయిర్ కూల్డ్ ఇంజిన్, మోనో లింక్ టైప్ సస్పెన్షన్, బ్లూటూత్ కనెక్టివిటీతో డిజిటల్ స్పీడోమీటర్, ప్రొటెక్టివ్ ట్రెల్లిస్ ఫ్రేమ్, పీఈఎస్‌వో సర్టిఫైడ్ సీఎన్‌జీ సిలిండర్, ఫోర్క్ స్లీవ్స్ ప్రొటెక్టర్ పొందుపరిచారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ కొత్త బైక్‌ను శుక్రవారం పుణేలో ఆవిష్కరించారు.

జీఎస్టీని సమీక్షించండి...

స్వచ్ఛ ఇంధనాలతో నడిచే వాహనాలపై జీఎస్టీ రేట్లను ప్రభుత్వం సమీక్షించాలని రాజీవ్ బజాజ్ సూచించారు. ఈవీలను ప్రోత్సహించడానికి అస్థిర రాయితీలను ప్రోత్సహించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సబ్సిడీలు నిలకడలేనివని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా వాహన పరిశ్రమలో ఈవీల వినియోగంపై కొనసాగుతున్న ఒత్తిడి గందరగోళంగా ఉందన్నారు. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సాంకేతికతలను నిలకడలేని రాయితీల ద్వారా ఎలా ప్రమోట్ చేస్తారని ప్రశ్నించారు. ఇలాంటి వాటి నుంచి స్వేచ్ఛ కావాలని బజాజ్ అన్నారు.

సరికొత్త శిఖరంపై నిఫ్టీ

- రికార్డు స్థాయి నుంచి సెన్సెక్స్ వెనక్కి
- వారాంతాన లాభాల స్వీకరణ
- రిలయన్స్, ఎస్‌బీఐ దన్నుతో రికవరీ
- మిశ్రమంగా ముగిసిన స్టాక్ సూచీలు

ముంబై: వారాంతాపు రోజున ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 53 పాయింట్లు కోల్పోయి 80వేల దిగువన 79,997 వద్ద స్థిరపడింది. అయితే నిఫ్టీ 61 పాయింట్లు బలపడి 24,363 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 22 పాయింట్లు పెరిగి ఆల్‌టైం హై 24,314 వద్ద ముగిసింది. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ప్రైవేట్ బ్యాంకుల షేర్లలో విక్రయాల ప్రభావంతో భారీగా పతనమైన సూచీలను రిలయన్స్ (2%) ఎస్‌బీఐ (2.50%) రాణించడంతో సూచీలు రికవరీ అయ్యాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీయల్, విద్యుత్, ప్రభుత్వ బ్యాంకుల షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫైనాన్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. యూఎస్ గణాంకాలు, బ్రిటన్ ఎన్నికల నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

రూ.450 లక్షల కోట్లు

సూచీలు ఫ్లాట్‌గా ముగిసినా, ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరింది. శుక్రవారం ఒక్క రోజే రూ. 2.58 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం గరిష్టం రూ.450 లక్షల కోట్లకు చేరింది.



- జియో పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.55,000 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వెలువడంతో రిలయన్స్ ఇండస్ట్రియల్ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 2% పెరిగి రూ.3180 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ 3% ఎగసి రూ.3198 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. మార్కెట్ విలువ రూ.55,287 కోట్లు పెరిగి రూ.21.51 లక్షల కోట్ల చేరింది.



టెల్కోల ఆదాయం జూమ్..

మార్చి క్వార్టర్‌లో జియో రూ. 25,331 కోట్లు

న్యూఢిల్లీ: మార్చి త్రైమాసికంలో టెలికం సంస్థల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. రిలయన్స్ జియో ఏజీఆర్ (సవరించిన స్థూల ఆదాయం) అత్యధికంగా 10 శాతం వృద్ధి చెంది రూ. 22,985 కోట్ల నుంచి రూ. 25,331 కోట్లకు చేరింది. అటు భారతీ ఎయిర్‌టెల్‌ది 13.25 శాతం పెరిగి రూ. 15,500 కోట్ల నుంచి రూ. 20,952 కోట్లకు ఎగిసింది. వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ స్వల్పంగా 2.22% పెరిగి రూ. 7,211 కోట్ల నుంచి రూ. 7,371 కోట్లకు చేరింది. ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ ఆదాయం 4.41 శాతం తగ్గి రూ. 1,992 కోట్లకు, ఎంటీఎన్ఎల్ ఆదాయం 14% క్షీణించి రూ. 157 కోట్లకు పరిమితమైంది. మొత్తం టెల్కోల ఏజీఆర్ 9% వృద్ధి చెంది రూ. 70,462 కోట్లకు చేరింది. టెల్కోలు కట్టాల్సిన స్పెక్ట్రం యూసేజీ చార్జీలు, లైసెన్సు ఫీజులను లెక్కించడానికి ప్రభుత్వం ఏజీఆర్‌నే పరిగణనలోకి తీసుకుంటుంది.

'ఇన్‌ఫ్రా'లో కోటి కొలువులు!



ఏడాదిలో అవకాశాల వెల్లువ

- నైపుణ్యాలు లేనివారికీ ఉద్యోగాలు
- ప్రభుత్వం నుంచి బలమైన మద్దతు

మౌలిక రంగం భారీ ఉపాధి అవకాశాలకు వేదిక కానుంది. మౌలిక వసతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేందుకు కేంద్ర సర్కారు ప్రాధాన్యం ఇస్తుండడంతో ఈ రంగంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే కోటి ఉద్యోగాలు కొత్తగా ఏర్పడతాయని ఉద్యోగ నియామక సేవలు అందించే 'టీమ్‌లీజ్ సర్వీసెస్' అంచనా వేసింది. కేంద్రంలో మూడోసారి కొలువు దీరిన మోదీ సర్కారు రహదారులు, రైళ్లు, విమానాశ్రయాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తుందన్న అంచనాలు నెలకొన్నాయి. దీంతో ఈ రంగంలో అసలు నైపుణ్యాలు లేని వారితో పాటు, స్వల్ప నైపుణ్యాలు, పూర్తి నైపుణ్యాలు కలిగిన వారికి పెద్ద ఎత్తున ఉపాధి లభించనున్నట్టు టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా. ఈ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 98 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కొత్తగా వస్తాయని తన తాజా నివేదికలో తెలిపింది. 'కొత్త ప్రభుత్వం ఈ రంగానికి ప్రాధాన్యతను కొనసాగిస్తుందని భావిస్తున్నాం. దేశ అభివృద్ధి, ఆర్థిక వృద్ధికి ఇది తప్పనిసరి. వ్యూహాత్మక పెట్టుబడులు ఉపాధి అవకాశాలతోపాటు, అన్ని ప్రాంతాలు సమానాభివృద్ధికి వీలు కల్పిస్తాయి'అని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ పి. సుబ్రమణియమ్ తెలిపారు. రవాణా రంగంపైనా ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలతో ఉన్నట్టు చెప్పారు. విమానాశ్రయాల సంఖ్యను 220కి పెంచడం, 2025 చివరికి జాతీయ రహదారుల నిడివిని 2 లక్షల కిలోమీటర్లకు చేర్చే దిశగా పనిచేస్తున్నట్టు గుర్తు చేశారు. అలాగే, 2030 నాటికి 23 జల రవాణా మార్గాల అభివృద్ధితోపాటు, 35 మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల అభివృద్ధిని సైతం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

భారీగా వ్యయాలు..

'మౌలిక రంగంలోని పలు ఉప విభాగాల మధ్య ప్రాధాన్యతల్లో మార్పు ఉండొచ్చు. మౌలిక రంగానికి సంబంధించిన ప్రభుత్వ మూలధన వ్యయాలు ఆరోగ్యకరమైన వృద్ధితో కొనసాగుతాయి. ఈ రంగంలో రైల్వే, రహదారులు, నీటి ప్రాజెక్టులకు ప్రభుత్వ కేటాయింపులు పెరుగుతాయి. ఇది ఉపాధి అవకాశాల కల్పనకు మద్దతునిస్తుంది' అని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా జూన్‌లో విడుదల చేసిన నివేదిక సైతం ఈ రంగంలో వృద్ధి అవకాశాలను తెలియజేస్తోంది. మౌలిక రంగం, సామాజికాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడం.. పట్టణీకరణ పెరగడం, రహదారుల అనుసంధానత ఇవన్నీ ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల అభివృద్ధికి దోహదం చేస్తాయని జీఐ గ్రూప్ హోల్డింగ్ కంపెనీస్ కంట్రీ మేనేజర్ సోనాల్ అరోరా తెలిపారు. పెద్ద, భారీ కాంట్రాక్టులు వస్తుండడంతో తాము నియామకాలను పెంచినట్టు ఎల్అండ్‌టీ గ్రూప్ హెచ్ఆర్ చీఫ్ ఆఫీసర్ సి.జయకుమార్ తెలిపారు.

- సాక్షి, బిజినెస్ డెస్క్

సెయిల్ ఈ ఏడాది పెట్టుబడి రూ. 6,500 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6,500 కోట్ల మూలధన వ్యయం చేయనుంది. 2030 నాటికి రూ. లక్ష కోట్ల పెట్టుబడి ప్రణాళికలో భాగంగా ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్టు సెయిల్ సీఎండీ అమరేందు ప్రకాశ్ శుక్రవారమిక్కడ తెలిపారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'తొలి దశలో సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 20 మిలియన్ టన్నుల నుంచి 2031 నాటికి 35 మిలియన్ టన్నులకు చేరుస్తాం. తదుపరి దశలో వార్షిక సామర్థ్యాన్ని 50 మిలియన్ టన్నులకు పెంచుతాం. స్టీల్ పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా 0.5% వృద్ధి చెందుతోంది. గతేడాది భారత్ ఏకంగా 13 శాతం వృద్ధి నమోదు చేసింది. వచ్చే పదేళ్లు భారత్‌లో స్టీల్ రంగం ఏటా సగటు వృద్ధి 8%గా ఉంటుంది' అని వివరించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇళ్ల అమ్మకాల సందడి | బ్యాంక్ డిపాజిట్లు డీలా..



క్వార్టర్ ఫైనల్లో గాయత్రి - ట్రెసా జోడి

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీ కెనడా ఓపెన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ జోడి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మూడో సీడ్ గాయత్రి - ట్రెసా 17-21, 21-7, 21-8 స్కోరుతో నటాషా ఆంథోనిసెన్ (డెన్మార్క్) - అలీసా టిర్‌టొసెన్‌టొనో (నెదర్లాండ్స్)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్ కూడా క్వార్టర్స్‌లోకి అడుగు పెట్టాడు. ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ ప్రియాన్షు 21-19, 21-11తో టకుమా ఒబయాషీ (జపాన్)పై గెలుపొందాడు. అయితే ఇతర భారత షట్లర్లకు రెండో రౌండ్‌లో నిరాశే ఎదురైంది. పురుషుల డబుల్స్‌లో గారగ కృష్ణప్రసాద్ - కె.సాయిప్రతీక్ 21-19, 18-21, 17-21తో జింగ్ వీ - చింగ్ హెంగ్ (చైనీస్ తైపీ) చేతిలో...మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్ - గద్దె రుత్విక శివాని 15-21, 21-19, 9-21తో చెంగ్ కువాన్ - యిన్ హుయి (చైనీస్ తైపీ)చేతిలో పరాజయంపాలయ్యారు.

కుర్రాళ్లతో కొత్తగా...

నేడు భారత్, జింబాబ్వే తొలి టి20 మ్యాచ్

- ఆత్మవిశ్వాసంతో టీమిండియా
- సొంతగడ్డపై ఆశలతో జింబాబ్వే
- సా.గం.4.30 నుంచి సోనీ స్పోర్ట్స్, సోనీ లివ్‌లలో ప్రసారం



అభిషేక్ / గిల్

టి20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచింది...ఇంకా దేశంలో సంబరాలు, వేడుకలు కొనసాగుతూనే ఉన్నాయి. మరో వైపు టీమిండియా మరో టి20 పోరుకు రంగం సిద్ధమైంది. అయితే ఇప్పటి వరకు జరిగిన ఆటతో పోలిస్తే ఇది కాస్త భిన్నమైంది. రోహిత్, కోహ్లి, జడేజాల రిటైర్మెంట్ తర్వాత జట్టు కాస్త కొత్తగా కనపడబోతోంది. తమ అవకాశాల కోసం ఎదురు చూస్తూ వచ్చిన యువ ఆటగాళ్ల సత్తాను ప్రదర్శించేందుకు ఇది సరైన వేదిక కానుంది. వరల్డ్ కప్ టీమ్‌లో అవకాశం దక్కించుకోలేకపోయిన గిల్ నాయకత్వ సామర్థ్యానికి కూడా ఈ సిరీస్ పరీక్ష కానుండగా... సొంతగడ్డపై జింబాబ్వే విజయాన్ని అందుకోవాలని ఆశిస్తోంది.

హరారే: పేరుకే ఇది భారత్‌కు చెందిన ద్వితీయ శ్రేణి జట్టు కావచ్చు. కానీ అగ్రశ్రేణి ఆటగాళ్లందరితో కలిసి ఆడిన, ఎదుర్కొన్న అపార ఐపీఎల్ అనుభవంతో యువ ఆటగాళ్లంతా కూడా అన్ని రకాలుగా సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు జరిగే తొలి టి20 మ్యాచ్‌లో జింబాబ్వేతో భారత్ తలపడుతుంది. వరల్డ్ కప్ విజయోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు స్వదేశానికి వచ్చిన సామ్సన్, యశస్వి, దూబే తొలి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. మూడో టి20 సమయానికి వీరు జట్టుతో చేరతారు. 2026 టి20 వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని భారత సెలక్టర్లు సిద్ధం చేయదలిచే బృందంలో కొందరి ప్రదర్శనపై ఇక్కడినుంచే ఒక అంచనాకు రావచ్చు.

గిల్ కెప్టెన్సీలో...

ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు నాయకత్వం వహించి సరైన ఫలితాలు రాబట్టలేకపోయిన శుబ్‌మన్ గిల్ తొలి సారి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఓపెనర్‌గా అతనితో పాటు అతని బాల్య మిత్రుడు, అండర్–19 వరల్డ్ కప్ సహచరుడు అభిషేక్ శర్మ ఆడటం ఖాయమైంది. అభిషేక్‌కు ఇది తొలి అంతర్జాతీయ మ్యాచ్ కానుంది. ఇటీవల ఐపీఎల్‌లో భీకర ఫామ్‌తో అదరగొట్టిన అభిషేక్ ఇక్కడ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం. మూడో స్థానంలో రుతురాజ్ ఖాయం కాగా, రియాన్ పరాగ్ కూడా అరంగేట్రం చేసే అవకాశం ఉంది. వరల్డ్ కప్‌లో రిజర్వ్‌గా ఉండి ఆడే అవకాశం రాని రింకూ సింగ్‌పై కూడా అందరి దృష్టీ నిలిచింది. తన దూకుడును ప్రదర్శించేందుకు రింకూకు ఇంతకంటే మంచి అవకాశం రాదు. బౌలింగ్‌లో కూడా ఐపీఎల్‌లో ఆకట్టుకున్న ఖలీల్, అవేశ్, బిష్ణోయ్‌లపై జట్టు ఆధారపడుతోంది. ప్రతిభ ఉన్నా...వరుస గాయాలతో పదే పదే సీనియర్ జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. కీపర్‌గా తొలి ప్రాధాన్యత జురేల్‌కు దక్కవచ్చు. ఈ మ్యాచ్‌లో భారత్‌నుంచి ఎంత మంది అరంగేట్రం చేస్తారనేది ఆసక్తికరం.


రజా

రజాపైనే భారం...

జింబాబ్వే కూడా కొత్త కుర్రాళ్లపైనే దృష్టి పెట్టింది. అందుకే సీనియర్లలో ర్యాన్ బర్ల్‌పై వేటు వేసిన జట్టు సీన్ విలియమ్స్, క్రెయిగ్ ఇర్విన్‌లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేయకుండా విశ్రాంతినిచ్చింది. డ్రగ్స్ వాడిన ఆరోపణలతో నాలుగు నెలలు సస్పెన్షన్‌కు గురైన మదవెర్, మవుతా తిరిగి జట్టులోకి వచ్చారు. అయితే కెప్టెన్ సికందర్ రజాపైనే జింబాబ్వే ప్రధానంగా ఆధారపడుతోంది. ఇటీవల వైటాలిటీ బ్లాస్ట్‌లో చెలరేగిన అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు. మసకద్జ, ముజరబానిలనుంచి అతనికి సహకారం అందాల్సి ఉంది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), అభిషేక్, రుతురాజ్, పరాగ్, రింకూ, జురేల్, సుందర్, బిష్ణోయ్, అవేశ్, తుషార్, ఖలీల్

జింబాబ్వే: రజా (కెప్టెన్), బెనెట్, మరుమని, క్యాంప్‌బెల్, నక్వీ, మదాండే, మదవెర్, జాంగ్వే, ఫరాజ్, మసకద్జ, ముజరబాని

పిచ్, వాతావరణం

నెమ్మదైన పిచ్. భారీ స్కోర్లకు అవకాశం లేదు. గత 12 మ్యాచ్‌లలో 5 సార్లు మాత్రమే స్కోరు 150 పరుగులు దాటింది. పొడి వాతావరణం. వర్ష సూచన లేదు.

8 భారత్, జింబాబ్వే మధ్య 8 టి20లు జరిగాయి. 6 భారత్ గెలవగా, 2 జింబాబ్వే గెలిచింది.

అల్‌కరాజ్ అద్భుత రీతిలో...

- ఐదు సెట్‌ల పోరులో విజయం
- పోరాడి ఓడిన ఫ్రాన్సెస్ టియాఫో
- మహిళల్లో కీస్, పావొలిని ముందంజ
- వింబుల్డన్ టోర్నీ


అల్‌కరాజ్

లండన్: డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ వింబుల్డన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఓటమి అంచుల నుంచి గట్టెక్కి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్‌లో మూడో రౌండ్ దాటేందుకే ప్రస్తుత ఫ్రెంచ్ ఓపెన్ చాంప్ అష్టకష్టాలు పడ్డాడు. ఐదు సెట్ల పాటు సాగిన సుదీర్ఘ పోరాటంలో ఎట్టకేలకు కార్లోస్ అల్‌కరాజ్ 5-7, 6-2, 4-6, 7-6 (7/2), 6-2తో ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా)పై చెమటోడ్చి గెలిచాడు. ఈ మ్యాచ్‌లో 29వ సీడ్ టియాఫో... స్పెయిన్ స్టార్‌కు చుక్కలు చూపించాడు. దాదాపు ఓడించినంత పనిచేశాడు. అల్‌కరాజ్ 1-2 సెట్లతో వెనుకబడిన దశలో నాలుగో సెట్ హోరాహోరీగా సాగింది. స్కోరు 6-6 వద్ద సమం కాగా... టైబ్రేక్ నిర్వహించారు. ఇందులో పుంజుకున్న అల్‌కరాజ్ తర్వాత ఆఖరి ఐదో సెట్‌ను సులువుగా గెలుచుకొని ఊపిరి పీల్చుకున్నాడు. ఇతర మ్యాచ్‌లలో పదో సీడ్ గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-3తో గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై వరుస సెట్లలో విజయం సాధించగా, ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) 6-1, 6-3, 4-6, 1-1తో జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై ఆధిక్యంలో ఉన్న దశలో వర్షం వల్ల మ్యాచ్‌ను నిలిపివేశారు. మహిళల సింగిల్స్‌లో 12వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా), ఏడో సీడ్ జాస్మిన్ పావొలిని (ఇటలీ) ప్రిక్వార్టర్స్ చేరారు. మూడో రౌండ్లో కీస్ 6-4, 6-3తో 18వ సీడ్ మార్టా కొస్ట్యుక్ (ఉక్రెయిన్)పై, పావొలిని (ఇటలీ) 7-6 (7/4), 6-1తో బియాంక ఆండ్రీస్కు (కెనడా)పై విజయం సాధించారు. మరో మ్యాచ్‌లో ఎమ్మా నవారో (అమెరికా) 2-6, 6-3, 6-4తో డయానా ష్నైడెర్ (రష్యా)పై నెగ్గింది.

ముర్రే నిష్క్రమణ...


ముర్రే

స్థానిక బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే కెరీర్ ప్రఖ్యాత వింబుల్డన్‌లో తొలి రౌండ్ ఓటమితో ముగిసింది. సోదరుడు జేమీ ముర్రేతో కలిసి అతను డబుల్స్ బరిలోకి దిగాడు. ముర్రే జోడీ 6-7 (6/8), 4-6 స్కోరుతో రింకీ హిజికట-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) ద్వయం చేతిలో ఓడింది. దీంతో రెండు సార్లు వింబుల్డన్ సింగిల్స్ చాంప్ (2013, 2016) ముర్రేకు ప్రేక్షకులంతా స్టాండింగ్ ఒవేషన్‌తో గౌరవవందం ఇచ్చారు. దిగ్గజాలు ఫెడరర్, నాదల్, జొకోవిచ్, వీనస్ విలియమ్స్‌లు వీడియో సందేశాల ద్వారా అతనికి ఫేర్‌వెల్ పలికారు. వర్షం కారణంగా వింబుల్డన్ టోర్నీకి అంతరాయం కలిగింది. పెద్ద సంఖ్యలో మ్యాచ్‌లను నిలిపివేసి శనివారానికి వాయిదా వేశారు.

యూకీ, బాలాజీ జోడీలు అవుట్

డబుల్స్‌లో భారత ఆటగాళ్లకు నిరాశ ఎదురైంది. యూకీ బాంబ్రీ పోరాటం రెండో రౌండ్లో ముగియగా, శ్రీరామ్ బాలాజీ కనీసం తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. రెండో రౌండ్‌లో యూకీ-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 6-4, 4-6, 3-6తో జర్మనీకి చెందిన కెవిన్ క్రావిట్జ్-టిమ్ ప్యుయెట్జ్ జంట చేతిలో పరాజయం చవి చూసింది. తొలి సెట్‌లో కనబరిచిన ఉత్సాహం తర్వాతి సెట్లలో కొనసాగించడంతో భారత్-ఫ్రాన్స్ ద్వయం విఫలమైంది. మరో మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ జంటకు తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. బాలాజీ-జాన్సన్ (బ్రిటన్) జంట 4-6, 5-7తో నాలుగో సీడ్ మార్సెలో అరెవలో (సాల్వేడార్)- మేట్ పావిచ్ (క్రొయేషియా) జోడీ చేతిలో ఓడింది.

భారత మహిళలు పోరాడినా...

- తొలి టి20లో దక్షిణాఫ్రికాదే గెలుపు
- 12 పరుగులతో ఓడిన భారత్

చెన్నై: వన్డే సిరీస్, ఏకైక టెస్టులో చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా మహిళల జట్టు టి20 సిరీస్‌లో భారత మహిళలకు అలాంటి అవకాశం ఇవ్వలేదు. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో శుభారంభం చేసిన సఫారీ టీమ్ టీమిండియాపై పైచేయి సాధించింది. శుక్రవారం చెపాక్ మైదానంలో చివరి వరకు హోరాహోరీగా సాగిన తొలి టి20లో దక్షిణాఫ్రికా 12 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. తజ్‌మిన్ బ్రిట్స్ (56 బంతుల్లో 81; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), మరిజన్ కాప్ (33 బంతుల్లో 57; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో చెలరేగగా...కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (22 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించింది. బ్రిట్స్, కాప్ రెండో వికెట్‌కు 56 బంతుల్లోనే 96 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో పూజ వస్త్రకర్, రాధ యాదవ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 177 పరుగులే చేయగలిగింది. జెమీమా రోడ్రిగ్స్ (30 బంతుల్లో 53 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... స్మృతి మంధాన (30 బంతుల్లో 46; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (29 బంతుల్లో 35; 5 ఫోర్లు) రాణించారు. స్మృతి, షఫాలీ వర్మ (18) తొలి వికెట్‌కు 32 బంతుల్లోనే 56 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ఆ తర్వాత ఒకే స్కోరు వద్ద స్మృతి, హేమలత (18) వెనుదిరిగారు. విజయం కోసం 59 బంతుల్లో 103 పరుగులు చేయాల్సిన ఈ దశలో జెమీమా, హర్మన్ జత కలిశారు. వీరిద్దరు దూకుడుగా ఆడి నాలుగో వికెట్‌కు 59 బంతుల్లో 90 పరుగులు జోడించగలిగినా...చివరకు ఓటమి తప్పలేదు. తాజా ఫలితంతో సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0తో ఆధిక్యంలో నిలవగా, రెండో టి20 మ్యాచ్ ఆదివారం ఇక్కడే జరుగుతుంది.


కాప్ / బ్రిట్స్

నేడు పర్యావరణవేత్తలకు 'క్యాపిటల్' అవార్డులు

- నల్సార్‌లో ప్రదానం చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- పాల్గొననున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే, అటార్నీ జనరల్ వెంకటరమణి

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) సభ్యులు కె.తులసీరావు, దిలీప్‌రెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, ఎ.కిషన్‌రావులకు క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ జాతీయ పురస్కారాలు ప్రదానం చేయనుంది. నల్సార్ యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం జరిగే క్యాపిటల్ ఫౌండేషన్ యానివల్ లెక్చర్ అండ్ అవార్డుల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని అవార్డులు ప్రదానం చేయనున్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, అటార్నీ జనరల్ వెంకటరమణి పాల్గొననున్నారు. ఎప్పటిలాగే దేశంలో ఆయా రంగాల్లో విశేషంగా కృషి చేసిన పలువురు ముఖ్యులకు క్యాపిటల్ ఫౌండేషన్ తరఫున అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తొలిసారి నల్సార్‌తో కలిసి 'సాంకేతిక పరిజ్ఞానం, న్యాయం మానవీయత'పై కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిపై వెంకటరమణి ప్రసంగిస్తారని వెల్లడించారు.

మీకు నచ్చినవారి పేరున మొక్కలు నాటండి

మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్: రాష్ట్రంలో వన మహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో మంత్రి పొన్నం, కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ కలిసి మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్ల మొక్కలు నాటాలని టార్గెట్ పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందరి భాగస్వామ్యం తప్పనిసరి అని సూచించారు. మీకు నచ్చిన వారిపేరున మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. తల్లి పేరు మీద మొక్కలు నాటాలని ప్రధాన మంత్రి చెబుతున్న విషయాన్ని పొన్నం గుర్తుచేశారు. ఈ సందరర్భంగా పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను మంత్రి, కలెక్టర్ సన్మానించారు. వాతావరణ సమతుల్యాన్ని కాపాడుకోవాలంటే అందరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓ రామ్మూర్తి, స్కూల్ ప్రిన్సిపల్ అన్నపూర్ణ, కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్యకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు

సికింద్రాబాద్ నుంచి అయోధ్య-కాశీ యాత్ర



సాక్షి, హైదరాబాద్: పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక యాత్రల కోసం దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చిన భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లకు విశేషమైన స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు వివిధ మార్గాల్లో భారత్ గౌరవ్ పర్యాటక రైళ్లు నడిచాయి. ప్రయాణికుల అపూర్వ స్పందనను స్ఫూర్తిగా తీసుకొని ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర భారత్ గౌరవ్ రైలును ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 9 నుంచి 17 వరకు ఈ పర్యటన ఉంటుందన్నారు. ఈ పర్యటనలో గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. రామజన్మభూమి, జ్యోతిర్లింగాలలో ఒకటైన కాశీవిశ్వనాథ్ ఆలయం దర్శనానికి ఆధ్యాత్మిక జ్ఞానోదయం కోసం లేదా గయలో పిండ తర్పణం చేయడానికి అవకాశమిస్తుంది. ఈ రైలు సికింద్రాబాద్, కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, వైజాగ్, విజయనగరం, తిట్లాగఢ్ స్టేషన్లలో ఆగుతుంది. ఈ ప్రయాణానికి స్లీపర్ రూ.15,150, థర్డ్ ఏసీ రూ.24,300, సెకండ్ ఏసీ రూ.31,500 చొప్పు న చార్జీలు ఉంటాయి. వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism.comను సందర్శించవచ్చు. బుకింగ్స్ కోసం సికింద్రాబాద్ 040-27702407, 9701360701 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

చేజింగ్.. ఫైరింగ్..

పార్థీ గ్యాంగ్‌ను 12 కిలోమీటర్లు వెంటాడి.. ● పెద్ద అంబర్‌పేట్ వద్ద ఆటోను చుట్టుముట్టిన పోలీసులు

- స్క్రూడ్రైవర్, కత్తితో పోలీసులపై పార్థీ గ్యాంగ్ దొంగల ఎదురు దాడి
- గాల్లోకి కాల్పులు జరిపి ఇద్దరిని పట్టుకున్న పోలీసులు



ఆటోలో ప్రయాణిస్తున్న గ్యాంగ్ సభ్యుల్ని పట్టుకుని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం/చౌటుప్పల్/అబ్దుల్లాపూర్‌మెట్ : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట దోపిడీలు, ఇళ్లలో దొంగతనాలు, హత్యలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్‌లోని ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఒక దొంగ తన వద్ద ఉన్న స్క్రూడ్రైవర్‌తో కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడు. మరో దొంగ కూడా అదే కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేయబోయాడు. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి ఇద్దరినీ పట్టుకున్నారు.

సవాల్‌గా తీసుకున్న పోలీసులు

జాతీయ రహదారి వెంట దోపిడీలు, దొంగతనాలు, హత్యలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన పార్థి గ్యాంగ్‌ను పట్టుకునేందుకు నల్లగొండ ఎస్పీ నేతృత్వంలో చిట్యాల, చౌటుప్పల్, నల్లగొండ, కట్టంగూర్, రాచకొండకు చెందిన పోలీసులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందం కొన్ని కీలక ఆధారాలు సేకరించింది. దొంగతనాలు, దోపిడీలు చేస్తున్నది స్థానికులు కాదనే నిర్ణయానికి వచ్చింది. కట్టంగూర్ వద్ద జాతీయ రహదారిపై మే నెలలో జరిగిన దోపిడీ, హత్య చేసింది స్థానికులు కాదని, పార్థీ గ్యాంగ్ పనే అయి ఉండొచ్చని అనుమానించి మరింత లోతుగా విచారణ చేపట్టారు. జాతీయ రహదారి వెంట దొంగతనం జరిగిన ప్రాంతాల్లో, అదే సమయంలో ఔట్‌గోయింగ్, ఇన్‌కమింగ్‌తో కాల్స్ వివరాలను సెల్ టవర్ డేటాను విశ్లేషించారు. ఇందులో ఇటీవల దోపిడీ జరిగిన ప్రాంతంలో, అదే సమయంలో సిగ్నల్స్ యాక్టివ్‌గా ఉన్న ఫోన్‌నంబర్ నుంచే గురువారం ఉదయం తన కుటుంబ సభ్యులకు ఒకరు ఫోన్ చేశాడు. దాని లోకేషన్ అబ్దుల్లాపూర్ మెట్ వద్ద ఉన్న గుట్టపై దేవాలయ సమీపంలో ఉన్నట్టు తేలింది. దాని ఆధారంగా పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించి, పార్థీ గ్యాంగ్‌లోని ఇద్దరు దొంగల కదలికలపై నిఘా పెట్టారు.

ఎల్‌బీనగర్ వెళ్లే ఆటో ఎక్కిన దొంగలు

చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మారగోని జంగయ్య తన టాటా ఏస్ ఆటోను చౌటుప్పల్ టు ఎల్‌బీనగర్ నడుపుతుంటాడు. రోజువారీ మాదిరిగానే శుక్రవారం ఉదయం 8.20 గంటలకు కొయ్యలగూడెం గ్రామం వద్ద నలుగురు ప్రయాణికులను ఎక్కించుకొని బయల్దేరాడు. తూప్రాన్‌పేట వద్ద మరొకరు, రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం గ్రామంలోని పండ్ల మార్కెట్ వద్ద మరో వ్యక్తి ఆటో ఎక్కారు. అదే సమయంలో రోడ్డు పక్కన నిల్చొని ఉన్న ఇద్దరు యువకులు ఎల్‌బీనగర్ వెళుతుందా అని హిందీలో డ్రైవర్ జంగయ్యను అడగగా వెళ్తుంది ఎక్కండి.. అని సమాధానం ఇచ్చాడు. దీంతో ఓ వ్యక్తి ముందు సీట్లో డోర్ వద్ద, మరో వ్యక్తి వెనుక సీట్లో డోర్ వద్దనే కూర్చున్నారు. పెద్దఅంబర్‌పేట సమీపంలో ఓ మహిళా ప్రయాణికురాలు దిగాల్సి ఉండడంతో 8.40గంటల ప్రాంతంలో ఆటోను ఆపుతుండగా.. అప్పటికే వెంబడిస్తున్న పోలీసులు పరుగున వచ్చి ఆటోను చుట్టుముట్టారు. దీనిని గ్రహించిన దొంగలు పోలీసులపై స్క్రూడ్రైవర్, కత్తులతో దాడికి ప్రయత్నించారు. ఆత్మరక్షణ కోసం ఓ కానిస్టేబుల్ గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. కాల్పుల శబ్దంతో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితుల్లో ఉన్న ఇద్దరు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని నల్లగొండ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్టు తెలిసింది. ఆ గ్యాంగ్‌లోని మరో ఇద్దరి కోసం పోలీసు టీం మహారాష్ట్రకు వెళ్లినట్టు సమాచారం.

అడ్డొస్తే హత్యలే..

పార్థీ గ్యాంగ్‌కు దేశంలోనే అత్యంత ప్రమాదకర గ్యాంగ్‌గా పేరుంది. వీరంతా మహారాష్ట్రలోని హరిని శికారిని తెగకు చెందినవారు. జింకలను వేటాడుతూ అడవిలోనే నివాసం ఉంటారని పోలీసులు చెబుతున్నారు. అయితే ఈగ్యాంగ్ దోపిడీ సమయంలో అడ్డొస్తే చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా హత్యలు చేస్తుంది. ఇంట్లో కుటుంబసభ్యులు ఉన్నా సరే కత్తులు, ఇతర మారణ ఆయుధాలతో దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసి సొత్తు చోరీ చేస్తారు. ఎవరికీ చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటారు. దోపిడీ చేసిన తర్వాత ఈ గ్యాంగ్ గుట్టలపై తలదాచుకుంటుంది. చోరీ చేసిన సొత్తును మహారాష్ట్రకు వెళ్లిన తర్వాతనే నగదు రూపంలోకి మార్చుకుంటారు. హత్య చేసిన తర్వాతనే వ్యక్తులపై సొమ్ము దోచుకుంటారు. ఈ గ్యాంగ్ వరుసగా 3 నెలల పాటు దోపిడీలు, దొంగతనాలు, అడ్డొస్తే హత్యలు చేస్తుంది. ఆ తర్వాత సంఘటనలకు పాల్పడిన ప్రాంతాల వైపు మూడేళ్ల పాటు కన్నెత్తి కూడా చూడదు. ఇలా చేస్తే ఆయా పోలీస్ స్టేషన్లలో అధికారులు మారడంతో తమ ఆచూకీ కనిపెట్టలేరని పార్థి దొంగలు భావిస్తారు.

ఒక్కసారిగా భయపడ్డాం



ఆటో డ్రైవర్ (ఎరుపురంగు టీషర్టు ధరించిన వ్యక్తి)

అకస్మాత్తుగా జరిగిన కాల్పుల ఘటనతో నాతోపాటు ఆటోలో ఉన్న ప్యాసింజర్లు కూడా భయభ్రాంతులకు గురయ్యారని ఆటోడ్రైవర్ జంగయ్య తెలిపారు. పట్టుకునే క్రమంలో ఆ ఇద్దరు తిరగబడటంతో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారన్నారు. అయితే ఇద్దరు దొంగల వద్ద ఎలాంటి మారణాయుధాలు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నామని, ఒకవేళ ఉండి ఉంటే ఏం జరిగేదో అని తలచుకుంటేనే భయమేస్తుందని వాపోయాడు.

నైనీ బ్లాక్‌కు అటవీ అనుమతులు మంజూరు

హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఒడిశాలోని నైనీ బ్లాక్ బొగ్గు గనుల ఉత్పత్తికి ఆ రాష్ట్ర ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. 2015లోనే సింగరేణికి ఈ నైనీ బ్లాక్ కేటాయింపు జరిగినప్పటికీ.. పలు పాలనాపరమైన అడ్డంకుల కారణంగా ఉత్పత్తి సాధ్యం కాలేదు. ఒడిశాలోని అంగుల్ జిల్లాలో ఉన్న ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల నైనీ బ్లాక్‌కు తాజాగా ఒడిశా ప్రభుత్వం అటవీ అనుమతులు మంజూరు చేయడంపై కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ బ్లాక్‌కు సంబంధించి కిషన్‌రెడ్డి ఒడిశాతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కావాల్సిన అవసరం, సహకార సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఉత్తర్వులు విడుదల చేసినందుకు ఒడిశా సీఎం మోహన్ మాంఝీకి కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వేగవంతంగా నిర్ణయం తీసుకోవడంపై సంతోషం వ్యక్తంచేశారు. నైనీ బ్లాక్‌లో సింగరేణి ఉత్పత్తిని ప్రారంభించిన తర్వాత తెలంగాణలో పవర్ సెక్యూరిటీకి (విద్యుత్ భద్రత) మరింత ఊతం లభిస్తుందనే విశ్వాసం తనకుందని కిషన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి మత్తులో జూనియర్ డాక్టర్లు

- ఇరువురిని అరెస్టు చేసిన టీజీఏఎన్‌బీ పోలీసులు
- గంజాయి సరఫరా చేస్తున్న పెడ్లర్ కూడా కటకటాల్లోకి..

సాక్షి, హైదరాబాద్: నగరానికి చెందిన కొందరు జూనియర్ డాక్టర్లు (జూడా), వైద్య విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారినట్లు వెలుగులోకి వచ్చింది. వీరికి ఈ మాదకద్రవ్యం సరఫరా చేస్తున్న పెడ్లర్‌తో పాటు ఇద్దరు జూడాలను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) అధికారులు అరెస్టు చేశారు. ఈ పెడ్లర్ నుంచి గంజాయి ఖరీదు చేస్తున్న మరో నలుగురు వైద్య విద్యార్థులను గుర్తించామని టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య శుక్రవారం వెల్లడించారు. ధూల్‌పేటకు చెందిన సురేశ్‌సింగ్ అలియాస్ టింకూ సింగ్ ప్రస్తుతం గచ్చిబౌలిలో నివసిస్తు డెయిరీ ఫామ్ నడుపుతున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం 2016 నుంచి గంజాయి దందా చేస్తున్న ఇతడు గతంలో ధూల్‌పేటకు చెందిన దినేష్ సింగ్ నుంచి దీన్ని ఖరీదు చేసేవాడు. అక్కడ నుంచి ఫోడేకీ ఖబర్ ప్రాంతానికి ఆ మాదకద్రవ్యం తీసుకువచ్చి విక్రయించే వాడు. దాదాపు మూడేళ్ల పాటు ఈ దందా చేసిన ఇతడికి కొందరు మెడికల్ స్టూడెంట్స్, జూడాలతో పరిచయం ఏర్పడింది. వాళ్లు కూడా క్రమం తప్పకుండా టింకూ నుంచి గంజాయి ఖరీదు చేయడం మొదలెట్టారు. అతను ఒక్కో ప్యాకెట్ ఎనిమిది గ్రాముల చొప్పున ప్యాక్ చేసి వైద్య విద్యార్థులకు అమ్ముతున్నాడు. ఎస్పీ సీతారాం ఆదేశాల మేరకు ఏసీపీ కె.నర్సింగ్‌రావు పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ పి.రాజశేఖర్ నేతృత్వంలోని బృందం శుక్రవారం కోఠి వద్ద కాపు కాసింది. టింకూతో పాటు అతడి నుంచి గంజాయి ఖరీదు చేస్తున్న ఉస్మానియా మెడికల్ కాలేజీకి చెందిన జూడాలు కె.మణికందన్, వి.అరవింద్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి 80 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నటుడు రాజ్‌తరుణ్‌పై యువతి ఫిర్యాదు

- తనతో సహజీవనం చేస్తూ మరో హీరోయిన్‌తో ప్రేమాయణం
- రాజ్ తరుణ్‌తో పదకొండేళ్లుగా కలిసి ఉన్నా
- ఆ హీరోయిన్ కుటుంబీకులతో ప్రాణహాని ఉంది
- తనకు రక్షణ కల్పించాలని కోరుతూ లావణ్య అనే యువతి ఫిర్యాదు



మణికొండ (హైదరాబాద్): టాలీవుడ్ యువ నటుడు రాజ్ తరుణ్‌పై నార్సింగి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజ్ తరుణ్ తను ఒకరినొకరం ప్రేమించుకున్నామని పదకొండేళ్లు కలిసి జీవించామని ఇప్పుడు అతడు ముంబైకు చెందిన ఓ హీరోయిన్‌తో ప్రేమాయణం సాగిస్తున్నాడని పేర్కొంటూ కోకాపేటకు చెందిన ఎం.లావణ్య అనే యువతి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనతోపాటు సహజీవనం చేస్తూ ప్రస్తుతం మరో హీరోయిన్‌తో ప్రేమాయణం సాగిస్తూ తనను మోసం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ముంబైకు చెందిన సదరు హీరోయిన్‌తో కలసి ప్రస్తుతం 'తిరగబడరా స్వామి'అనే సినిమాలో నటిస్తున్నాడని..ఆమె మోజులో పడి తనను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపింది. వీరిద్దరూ కలసి ఇటీవల గోవా, చెన్నై, పాండిచ్చేరిలకు కలిసి వెళ్లారని ఇదే విషయాన్ని తాను నిలదీయగా తనను దూరం పెట్టాడని పేర్కొంది. రాజ్ తరుణ్‌ని వదిలేస్తే తనకు కొంత డబ్బు ముట్టజెబుతామని లేదంటే చంపేస్తామని హీరోయిన్ సోదరుడు బెదిరించాడని తెలిపింది. హీరోయిన్ తండ్రి హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సన్నిహితుడని వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని తనను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొంది. గతంలో తనను తప్పుడు కేసులో ఇరికించడంతో 43 రోజులు జైలులో ఉన్నానని తెలిపింది. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా సదరు హీరోయిన్ పేరు మాల్వీ మల్హోత్రాగా లావణ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాల్ ట్రేస్ చేసి.. ప్రాణాలను కాపాడి..

నేలకొండపల్లి: ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ వ్యక్తి వాట్సాప్ స్టేటస్ పెట్టడంతో అప్రమత్తమైన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు చివరి ఫోన్‌కాల్ ఆధారంగా ట్రేస్ చేసి రైలు పట్టాలపై పడుకున్న వ్యక్తిని కాపాడారు. ఈ సంఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెంకు చెందిన ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధుల నడుమ ఆర్థిక లావాదేవీల విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరు భూమి విక్రయించేందుకు యత్నించగా ఎదుటి వ్యక్తి అడ్డుపడ్డాడని ఆవేదనతో గురువారం రాత్రి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వాట్సాప్‌లో 'ఇక సెలవు' అంటూ స్టేటస్ పెట్టాడు. దీన్ని గమనించిన బంధువులు నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజుకు సమాచారం ఇవ్వగా ఆయన చివరి కాల్ ఆధారంగా ట్రేస్ చేసి సదరు వ్యక్తి ఖమ్మం రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్నాడని తెలిపాడు. దీంతో రాత్రి ఖమ్మం చేరుకుని రైల్వే స్టేషన్, పరిసరాల్లో గాలించారు. పట్టాలపై పడుకున్న అతన్ని పక్కకు తప్పించడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. సకాలంలో స్పందించిన ఎస్సై నాగరాజును గ్రామస్తులు అభినందించారు.

పర్యాటకులకు స్వర్గధామంగా తెలంగాణ

- ప్రకృతి రమణీయ ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం
- మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి
- ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలసి నల్లమల సందర్శన



మల్లెలతీర్థం జలపాతం వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల బృందం

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్రాన్ని పర్యాటకులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతామని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు అన్నారు. నల్లమలలో పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు చేపట్టేందుకు ఉద్దేశించిన రెండు రోజుల స్టడీ టూర్‌లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో కలసి మంత్రులు శుక్రవారం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో పర్యటించారు. నల్లమల లోతట్టు ప్రాంతంలోని రాంపూర్ పెంట, ఫర్హాబాద్ వ్యూ పాయింట్, మల్లెల తీర్థం జలపాతాలను సందర్శించారు. రాష్ట్రంలోని ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ఇతర దర్శనీయ ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్టు మంత్రులు ఈ సందర్భంగా ప్రకటించారు. దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటూనే స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సరికొత్తగా టూరిజం పాలసీ: మంత్రి జూపల్లి

రాష్ట్రవ్యాప్తంగా టూరిజం స్పాట్ లను అభివృద్ధి చేసి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్, పురావస్తు శాఖ డైరెక్టర్ భారతీ హోలికెరి, పర్యాటక శాఖ డైరెక్టర్ త్రిపాఠి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, మధుసుదన్‌రెడ్డి, మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ వారి వెంట ఉన్నారు.



బస్సులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన శ్వేతారత్నం. చిత్రంలో డ్రైవర్, కండక్టర్

ఆర్టీసీ బస్సులో పురుడు పోశారు..

కాచిగూడ (హైదరాబాద్): పురిటి నొప్పులు పడుతున్న గర్భిణికి బస్సులోనే డెలివరి చేసి ఆర్టీసీ సిబ్బంది మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. నగరానికి చెందిన శ్వేతారత్నం అనే గర్భిణి ఆరాంఘర్‌లో ముషీరాబాద్ డిపోకు చెందిన బస్సులో (టీఎస్‌వో 2జెడ్ 0341) శుక్రవారం ఉదయం 7:30 గంటల సమయంలో ఎక్కారు. ఆ బస్సులో డ్రైవర్ ఎం.అలీ, కండక్టర్ బి.సరోజ విధుల్లో ఉన్నారు. బస్సు బహదూర్‌పురా వద్దకు రాగానే శ్వేతారత్నంకు నొప్పులు రావడంతో బస్సు డ్రైవర్ బస్సును పక్కనే ఆపి ప్రయాణికులను దించాడు. బస్సు కండక్టర్ బి.సరోజ తోటి ప్రయాణికుల సహాయంతో శ్వేతారత్నంకు డెలివరీ చేశారు. శ్వేతారత్నం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని జజ్జిఖానాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి అడ్మిట్ చేశారు. మహిళకు పురుడు పోసిన కండక్టర్ సరోజను పలువురు ప్రయాణికులు అభినందించారు. ముషీరాబాద్ ఇన్‌చార్జి డీఎం రఘు అలీ, సరోజలను అభినందించారు. ఆర్టీసీ హైదరాబాద్ సిటీ రీజినల్ మేనేజర్ వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎంఓ జగన్, కాచిగూడ డీఎం, ముషీరాబాద్ డిపో ఇన్‌చార్జి డీఎం రఘు, బర్కత్‌పుర డీఎం వేణుగోపాల్, ముషీరాబాద్ అసిస్టెంట్ మేనేజర్ కళ్యాణి తదితరులు డ్రైవర్, కండక్టర్‌లను అభినందించి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ డ్రైవర్, కండక్టర్లకు అభినందనలు తెలియజేశారు.



మిట్టపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పొలం వైపు మళ్లి.. విత్తనాలు చల్లి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ 'పొలం బాట'

తల్లాడ: ఆయన జిల్లా కలెక్టర్.. అయితేనేం రైతులతో కలిసిపోయారు. బురద పొలంలోకి దిగారు.. నేలపై కూర్చుని రైతులతో మాట్లాడారు. ఆపై వెదజల్లే పద్ధతిలో విత్తనాలు చల్లారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యటించారు. గ్రామంలో రైతు నలజాల శ్రీనివాసరావు పొలంలో వెదజల్లే పద్ధతిలో వరి సాగుకు విత్తనాలు చల్లుతుండగా పరిశీలించారు. తాను సైతం విత్తనాలు చల్లేందుకు సిద్ధమైన ఆయన ముందుకు వెళ్తుండగా.. బురద ఉండడంతో బూట్లు చేతితో పట్టుకుని గట్టుపై నడిచారు. కాసేపటికి రైతులతో కలిసి కింద కూర్చుని మాట్లాడారు. గ్రామస్థాయిలో అధికారులు ఎలా పనిచేస్తున్నారు, ఏయే పంటలు సాగు చేస్తున్నారు, వెదజల్లే పద్ధతిపై ఎందుకు ఆసక్తి చూపడం లేదని ఆరా తీశారు. సాగర్ జలాలు రావడం లేదని, రెండో జోన్ పరిధిలో సాగు ఇబ్బందిగా ఉందని రైతులు తెలిపారు. విద్యుత్ లైన్‌మన్ పనితీరు సరిగ్గా లేదని చెప్పడంతో.. అక్కడి నుంచే ఎస్ఈకి ఫోన్ చేసి లైన్‌మన్‌ను మార్చాలని ఆదేశించారు. రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కలెక్టరేట్‌లో ఉంటానని.. ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి చెప్పుకోవాలని సూచించారు.

మాస్టారూ వెళ్లొద్దు

బదిలీ ఉపాధ్యాయునికి విద్యార్థుల కన్నీటి వీడ్కోలు



ఉపాధ్యాయుడు రాజును చుట్టుముట్టి విలపిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పద్నాలుగేళ్లుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు బదిలీపై వెళ్తుండడంతో ఆ పాఠశాల విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. తమను విడిచి వెళ్లిపోవద్దని రోదించారు. ఈ దృశ్యాన్ని చూసిన పాఠశాలలోని మిగతా ఉపాధ్యాయులు సైతం కంటతడి పెట్టారు. దీనికి వేదికైంది రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ప్రభుత్వ ప్రా థమిక పాఠశాల. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాముల రాజు ఇదే మండలం దుమాల ప్రాథమిక పాఠశాలలో 14 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. ఇటీవల జరిగిన బదిలీల్లో చీర్లవంచలోని ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యాడు. దీంతో చివరిరోజు శుక్రవారం దుమాల పాఠశాలకు రాగా.. విద్యార్థులు చుట్టుముట్టి రోదించారు.

చనిపోయిన వ్యక్తికి పదోన్నతి

- ఉద్యోగ విరమణ చేసిన మరో ఉపాధ్యాయునికి కూడా..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయునికే కాదు, ఏకంగా చనిపోయిన వ్యక్తికి పదోన్నతి కల్పించి పోస్టింగ్ కూడా ఇవ్వడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 830 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. మరో 955 మందికి స్థాన చలనం కల్పించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో మూడు వేల మందికిపైగా ఉపాధ్యాయులకు స్థానచలనం కలగనుంది. ఇప్పటికే ఆయా ఉపాధ్యాయులంతా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఉపాధ్యాయులను బదిలీ చేస్తున్నారు. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను తయారు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇప్పటివరకు ఎంత మంది పదవి విరమణ చేశారో? ఎంత మంది చనిపోయారో? కూడా తెలుసుకోకుండా గుడ్డిగా జాబితాను సిద్ధం చేశారు. మంచాల మండలం తిప్పాయిగూడలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న ఎండీ బషీర్ 2023 జూన్ ఒకటో తేదీన చనిపోయారు. కానీ ఆయనకు గ్రేడ్-2 హిందీ పండిత్ (స్కూల్ అసిస్టెంట్)గా పదోన్నతి కల్పించడంతో పాటు ఏకంగా కొందుర్గ్ మండలం చిన్నెల్కచెర్ల ప్రభుత్వ పాఠశాలకు పోస్టింగ్ ఇచ్చారు. 2024 మార్చిలో వెలిజర్ల ప్రభుత్వ పాఠశాల నుంచి పదవీ విరమణ చేసిన కె.రవీంద్రనాథ్‌కు స్కూల్ అసిస్టెంట్, బయాలజికల్ సైన్స్‌గా పదోన్నతి కల్పించడమే కాకుండా ఆయనకు జెడ్పీహెచ్ఎస్ కొందుర్గ్‌లో పోస్టింగ్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయం బయటికి పొక్కి విమర్శలు వెల్లువెత్తడంతో అప్రమత్తమై..ఆ వెంటనే పదోన్నతుల జాబితా నుంచి వారి పేర్లు తొలగించడం కొసమెరుపు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.